RNI No. APTEL/2003/12253

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

BHAVA VEENA

Journal of Arts, Literary,
Culture & Language Study

Vol : 17 - Issue No. 5
Monthly - May 2020
ISSN No. : 2456-4702
Rs. : 15/-



ఆచార్య
ఆత్రేయ

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 17 - Issue. 4 - May 2020 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
   HOD, Dept. of Telugu,
   Govt. Degree College, Puttur, Chittor Dist.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మన(సు)కవి ఆత్రేయ

తెలుగు సినీ పూదోటలో విరిసిన సౌంగధికా పుష్పం ఆత్రేయ. మనసుకవిగా సినిమా వారు పిలుచుకునే ఆత్రేయ అసలు పేరు. కిళాంబి వెంకట నరసింహాచార్యులు. ఆచార్య ఆత్రేయ తెలుగు సినీ గేయరచయితగా, సంభాషణాకర్తగా పేరుపొందినా నిజానికి ఆయన మాతృరంగం నాటకాలే. నాటక రచయితగా ఆయన స్థానం సుస్థిరం. తన నాటక రచనా నైపుణ్యంతో చక్కని ప్రయోగాలు చేసి, నాటక రంగాన్ని మలుపుతిప్పిన నాటకకర్త ఆచార్య ఆత్రేయ.

దాదాపు 400 సినిమాలకు మాటలు, పాటలు రాసిన గొప్పకవి ఆత్రేయ. ఆయన రాసిన పాటలు, నాటకాలు, నాటికలు, కథలు మొదలగు రచలన్నింటిని 7 సంపుటాల్లో సమగ్రంగా ప్రచురించిన వ్యక్తి ఆయన ఆప్తమిత్రుడు జగ్గయ్య. ఆత్రేయ నాటకాల్లో మనకు ఎక్కువగా కనబడేది మధ్యతరగతి కుటుంబ సమస్యలు. ఆ సమస్యల్ని తన ఇతివృత్తంగా ఎంచుకొని ఎంతో మనోహరంగా తన నాటకాలను తీర్చిదిద్దారు. వీరు రచించిన 'ప్రరివర్తన', 'ఎన్.జి.వో' నాటకాలతో ఆంధ్రనాటక కళాపరిషత్ అవార్డులను గెలుచుకున్నారు.

తాత్విక ధోరణిలో ఆత్రేయ రాసిన సంభాషనలు జీవిత తత్వాన్ని గట్టువిప్పుతాయి. అవి జీవితాన్ని కాచి వడబోసిన నగ్నసత్యం, ప్రతీ వ్యక్తి జీవితానికి మార్గదర్శకాలు ఎన్ని గొప్ప నాటకాలు! ఎన్ని గొప్ప సినిమాలు! ఎన్ని గొప్ప పాటలు! ఎన్ని గొప్ప మాటలు! ఆయన చేత పాట రాయించుకోవాలని తిరగని వాళ్ళు లేరు. ఐతే ఆపాట ఆ మనసులో ఎప్పుడు పుడుతుందో! ఆయనకే తెలీదు. ఆత్రేయ సంభాషణలు అంతే, వింటూ థియేటర్లో ప్రేక్షకులు చప్పట్లు కొట్టేవారు.

ఎంత బరువైన భావాలనైనా అర్థవంతమైన తేలికైన పదాలతో పలికించడంలో ఆత్రేయ దిట్ట. మూడున్నర దశాబ్దాల సినీ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను చవిచూచిన ఆయన తన అనుభావలన్నింటినీ తన పాటల్లో పొదిగి, గుండె బరువును దించుకునేవారని అతని సన్నిహితులు అనేక సందర్భాల్లో చెప్పేవారు. రాయక నిర్మాతలనూ, రాసి ప్రేక్షకులనూ ఏడిపిస్తాడని ఆత్రేయపై ఓ ఫలోక్తి కూడా ఉన్నది. కానీ ఆయన ఏమనే వారంటే "రాస్తూ నేనెంత ఏడుస్తానో ఎందరికి తెలుసు" అనేవారు. సినిమా పరిబాషలో చెప్పుకునే సెంటిమెంటల్ డైలాగ్స్ రాయడంలో ఆత్రేయది. అందెవేసిన చెయ్యి. ముఖ్యంగా లేడీస్ సెంటిమెంట్ డైలాగ్స్ బాగా రాస్తారని చెప్పుకుంటారు. ఆయన రాసిన పాట్లో విషాద గీతాలు ఎక్కువ. ముఖ్యంగా మనసును గూర్చి రాసిన పాటల్లో ఎంతో విషాదం గోచరిస్తూ ఉండేది. మనసును గూర్చి ఆగ్రేయ రాసినన్ని పాటలు మరొకరు రాయలేదంటే అతిశయోక్తి కాదు. అందుచేతనే ఆయన మనసుకవి, మన సుకవి అయ్యాడు.

- సంపాదకవర్గం

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

Contents (విషయ సూచిక)

1. కొమఱ్ఱాజు లక్ష్మణరావు గారి సాహిత్య కృషి	- డా॥. ఏటూరు జ్యోతి	5
2. మనభాషే మన గుర్తింపు	- బి. వరలక్ష్మి	9
3. తెలుగులో అనువాద ప్రక్రియ	- డా॥. శిరీష ఈడ్పుగంటి	12
4. కొడవటిగంటి కుటుంబరావు కథల్లో సంఘర్షణ	- డా॥. వెంకటరామయ్య గంపా	17
5. ఆధునికానంతర భారతదేశంలో మహిళాభివృద్ధి	- డా॥. కె.సుమలత	21
6. దక్షిణాత్య భాషలు - తోబుట్టు భాషలు	- డా॥. నందనవనం శివ కుమార్	25
7. 'జానపదుల భాషా సారస్వతములు' - ఒక సమీక్ష	- డా॥. పాలెం వేణుగోపాల్	29
8. సాహితీ దురంధరుడు 'ఆచార్య పేర్వారం జగన్నాథం'	- డా॥. పంతంగి వెంకటేశ్వర్లు	38
9. జానపద సంస్కృతి - కళలు వాటి వైశిష్ట్యం	- డా॥. వి. శివనాగార్జున రెడ్డి	42
10. ఆంధ్రప్రదేశ్ తోలుబొమ్మలు - వాటి విశిష్టత	- కోట మృత్యుంజయరావు	46
11. తెలుగుసాహిత్యంలో పత్రికావిలువల చిత్రీకరణ	- భార్గవ్ నిమ్మగడ్డ	51
12. అగ్నివసంతం - ఒక విశ్లేషణ	- పోల్కం రాములు	58
13. భండారు అచ్చమాంబ మహిళా సంఘాల్ని స్థాపించిందా?	- డా॥. షేఖ్ మహబూబ్ బాషా	60
14. గోండి సంస్కృతి - దండారి నృత్యం	- వై. శ్రీనివాస్ రావు	68
15. వసంతరావ్ దేశ్‌పాండే నవలలో గిరిజనుల వెతలు	- బానోతు క్రిష్ణ	72
16. 'మొరాన్‌కన్య' కావ్యంలో తాత్త్విక నేపథ్యం	- డా॥. దోనెపూడి రామాంజనేయశర్మ	75
17. మతానికీ మగపెత్తనానికీ మధ్య బలైన 'నాదిరా'	- డా॥. ఎం.ఎం. వినోదిని	78
18. 'కరోనా'పై కదం తొక్కిన పాట	- సైదయ్య మల్లెపాకుల	82
19. శ్రీకృష్ణదేవరాయల పాలనాకాలంలో తెలుగు భాషా వికాసం	- ఎన్.వి. వసుమతి & బి. వరలక్ష్మి	86
20. పూల కుండీలు నవల - దళిత స్త్రీ దృక్పథం	- ధర్మారపు నాగయ్య	90
21. శ్రీ పోతులూరి వీరబ్రహ్మం గారి ఆధ్యాత్మిక విశేషాలు	- బి. చంద్రశేఖర్	94
22. శాంతినారాయణ ఆవిష్కరించిన అనంత జీవనం	- డా॥. డి.యువశ్రీ	98
23. తెలుగు దృశ్య శ్రవణ వ్యాపార ప్రకటనలు	- ప్రియాంక రాచబత్తుని	102
24. తెలంగాణ కథలు - దళిత స్త్రీ జీవన చిత్రణ	- డా॥. డి. విజయకుమారి	107
25. 'జై భవానీ - జై శివాజీ' చారిత్రక నవల-శివాజీ పాత్ర చిత్రణ	- చిగురుపాటి మస్తాన్‌రావు	112
26. రెండు దశాబ్దాల రాయలసీమ పద్యకవిత్వం - తల్లిప్రేమ	- నరేష్	115
27. అంపశయ్య నవీన్ జీవితము, సాహిత్యము - పరిశీలన	- కొప్పు సుభాష్ చంద్రబోస్	120
28. సమిష్టి కోసం వ్యష్టి బలిదానం కట్టమంచి వారి 'ముసలమ్మ మరణం'	- నిమ్మలపూడి వీరరాఘవులు	126
29. డా॥. వి.చంద్రశేఖరరావు కథలు - బహుజన జీవితం	- కట్టా సుబ్బారావు	129
30. వ్యాస భాగవతం - అష్టాదశ పురాణాలలో విశిష్టత	- పి.ఉమా భార్గవి	132
31. బంజారాల సాంస్కృతిక జీవనం	- డా॥. నెహ్రూనాయక్	137
32. "The long awaited transformation of Kuchipudi	- Bijina K K	140

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కొమర్రాజు లక్ష్మణరావు గారి సాహిత్య కృషి

– డా॥. ఏటూరు జ్యోతి, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాయం, వరంగల్.

కొమర్రాజు లక్ష్మణరావు గారు మే 18, 1818న కృష్ణా జిల్లా నందిగామ తాలుకా పెనుగంచిప్రోలులో జన్మించారు. కొమర్రాజు వంశం వారు గ్రామకరణీకం చేసేవారు. వీరి 3వ సం॥లోనే తండ్రి మరణించారు. తల్లి అప్పట్నించి ఆధ్యాత్మిక చింతనలో కాలలం గడుపుతుంది. తండ్రి చనిపోయిన సందర్భంలో లక్ష్మణరావు గారు సవతి అన్న శంకరరావు పోషణలో భువనగిరిలో గడిపారు. భువన గిరిలోనే చదువు ప్రారంభించారు. తెలుగు, సంస్కృతాలు చదవడం ప్రారంభించారు. లక్ష్మణరావు గారి తండ్రి వెంకటప్పగారికి ఇద్దరు భార్యలు పెద్దభార్య కొడుకే శంకర్రావు, రెండో భార్య గంగమ్మ బండారు వారి ఆడ పడుచు. ఈమె మొదటి సంతానం అచ్చమాంబ. గంగమ్మ సోదరుడి భార్య చనిపోతే తన మేనకోడలు అచ్చమాంబను రెండవ భార్యగా వివాహం చేసుకున్నాడు. ఈ వివాహం అయ్యాక అక్కతోపాటు లక్ష్మణరావుగారు నాగపూరు వెళ్ళారు. మరాఠీ భాషలో చదువు కొనసాగించారు. మరాఠి భాషలోని పత్రికల్లోని వ్యాసాలు చదివేవారు. వివిధ సాహిత్య ప్రక్రియలను అధ్యయనం చేసారు. అంతే కాకుండా వీరు హిందీ, సంస్కృత భాషలలో పాండిత్యాన్ని సంపాదించారు. తరువాత బెంగాలీ,గుజరాతీ, కన్నడ భాషలతో పరిచయం సంపాదించారు. మహారాష్ట్రీయుల జీవిత విధానం, ఆచార వ్యవహారాలకు అలవాటు పడ్డారు. విద్యార్థిగా ఉన్నపుడే మరాఠీ భాషలో చాలా వ్యాసాలు, భావ గీతాలు, సాంఘిక ప్రహసనాలు వ్రాసారు. తమ కుటుంబానికి దగ్గరివాడైన ఒక ముసలి డాక్టరు, చిన్న పిల్లను వివాహం చేసుకున్న ఇతివృత్తంతో ఒక ప్రహసనం రాశారు. అది మహారాష్ట్ర ప్రాంతంలో సంచనలం సృష్టించింది. ఇవి కొమర్రాజు గారి బాల్య జీవితంలోని వ్యక్తిగత విషయాలు.

కొమర్రాజు వారు జన్మించిన సందర్భాన్ని చూస్తే వారి సాహిత్యసేవకు నేపథ్యం తెలుస్తుంది. 20వ శతాబ్దంలో సంప్రదాయ భావాలతో ఉన్న తెలుగుదేశాన్ని సంస్కరించిన యుగకర్త కందుకూరి వీరేశలింగం గారు, ఆధునికాంధ్ర కవిత్వానికి కోమల కవిత్వపు ముత్యాల హారాలను వేసిన గురజాడ అప్పారావు. ఇంకోవైపు ప్రజల వ్యవహారిక భాషకు పట్టంకట్టాలని ఉద్యమం నడిపిన గిడుగు రామమూర్తి గారు, ఇలాంటి మహనీయులు తెలుగు సాహిత్యానికి నూతనదారులు వేస్తున్న కాలం. ఇంకోవైపు భారతదేశ స్వాతంత్రోద్యమం తీవ్రరూపం దాలుస్తున్న రోజులు. తెలుగులో చారిత్రక పరిశోధనకు, వైజ్ఞానిక గ్రంథాల ఆవిర్భానికి పితామహుడుగా కొమర్రాజు లక్ష్మణరావుగారిని చెప్పుకోవాలి.

మరాఠీ భాషలో కేసరి, మహారాష్ట్ర వంటి పత్రికలలో వ్యాసాలు రాయడమే కాకుండా, 'సమాచార్', వివిధ విజ్ఞాన విస్తార్' అనే పత్రికలకు సంపాదకత్వంవహించారు. మరాఠీలో గ్రంధపరిష్కరణ చేసారు. వ్యాసాలతోపాటు అనేక వాదోపవాదాలలో పాల్గొనేవారు. రామాయణంలో పర్ణశాల ఎక్కడ వుంది? బాలగంగాధర్ తిలక్ నాసికా త్రయంబకం వద్ద అని అంటే, కాదు అది ఆంధ్ర ప్రాంతం లోని భద్రాచలంలో ఉందని ధైర్యంగా, తర్కభద్ధంగా చెప్పగలిగారు. మోరోపంత్ రాసిన భారతంలోని కర్ణపర్వాన్ని పరిశోధించి శుద్ధప్రతిని తయారుచేసి ప్రకటించారు. ఇది వారి మొదటి సంపాదక గ్రంథం.

కొమర్రాజు వారు తెలుగులో రచనలు చేసి తెలుగు పత్రికలకు పంపేవారు. రాయసం వెంకటశివుడుగారి "తెలుగు జనానా" పత్రికకు విశ్వం యొక్క విరాట్ స్వరూపం అనే రచనను పంపారు. లక్ష్మణ్‌రావు గారు నాగ్‌పూర్‌లో బి.ఏ. ఎం.ఏ. పూర్తిచేసారు. వీరు బి.ఏ. పరీక్ష పాస్‌కాగానే తల్లి కొడుకును తీసుకుని స్వంత గ్రామానికి వచ్చింది. మునగాల సంస్థానంలో దివానులుగా ఉన్నారు కొమర్రాజువారు. సంస్థానంలోని లావాదేవిల విషయంలో

హైద్రాబాద్, చెన్నపట్నంలతో సంబంధాలుండేవి. హైద్రాబాద్‌లో రావిచెట్టు రంగారావు, ఆదిపూడి సోమనాధరావు, మైలవరపు నరసింహశాస్త్రి మిత్రులు అయ్యారు. హైదరాబాద్‌లో తెలుగు భాష పరిస్థితి అధ్వాన్నంగా ఉండడం గమనించారు. తెలుగు భాష స్థితిగతులను మెరుగు పరచాలనే ఉద్ధేశ్యంతో 1901 సెప్టెంబర్1వ తేదీన హైద్రాబాద్‌లో ''శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం''ను స్థాపించారు. అదిరాజు వీరభద్రరావు వంటి వారు కార్యకర్తలుగా పనిచేసారు. ఇక్కడ మనం వీరి అక్కగారైన అచ్చమాంబ గారికి పుత్ర వియోగం కలగడంతో ఆదు:ఖ భారాన్ని తగ్గించడం కోసం లక్ష్మణ్‌రావుగారు ఆమెతో కలిసి చరిత్ర గ్రంథాలను పరిశోధించి ఇతర భాషలలోని ఉత్తమ గ్రంథాలను సేకరించి పరిష్కరించారు. అలాగే 'అబలా సచ్చరిత్ర రత్నమాల' అనే గ్రంథం రాసారు. అచ్చమాంబగారు. అచ్చమాంబగారు తమ్మునితో కలిసి విజ్ఞానాభివృద్ధికి కృషిచేసారు.

కొమర్రాజు వారు నాగ్‌పూర్‌లో ఉన్నపుడు చరిత్ర గ్రంథాలు రాసారు. 'శివాజీ చరిత్ర వీరి మొదటి చరిత్ర గ్రంథం. వీరి పరిశోధనా దృక్పథం, విమర్శ నైపుణ్యం, మాతృభాషపై గల మక్కువ వీరిని తెలుగు సాహిత్యంలో ఒక విజ్ఞాన భాండాగారంగా నిలిపింది.

గ్రంథాలయాలు ప్రారంభించి వదిలివేయడం కాదు. విజ్ఞాన అంశాలను అందించే సాహిత్య గ్రంథాలు, ప్రచురించే, పత్రికలను కూడా గ్రంథాలయాల్లో ఉంచారు అని అనుకున్నారు. రాజకీయ ఆర్థిక శాస్త్రాలు, ప్రకృతి శాస్త్రాలు వ్యవసాయక, పారిశ్రామిక విషయాలు, దేశచరిత్రలు మహాపురుషుల జీవితాలు, చారిత్రాత్మక నవలలు, అనువాద సాహిత్యాన్ని ప్రచురించాలని నిర్ణయించారు. అవి ప్రచురించడానికి నాయని వేంకటరంగారావు, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, అయ్యదేవర కాళేశ్వరరావు, రావిచెట్టు రంగరావు మొదలగు వారితో కలిసి ''విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి'' అనే సంస్థను స్థాపించారు. రావిచెట్టు రంగారావు గారు పుస్తకాలను హైదరాబాద్ నుంచి చందాదారులకు పంపాలి. ఏడాదికి నాలుగు గ్రంథాలను ప్రచురించాలి. పుస్తకంలో కనీసం వందపేజీలు ఉండాలి. పుస్తక వెల 4 అణాలు. ఇలా గ్రంథప్రచురణకు నిర్ణయించుకున్నారు. విజ్ఞానచంద్రికా గ్రంథమాల తరుపున మొదటి గ్రంథంగా గాడిచర్లహరి సర్వోత్తమరావు గారు రాసిన ''అబ్రహం లింకన్ జీవిత చరిత్రను'' ప్రకటించారు. రెండవ పుస్తకం కొమర్రాజు వారి 'హిందూ మహాయుగం 3వ పుస్తకంగా అచంట లక్ష్మీపతి గారు వ్రాసిన ''జీవ శాస్త్రం'', 4వ పుస్తకం వేలాల సుబ్బారావు గారి రాణీ సంయుక్త'' మంత్రిప్రగడ సాంబశివరావు - పదార్థ విజ్ఞానశాస్త్రం, ఆంధ్రుల చరిత్ర-చిలుకూరి వీరభద్రారావు, అర్థశాస్త్రము-కట్టమంచి రామలింగారెడ్డి, విజయనగర సామ్రాజ్యవల-దుగ్గిరాల రాఘవచంద్రయ్య, పాతాళ భైరవి- ఏ.వి. నరసింహపంతులు మొదలగునవి. విజ్ఞాన చంద్రికా మండలి సంపాదకులు గ్రంధప్రచురణల గురించి చెపుతూ మా గ్రంథాలన్నీ జనోపయోగమునకై వ్రాయబడినవి, ఇంగ్లీషు భాష తెలియని వారికి ఇంగ్లీష్‌లో వ్రాయబడిన విషయాలను తెలియజెప్పి జ్ఞానమును కలిగించు ఆశయముతో ఈ ప్రచురణలు ప్రారంభించాము. ''ఈ గ్రంథాలన్ని నిర్ధిష్టమైనవిగా, అనవసర పాండిత్య ప్రకర్షనూ చూపే భాషలో కాకుండా నాజూకైన మధుర భాషలో రాయబడినవిగా కట్టమంచి వారు ఉదాహరిస్తున్నారు.'' కందుకూరి వారి స్వీయ చరిత్రన కూడా ప్రకటించారు. విజ్ఞాన చంద్రికగా గ్రంథమండలి సాహిత్య సేవ చాలా గొప్పది.

1912వ సం॥లో లక్ష్మణరావుగారు ''విజ్ఞాన చంద్రికా పరిషత్తు''ను స్థాపించారు. వైజ్ఞానిక, చారిత్రిక, శాస్త్రీయ గ్రంథాలలో పరీక్షలు జరిపేవారు. ఈ సంస్థనుంచి గెలిచిన వారికి నూటపదహార్లు, బంగారు, వెండి పతకాలు ఇచ్చేవారు. పొటీలకు వీరేశలింగంగారు, కట్టమంచి వారు, వనప్పాకం శ్రీనివాసాచార్యులు గారు పరీక్షకులుగా వ్యవహరించారు.

1915వ సంవత్సరంలో ఆంధ్రభాషలో విజ్ఞాన సర్వస్వాన్ని రాయడానికి ఏర్పాటు చేసుకున్నారు. గాడిచర్ల వారు, అచంటలక్ష్మీపతి, మల్లంపల్లి సోమశేఖర శర్మ,

రాయప్రోలు సుబ్బారావులు సహాయకులుగా పనిచేశారు. 'ఆ' అక్షరంతో ప్రారంభించి మూడు సంపుటాలుగా ప్రచురించారు. భాష విషయ వ్యాసాలు, ధర్మ శాస్త్ర వ్యాసాలు, చారిత్రిక విషయాలు, ప్రకృతిశాస్త్ర విషయాలు, గణితశాస్త్ర విషయాలతోపాటు, లక్ష్మణరావుగారు అధర్వ వేదం, అద్వైతం, అభిజ్ఞానశాకుంతలం, అలంకారాలు, అష్టాదశపురాణాలు, అష్టాధ్యాయి మొ॥ రాసారు.

1922లో కొంతమంది సహచరులతో కలిసి హైదరాబాద్‌లో 'పరిశోధక మండలిని' స్థాపించారు. తెలంగాణాలోని అపారమైన గ్రామ శిలాశాసనాలనూ, కాగితాలనూ, తాళపత్ర గ్రంథాలనూ సేకరించి ప్రచురించడానికి ఈ సంస్థను స్థాపించారు. ఆంధ్రుల చరిత్రకు సంబంధించిన పరిశోధనలు సమగ్రంగా జరపాలనే సంకల్పంతో లక్ష్మణరావు గారు 1919లో కందుకూరి వీరేశలింగం గారిని మద్రాస్‌కు ఆహ్వానించి తన స్వగృహం 'వేదవిలాస్'లో సౌకర్యాలు ఏర్పాటుచేసి కవుల చరిత్రను రాయడానికి పిలిపించుకున్నారు. ఆపనిలో నిమగ్నులైనపుడే కందుకూరి వారు వేదవిలాస్‌లోనేమరణించారు. ఆ సమయంలో కొమర్రాజు వారు మునగాల సంస్థానం పనిమీద నడిగూడెం వెళ్ళారు. తాను లేనపుడు కందుకూరివారు మరణించారు. అనే బాధ కొమర్రాజు వారిని కలిచివేసింది. మాసపత్రికను నడపాలనే కోరికతో లక్ష్మణ రావుగారు 'జనరంజని' అనే పత్రికను కొంతకాలం నడిపారు. ఆంధ్ర పరిశోధకమండలి తెలంగాణా శాసనాలు, షిబుఖాను చరిత్రవంటి గ్రంథాలను ప్రచురించింది.

కొమర్రాజు వారు ఆరోగ్యాన్ని సరిగ్గా పట్టించుకోకుండా భారమైన పనులన్నీ చేస్తూ పోయేవారు. డాక్టర్లు విశ్రాంతి అవసరం అని చెప్తే హార్స్‌లీహాల్స్‌లో విశ్రాంతి తీసుకున్నారు.

"ఆంధ్ర అనే అంశంపై విజ్ఞాన సర్వస్వానికి వ్యాసం రాస్తూ 1923 జులై 12వ తేదీన వీరేశలింగం గారు మరణించిన గదిలోనే కన్నుమూసారు. 46 సం॥లకే కనుమరుగయ్యారు ఆంధ్రభాషలోనే యాభైపైగా అక్షరాలలో ఒకే ఒక అక్షరంతో మొదలయ్యే ఆరోపాలను మాత్రమే ఆయన 3 సంపుటాలలో రచించారు. కొమర్రాజువారి అకాల మరణం సాహితీలోకానికి తీరనిలోటు అయ్యింది. కాని అతని మిత్రులు ప్రచురణలను కొన్నింటిని కొనసాగించారు. అచంట లక్ష్మీపతిగారు సంకలనం చేసిన కొమర్రాజు వారి వ్యాసాలను "లక్ష్మణరాయ వ్యాసావళి" పేరుతో ప్రకటించారు. కొమర్రాజు వారు సంఘసంస్కరణ భావాలు కలవారు. ముసలి డాక్టరు చిన్న బాలికను వివాహం చేసుకున్న ఉదంతంపై మరాఠీలో వ్రాసిన ప్రహసనం సంఘసంస్కరణ నేపథ్యంతో రాసినదే. సోదరి అచ్చమాంబను ప్రోత్సహించి, రచనలు చేయడం స్త్రీ విద్యా వ్యాప్తికి దోహదం చేసారు. 1907లో నందిగామలో జరిగిన కృష్ణాజిల్లా సంఘసంస్కరణ సభలో వితంతు వివాహం, సముద్రయానం అస్పృశ్యతా నివారణ, మొదలగు విషయాలపై తీర్మానాలు ప్రవేశపెట్టడంలో లక్ష్మణ రావుగారిది ప్రధానపాత్ర. లక్ష్మణ్‌రావుగారు కొత్త పారిభాషక పదాలను తెలుగులో వాడారు. యూనివర్సిటీ-అనే పదంకు 'సర్వకళాశాల' అని ఉంటే, విశ్వవిద్యాలయం అనే పదాని, ఎడిటర్ అనే పదానికి, పత్రికాధి పతికి బదులు 'సంపాదకుడు' పదంను వీరే వాడుకలోకి తెచ్చారు.

కురుగంటి సీతారామయ్య గారన్నట్లు లక్ష్మణరావు పంతులుగారు ఒకవ్యక్తి కాదు. ఒక సంస్థ అనేది అక్షర సత్యం. అనేక మంది సాహితీవేత్తలను, విజ్ఞానవేత్తలను ఆంధ్రలోకానికి పరిచయం చేసారు. వీరి సాహిత్య వ్యాసాలలో శివతత్త్వసారం, అభిజ్ఞాన శాకుంతలం, అధర్వ వేదం, లలితకళలో అభినయము ఉత్తమ వ్యాసాలుగా పిలిచేవి. వ్యాసాలలో, గ్రంథాలలో అతని వ్యక్తిత్వము తెలుస్తుంది. ఛాందస సంప్రదాయాలు, ఆచారాలను గ్రుడ్డిగా అనుకరించవద్దని తన వ్యాసాలద్వారా తెలియజేస్తారు.

బందరు నుంచి వెలువడిన 'శారద' సాహిత్య పత్రిక 1923 ఆగస్టు సంచికలో పింగళి నాగేంద్రరావు గారితో జరిగిన సంభాషణ చూస్తూ లక్ష్మణరావు గారి సాహిత్య సామాజిక ప్రయోజనాన్ని అర్థం చేసుకోవచ్చు. 'సమాజాన్ని

ఏవిధంగా శిక్షకు గురిచేయాలి. సంఘంలో సాగుతున్న ఈ దుర్మార్గాలకుగాను? దానికి లక్ష్మణ రావుగారు " ఈ సమస్యను చూసే దృష్ట, పరిష్కరించే దృష్ట ఇది కాదు. ప్రతి ఒక్కరు ముందు తమలోని లోపాలు సరిదిద్దుకోవాలి. ప్రజలలో ఈ విధమైన అవగాహనను పెంపొందించే ఉత్తమసాహిత్యాన్ని సృష్టిం చాలి. సమాజంలో ఉండే లోపాలు. దోషాలు తొలగి పోవడానికి దోహదం చేయగల సాహిత్యాన్ని సృష్టించు కోవాలి. సృష్టింపజేయాలి. సమాజంలో కోరుకొనదగిన మార్పు రావడానికి బలమైన సాధనంగా సాహిత్యాన్ని రూపొందింపజేసుకోవాలి. అది శక్తివంతంగాను, సంపన్నం గాను, సమాజంలో భావవిప్లవం తీసుకొనిరాగలిగి ఉం డాలి' అంటారు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు భాషా సాహిత్యాలు- కొమర్రాజు లక్ష్మణరావు -పాలకుర్తి మధుసూధనరావు
2. తెలుగు వైతాళికులు-ఉపన్యాసాలు సంపుటం-2.



BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మనభాషే మన గుర్తింపు

– బి. వరలక్ష్మి, తెలుగు ఉపన్యాసకురాలు, సి.యస్.యస్.ఆర్ & యస్.ఆర్.ఆర్.యం. డిగ్రీ & పిజి కళాశాల, కమలాపురం, కడప జిల్లా.

తెలుగు మర్చిపోతే తప్ప పిల్లలకు ఆంగ్లంరాదు అనేది ఈరోజు తెలుగునాట ప్రబలిపోయిన ఓ దురభిప్రాయం. ఎవరైన మొదట అమ్మభాష మీద పట్టు సాధిస్తేనే తర్వాత ఎన్ని భాషలైనా నేర్చుకోగలరు. భాషఅంటే కేవలం భావ వ్యక్తీకరణకు సాధనం మాత్రమే కాదు. అనేక మాంలిక భేదాలు కలుపుకుని సమగ్రంగసాగే సాంస్కృతిక జీవనది భాష,ప్రస్తుతంపసితనం నుంచే మాతృభాషను దూరం చేయడంవలన ఇంటర్మీడియట్‌కు వచ్చినవిద్యార్థులు కూడా అక్షరాలు రాని దుర్దశలో ఉన్నారు. ఈపరిస్థితిని చక్కదిద్దాలంటే ప్రాథమిక విద్యాభ్యాసమంతా తెలుగు లోనే సాగాలి.

పరాయి భాషమీద మనకు ఎంత పట్టున్న ఎంత అనర్గళంగా మాట్లాడిన మాతృభాషలో మాట్లాడినంత హృదయ పూర్వకంగా పరాయి భాషలోమాట్లాడలేము. ఇది చాలా మంది అనుభవం కూడా. పల్లెపట్టులో పది లంగా ఉన్న తెలుగు పట్టణాలు, నగరాల్లో పెను సవాళ్ళను ఎదుర్కోంటోంది. ప్రపంచీకరణ పెనుముప్పుగా మారు తున్న కాలంలో నవతరం వాడుకలో అమ్మభాషను అందరూ నేర్చుకోని రక్షించుకోవాలన్న సంకల్పం ఇచ్చాయి.

సాహిత్య ప్రయోజనం నెరవేరాలంటే భాష బతి కుండాలి. అనేక విశ్వవిద్యాలయాలు డాక్టరేట్లు ఇస్తున్నా ఆయా పరిశోధనల్లో ఏమి కనుకోన్నారనే అంశాలు ప్రశ్నార్థకంగానే ఉంటున్నాయి. తెలుగు భాష సంస్కృతుల పునరుజ్జీవనంకోసం భాషా ప్రేమికులు, సాహితీ వేత్తలు సమర్థవంతంగా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్ తెలియచేశారు.

బోయాజ్ కీసర్ షికాగో విశ్వవిద్యాలయంలో మనస్తత్వ శాస్త్రవేత్త. అయన మాతృభాషా హిబ్రూ. అమెరికాలో నివసిస్తున్న కీలర్ తరచూ ఆంగ్లంలో మాట్లాడవలసి వచ్చేది. అలా మాట్లాడుతున్న సమయంలో ఏదో అను భూతికి దూరమవుతున్నట్లుగా ఆయనకు తోచేది. దీని కోరకు ఆయన తానే స్వయంగా చేసిన అధ్యయనంలో తెలిసిదేమంటే, మాతృభాషని బాల్యం నుంచే సహజంగా నేర్చుకుంటాం తల్లిదండ్రులు , స్నేహితులు, మాధ్యమాల ద్వారా దాని మీదపట్టు సాధిసాం. ఆక్రమంలో భాషతో పాటుగా భావోద్వేగాలు కూడా మన మనసులో నిక్షిప్తమై పోతాయి. కాని పరాయి భాషలు అలాకాదు. అంతే కాకుండా కంటిముందు జరుగుతున్న సంఘటనని దాని పర్యావసానాలతో అంచనా వేయటంలో కూడా మాతృ భాషకు పరాయి భాషకు తేడా ఉంటుందని పరిశోధకులు చెప్తున్నారు.

హైదరాబాదులోని శ్రీ పోట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో మే 10, 11, 12 (2018) తేదిలలో భాషాసాహిత్యోత్సవం నిర్వహించీరి. ఈఉత్సవాలలో చాలా ఉపాన్యాసాలు భాష ఉనికిని నిలుపు కోవడమంటే కేవలం ఆంగ్ల ప్రభావాన్ని ఖండించడమే కాదూ. జనం భాషని, పలుకుబడులను ప్రచారంలోకి తీసుకురావాలన్న విష యాన్ని తెలియచేస్తూ సాగాయి.

భాషను కాపాడుకోవడమంటే పురాణ, ఇతిహాసాలను కావ్యాలను కాపాడుకోవడం, పండితులకు సన్మానం చేయడం కాదు బౌద్ధిక భాషగా తెలుగును ఉపయోగిం చేందుకు కృషిచేయాలి అని ఆంధ్రజ్యోతి పత్రికా సంపా దకులు కె.శ్రీనివాస్ తెలియచేశారు.

ప్రస్తుత రోజుల్లో ఉన్నత విద్యకు వెళ్లిన తర్వాత అందరూ తెలుగు భాషను మర్చిపోతుండటమే ప్రధాన సమస్య. ఉన్నత విద్య అంతా ఆంగ్లంలోనే ఉంటుంది. నేర్చుకున్నది . తెలుగులో రాయాలంటే పెద్ద ప్రయత్నమే చేయవలసి వస్తోంది అనే బావన చాలా తపు.

పురపాలక, జిల్లా పరిషత్ బడుల్లో చదువుకుని వచ్చిన చాలా మంది మంచి స్థాయికి ఎదిగారు. తెలుగు

మాధ్యమంలో చదువుకోని సుప్రిం కోర్టున్యాయవాది వృత్తి చేస్తున్నవారు చాలా మంది ఉన్నారు. జస్టిస్ చలమేశ్వర్ అచ్చమైన తెలుగు భాష మాట్లాడుతారు .అయనకు సాహిత్యంలో కూడా మంచి ప్రవేశం ఉంది.

భాషను రక్షించడంలో ప్రభుత్వ కృషి :

రాజ్యాంగప్రకారం పౌర సమాజంలో అందరి హక్కులు కాపాడటంప్రభుత్వ విధి. మన సంస్కృతిని కాపాడట కూడ ప్రభుత్వ బాధ్యతే. భాషపై ముందు అవగాహన కలిగించాలి. అందుకోసం పాఠశాలలను వేదికలుగా మార్చుకుంటే చాలా ఉపయోగం ఉంటుంది. భాష పట్ల అభిమానం పెంచాలంటే పిల్లలకీ సుమతీ శతకాలు చెప్పాలి.ఇంగ్లీషు పదాలుమాట్లాడితే మన సమాజిక హోదా పెరుగుతుందన్న భావన చాలామందిలో ఉన్నది.కానీ మనభాషలోమనం మాట్లాడుకోవడమే గౌరవం.

ప్రభుత్వం ఉన్నత న్యాయవ్యవస్థలో ప్రాంతీయ భాషలను తప్పని సరిచేస్తే భాషను కాపాడుకోవచ్చు. కానీ బదిలీ విధానంలో బయటరాష్ట్రాలనుండి నాయ మూర్తులు రావటం వలన స్థానిక భాషను తృనిసరి చేసైఈన్యాయమూర్తులకు ఇబ్బంది అవుతుందన్నది ప్రభుత్వ అభిప్రాయం. కాని మాతృభాషలోన్యాయపాలన సాగితే న్యాయవాదులు, క్లయింట్లుకు అనుకూలంగానే ఉంటుంది. అయితే దీన్ని ఉన్నత న్యాయస్థానాల్లో అమలు చేయడానికి ప్రభుత్వం ఏదైనా మార్గాన్ని కనుక్కో వాలి. కృష్ణాజిల్లా ఘంటసాల మండలం శ్రీకాకుళం శ్రీకృష్ణదేవరాయ మహోత్సవాల్లో భాగంగా 2018 ఫిబ్రవరి 10,11 తేదిల్లో నిర్వహించిన భాషా బ్రంహోత్సవాలల్లో ఎంతోమంది వక్తలు విజ్ఞాన శాస్త్రంలో వచ్చే అనేక అంగ్ల పదాలకు తెలుగులో ప్రత్యామ్నాయాలను సృష్టించు కోవాలని గళమెత్తారు. 2018 సంవత్సరాన్ని తెలుగు భాషా వికాసం సంవత్సరంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ప్రకటించారు. ఈనేపథ్యంలో భాషాభి వృద్ధికి రాష్ట్రవ్యాప్తంగా విభిన్న, వినూత్న కార్య క్రమాలను నిర్వహిస్తున్నారు. భాష బ్రతకాలంటే సామాన్యుడికి సులభంగా అర్థమయ్యే ఆయా ప్రాంతాల మాండలికాల సాయంతో పారిభాషిక పదాన్ని సృష్టించుకోవాలి. విశిష్ట మైన ఎన్నో సామెతలు, నుడికారాలు, వ్యాకరణ సహిత హాస్యోక్తులు తెలుగు భాషకు మాత్రమే సొంతం. ముఖ్యంగా సామెతలు సామాన్యుల మహాకావ్యాలుగా చెప్పవచ్చు. కాబట్టి సాహిత్య ప్రయోజనం నెరవేరాలంటే భాష బ్రతికుండాలి. మన భాష కేవలం భావాల వ్యక్తీ కరణకు మాత్రమే పరిమితం కాలేదు తరతరాలుగా భావ జాలాన్ని అందిస్తూ గొప్ప నాగరికతకు మూలంగా ఉంది.

ప్రస్తుత రోజుల్లో యువతరాన్ని భాషపట్ల ఆకర్షితులను చేసేటందుకు వారికి నచ్చే, అర్థమయ్యే రీతిలో రచనలు రావాలని ప్రముఖ గేయ రచయిత అనంత్ శ్రీరామ్‌గారు చెలియచేసారు. భాషా సంస్కృతులు ప్రాథాన్యాన్ని వివరిస్తూ అనెకమంది మహనుభావులు సమాజాన్ని ఉత్తేజపరుస్తున్నారు.అమ్మభాష ద్వారా ఉపాధిలభించేలా తెలుగుప్రభుత్వాలుచోరవచూపాలని రచయిత గోల్లపూడి మారుతీరావు ప్రభుత్వానికి సూచించారు.

మనిషి ఎక్కడ స్థిరపడినా, ఎంత ఎత్తుకు ఎదిగినా తనదైన భాషానంస్కృతులతో ఉండే అనుబంధం విడదీయరానిది, విస్మరింపరానిది. తనదైన ఆచార వ్యవ హరాలతో జీవితాన్ని గడపడానికి నేను ఫలానా అని చెపుకోవడానికి కూడా ఆధార చిహ్నాలు భాషాసంస్కృతులే. ఇపుడు ఎటు చూసినా ఆంగ్లమే రాజ్యమేలుతుంది. కార్యాలయాల దగ్గర నుంచి సమావేశాల వరకు మాతృ భాషలో కాకుండా ఆంగ్ల భాషలోనే సంభాషిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో వ్యక్తిగత స్థాయిలో ప్రమాదం వాటిల్లితే పర్వాలేదు, కానీ వైజ్ఞానిక రంగంలోను, అంతర్జాతీయ శాంతి ఒప్పందాల్లోను ఆంగ్లాన్ని వారధిగా ఉపయోగిస్తుం టారు. మరి ఇలాంటి సమయాల్లో, సందర్భాల్లో పరాయి భాషలు ఏవైనా కావచ్చు అవి ప్రపంచపు మనుగడ మీదనే దెబ్బతీయచ్చు.

ముగింపు :

ఐరోపా దేశాల వాళ్ళు విజ్ఞాన శాస్త్రాలను వాళ్ళభాషలోకి

తర్జుమా చేసుకున్నారు. మనం2% అమెరికా ఉద్యోగాల కోసం అంగ్లం నేర్చుకుంటున్నాం. ప్రభుత్వ ఉత్తర్వులు ఇంకా ఆంగ్లంలోనే వస్తున్నాయి. భాష అనేది ఉద్య మాలకు ఊతం ఇచ్చేలాగ ఉండాలి. చాలా రాష్ట్రాలు స్థానిక భాషలో విద్యాభోధనకు ప్రాదాన్యలిపై మనం మాత్రమే ఆంగ్లాన్నే ఆరాధిస్తున్నాం. ఈపరిస్థితి తోలిగి పోయి తెలుగుకు జీవ సత్వాలు వపైనే మన భాష పది కాలాలపాటు పచ్చగా ఉంటుంది.

అధార గ్రంధాలు :

1. తెలుగు వెలుగు మాసపత్రిక
2. వివిధ దిన పత్రికలు



BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగులో అనువాద ప్రక్రియ

- డా॥. శిల్ప ఈడ్పుగంటి

తెలుగు సాహిత్యం అనువాదంతోనే ప్రారంభమైంది. కవిత్రయ మహాభారతం వ్యాస భారతానికి అనువాద గ్రంథమని అప్పటినుండి మొదలైన తెలుగు అనువాదం నేటివరకు కొనసాగుతూ, అభివృద్ధి చెందుతున్నది. కవిత్రయయుగం నాటికి అనువాద నిర్వచనాలు గాని, సిద్ధాంతాలు గాని వెలువడలేదు. అందువల్లనే పూర్వకవుల అనువాదాలలో స్వాతంత్ర్యం కనిపిస్తుంది. తరువాత కూడా వివిధ కాలాలలో అనేక అనువాద రచనలు వస్తూనే ఉన్నాయి.

ప్రాచీనయుగంలో తెలుగులో నన్నయ తరువాత నన్నెచోడుని కుమారసంభవం రచన కూడా అనువాద గ్రంథమని చెబుతారు. వీరి తరువాత సోమన అనువాద ప్రక్రియను అంతగా ఆదరించలేదు. గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణాన్ని సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించాడు. తిక్కనకాలంలో తిక్కన నుండి అతని సమకాలీనులైన కేతన, మారన మంచన అందరూ అనువాద గ్రంథాల్ని రాశారు. సంస్కృతంలో దండి రచించిన దశకుమార చరిత్రను కేతన తెలుగులోకి అనువదించాడు. మారన మార్కండేయపురాణం, మంచన కేయూర బాహుచరిత్ర కూడా అనువాద గ్రంథాలే. ఎర్రన హరి వంశం, నాచన సోమన ఉత్తర హరివంశం వంటి అనువాద గ్రంథాలకు సంస్కృతం మూలం. నన్నయ నుండి ఎర్రన వరకు వచ్చిన అనువాదాలన్నీ స్వేచ్ఛానువాద పద్ధతిలో వచ్చాయి. శ్రీనాథుని కాలంలో కూడా ఒక తరహా అనువాదాలు వచ్చాయి. ఈయన శ్రీహర్షుని నైషధాన్ని శృంగార నైషధం అనే పేరుతో అనువదించాడు. నైషధాన్ని ఎలా అనువాదం చేశాడో తానే చెప్పుకున్నాడు. రాయల యుగంలో అనువాదాల కంటే స్వతంత్ర రచనలే ఎక్కువగా వెలువడ్డాయని చెప్పవచ్చు. ఈ యుగంలో వచ్చిన అనువాదాలు పూర్వపు అనువాదాలకంటే భిన్నంగా ఉన్నాయి. ప్రబంధ కవులు కేవలం కథను మాత్రం గ్రహించి సొంతంగా కావ్యాలు రాశారు. దక్షిణాంధ్ర యుగంలోను, క్షీణయుగంలోను స్వతంత్ర కావ్యాలు ఎక్కువగా వెలువడినప్పటికి అనువాద గ్రంథాలు కూడా ఉన్నాయి. ఈ విధంగా కథనో, భావాన్నో ఏదో ఒకటి సంస్కృతం నుండి గ్రహించి రచనలు చేశారు. కనుక ప్రాచీన యుగంలోని రచనలు ఎక్కువగా సంస్కృత కావ్యాలకి అనువాదాలని చెప్పవచ్చు.

తెలుగు సాహిత్యంలో నన్నయ, ఆ తరువాత తరాల వారు పాటించిన అనువాదపద్ధతులు :

కథానువాద పద్ధతి (స్వతంత్రానువాద పద్ధతి) :

మూలకథతో పాటు వివిధ పాత్రల్ని సన్నివేశాలను గ్రహించి రచయిత తనకు నచ్చిన విధంగా అనువాదరచన చేయడం. కవిత్రయం వారిది స్వతంత్రానువాద పద్ధతి.

"నన్నయ యథామూలానువాదం చేయలేదు. శ్లోకానికి పద్యం అనే పద్ధతి పెట్టుకోలేదు. భారతబద్ధ నిరూపితార్థం తెలుగువారికి అందించడమే నా లక్ష్యం అన్నాడు. దానికి తగినట్టుగా పద్దెనిమిది పర్వాలకూ ప్రణాళిక రచించి తన స్వేచ్ఛానువాదాన్ని ప్రారంభించాడు. తిక్కన, ఎర్రనలు అదే మార్గంలో అదే లక్ష్యంతో దాన్ని పూర్తి చేశారు. అప్పటి నుంచి ప్రాచీన తెలుగు కవులు అందరికీ అదే ఒరవడి అయింది. స్వేచ్ఛానువాదాలే తప్ప యథామూలానువాదాలు అవతరించలేదు. నన్నయ ఈ మార్గం తొక్కడానికి ఒక చారిత్రక కారణం ఉంది. పదకొండవ శతాబ్దానికి ముందే వ్యాసభారతం కన్నడంలోకి వచ్చింది. అయితే అది కన్నడ భారతమే తప్ప వ్యాసభారతం కాదు. వ్యాసుడి లక్ష్యమూ, పరమార్థమూ పూర్తిగా భంగపడ్డాయి. కథా గమనమూ, పాత్రల పేర్లు మాత్రం మిగిలాయి. స్వభావాలు మారిపోయాయి. భారత రచనకు పరమార్థమైన వైదికధర్మం స్థానాన్ని జైనమతం ఆక్రమించింది.

ఈ అన్యాయాల్ని చక్కదిద్దడం కోసం నన్నయ గంటం అందుకున్నాడు. అందుచేత భారత పరమార్థాన్ని పున:ప్రతిష్టంచడమే సత్వర కర్తవ్యంగా స్వేచ్ఛానువాద పద్ధతిని స్వీకరించాడు. బహుశ ఇందులోని స్వేచ్ఛ అనంతర కవులను ఆకర్షించింది. స్వీయ ప్రతిభా ప్రద ర్శనకు అవకాశం ఇచ్చింది. అందుచేత కథాకల్పన కోసం శ్రమపడకుండా ప్రఖ్యాత వస్తులేశాన్ని స్వీకరించి స్వతంత్ర కావ్యాలను రచించారు. వస్తుపరంగా తెలుగులో స్వతంత్ర కావ్యాలు లేవు. ఏవో కొన్ని శతకాలు, ద్విపద రచనలు, ఒక్క కళాపూర్ణోదయం మినహాయిస్తే తెలుగు కావ్యాలకు సంస్కృత కావ్యాలలోనో తమిళ కన్నడాది ప్రాంతీయ భాషలలోనో మూలాలు ఉన్నాయి. అయితే ఇవి ఏవీ యథామూలానువాదాలు కాకపోవడమూ, ఇంచుమించు స్వతంత్ర రచనలు అన్నట్టు సాగడమూ గమనించవలసిన అంశం'' (రామబ్రహ్మం, బేతవోలు. 2007:1)

భావానువాద పద్ధతి (స్వతంత్రానువాద పద్ధతి) :

మూలంలోని కథతో పాటు భావాల్ని అనుసరిస్తూ మూలభావాలని ఉచితమైన భాషలో సుందరమైన శైలిలో కొన్ని సందర్భాలలో మూలవిధేయుడై అనువదించడం. శ్రీనాథుని అనువాదాలు ఈ కోవకే చెందుతాయి.

పదపదానువాద పద్ధతి :

మూలం నందలి కథను, భావాల్ని గ్రహించి ప్రతి పదానికి సమానార్థకాన్ని చేకూర్చి అనువాదం చేయడం. పురాణేతిహాసాలను అనువదించడానికి స్వతంత్రానువాద పద్ధతిని, నాటకాలను అనువదించడానికి అస్వతంత్రాను వాద పద్ధతిని అనువాదకులు అవలంబించారు.

ప్రాచీనకాలంలో వచ్చిన అనువాదాలన్నీ సాహిత్య పరమైనవి. కాని ఆధునిక కాలంలో సాహిత్యపరమైన అనువాదాలతో పాటుగా సాహిత్యేతర అనువాదాలు కూడా వచ్చాయి. శాస్త్రానువాదాలు, గణితానువాదాలు, రాజకీయానువాదాలు, సాంకేతికానువాదాలు, సాంఘి కానువాదాలు, మనస్తత్వానువాదాలు, గణాంకాను వాదాలు, చారిత్రకానువాదాలు, ఆర్థికానువాదాలు, వైద్య శాస్త్రానువాదాలు, మొదలైనవి. విషయాన్ని బట్టి రకరకాల అనువాదాలు వస్తున్నాయి. ప్రాచీనకాలంలో వచ్చిన తెలుగు అనువాదాలకు మూలం సంస్కృత గ్రంథాలు. ఆధునికకాలంలో వచ్చిన తెలుగు అనువాదా లకు మూలం ఆంగ్లగ్రంథాలు. ప్రాచీనులు సంస్కృత పదాలను యథాతథంగా వాడుకున్నట్లే ఆధునికులు ఆంగ్లపదాలను యథాతథంగా వాడుకుంటున్నారు. అంతేకాకుండా తమిళ, మళయాల, కన్నడ, హిందీ, బెంగాలీ మొదలైన భాషలలోని గ్రంథాలు కూడా అను వదింపబడుతున్నాయి.

ఒకప్పుడు సంస్కృతంలో గాని ఇతర భారతీయ భాష లలో గాని అనువాదానికి అంతగా ప్రాధాన్యం లేదు. పూర్వీకులు భావానువాదాలు, స్వేచ్ఛానువాదాలు ఎక్కువగా చేశారు. మూలగ్రంథాలకు వ్యాఖ్యానాలు గానూ, లేదా టీకా తాత్పర్యాలుగానూ రాసిన గ్రంథాలే కాని అనువాదాలు కావని కొంతమంది అభిప్రాయం. కాళిదాసు రచనలకు సంజీవనీ వ్యాఖ్య రాసిన మల్లినాథ సూరి 'నా మూలం లిఖ్యతే కించిన్నా నపేక్షిత ముచ్యతే' అన్నాడు. కాని అది తన వ్యాఖ్యాన పద్ధతిని గూర్చి చెప్పిందే తప్ప అనువాదం గూర్చి చెప్పింది కాదు. కాళి దాసు రచనలను క్షుణ్ణంగా అర్థం చేసుకున్న మల్లినాథుడు తన వ్యాఖ్యానాల ద్వారా కాళిదాసును పునర్జీవింపచేశాడు. మల్లినాథుడు రాసినవి వ్యాఖ్యాన గ్రంథాలే కాని అను వాదాలు కావు'. బృహత్కథ మొదలైన రచనలకు సంస్కృతంలో వచ్చిన రచనలు భావానువాదాలు లేదా ఛాయానువాదాలే తప్ప శబ్దానువాదాలు కావు. సంస్కృతంలోని నీతిగ్రంథాలను, వైద్యగ్రంథాలను, నాటకాలను ఆయా కవులు, పండితులు తమతమ భాషలలో రాశారు. అవి అనువాదాలుగా గాక మౌలిక రచనలుగానే భాసిస్తున్నాయి. కాబట్టి వీరెవరూ అను వాదం, అనువాద సిద్ధాంతాలు మొదలైన వాటిని గూర్చి శాస్త్రీయంగా చర్చించలేదు.

ఆధునికయుగంలో చిన్నయసూరి ఆంధ్రశబ్ద చింతామణి వంటి వ్యాకరణ సూత్రాలను, నీతిచంద్రికగా హితోపదేశాన్ని అనువదించారు. ఆధునిక యుగారంభం

లోనే వస్తుపరంగా కూడా స్వతంత్ర రచనలు ప్రారంభ మయ్యాయి. ప్రాంతీయ చరిత్రలు, ఐతిహాస్యాలు, సామాజిక సంఘటనలు కావ్య వస్తువులయ్యాయి. ఇవి లఘుకావ్యాలుగా ప్రారంభమై మహాకావ్యాలకు విస్తరించాయి. ఇదే సమయంలో యథామూలాను వాదాలు ప్రారంభమయ్యాయి. శ్రీపాద కృష్ణమూర్తిగారు భారత, భాగవత, రామాయణా లన్నింటినీ అను వదించారు. శ్లోకానికి పద్యం అనే పద్ధతిలో తుచ తప్పని అనువాదం చేశారు. ఇరవైవ శతాబ్దంలో ఆంగ్ల సాహిత్య ప్రభావం వలన అనేక అనువాదగ్రంథాలు వెలువడ్డాయి. నవల, నాటక, కథానిక, స్వీయచరిత్ర, విమర్శ మొదలైన సాహిత్య ప్రక్రియలు ఆంగ్లభాషా ప్రభావం వలన తెలుగులో తమ సొరభాలను వెదజల్లాయి. కందు కూరివారు అనేక కథల్ని ఆంగ్లం నుండి తెలుగులోకి అను వదించారు. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలాన్ని యథా మూలంగా అనువదించారు. ఈయన రాసిన రాజశేఖర చరిత్ర నవల గోల్డ్ స్మిత్ వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్ కు అను వాదం. క్రీ.శ.1841 లో శ్రీహర్షుని రత్నావళిని, షేక్స్పియర్ కామెడి ఆఫ్ ఎర్రర్సు ను అనువదించారు. గురజాడ శ్రీరామమూర్తి అరేబియన్ నైట్స్ లోని ది స్లీపర్ అవేక్డన్ ని చిత్రరత్నాకరమనే పేరుతో అనువదించారు. అంతేగాక మర్చంట్ ఆఫ్ వెనిస్ అనే షేక్స్పియర్ నాటకాన్ని కూడా అనువదించారు. మృచ్ఛకటికం, ముద్రారాక్షసం వంటి సంస్కృత నాటకాలు కూడా అనువదింపబడ్డాయి. వేదం వారు హర్షనాటక త్రయాన్ని, మల్లాది సూర్యనారా యణశాస్త్రి గారు ఉత్తర రామచరిత్ర నాటకాన్ని అనువదిం చారు. వేదం వేంకటరాయశాస్త్రిగారు హితోపదేశాన్నే గద్యపద్యాత్మకంగా అనువాదం చేశారు. పానుగంటి, తిరుపతి వేంకటకవులు అనేక సంస్కృత నాటకాల్ని అనువదించారు. క్రీ.శ. 1874 లో వావిలాల వాసుదేవశాస్త్రి జూలియన్ సీజర్ ను అనువదించాడు. ఆదిభట్ల నారా యణదాసు బాటసారి గోల్డ్స్మిత్ ది ట్రావెలర్ కు అను వాదం. జాన్ మిల్టన్ కోమస్ ని విశ్వనాథశాస్త్రి కామ విలాసం అనే పేరుతో అనువదించారు. డికెన్స్ ఎ టేల్ ఆఫ్ టు సిటీస్ ను కనకసుందరం గుప్తజ్ఞానమని అను వదించారు. జోనాధన్ స్విఫ్ట్స్ గలివర్ ట్రావెల్స్ ను కాళ్ళకూరి హనుమంతరావు గాలివరు నౌకాచరిత్రలని అనువదించారు. షేక్స్పియర్ కింగ్ లియర్ నాటకాన్ని చెన్నాప్రెగడ భానుమూర్తి మందపాల చరిత్ర గాను, పరమహంస విద్యానందస్వామి ప్రళయంతకరాజు గాను అనువదించారు. తెలుగు నుంచి ఆంగ్లంలోకి కావ్యాలను అనువదిస్తున్న వారిలో వెలిచేరు నారాయణరావుగారు ఒకరు. కళాపూర్ణోదయం, క్షేత్రయ్య పదాలు, అన్నమా చార్య కీర్తనలు, శ్రీకాళహస్తీశ్వర శతకం చాలా ఉన్నాయి. క్షేత్రయ్య పదాలకు బాలాంత్రపు రజనీకాంతారావుగారు అనువాదం చేశారు.

ఆంగ్లభాష నుండి మాత్రమే కాకుండా వంగ, హిందీ, రష్యన్, తమిళ భాషల నుంచి కూడా రచనలు తెలుగు లోకి అనువదింపబడ్డాయి. వంగభాష నుండి శరత్ సాహిత్యాన్ని బొందలపాటి శివరామకృష్ణ అనువదించారు. రవీంద్రుని రచనలు కూడా తెలుగులోకి అను వదింపబడ్డాయి. గీతాంజలిని చాలామంది అను వదించారు. చలం, బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు, జగ్గయ్య, టి.అనసూయాదేవి, ఆచంట జానకీరామ్ మొదలైనవారు ఎన్నో అనువాద రచనలు చేశారు. రష్యాభాషలో మాక్సిమ్ గోర్కీ రచించిన మదర్ ని క్రోవ్విడి రంగరాజు అమ్మ అనే పేరుతో అనువదించారు. హిందీ భాషలో ప్రేమ్చంద్, యశపాల్, జయశంకర్ ప్రసాద్ మొదలైనవారి నవలలు తెలుగులోకి అనువదింప బడ్డాయి. ప్రేమ్చంద్ గోదాన్ ని పిచ్చయ్యశాస్త్రి అను వదించారు.

"రెండో ప్రపంచ యుద్ధానంతరం అనువాద ప్రక్రియ అన్నిభాషల్లోకి విస్తరించింది. అందులో ముఖ్యంగా శాస్త్రీయ సాంకేతిక గ్రంథాల్ని అనువదించటం. అంతేగాక అనేక ప్రబంధాలు చిన్న చిన్న కావ్యాలుగా అనువదింపబడి ముద్రణారూపంలో అందరికి అందుబాటులోకి రావటం. వీటిపై ప్రజలకు ఏర్పడ్డ ఆసక్తిని తక్కువ అంచనా వేయటానికి లేదు. ఆసక్తిని బట్టి అనువాద గ్రంథాలు

ఎక్కువగా ప్రచురింపబడటమే కాక అవి తక్కువ ధరకు లభ్యం కావటం వల్ల అనువాద గ్రంథాలకు ఆదరణ ఏర్పడింది. ఇలాంటి ఉత్తమ ఫలితాలకు కారకులు అనువాదకులు. అందువల్ల ఆధునికయుగంలో అనువాదకుల పాత్ర అభినందనీయం." (అక్కిరెడ్డి, ఎస్. 1989 : 15)

'క్రీ.శ.1953 లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. 1966 లో ప్రాంతీయ భాషలను అధికార భాషలుగా నిర్ణయించడం జరిగింది. తత్ఫలితంగా ప్రాథమిక, ఉన్నత విద్యాబోధన ప్రాంతీయ భాషలోనే జరగాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలుగు పాఠ్యగ్రంథాలను తయారుచేసే బాధ్యత తెలుగు అకాడమీ స్వీకరించింది. ఒకటవ తరగతి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు వివిధ అంశాలకు సంబంధించిన విషయాలను అనువదించాల్సిన అవసరం ఏర్పడింది. 1980 లో పరిపాలన, న్యాయ పదకోశాలను తెలుగు అకాడమీ తయారుచేసింది. శాస్త్రానువాదాల్లో కూడా ముందంజ వేయాలనే దృక్పథంలో వివిధ శాస్త్ర పదకోశాలను తయారుచేశారు. భౌతిక, రసాయనిక, జీవ, గణిత, గణాంక, రాజనీతి శాస్త్రాలు మొదలైనవి'. తెలుగు అకాడమీ కృషి ఫలితంగా నేడు ఎన్నో అనువాద గ్రంథాలు వెలువడ్డాయి. వివిధ భాషల నుంచి తెలుగులోకి సాహిత్య, సాహిత్యేతర గ్రంథాలు అనువదించబడ్డాయి. ఇతర భాషల నుండి తెలుగులోకి అనువదించబడిన కథలు, నవలలు, నేడు వివిధ పత్రికలలో (చతుర, విపుల) ప్రచురింపబడుతున్నాయి. చందమామ పత్రిక ఒక భాషలోని కథలను వేర్వేరు భాషలలోకి అనువదించి ప్రచురిస్తుంది. అకాడమీ సంస్థలే గాల బుక్ ట్రస్టులు, విశ్వవిద్యాలయాలు కూడా తమవంతు కృషి చేస్తున్నాయి. అంతేగాకుండా కౌముది, సుజనరంజని, విహంగ ... మొదలైన అంతర్జాలీయ పత్రికలు సాహిత్యంలో నవల, నాటకం, కథానిక, వంటి ప్రక్రియలతో పాటుగా అనువాద ప్రక్రియకు సంబంధించిన వాటిని కూడా ప్రచురిస్తున్నాయి. విద్యాసంస్థలలో అనువాద ప్రక్రియ పాఠ్యాంశాలలో ముఖ్య విషయంగా ఉంది. అనువాద ప్రక్రియను పాఠ్యాంశంగా బోధించి అనువాదశాస్త్రంలో నైపుణ్యాన్ని కలిగిస్తే అనువాద కార్యక్రమం మరింత సమర్థవంతంగా జరుగుతుంది. తెలుగులో అనువాద సిద్ధాంతానికి, సమస్యలకు సంబంధించిన రచనలు కూడా వచ్చాయి. రాచమల్లు రామచంద్రారెడ్డిగారి అనువాద సమస్యలు (1987). డా. ఎస్. అక్కిరెడ్డిగారి అనువాద సిద్ధాంతాలు (1989) గోవిందరాజు చక్రధర్ రావుగారు అనువదించడం ఎలా? (1998), ఆచార్య భీంసేన్ నిర్మల్ గారి అనువాద శాస్త్రం (2000) మొదలైనవి.

ఆధునికకాలంలో కందుకూరి వీరేశలింగం పంతులు గారు, వావిలాల వాసుదేవ శాస్త్రిగారు మొదలైనవారు సంస్కృత, ఆంగ్లభాషల నుండి అనువాదాలు చేశారు. ఇతర భాషల నుండి కూడా ఎన్నో అనువాదాలు తెలుగులోకి వచ్చాయి. అయితే ఆ అనువాదకులెవరూ కూడా సిద్ధాంతపరంగా అనువాదం గూర్చి తెలుగులో చర్చించలేదు. కాని ఇతర భాషలలో అనువాద సిద్ధాంతపరమైన చర్చలు, రచనలు ఉన్నాయి. పాశ్చాత్యులు కూడా అనువాదం గూర్చి చాలానే నిర్వచనాలు ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అనువాదం యొక్క ఆవశ్యకత, ప్రాధాన్యతను బట్టి ప్రత్యేకమైన అనువాద సిద్ధాంతాన్ని తెలుగులో రూపొందించుకోవలసిన అవసరం ఉంది. తెలుగులో అనువాద ప్రక్రియ పై రచనలు కూడా తక్కువగానే ఉన్నాయి. వీటిపై ఇంకా రచనలు రావాలి. తద్వారా మనం ఉత్తమ అనువాద రచనలు పొందాలి.

ముగింపు :

ఆధునికయుగం వైజ్ఞానిక యుగం. నేడు అన్ని రంగాలలోను వైజ్ఞానిక అభివృద్ధి కనిపిస్తుంది. దేశం అభివృద్ధి చెందాలంటే అన్ని రంగాలలోను అభివృద్ధిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి. వివిధ దేశాలలో వివిధ భాషలలో వెలువడుతున్న శాస్త్ర, సాహిత్య, ఇతర విషయాలను ప్రతివ్యక్తి చదివి అర్థం చేసుకోవడం సాధ్యమయ్యే పనికాదు. కాబట్టి ప్రపంచ భాషలలో వెలువడుతున్న ఈ విషయాలను ఎప్పటికప్పుడు అన్ని దేశాలకు వ్యాపింపజేసే ఏకైక సాధనం అనువాదం. ఈ అనువాద ప్రక్రియ మరింత పురోగతి సాధించాలి.

ఉపయుక్త గ్రంథసూచి :

1. అక్కిరెడ్డి. ఎస్; నిర్మలాదేవి. పి; నళిని. జి.1989. అనువాద సిద్ధాంతాలు. సమతా పబ్లికేషన్స్. మద్రాసు.
2. భీంసేన్ నిర్మల్ 2000. అనువాదశాస్త్రం (మోనోగ్రాఫ్) తెలుగు అకాడమీ, హైదరాబాద్.
3. రామబ్రహ్మం. బేతవోలు. 2007. అనువాదాలు అరసున్నాలేనా? (బేతవోలు రామబ్రహ్మం/ నన్నయ వికిపిడియా.)

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కొడవటిగంటి కుటుంబరావు కథల్లో సంఘర్షణ

- డా॥. వెంకటరామయ్య గంపా

"... నేను ఒకప్పుడు కథలో శిల్పం తప్ప మరేమీ చూసేవాణ్ణి కాదు. అప్పటి నా ఉద్దేశంలో కథకి శిల్పం తప్ప ఇంకేమీ అవసరం లేదు. ఆ వైఖరి ఇప్పుడు మారిందనుకోండి.

... ఇప్పుడు కథాశిల్పం గురించి నాకు ఏ విధమైన జంకూలేదు. ఒకప్పుడు 'నా శిల్పం ఎంత బాగుంటుందో చూడండి' అన్నట్టుగా కథ రాసేవాణ్ణి. ఇప్పుడు కేవలం శిల్ప ప్రదర్శన కోసమే కథ రాయటం వట్టిదండుగగా కనిపిస్తోంది. కాని కథకి శిల్పం అయువుపట్టు అని మాత్రం ఆనాడే కాదు ఈనాడు కూడా ఒప్పుకుంటాను. కథలో శిల్పం లేకపోయినా ఇంకెన్నున్నా దండుగే" (విశ్వనాథరెడ్డి, కేతు. (సంపా.) కుటుంబరావు సాహిత్యం రెండవ సంపుటం. శ) అని కొడవటిగంటి కుటుంబరావు శిల్పం గురించి పేర్కొన్నారు. దీనినిబట్టి కుటుంబరావు కథల విషయంలో శిల్పానికి ఇచ్చిన ప్రాధాన్యత తెలుస్తుంది.

ఈ వ్యాసం కోసం కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యం రెండవభాగం సంపుటి నుంచి కొన్ని కథలను ఎన్నుకొని, ఆ కథల్లోని సంఘర్షణను పరిశీలించడం జరిగింది.

మంచికథకు ఉండవలసిన లక్షణాలను గురించి విమర్శకులు పలు విధాలుగా వివరించి ఉన్నారు. క్లుప్తత, అనుభూతి ఐక్యత, సంఘర్షణ, నిర్మాణ సౌష్ఠవం అనే నాలుగు అంశాలు మంచి కథకు ఉండవలసిన లక్షణాలుగా వల్లంపాటి వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. ఈ అంశాల్లో కొంతమంది దృష్టిలో సంఘర్షణ అనేది మొదటి అంశంగా కనిపిస్తుంది. కథా శిల్పంలో ముఖ్యమైన అంశం సంఘర్షణ అని విమర్శకులు అందరూ అంగీకరిస్తారు.

"సంఘర్షణ శబ్దానికి తెలుగులో రాపిడి లేదా ఒరిపిడి అనే అర్థముంది. సాహిత్య పరిభాషలో కూడా ఇదే అర్థం ప్రయుక్తమవుతున్నది. రెండు పరస్పర వ్యతిరేక శక్తుల మధ్య కలిగే రాపిడినే సంఘర్షణ అంటున్నాం. ఇవి బాహ్యశక్తులైనా కావచ్చు; ఆంతరిక శక్తులైనా కావచ్చు. కొన్ని సందర్భాల్లో బాహ్యశక్తికీ ఆంతరిక శక్తికీ మధ్య ఘర్షణ ఏర్పడవచ్చు. ఈ శక్తులు ఒకదానిమీద ఒకటి ప్రాబల్యం వహించడానికి చేసే ప్రయత్నం గాఢమైనకొద్దీ సంఘర్షణ తీవ్రతరమవుతూ ఉంటుంది." (దక్షిణామూర్తి, పోరంకి: కథానిక స్వరూప స్వభావాలు. 353)

"కథలోని సంఘర్షణ రచయిత దృక్పథానికి సంకేతం. మరొక రకంగా చెప్పాలంటే ఎలాంటి సంఘర్షణా లేని కథను రాసిన రచయితకు ఒక నిర్దిష్ట జీవిత దృక్పథం లేదని చెప్పవచ్చు." (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. కథాశిల్పం. 15)

పై అంశాలను బట్టి కథానికలో సంఘర్షణకు ఉన్న ప్రాధాన్యత తెలుస్తుంది. జీవితం ఎప్పుడూ సంఘర్షణలతో నిండి ఉంటుంది. అందులో కొన్ని చాలా చిన్నచిన్న విషయాలుగా, మరికొన్ని జీవితాన్ని ప్రభావితం చేసేవిగా ఉంటాయి. సమస్య జీవితాన్ని ప్రభావితం చేసిన తరువాత మనిషి మునుపటిలా ఉండడు. తప్పని సరిగా మార్పు కనిపిస్తుంది. జీవితాన్ని ప్రతిబింబించే కథానికలో చాలా సందర్భాల్లో సంఘర్షణ కనిపిస్తుంది. కొడవటిగంటి కుటుంబరావు కథల్లో కనిపించే సంఘర్షణ మనల్ని ఆలోచింపజేసేలా ఉంటుంది. వారి కథలు జీవితాన్ని చాలా సునిశితంగా పరిశీలించి రచించిన కథల్లాగా అనిపిస్తాయి. చాలా వరకు పాత్రల మధ్య కనిపించే వైరుధ్యం కొడవటిగంటి కుటుంబరావు దృక్పథానికి నిలువుటద్దంలా కనిపిస్తుంది.

"సంఘర్షణ అనేది అనేక రకాలుగా ఉండవచ్చు. ఇద్దరి వ్యక్తుల మధ్యా, ఒకే వ్యక్తిలోని రెండు అంశాల మధ్యా, రెండు భావాల మధ్యా, రెండు వర్గాల మధ్యా, రెండు

జీవిత దృక్పథాల మధ్యా - ఇలా ఎన్నిటి మధ్యనైనా ఉండవచ్చు. అంతే కాకుండా ఈ సంఘర్షణ భౌతికంగా కానీ, మానసికంగా కానీ ఉండవచ్చు." (పైదే. 15)

కొడవటిగంటి కుటుంబరావు కథల్లో సంఘర్షణ వివిధ రకాలుగా కనిపిస్తుంది. ఒకే పాత్ర మధ్య ఉండే సంఘర్షణను వివరించే కథ విమోచనం. ఇందులో రచయితే పాత్రగా తన స్వగతాన్ని వివరిస్తాడు. పేదవాడిగా ఉండటం వలన తనకు ఎవ్వరూ పిల్లనివ్వడం లేదని బాధపడతాడు. కానీ అనుకోకుండా సరోజిని అనే ఆమెతో పరిచయం ఏర్పడుతుంది. ఆమెతో పరిచయం తరువాత మరొకర్ని పెళ్ళాడటానికి అతని మనసు అంగీకరించలేదని చెబుతాడు రచయిత. అయితే అతను పేదవాడు కావడం వలన ఆమె యోగక్షేమాలు ఆలోచించి ఆమె తనను పెళ్ళాడటం ఉచితం కాదని భావిస్తాడు.

"... ఎందుకంటే, నావంటి దరిద్రుణ్ణి పెళ్ళాడి సరోజిని ఏం బావుంటుంది? నాకా మనిషి మీద ఈషత్తయినా ఇష్టం వుంటే నన్ను పెళ్ళాడమని ఎట్లా అనగలను?" (విశ్వనాథరెడ్డి, కేతు. కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యం రెండవ సంపుటం. 267.)

కానీ ఒకానొక సందర్భంలో ఆమెను నేను ప్రేమిస్తున్నానా? అనే సందేహాన్ని కూడా వెలిబుచ్చుతాడు. వారి మధ్య కేవలం స్నేహం మాత్రమే ఉందేమో అనే అనుమానం కూడా ఉంటుంది. "దురదృష్టవశాత్తూ అందులో ప్రణయ లక్షణాలు- నేను పైన చెప్పినవి తప్ప- ఏమి లేవు. 'నేను సరోజినిని ప్రేమిస్తున్నాను' అని కూడా నా అంతరాత్మలో అనుకున్న పాపాన పోలేదు." (పైదే)

సరోజినితో తను మనసు విప్పి మాట్లాడాడు. తన అంతరంగాన్ని పంచుకున్నాడు. తన మనసులో సరోజిని అంటే గౌరవం పెంచుకున్నాడు. కానీ సరోజిని తన ఎదుటనే మరొక వ్యక్తి మంచి చెడ్డల గురించి మాట్లాడుతుంటే తనుకు ఇబ్బంది కలుగుతుంది. అదే సరోజిని ఆ అబ్బాయి జీతం గురించి మాట్లాడుతూ "ఏం చదివితే మాత్రం, నెలకి డెబ్భై సంపాదన; నాన్నా?' అని సరోజిని అన్న మాటలు నా అంతరాత్మలో గులకరాళ్ళల్లే చేరి ఎంత మథించినా జీర్ణానికి రాకపోయినై... యాభై సంపాదించుకునే నన్ను గురించి సరోజిని ఏమనుకుంటూ వుండి ఉండాలి?... నేను ఒకంతట పశ్చాత్తాప పడే ప్రాణిని కాను. కాని సరోజినికి సంపూర్ణ పరిచయం- స్నేహం- ఇచ్చి నందుకు నేను చెప్పతరం గాని బాధ పడ్డాను. ఆమె విషయమై వెనక ఎన్నడూ రాని ఆలోచనలన్నీ వచ్చినై. సరోజిని నన్ను పెళ్ళాడటానికెందుకు ప్రయత్నం చెయ్యదూ? నేను తక్కువ సంపాదిస్తూ ఉంటేనేం? నాతో అంత తృప్తి చెందినట్టు కనిపించిన మనిషి, డబ్బు కొంతవరకు త్యాగం చెయ్యకూడదా? ఎంత భాగ్యవంతుడు వచ్చినా తనకి లక్షాధికారి రాడుకదా! తనని పెళ్ళాడేవాడు ఏ రెండు వందలో సంపాదిస్తున్నాడని తెలిస్తే వాడి అంతరాత్మ ఎటువంటుదైనా పెళ్ళాడేస్తుందా?... ఈ ఆలోచనల కంతే లేదు" (పైదే. 268.) ఇలా అతని మనసులో రెండు రకాలైన అభిప్రాయాలు కనిపిస్తుంటాయి. ఎటూ తేల్చుకోలేని పరిస్థితి. ఒక స్నేహితుడిగా సరోజినిని పెళ్ళాడాలను కోవడం, ఒక పేదవాడిగా తన క్షేమం గురించి ఆలోచించి తను సరోజినికి దూరంగా ఉండాలని ప్రయత్నం చేయడం అనే ఆలోచనలతోనే సంవత్సర కాలం గడిచిపోతుంది. మొత్తం కథ అంతా కూడా ఈ సంఘర్షణే కనిపిస్తుంది. కొన్ని సందర్భాల్లో తన అభిప్రాయాలతో తనే విభేదించుకుంటాడు రచయిత. అతనిలోని సంఘర్షణ అతడిని అన్ని విధాలాగా ఇబ్బంది పెడుతూనే ఉంటుంది. చివరకు ఆనందం, తృప్తి అనే మాటలను మరిచిపోతాడు. సరోజినికి కావాల్సింది డబ్బు కాబట్టి డబ్బు సంపాదించడానికి పట్టణం వెళ్ళి అక్కడ డబ్బు సంపాదిస్తాడు. కానీ ఆ డబ్బుతో ఆనందం లేదని సరోజిని తండ్రికి లేఖ రాస్తాడు.

ఇందులో ఒకే వ్యక్తిలోని రెండు భిన్న మనస్తత్వాలను ఒక వ్యక్తి కోసం ఎలా సంఘర్షణ పడుతున్నాయో రచయిత వివరించిన తీరు పాఠకులను ఆకట్టుకోవడంతో పాటు కొంత ఆలోచనను కూడా రేకెత్తిస్తుంది.

వ్యక్తికి-వ్యక్తికి మధ్య సంఘర్షణ :

వ్యక్తికి, వ్యక్తికి మధ్య సంఘర్షణ అనేది చాలా సహజం.

ఒక పాత్ర మరొక పాత్రతో విభేదించడమనేది చాలా సందర్భాల్లో జరుగుతుంది. ఈ రకమైన సంఘర్షణ ఏర్పడటానికి కారణాలు చాలా ఉన్నాయి. ఒక పాత్ర మరొక పాత్రతో మాటలతో లేదా చేతలతో విభేదించడాన్ని వ్యక్తికి, వ్యక్తికి మధ్య సంఘర్షణ లేదా రెండు విభిన్న పాత్రల మధ్య సంఘర్షణగా పేర్కొనవచ్చు. రెండు పాత్రల మధ్య సంఘర్షణను చిత్రించిన కథ 'ఇంతలో ఉంది'. కథకుడు, అతని భార్య 'ఇంతలో ఉంది'లో ప్రధాన పాత్రలు. కథ ప్రారంభంలో భార్యాభర్తలు ఎంతో అన్యోన్యంగా ఉంటారు. తరువాత ఒకరి ఆధీనంలో మరొకరు ఉండాలని ఇద్దరూ భావించడంతో వారివురి మధ్య సంఘర్షణ ప్రారంభమవుతుంది. మొదట భర్త ఆత్మాభిమానం అనే పేరుతో భార్య మీద తన అహంకారాన్ని ప్రదర్శించడంతో ప్రారంభమైన సంఘర్షణ చిలికి..చిలికి గాలివానగా మారి నట్లు ఇద్దరూ విడిపోయో స్థితి ఏర్పడుతుంది. "సీత యందు నాకూ నాయందు సీతకూ సానుభూతి ఎప్పుడైతే అంతరించిదో, ఆ క్షణం నించీ మేమిద్దరమూ ఒకర్నొకరం ప్రతిఘటించ సాగాం. నా అభిప్రాయాలను సీత తృణీకరించితే నాకు సీతమీద నైతికంగా ఉన్న హక్కు నంతా వినియోగించి నేను సీతను శాసించసాగాను. చివరకు కూరగాయల దగ్గర నించీ నాయిష్టమే చెల్లించుకుంటూ రాసాగాను. ఒక్క నా ఇష్టం చెల్లటమే కాదు సీత యిష్టం చెల్లకుండా కూడా చూడసాగాను. నన్ను ప్రతిఘటించడానికి ఆవగింజంత అవకాశం ఉంటే చాలు జారవిడవటం లేదు సీత. నాకెన్ని విధాల అసంతృప్తి కలిగించటానికి వీలుందో అన్ని విధాల అసంతృప్తి కలిగిస్తున్నది." (పైదే. 280)

కేవలం ఒకరిమీద మరొకరు ఆధిపత్యం చెలాయించడం కోసమే సంఘర్షణకు దిగుతారు. చివరికి ఇద్దరు విడిపోయి ఆరు సంవత్సరాలు దూరంగా ఉంటారు. కానీ భర్త మొదట తన తప్పును సరిదిద్దుకోవడానికి తన భార్య దగ్గరకు వెళ్ళటంతో ఆమె కూడా తన తప్పును సరిదిద్దుకుని ఇద్దరూ ఒకటవడం అనేది ముగింపు.

వ్యక్తికి - సమాజానికి మధ్య సంఘర్షణ :

ప్రతి మనిషి సమాజంలో ఒక భాగమే. చాలా వరకు వ్యక్తులు సమాజంతో సర్దుకుపోయే ప్రయత్నం చేస్తుంటారు. కానీ కొన్ని సందర్భాల్లో కొంతమంది వ్యక్తులు సమాజంలో ఉన్న కొన్ని పద్ధతులతో, విధానాలతో సర్దుకుపోలేక ఘర్షణ పడతారు. ఈ ఘర్షణ అనేది కొన్ని సందర్భాల్లో వ్యక్తికి సమాజ సంస్కృతికి మధ్య, వ్యక్తికి ప్రభుత్వానికి మధ్య, వ్యక్తికి సంస్థకు మధ్య... ఇలా పలు విధాలుగా ఉంటుంది.

వ్యక్తికి సమాజానికి మధ్య ఉన్న సంఘర్షణను చిత్రించిన కథ 'వ్యర్థజీవితం'. కథలో ముఖ్య పాత్ర అయిన మార్కండేయులు గురించి రచయిత మాటల్లో చెప్పాలంటే 'తెలివితేటలు, మంచితనం ఉన్నా బాగుపడేవాడికి ఉండవలసిందేదో లేని వ్యక్తి'. కథలో మార్కండేయులు సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక చివరికి తన జీవితాన్నే కోల్పోయిన వ్యక్తి. "ఎవరికన్నా అన్యాయం జరిగిందని వాడికి తోచినప్పుడే తన తల రోకట్లో దూర్చేవాడు- రోకటి పోట్లు తినేవాడు." (పైదే. 298). తను చదువుతున్న పాఠశాలలో తెలుగు మాష్టారు ప్రతిభ ఆధారంగా కాకుండా ఇష్టాయిష్టాలతో మార్కులు ఇచ్చినప్పుడు మాష్టారుపై హెడ్మాష్టర్‌కు పిర్యాదు చేసి అక్కడ హెడ్మాస్టర్ దగ్గర చివాట్లు తిన్నాడు. చదువుకునే రోజుల్లో పలువురి మాష్టార్లతో గొడవపడుతూనే ఉండేవాడు. చివరకు ఒక సందర్భంలో కాలేజీ ప్రిన్సిపాల్ మార్కండేయులుకు ట్రాన్స్‌ఫరు సర్టిఫికెటు ఇచ్చి కళాశాల నుంచి పంపించేశారు. ఉద్యోగంలోనూ అదే పరిస్థితి. ఎక్కడా ఒక చోట నిలకడగా పనిచేయలేక పోయాడు.

తరువాత అతని భార్యవైపు వారు సహాయం చేస్తామంటే వద్దన్నాడు. అందుకు ప్రధాన కారణం వారు సంపాదిస్తున్న డబ్బు, జీవిస్తున్న విధానం అతనికి నచ్చలేదు. అతడి బావమరుదులు దొంగ స్వామీజీని అడ్డుపెట్టుకుని అక్రమ మార్గంలో సంపాదించిన డబ్బుతో అతడిని జీవించమన్నారు. అది అతనికి నచ్చలేదు. చివరికి తన భార్య కూడా అతడిని వదిలేసింది. అతడి జీవితం ముగిసిన అధ్యాయమని కథకుడు చివర్లో పేర్కొన్నాడు.

ఆస్తికతకు - నాస్తికతకు మధ్య సంఘర్షణ :

సమాజంలో ప్రతి మనిషి కొన్ని నమ్మకాలను, సంప్ర

దాయాలను పాటించడం అనేది ఎప్పటి నుంచో ఉంది. కానీ విజ్ఞానం పెరిగిన తరువాత చాలా మంది హేతువాదులుగా మారారు. సమాజంలోని ప్రతి అంశాన్ని హేతుబద్ధంగా ఆలోచించడం ప్రారంభించారు. దీనితో కొన్ని విషయాలను నమ్మేవారు వాటిని నమ్మడానికి గల కారణాలపై స్పష్టతనివ్వకపోవడాన్ని హేతువాదులు ప్రశ్నిస్తూనే ఉన్నారు. సమాజంలో ఎక్కువ శాతం మంది ఆస్తికులే. అయితే కొంతమంది నాస్తికులు ఆస్తికుల నమ్మకాలను ప్రశ్నిస్తున్నారు. ఇలా ఆస్తికత్వానికి - నాస్తికత్వానికి మధ్య ఉన్న సంఘర్షణని వివరించే కథ 'భగవద్భక్తి'.

భగవద్భక్తి కథలో భర్త (కథకుడు) నాస్తికుడు. భార్య ఆస్తికురాలు. భగవంతుని మీద భక్తి ఉన్న ఇల్లాలు. కానీ భార్య భగవంతుని ప్రస్తావన తెచ్చినప్పుడల్లా ఏవో కొన్ని ప్రశ్నలడిగి ఆమెను కొంత కంగారు పెట్టే ప్రయత్నం చేస్తుంటాడు భర్త. భార్య తండ్రి శ్రీరాముని భక్తుడు, తమ్ముడు బైరాగిగా మారాడు, రెండవ తమ్ముడు భజనలు చేయడంలో ప్రసిద్ధికెక్కాడు. అయితే అనుకోకుండా ఆమె తల్లికి దేవుడు వంటిమీదికి వచ్చాడు. హారం... హారం... అనిగాడు. అది చూసి ఆమె తండ్రి కంగారు పడ్డాడు. తరువాత ఆమెకు పూనింది దేవుడని "అపరాధం అనవయ్యా, పిచ్చి బ్రాహ్మడా! నువ్వు రామకోటి రాస్తున్నావాయెను! మరి దానికి శాంతి వద్దు? మొక్కుకో - సంతర్పణ చేస్తానని మొక్కుకో" అని చెప్పింది పక్కింటి ఎల్లమ్మ. విషయాన్ని అర్థం చేసుకున్న ఆమె తండ్రి రామకోటి పూర్తైన తరువాత భద్రాచలం వచ్చి స్వామివారిని దర్శించుకుని.. వెయ్యిమంది బ్రాహ్మణులకు సంతర్పణ చేస్తానని మొక్కుకున్నాడు. అయితే కథకుడు ఒక సందేహాన్ని వెలిబుచ్చాడు. "ఎదురుగా సాక్షాత్కరించిన శ్రీరామచంద్రమూర్తిని, విగ్రహరూపంలో భద్రాచలంలో చూడటం ఎందుకో నాకర్థం కాలేదు!..." (పైదే. 314) "పేరుపడ్డ రామదాసు మా మామగారు, రామకోటి రాస్తున్నది మా మామగారు, గడ్డాలూ మీసాలూ పెంచుకున్నది మా మామగారు, రామకోటి రాసినందుకు తద్దోష పరిహారార్థము సంతర్పణ చెయ్యబోతున్నది మా మామగారు! చివరకు ఆ రామచంద్రులవారు మా అత్తగారి వంటిమీదికి వచ్చి ఆమెను పవిత్రం చెయ్యటమేమిటి?..."(పైదే-315)

తరువాత రెండుమూడు రోజులకు వారి అత్తగారికి మళ్ళీ పూనకం వచ్చింది. మళ్ళీ హారం! హారం!... అని పెడబొబ్బలు పెట్టింది. మామగారు సర్దిచెప్పడం చేశాడు. తరువాత స్వామి అప్పుడప్పుడు ఆమెకు పూనుతూనే ఉండేవారు. "నిరాకారుడైన శ్రీరాముడి యందు అంత భక్తి ప్రేమ విశ్వాసాలు కలిగి ఉండిన మా మామగారు, రాముడు ఏ క్షణాన సాక్షాత్కరించుతాడో, తన భార్యనోట ఏ క్షణాన పలుకుతాడో అని గడగడలాడి పోతుండేవాడు. రామచంద్రమూర్తి తన ఇంటికి రావటం తన మంచికి కాదన్నట్టు ఆయన భావించేవాడనిపిస్తుంది." (పైదే. 315)

ఇలా ఆస్తికులైనవారు పడే ఇబ్బందులను హేతుబద్ధంగా ప్రశ్నిస్తాడు రచయిత. ఇందులో ఆస్తికులైనవారు నమ్మకం పేరుతో పొందుతున్న ప్రయోజనం కంటే ఇబ్బందులనే ఎక్కువ చూపెట్టాడు. ఇలా కథ ప్రారంభం నుంచీ భార్యభర్తల మధ్య ఆస్తికత్వానికి, నాస్తికత్వానికి మధ్య ఏదో ఒక రకమైన చర్చ జరుగుతూనే ఉంటుంది.

కొడవటిగంటి కుటుంబరావు కథల్లో సంఘర్షణ ఒక పరిష్కారాన్ని తెలియజేసేలా, ఒక ఫలితాన్ని చూపించేలాగా ఉంటుంది. మనిషిలో ఉన్న పలు పార్శ్వాల మధ్య సంఘర్షణ తెలియజేయటంలో వారికి వారే సాటి.

ఉయోగించుకున్న పుస్తకాలు :

1. దక్షిణామూర్తి, పోరంకి. కథానిక స్వరూప స్వభావాలు. హైదరాబాద్: -----, 1977.
2. విశ్వనాథరెడ్డి, కేతు. (సంపా.) కుటుంబరావు సాహిత్యం రెండవ సంపుటం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1996.
3. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. కథాశిల్పం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1995.

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆధునికానంతర భారతదేశంలో మహిళాభివృద్ధి : సవాళ్ళు, పరిష్కారాలు

Development of Women in Post modern India : Challaenges and Solutions

- డా॥ కె.సుమలత, ప్రాంతీయ సంచాలకులు (ఇన్‌ఛార్జ్), ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో), విజయవాడ.

- **Dr. K. Sumalatha,** Regional Director (I/C), Indira Gandhi National Open University (IGNOU), Vijayawada.

సంక్షిప్తి :

నేటి మహిళ చరిత్ర సృష్టిస్తోంది. కొత్త కొత్త పనుల్లో సత్తా చాటుతోంది. మహిళాలోకం కొత్తపుంతలు తొక్కుతోంది. పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఇంటిపని, వంటపని, వ్యవసాయం, చేతివృత్తుల వంటి సంప్రదాయ పనులకు పరిమితమైన మహిళలు నేడవన్నీ దాటి దూసుకుపోతున్నారు. ఆడది చదివి ఉద్యోగాలు చేయాలా? ఊళ్ళేలా? ఆడవారికీ ఎందుకు చదువు అనే మాటలను తోసేసి పరుగులెడుతూ ఉద్యోగాలూ చేస్తున్నారు. ఊళ్ళేకాదు, దేశాలనూ ఏలుతున్నారు. పరిపాలక అధికారులుగా, రక్షకభటులుగా, సైనికులుగా, క్రీడాకారులుగా, కళాకారులుగా, శాస్త్రవేత్తలుగా, పరిశోధకులుగా, అంతరిక్ష యాత్రికులుగా, అధ్యాపకులుగా, సాఫ్ట్‌వేర్ వంటి సేవా రంగాల ఉద్యోగులుగా, ప్రజా ప్రతినిధులుగా అదీ ఇదీ అని ఏమిటీ అన్నిరంగాల్లో దూసుకుపోతున్నారు. నేడు మహిళ లేని రంగం లేదంటే అతిశయోక్తి కాదు. అయితే, ఈ ఘనత చెప్పుకున్నంత తేలికగా సాధ్యం కాలేదు. ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఇంతటి అభివృద్ధి జరగనూ లేదు. ఎన్నో సవాళ్ళు, ప్రతిబంధకాలు నేటి మహిళలకు అడుగడుగునా పరీక్షలు పెడుతున్నాయి. వీటన్నిటినీ ఎదుర్కొని, కష్టాలను విజయాలకు సోపానాలుగా చేసుకోవాల్సిన తక్షణ కర్తవ్యం మహిళల మీద ఉంది.

పరిచయం :

విజ్ఞానశాస్త్రం అందిస్తున్న కొత్త ఆవిష్కరణలు కొత్త కార్యకలాపాలను సృష్టిస్తున్నాయి. డిజిటల్ ఇన్నోవేషన్స్, వేగంగా విస్తరిస్తున్న సమాచార సాంకేతిక నైపుణ్యాలు సృష్టిస్తున్న స్వయంచలిత యంత్రాలు (ఆటోమేషన్), కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, ఇంటర్‌నెట్ వంటివి మానవ కార్యకలాపాలను చాలా మార్చేసాయి. ఈ కొత్త టెక్నాలజీలు భౌగోళిక ఆటంకాలను మహిళలు అధిగమించేలా చేసాయి.

కొత్త అనియత పద్ధతులు నిజానికీ మహిళలను సాధికార దిశగా నడిపించాలి. స్త్రీ, పురుష అసమానతలను తగ్గించాలి. కానీ వాస్తవం అందుకు భిన్నంగా ఉంది. ప్రపంచీకరణ కోట్లాదిమంది మహిళలను వేతన శ్రామికులుగా మారుస్తున్నా, శ్రామికశక్తిలో మగవారికంటే మహిళలు చాలా తక్కువే. సమాజంలోని వివక్ష, స్త్రీ, పురుష అసమానతల వలన ఈ పనుల్లో కూడా గౌరవప్రదం కానీ, సామాజిక భద్రత లేని ఉద్యోగాలు, తక్కువ వేతనాల ఉద్యోగాలే ఎక్కువగా మహిళలకు దక్కుతున్నాయి. పొరుగుసేవలు, ఒప్పంద సేవల వంటి పనులు, అభద్రత కలిగిన స్వయం ఉపాధిలోనే శ్రామిక మహిళలు అధికంగా ఉన్నారు. ఓవైపు ఉద్యోగం, మరోవైపు వేతనం లేని ఇంటిపని, పిల్లల సంరక్షణ వంటి రెండు పనులూ చేస్తున్నారు మహిళలు. ఇంత చాకిరీ చేస్తున్నా మహిళా సాధికారత సాధ్యం కావడం లేదు.

ఐక్యరాజ్యసమితి 2017 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ''మారుతున్న పని ప్రపంచంలో మహిళలు - 2030 వరకు భూమిపై అన్ని పనుల్లో మహిళలకు సగం వాటా'' అనే థీమ్‌తో జరుపుకోవాలని పిలుపునిచ్చింది.

ఇదీ ప్రస్తుత పరిస్థితి :

మరి నేటి వాటా ఎలా ఉంది? నేటికీ శ్రామికశక్తిలో మహిళల శాతం చాలా తక్కువగా ఉంది. ప్రపంచ శ్రామిక శక్తిలో పురుషులు 76 శాతం ఉండగా, స్త్రీలు 49.6శాతం

మాత్రమే. మహిళా శ్రమశక్తి చూస్తే పరిశ్రమల్లో 13.5 శాతం, సేవారంగంలో 61.5 శాతం, వ్యవసాయంలో 25 శాతంగా ఉన్నారు. నాయకత్వ స్థానాల్లో చూస్తే పార్ల మెంట్‌లో 23 శాతం మంది మహిళలు ఉన్నారు. అతిపెద్ద 500 కంపెనీల్లో సీఈఓలుగా మహిళలు కేవలం నాలుగు శాతం మాత్రమే ఉన్నారు.

పురుషులకంటే 33 శాతం తక్కువ ఆదాయాలు పొందుతున్నారు. ఇది జీవితకాల ఆదాయ వివక్ష. వేతనం పొందే పని, కుటుంబ బాధ్యతలూ రెండింటినీ సమ తుల్యంగా నిర్వహించాల్సి వస్తున్నది. ఐటీ రంగంలో రాత్రి వేళ పని మహిళలను రాకుండా ఆపుతున్నది. ఒక వేళ వచ్చినా పిల్లల తల్లులకు సాధ్యం కావడం లేదు. పిల్లల సంరక్షణా సెలవులూ పరిమితంగా ఉండడం కూడా మరో సవాలు. ఇవి మహిళలను ప్రధానస్రవంతి ఉద్యోగాల నుండి దూరంచేసి పాక్షిక, విరామ కాల ఉద్యోగాలవైపు నెడుతున్నాయి. వీటిలో ఆదాయం తక్కువగా ఉం టుంది. ఇవి ఇంకా అసమానతలను పెంచుతున్నాయి.

మిథ్యగా మారుతున్న సామాజిక భద్రత :

దాదాపుగా 73 శాతం మహిళలకు సామాజిక భద్రత లేదు, లేదా పాక్షికంగా ఉన్నది. గౌరవప్రదమైన ఉద్యోగం లేనందున వాళ్ళ వేతనాలు తక్కువగా ఉండడం వలన మగవారికంటే తక్కువ ఆస్తులు కలిగి ఉంటారు. ఆదాయ అభద్రతలో ఉంటూ పెన్షన్, నిరుద్యోగ భృతి, ఆరోగ్య బీమా వంటి సామాజిక రక్షణా సౌకర్యాలు పొందలేరు. దీనిఫలితం చాలా మంది పేదరికంలో పడిపోతున్నారు. పిల్ల తల్లులు ఇంకా ఎక్కువగా ఈ వివక్షకు గురౌతున్నారు. పిల్లల సంరక్షణ బాధ్యతకోసం ఇంటికి దగ్గరలోనే ఉం డాల్సి వస్తుంది. పిల్లలు పుట్టడం వారిని ఉద్యోగాల నుండి దూరం చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా పెన్షన్ సౌకర్యంలేని వాళ్ళలో 65 శాతం మంది మహిళలే. 20కోట్ల మంది మహిళలకు ఎటువంటి పెన్షన్‌గానీ, సామాజిక రక్షణలు గానీ లేవు.

భారతదేశంలోని శ్రామిక మహిళల పరిస్థితి చూస్తే మరీ దారుణంగా ఉంది. మొత్తం జనాభాలో మహిళలు 48శాతం. నేటికీ 40శాతం మంది మహిళలు నిరక్ష రాస్యులుగానే ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో, ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో నిరక్షరాస్యులు చాలా ఎక్కువ. ప్రపంచబ్యాంక్ లెక్క ప్రకారం మొత్తం మహిళల్లో 27శాతం మంది. శ్రామికమహిళలతో 131 దేశాల్లో మనం 121వ స్థానంలో ఉన్నాం. చైనాలో 65శాతం, నేపాల్‌లో 79.9శాతం, బ్రెజిల్‌లో 70శాతం ఉన్నారు.

పురుషులతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో 26.7శాతం మహిళలు శ్రామికులుగా ఉండగా, పట్టణ ప్రాంతాల్లో కేవలం 16.2శాతం మాత్రమే శ్రామికులుగా ఉన్నారు. వ్యవసాయం సంక్షోభంలో పడడంతో మహిళలు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కోల్పోతున్నారు.

పరిశ్రమలు, సేవా రంగాల్లో 20శాతం కంటే తక్కువగా మహిళలు ఉన్నారు. పురుష శ్రామికుల్లో 21.2 శాతం మంది రెగ్యులర్‌గా వేతనాలు పొందే ఉద్యోగాల్లో ఉండగా మహిళలు 13.4 శాతం మాత్రమే ఉన్నారు. అంటే మిగిలినవన్నీ రెగ్యులర్ వేతనాలు లేని పను లేనన్నమాట.

ఇక పెద్ద ఉద్యోగాలు, పనుల్లో మేనేజింగ్ డైరెక్టర్లలో 21 శాతం, సీనియర్ మేనేజర్లలో 19శాతం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లలో 14శాతం, వివిధ కంపెనీల బోర్డు డైరెక్టర్లుగా 7.7శాతం, కంపెనీల బోర్డు ఛైర్మన్లుగా 2.7 శాతం మంది మాత్రమే మహిళలు ఉన్నారు. ముంబాయి స్టాక్ ఎక్ఛేంజ్‌లో నమోదైన అతిపెద్ద 54 కంపెనీల్లో ఒక్క మహిళ కూడా బోర్డు డైరెక్టర్స్‌లో లేరు. ప్రయివేటీకరణ, సరళీకరణ విధానాల ఫలితంగా 2005 నుండి 2012 కాలంలో కోటీ తొంభై ఆరు లక్షల మంది మహిళలు ఉద్యోగాలు కోల్పోయారు. శ్రామిక మహిళల శాతం తగ్గింది. మహిళలు ఎక్కువగా అసంఘటిత రంగాల మీద ఆధారపడాల్సి వస్తుంది. తగిన ఉద్యోగ భద్రత లేక పోవడంతో లైంగిక వేధింపులకు గురౌతున్నారు.

నూతన పని ప్రపంచం - సవాళ్ళు :

కొత్త కొత్త అవకాశాలు వస్తున్నప్పటికీ మహిళలు వాటిని పూర్తిగా అందుకోలేకపోవడానికీ, తమ సగం వాటా తాము పొందలేకపోవడానికీ కారణాలేమిటన్న విషయాన్ని మరింత లోతుగా చర్చించాల్సిన అవసరం ఎంతైనా

ఉంది. ఐక్యరాజ్యసమితి 2020, మార్చి నెలలో ఈ అంశంపై నిర్వహించిన సదస్సులో ఈ కింది అంశాలను గుర్తించింది.

1. లింగ సమానత్వం, మహిళా సాధికారత నేడు దేశం ముందే కాదు, ప్రపంచం ముందు కూడా ఉన్న సవాళ్ళు. ఎంతపెద్ద పదవుల్లో ఉన్నా మహిళ అనగానే చిన్నచూపు, వివక్ష కనపడుతుంది.
2. వేతనాలలో అసమానతలు.
3. సమానవేతనం ఉన్నట్టు అనిపించినా పిల్లల సంరక్షణ ఇతర కుటుంబ బాధ్యతల కోసం సెలవులు వంటివి లేకపోవడం వలన వేతనాలలో కోతలు.
4. ఆడవారికి వీలుకాని పనివేళలు. రాత్రిపూట పని చేయాల్సి వస్తుంది. పొద్దున్నే లేచి పరుగెత్తవలసి వస్తుంది. ఇవి కుటుంబ బాధ్యత నిర్వహించే మహిళలకు ఆటంకంగా ఉన్నాయి.
5. పని ప్రదేశాలల్లో వేధింపులు.
6. రాత్రిపూట ప్రయాణాలు అభద్రతగా మారడం.
7. ఎంత సమర్ధత నిరూపించుకున్నా ఆడవాళ్ళపట్ల చిన్నచూపు. వారి పనికి గుర్తింపునివ్వకపోవడం

ఇవి అధిగమిస్తే కానీ 2030 నాటికి పని ప్రపంచంలో సమాన వాటా సాధ్యం కాదు. వీటిని ఎలా అధిగమించాలి? ఐరాస రోగనిర్ధారణ బాగానే చేసింది. కానీ చికిత్సాపద్ధతులను సరిగ్గా ఎంచుకోలేదు. వివిధ దేశాల ప్రభుత్వాలకు లక్ష్యాలను నిర్దేశించి వదిలేసింది. గతంలో అనేక లక్ష్యాలను ఇలా నిర్దేశించినా ఆచరణలో సాధ్యం కాలేదు. ముఖ్యంగా మహిళల విషయంలో ఇది అసలు ఆచరణ సాధ్యంకాదని చరిత్ర రుజువు చేస్తోంది. .

సమానత్వ సాధన - కర్తవ్యం :

గౌరవ ప్రదమైన పని ప్రతీ మహిళ హక్కు కావాలి. అంటే మంచి నాణ్యత కలిగిన, వేతనం ఇవ్వగలిగిన ఉద్యోగాలు, అదేవిధంగా లింగ సమానత్వాన్ని గుర్తించే ప్రభుత్వ విధానాలు, నియంత్రణలు, తల్లులకు పిల్లల సంరక్షణకు తగిన సెలవులు, పిల్ల తల్లులకు వీలైన పని కాలం, పిల్లల సంరక్షణా కేంద్రాలు (క్రెచ్, ప్లేస్కూల్) వంటివి ఏర్పాటు చేయాలి. మహిళల భద్రత, పిల్లల సంరక్షణ తాము పని చేసే సంస్థల బాధ్యత కావాలి. మహిళలకు ఉద్యోగాలను కల్పించే పరిశ్రమలను, సంస్థలను ప్రభుత్వం ప్రోత్సహించాలి. పనిస్థలాల్లో వేధింపులు లేకుండా తగిన రక్షణ ఏర్పాటు చేయాలి. రాత్రిపూట ప్రయాణాలకు తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలి. పరిశ్రమలు మహిళలను ఆకర్షించే ఉద్యోగ కల్పనచేయాలి. ఉత్పాదక, సేవారంగాల్లో మహిళా శ్రామికశక్తి పెంచాలి. సమాన వేతనాలు మహిళల హక్కుగా గుర్తించి అమలు చేయాలి. మరి ప్రభుత్వాలు వీటిని చేస్తాయా? ఆధిపత్య భావజాలం ఉన్న ప్రభుత్వాలు కచ్చితంగా చేయవు. అందుకే ప్రభుత్వాల మీద ఆధారపడితే వీటిని సాధించలేం.

భారత ప్రభుత్వ కృషి :

భారత ప్రభుత్వం 2001లో రూపొందించిన జాతీయ మహిళా విధానం స్థానంలో నూతన లక్ష్యాలతో జాతీయ మహిళా విధానం-2016 కోసం ముసాయిదా రూపొందించారు. మహిళల హక్కులను కాపాడుతూ వారిని సామాజిక అభివృద్ధిలో సమ్మిళితం చేయడమే దీని ధ్యేయం. ఇందులో పామ్ రాజ్‌పుత్ కమిటీ సూచనలకు ప్రాధాన్యం ఇచ్చారు.

వ జాతీయ మహిళా విధానం ప్రకారం మాతా, శిశు మరణాల నియంత్రణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా తగిన రవాణా సౌకర్యాలు కల్పించాలి.

- మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పురుషులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకునే విధంగా ప్రోత్సహించాలి.
- అన్ని వయసుల వారికి బలవర్ధక పౌష్టికాహారం అందించాలి. 60 ఏళ్ల దాటిన మహిళలకు వృద్ధాప్య సేవలు అందించాలి.

- పాఠశాల దూరంగా ఉండడంతో చాలామంది బాలికలు సెకండరీ విద్యలో డ్రాపౌట్ అవుతున్నారు. మినీ బస్ వంటి రవాణా సాధనాలను అందు బాటులోకి తీసుకొచ్చి డ్రాపౌట్స్‌ను తగ్గించాలి.
- స్త్రీల పట్ల గౌరవం పెంపొందించే విధంగా పురుషు లకు సామాజిక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.
- సంతానం లేని మహిళలు అద్దెగర్భంపై ఆధార పడుతున్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని గర్భాన్ని మోసే తల్లి, సంతానం పొందే మహిళకు సంబంధించిన హక్కుల గురించి ముసాయిదాలో పొందుపరిచారు.
- వితంతువులు, విడాకులు పొందినవారు, ఒంటరి మహిళలకు సామాజిక భద్రత కల్పించాలని ప్రతిపాదించారు. ఆధారం కోల్పోయిన మహిళలకు వసతి కల్పించాలని సూచించారు.
- నూతన జాతీయ విధాన ముసాయిదా ప్రధానంగా మహిళల అక్రమ రవాణాపై దృష్టి సారించింది. అక్రమ రవాణాను అరికట్టేందుకు సంబంధిత విభాగాలు సమర్థంగా పనిచేయాలి. సత్వర న్యాయం కోసం నారీ అదాలత్, కుటుంబ న్యాయస్థానాలను పటిష్టం చేయాలి.
- స్త్రీలపై వివక్ష ఏ రూపంలో ఉన్నా నివారించి, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.
- మహిళలకు భద్రత కల్పించేందుకు పోలీసు, తక్షణ ప్రతిస్పందన విభాగం, అత్యవసర పరిస్థితుల్లో ఫిర్యాదుల కోసం మొబైల్ అప్లికేషన్‌లను మరింతగా అభివృద్ధి చేయాలని నూతన విధానం సూచిస్తోంది.

భారత ప్రభుత్వం తయారు చేసిన ఈ విధానం అమలుకు ప్రస్తుత మహిళా సంక్షేమ కార్యక్రమాలకు తోడు మరిన్ని చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. మహిళా సాధికారత సాకారానికి ప్రభుత్వ చర్యలతోపాటు ప్రజల ఆలోచనా ధోరణిలోనూ మార్పు రావాలి. స్త్రీ, పురుష భేదాలను పక్కనపెట్టి సమాజ పురోభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి.

ముగింపు :

మహిళలు నూతన సవాళ్ళను అధిగమించాలంటే అందుకు ఆటంకంగా ఉన్నవాటిని గుర్తించాలి. నిరక్ష రాస్యత ఎక్కువగా ఉంది. నూతన సాంకేతిక పరికరాలతో పని చేయాలంటే సాంకేతిక అక్షరాస్యత కూడా కావాలి. పని నైపుణ్యాలు పెరగాలి. అందుకు తగిన శిక్షణ మహిళలకు ఇవ్వాలి. వివక్షారూపాలను గుర్తించాలి. వాటిని ఎదిరించి తగిన వాటా సాధన కోసం కృషిచేయాలి. ఇవన్నీ మాటలతో జరగవు. సమస్యల నుండి విముక్తి కావాలంటే ఎన్నో సవాళ్ళను అధిగమిస్తూ ముందుకు సాగుతున్న మహిళలు పోరాటపథంలో కూడా ముందు ఉండాలి. లేకుంటే బంధనాలు తొలగిపోవు. కేవలం పనిలోకంలో వాటా మాత్రమే కాదు వివక్ష నుంచీ, అస మానతల నుంచీ మహిళలకు విముక్తి కూడా పోరా టాల ద్వారానే సాధ్యమౌతుంది.

సంప్రదించిన గ్రంథాలు / వెబ్‌సైట్లు :

1. krishna.ap.gov.in
2. https://te.vikaspedia.in/social-welfare c2ec39c3fc33c3ec2dc3fc35c43c26c 4dc27c3f-c2ec30c3fc2fc41-c36c3fc36c41-c38c02c15c4dc37c47c2ec02/women-and-child-development#section-9
3. మహిళా స్త్రీ శిశు సంక్షేమశాఖ కరదీపిక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
4. బోధన అభ్యసన ప్రక్రియల్లో లింగ వివక్షత యొక్క ఔచిత్యం, ఉపాధ్యాయుల శిక్షణ కరదీపిక, ఎస్.సి.ఇ.ఆర్.టి, తెలంగాణ ప్రభుత్వం.

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దక్షిణాత్య భాషలు - తోబుట్టు భాషలు

- డా॥. నందనవనం శివ కుమార్, తెలుగు అధ్యాపకుడు, ఒంగోలు, ప్రకాశం జిల్లా.

మనదేశంలో వ్యవహారంలో ఉన్న భాషలను ప్రధానంగా రెండు రకాలుగా విభజించవచ్చు. అవి (1) ఉత్తరదేశ భాషలు (2) దక్షిణ దేశ భాషలు. భాషాతత్త్వ శాస్త్రజ్ఞులు ఉత్తరదేశ భాషలను ఆర్యభాషలని, దక్షిణ దేశ భాషలను ద్రావిడ భాషలని వ్యవహరిస్తారు. దక్షిణా పథమునకు పర్యాయపదముగా సంస్కృత సాహిత్యంలో కనబడుతున్న ద్రావిడ శబ్ధం అతి ప్రాచీనమైనదని చెప్పవచ్చు. దక్షిణాత్యులైన రామానుజాచార్యులు, జగన్నాథ పండితరాయలు మొదలగువారు తాము ద్రావిడులమనే పేర్కొన్న విషయం జగద్విదితమే.

ద్రావిడ శబ్ధమును గురించి పండితలోకంలో పలు భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికినీ యిది సంస్కృత శబ్ధభవమనే చాలామంది అంగీకరించారు. దక్షిణాత్యులకు సమిష్టి నామముగా ద్రావిడ శబ్ధం ప్రయుక్తమైనా తమిళులను ద్రావిడులుగా తమిళభాషను ద్రావిడ భాషగా తెలుగు కావ్యాలలో పేర్కొనడం జరిగింది. (ద్రావిడ భాష నుతింతు. . . . . .(వృషాధిప శతకము, 56వ పద్యం, "ద్రవిడ మహీస్థలియందు. . . . .(పండితారాధ్య చరిత్ర - మహిమ ప్రకరణము 2 - 124) తమి

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉభయ రాష్ట్రాలలో తెలుగు, తమిళనాడు రాష్ట్రంలో తమిళం, కర్నాటక రాష్ట్రంలో కన్నడం, కేరళ రాష్ట్రంలో మలయాళం భాషలు ప్రధానంగా దక్షిణాత్య భాషలుగా చలామణిలో ఉన్నాయి. ఇవి ఏకభాషా కుటుంబానికి (ద్రావిడ భాషా కుటుంబానికి) చెందినవిగా భాషాతత్త్వ శాస్త్రవేత్తలు అంగికరించారు. ఈ నాలుగే కాకుండా తుళు, కొడగు, కోలామి, కోట, కుయ్, ఖోండ్ మొదలైనవి కూడా ద్రావిడ భాషలని విజ్ఞుల అభిప్రాయం. (రాబర్ట్ కాల్డ్వెల్ తన "Comparative Grammar of the Dravidian Languages"లో (1913) 12 ద్రావిడ భాషలను పేర్కొనగా జార్జి గ్రియర్సన్ "Linguistic Survey of India (4వ సంపుటం, 1906)లో 14 ద్రావిడ భాషలను ఉదాహరించగా, టి. బర్రో ఎం.బి. ఎమెనోలు తమ "The Dravidian Etymological Dictionaryలో (1961) 24 ద్రావిడ భాషలను పేర్కొన్నారు.) దక్షిణ భారతదేశంలో నివసిస్తున్న ఆదిమవాసుల భాషలను మరింత లోతుగా పరిశీలిస్తే మరికొన్ని ద్రావిడ భాషలు వెలుగులోకి రావచ్చు.

తెలుగు, తమిళం మొదలైన దాక్షిణాత్య భాషలు ఒకే కుటుంబానికి చెందినవి అనే విషయం మొట్టమొదట పేర్కొన్న పండితుడు ఫ్రాన్సిస్ వైట్ ఎల్లిస్ (1780-1819). తెలుగు, తమిళ, మలయాళ భాషలను గురించి వ్రాసిన వ్యాసమును ఎ.డి. కాంబెల్ తన "A Grammar of the Teloogoo Language"లో (1816) ఉపోద్ఘాతానికి అనుబంధంగా ప్రచురించాడు. దాక్షిణాత్య భాషల ప్రత్యేకతను శ్రీన ఎల్లిస్ ఈ విధంగా వివరించాడు.

"Neither the Tamil, the Telugu nor any of their cognate dialects are derivations from the Sanskrit...and that they form a distinct familhy of languages with which the Sanskrit has, in later times especially intermixed but with which the Sanskrit has, in later times especially intermixed but with which it has no radical connection"

ఆ తరువాత, ఈ దాక్షిణాత్య భాషలను ద్రావిడ భాషలని వ్యవహరించాని వాడు రాబర్ట్ ఎ. కాల్డ్వెల్. (Comparative Grammar of the Dravidian or South INdian Family of Languages, First Edition, 1856)" అంతేగాక "తొద" మరికొన్ని భాషలను ద్రావిడ భాషలుగా గుర్తించినవాడు కూడా ఆయనే.

ఈనాడు తెలుగు తమిళములు ప్రత్యేక భషలుగా వ్యవహృతములవుతున్నా, అతి ప్రాచీన కాలర్ఒలో ఇవన్నీ కలసి మెలసి వుండేవి. కాలక్రమాన అవి విడివడిపోయి వేర్వేరు భాషలుగా వాడుకలోకి వచ్చినవనీ, వీటికి మూల ద్రావిడ భాష లేక ప్రాచీన ద్రావిడభాష మాతృక అని

పండితులు విశ్వసిస్తున్నారు. అయితే మూల ద్రావిడ భాషలో ఎక్కడా గ్రంథరచన జరిగినట్లు తెలియడంలేదు. కావున మూలద్రావిడ భాష కేవలం వ్యావహారిక భాషగా మాత్రమే ఉండేదని, అది కావ్యభాషగా పరిణితి చెంద లేదని చెప్పవచ్చు. ఒక భాషలో గ్రంథములు లేనంత మాత్రాన ఆ భాష ప్రచారంలో లేదని భావించడం కూడా అసమంజసమే అవుతుంది. నేటికీ తుళు, కుడగు భాషలు వ్యవహరించేవారు, తమ దైనందిన వ్యవహారములకు తమ భాషలనే ఉపయోగిస్తున్నారు. కాని వాటిలో గ్రంథ రచన జరగడంలేదు. అనగా సాహిత్యసంపద లేక తుళ, కుడగు భాషలు కేవలం వ్యవహారిక భాషలుగానే నిలిచిపోయినవి.

ప్రాచీన ద్రావిడభాష నుంచి తెలుగు తమిళములు ఎపుపడు విడివడి, ప్రత్యేక భాషలుగా రూపొందెనో మనం ఖచ్చితంగా చెప్పలేము. ఈ విడివడడం క్రీస్తుకు పూర్వమే జరిగి వుంటుందని పండితులు భావిస్తున్నారు. ఆ విధంగా విడివడిన భాషలలో తెలుగే మొదటిదని, ఆ తరువాత తమిళ కన్నడములు విడివినవనీ భావించబడుతున్నది. ఈ సందర్భగా శ్రీ టి.ఎన్. శ్రీ కంఠయ్య అభిప్రాయమును యథాతథంగా ఇచ్చట ఉదహరిస్తున్నాను. (Karnataka Darshana - Volume presented to R.R.Diwakar, 1955, పుటలు175 - 182)

.....But the major langauges like Telugu, Tamil and Kannada must have become independent entities some centuries at least before the commencement of the Christian era. Among these Telugu was the first to break off and it developed many divergent features in course of time. Tamil and Kannada must have remained together for a longer time before separating from each other"

ఈనాడు ప్రాచ్య పాశ్చాత్య పండితులందరూ దాక్షిణాత్య భాషలను ద్రావిడభాషలుగా పేర్కొన్నప్పటికీ, డా॥ చిలుకూరి నారాయణరావు వంటి కొందరు పండి తులు ద్రావిడభాషా సిద్ధాంతమును అంగీకరించలేదు. ఆయన అభిప్రాయం ప్రకారం నేటి ద్రావిడ భాషలు - ముఖ్యంగా తెలుగు - పైశాచీ ప్రాకృతపు అపభ్రం శములు. కనుక ద్రావిడ భాషలను ప్రాకృత భాషలతో పోల్చి చూడాలన్నది ఆయన వాద సారాంశం. (Introduction to Dravidian Philology, 1929, పుటలు 23, 212 & 214) కాని దక్షిణాపథంలో ప్రాకృతభాషల అధ్యయనం జరగడంలేదు కనుక, ఈ విషయం గురించి ఇతిమిత్థంగా ప్రస్తుతం చెప్పలేము.

సంస్కృత ప్రాకృతముల వికృతియే తెలుగని మన ప్రాచీనులు పేర్కొన్న అంశం సాహితీవేత్తలకు కొత్తకాదు. (ఆర్య ప్రకృతి: ప్రకృతిశ్చాద్యే, ఏషా తయోర్భవేత్ వికృతి:) "తల్లి సంస్కృతంబె యెల్ల భాషలకును" అని తర్వాతవారు కూడా పేర్కొన్నారు. (కేతన, ఆంధ్రభాషా భూషణము, పద్యము 13)

భాషల పుట్టు పూర్వోత్తరములను నిర్ణయించడానికి పదజాలం కంటే ఆయా భాషలలోని వ్యాకరణాంశములు బహుథా తోడ్పడతాయి. ఈ దృష్టితో చూచినప్పుడు, దాక్షిణాత్య భాషలు సంస్కృతాద్యార్య భాషలకు భిన్నము లైనవనీ, అవి ఒకే కుటుంబమునకు చెందినవనీ తెలియుచున్నది.

ద్రావిడ భదూషలలోని క్రియా రూపములు, నామ వాచకములు, సంఖ్యావాచకములు, సర్వనామములు, సంబంధ వాచకములు మొదలైనవి ఈ షద్భేదములతో కనిపిస్తున్నప్పటికీ, వాటి మూలరూపములు మాత్రం ఒకటిగానే ఉండడం చెప్పదగిన విషయం. అందుకు ఈ క్రింద కొన్ని ఉదాహరణలు పరిశీలించదగినవి.

సంఖ్యావాచకములు :

తెలుగు	తమిళం	కన్నడం	మలయాళం
ఒకటి	ఒన్టు	ఒందు	ఒన్ను
రెండు	ఇరణ్డు	ఎరడు	రండు

ఐదు	ఐన్దు	ఐదు	అంజి
ఇరువది	ఇఱువదు	ఇప్పత్తు	ఇరువదు
నూరు	నూరు	నూరు	నూరు

సంబంధ వాచకములు :

తెలుగు	**తమిళం**	**కన్నడం**	**మలయాళం**
అమ్మ	అమై ్మ	అమ్మ	అమ్మ
అన్న	అణ్ణన్	అణ్ణ	జేష్ఠన్, చేట్టన్
అక్క	అక్కాళ్	అక్కె	చేచ్చి
అత్త	అత్తై	అత్తె	అమ్మాయి

సర్వనామములు :

తెలుగు	**తమిళం**	**కన్నడం**	**మలయాళం**
అతడు	అవన్	అవను	అవన్
ఆమె	అవళ్	అవళు	అవళ్
అది	అదు	అదు	అదు

శరీరావయవములు :

తెలుగు	**తమిళం**	**కన్నడం**	**మలయాళం**
తల	తలై	తలె	తల
వాయి(నోరు)	వాయ్	బాయి	వాయ్
చెవి	కాదు	కివి	చెవి, కాదు
చేయి(చెయ్యి)	కై	కయి	కై
వ్రేలు(వేలు)	విరల్	బెరళు	వి(వె)రలు

క్రియావాచకములు :

తెలుగు	**తమిళం**	**కన్నడం**	**మలయాళం**
వ్రాయి	వరై	బరియు	ఎళుదు
పాడు	పాడు	హాడు	పాడు
చేయు	చెయ్	గెయ్యు	చెయ్
చెయ్యు	--	మాడు	--

ద్రావిడభాషలను సంయుక్త ధాతురూప పరభాషఅని వ్యవహరిస్తారు. అర్థభేధమును సూచించడానికి ధాతువుపై మరొక ధాతువునో, పదముపై మరొక పదమునో చేర్చడం ఈ భాషలలో సంప్రదాయ. సంస్కృతంలో అలాకావు. ఉపసర్గలనుగాని, ప్రత్యయాలనుగాని, ఉపయోగించి భిన్నార్థమును సూచిస్తారు. నామవాచకములను తెలుగు వ్యాకరణకర్తలు మహత్తులనీ, అమహత్తులనీ విభ జించారు. తమిళ వ్యాకరణకర్తలు కూడా వివేకవంత ములు (ఉయర్ తిణై), వివేకరహితములు (అవ్ తిణై) అని విభజించారు. ఇటుంటి విభజన ఒక్క ద్రావిడ భాషలలోనే ఉన్నదని పండితులు భావిస్తున్నారు. పైగా, ద్రావిడభాషలలో ఏకవచన బహువచనములే కాని

సంస్కృతములో ఉన్నట్టుగా ద్వివచనం లేదు. కళ్, గుళ్‌లు ద్రావిడ భాషలలో బహువచన ప్రత్యయములుగా వాడ బడుతున్నవి. సంస్కృతంలోవలె కాక ఈ భాషలలో మూడు కాలములు మాత్రమే వాడబడుతున్నవి.

దక్షిణాత్యభాషలలోని వాక్యరచన కూడా ఇంచు మించు ఒకే విధంగా ఉంటుంది. వాక్యారంభంలో కర్త, తరువాత కర్మ, క్రియ ఉండడం పరిపాటి.

తెలుగు : ఆమె పాట పాడెను.
తమిళం : అవళ్ పాట్టు పాడినాళ్.
కన్నడం : అవళు హాడు హాడిదళు.
మలయాళం : అవళ్ పాట్టు పాడి.

సంస్కృతంలో లేని హ్రస్వ ఎకార ఒకారములూ శకటరేఫం మొదలైనవి దాక్షిణాత్య భాష లన్నింటిలోనూ కనబడుతుంది. నేడు తెలుగ కన్నడ భాషలలో భ్రష్టమై పోపయిన ఱ అనే అక్షరం నేటికినీ తమిళ మళయాళ భాషలలో ఉన్నది. మహాప్రాణములూ శషసహలు ప్రాచీన ద్రావిడ భాషలలో లేవు. ఇవి సంస్కృత భాషా ప్రభావం వల్లనే ద్రావిడ భాషలలోకి ప్రవేశించినవి. తమిళంలో మహాప్రాణములను సూచించే సంకేతములు లేవు. తెలుగులో కూడా ఇవా మార్పు చెందిన విషయం విజ్ఞు లకు తెలిసిందే. కనుకనే శ్రీ, లక్ష్మి, రాజు వంటి మాటలు ఈ భాషలలో సిరి, తిరు, ఇలక్కుమి, లచ్చి, లరశన్, అరసులుగా మారిపోయినవి.

పదజాలం, వ్యాకరణాంశములు, వాక్యనిర్మాణం మొదలైన వాటిలో దాక్షిణాత్య భాషల మధ్య సన్నిహిత సంబంధం కనిపిస్తున్న కారణంగా ఈ భాషలు ఒకే మూలభాష నుంచి ఏర్పడినవిగా భావించడంలో సందేహించాల్సిన అవసరం లేదు. కాబట్టి ఇవి సజా తీయములని, పరస్పర సంబంధంగల భాషలనీ చెప్ప వచ్చు. అంతేగాని వీటి మధ్య జన్యజనక సంబంధం ఉ న్నట్టు భావించరాదు. దాక్షిణాత్య భాషలు తోబుట్టు భాషలు!

భాషా విషయకంగా ద్రావిడభాషలు స్వతంత్రము లయినా, అవి సంస్కృత భాషనుంచి ఎన్నో శబ్దాలను గ్రహించాయి. తెలుగు, కన్నడ, మలయాళ భాషలలో తత్సమ తద్భవాల రూపంలో కలసి మెలసి పోయిన సంస్కృత శబ్దాలు కోకొల్లలు. ఈ విషయంలో తమిళం కొంత నిగ్రహం చూపిన మాట వాస్తవమయినా, సంస్కృత పదజాలాన్ని తమిళం కూడా స్వీకరించింది. తమిళ సాహిత్యంలో తొలి యుగమైన సంగ కాలంలో వెలువడిన కావ్యాలలో ఎన్నో సంస్కృత శబ్దాలు చోటుచేసుకున్నాయి. నేటి వ్యావహారిక తమిళంలోనూ సంస్కృత శబ్దాలు పరశ్శతంగా వినిపిస్తున్నాయి. (చల్లా రాధాకృష్ణ శర్మ వ్యాసములు: "వ్యావహారిక తమిళంలో సంస్కృత శబ్దాలు" తెలుగు, అక్టోబర్ - డిసెంబర్ 1972 పుటలు 36-42, "సంగకాలపు కృతులలో సంస్కృత శబ్దాలు" తెలుగు, ఏప్రిల్-జూన్, 1973 పుటలు 149-152). ఇది తమిళ శబ్దమే అన్నంతగా సంస్కృత శబ్దాలు కొన్ని వ్యవహారిక తమిళంలో కలిసిపోయాయి. సెల్వంతన్ (ధనవంతుడు), తార్కాలికం (తాత్కాలికం) మొదలైనవి కొన్ని ఉదా హరణలు. ద్రోగచ్చెయల్ (విద్రోహచర్య), ఆనందక్కణ్ణీర్ (ఆనందాశ్రులు) వంటి సమాసాలు ఎన్నో గమనించవచ్చు. "తమిళమునకు సంస్కృతం దాది వంటిది" అని ప్రసిద్ధ తమిళ పండితులు శ్రీ ఎన్. వైయాపూరి పిళ్ళై పేర్కొ న్నారు. (ఇలక్కణచ్చిన్ద నైగళ్, 1956 పుట 21. 17వ శతాబ్ధి ఉత్త రార్ధంలో జావించిన స్వామినధ దేశికర్ అనే పండితుడు తన "ఇలక్కణ క్కొత్తు" అనే లక్షణ గ్రంథంలో తమిళముపైగల సంస్కృత ప్రభావమును వివరిస్తూ "సంస్కృత, తమిళ భాషలలోని వ్యాకరణములు ఒక్కటే" అని పేర్కొన్నాడు. కానీ నేటి పండితులు ఈ అభి ప్రాయాన్ని సమర్ధించరు)

సాహిత్య విషయకంగా చూచినా, సంస్కృత సాహిత్య ప్రభావం దాక్షిణాత్య సాహిత్యముల మీద కొద్దిగానో గొప్పగానో కనిపిస్తూనే ఉంటుంది. సంస్కృతం కూడా ద్రావిడ శబ్దాలు గ్రహించక పోలేదు.

మనదేశంలో ఆంగ్లభదషా సాహిత్యముల అధ్యయనం ప్రారంభమైన నాటి నుంచీ, ఇతర భారతీయ భాషలవలె దాక్షిణాత్య భాషలు కూడా పాశ్చాత్య సాహిత్య ప్రభావానికి లోనయిన విషయం విజ్ఞులకు విదితమే. మొత్తం మీద, తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం - ఈ నాలుగు దాక్షిణాత్య భాషలు ప్రాచీనమైనవేగాక సాహిత్య సంపద గల జీవద్భాషలు! తోబుట్టు బాషలు!

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'బిరుదురాజు రామరాజు గారి 'జానపదుల భాషా సారస్వతములు' - ఒక సమీక్ష

- డా॥. పాలెం వేణుగోపాల్

''జానపదుల్ పురీజనులు సంతసముంబ్రమదం బెలర్ప నీ
ధైన శుభోదయంబు హృదయంబుల గోరుచునున్నవారు స
మ్మానమునొంది కౌరవ సమాజము నిన్ను భజింప భూరి తే
జోనిధివై వెలింగెదవు సూర్యుని చాడ్పున నీవ యిమ్మహిన్'

(ఆంధ్రమహాభారతం-అరణ్య పర్వం-5.346)

ఆంధ్రమహాభారతంలో జానపద శబ్దం గ్రామీణులనే అర్థంతో మొదటిసారిగా వాడినట్లు అంచనా. జనపద మనగా పల్లెటూరు. జనపదములందుండువారు జానవదులు. 'కృతయజ్ఞశ్చ మేధావీ బుధో జానపదశ్చుచిః' అని వ్యాసుడు జానపదులను యజ్ఞము చేసినవారితోను, పండితులతోను సమానులుగా వ్యాఖ్యానించారు. వారి సాహిత్యాన్ని జానవద సాహిత్యమంటారు. జానపదులు పాడుకొను పాటలను జానపదగేయములు అంటారు. ఆంగ్లంలో వీనినే Folk Literature, Folk Songs అంటారు. ఈ పదాలు ఎశీశ్రీఎంశ్రీఱవఎ అనే జర్మను భాషా పదానికునువాదం, మరికొందరు జానపద విజ్ఞానం (Folk lore) అనికూడా ఈ వాఙ్మయాన్ని పిలుస్తారు. కాబట్టి Folk-songs, Folk-Literature, Folk-lore అనే పదాలకు జానపదగీతాలు, జానపద సాహిత్యం లేదా జానపదసారస్వతం, జానపద విజ్ఞానం అనే మాటలను వాడుచుండుట పరిపాటి. కొందరు జానపద సాహిత్య, జానపద వాఙ్మయాలకభేదం పాటిస్తున్నారు. అయితే వాఙ్మయ శబ్దం సాహిత్యశబ్దంకన్నా విస్తృతమైనదని గమనించాలి. ఇక జానపద విజ్ఞానంలో జానపదులకు సంబంధించిన విజ్ఞాన మంతయు చేరుతుంది. అనగా జానపద కథావాఙ్మయం, మూఢ విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, మంత్ర తంత్రాలు, శాస్త్ర విజ్ఞానం (భౌతిక, పారమార్థిక విషయాల పరిజ్ఞానం), వారిభావాలు, పొడుపుకథలు, సామెతలు, వినోదాలు, వేడుకలు, ఆట-పాటలు మున్నగునవి పై వానిని సాహిత్య సంబంధి, భాషాసంబంధి, వైజ్ఞానిక సంబంధి, క్రియా సంబంధియని నాలుగు భాగాలుగా విభాగించవచ్చు. పురాణం, జానపద కథ, గేయం మొదటి విభాగమైతే; మాట, పొడుపుకథ, సామెత రెండవ విభాగం. మందు, చికిత్స, ఇంద్రజాలం, జ్యోతిష్యం, వివిధ నమ్మకాలు, వైజ్ఞానికవిభాగం, నృత్యం, సంగీతం, ఆట, వినోదం, నాటకం, దుస్తులు, వంట, కళ మొదలైనవి చివరిదైన క్రియాత్మకంలో చేరుతాయి. సాహిత్యవర్గానికి కావలసింది కళాత్మక భాష. భాషావర్గంలో వ్యక్తమయ్యేది భాషా సామాన్య స్వరూపం. కార్యకారణాలను వైజ్ఞానికవర్గం వివరిస్తే, క్రియాత్మక వర్గానికి కావలసింది దేహం యొక్క కళాత్మక కదలికలు. ఈ అన్నిటి సమిష్టి సాంప్రదాయాన్నే 'జానపద విజ్ఞానం' అంటాం. దీనినే వాగ్రూప జానపద విజ్ఞానం, సాంఘిక జానపదాచారం, వస్తుసంస్కృతి లేదా భౌతిక సంస్కృతి, జానపదకళలు అని మరొక విధంగా వర్గీకరించవచ్చు. ఇలా వర్గీకరింపబడిన జానపదవిజ్ఞానం కేవలం జనపదాల్లో మాత్రమే ఉందని అనుకోరాదు. నగరవాసులలో సైతం జానపదత్వం ఉందన్న సత్యాన్ని మనం గమనించాలి. ఈ అంశం జానపద విజ్ఞాన ప్రక్రియ లైన కళలు, వైద్యం, నమ్మకాలు, సంప్రదాయాలను గమనిస్తే స్పష్టమవుతుంది. ప్రతిరోజూ నాగరికుడు తన జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒకవిధంగా పై

జానపద విజ్ఞానాంశాల్ని అలవరచుకుంటూనే ఉన్నాడనేది విస్పష్టం.

జానపద సాహిత్యం :

ఇంత విశాలమైన జానపదవిజ్ఞానంలో జానపద వాఙ్మయం ఒకభాగం మాత్రమే. ఎక్కువగా దీనిలో వాగ్రూపవిజ్ఞానం మాత్రం చేరుతుంది. ఈ జానపద వాఙ్మయంలో జానపదసారస్వతం ఒకభాగం, జానపదుల ఆధ్యాత్మిక, ఆదిభౌతిక భావవ్యాప్తికి లక్ష్యభూతమైనదీ జానపద సారస్వతం. తెనుగునాట వెలసిన దేశి సారస్వతాన్ని 'నిబద్ధదేశి, అనిబద్ధదేశి' అని రెండుగా విభజించవచ్చు. నిబద్ధదేశి శిష్టుల రచన కాగా అనిబద్ధదేశి జానపదుల సామూహిక రచన. దీనినే జానపదదేశియనవచ్చును. ఆయా జనుల సంస్కారాల అనుసరించి 'ఆటవికదేశి, పామరదేశి, జాతిదేశి' అని మూడురకాలుగా వింగడించవచ్చు. ఆటవికులకు, గిరిజనులకు సంబంధించిన సారస్వతం ఆటవికదేశి. చదువుసంధ్యలురాని పల్లీయులకు చెందినది పామరదేశి. కొంచెం అక్షరాస్యులైనను కాకున్నను అగ్రవర్ణాల వారికి, ప్రత్యేకంగా స్త్రీలకు సంస్కారవంతులకు సంబంధించినది జాతిదేశి. జానపద సారస్వతం కన్నా పరిమితమైనది జానపద సాహిత్యం. ఇది రసానందం, భావసౌకుమార్యం, భాషాసౌందర్యాలు ముఖ్యాంగాలుగా కలది.

జానపదుల భాష :

జానపద సారస్వతానికి, జానపద వాఙ్మయానికి జానపద భాషయే మూలధారం. వారి భావాల వలెనే వారి భాష కూడా జీవకళ ఉట్టిపడునదిగా ఉంటుంది. చెప్పదలచిన విషయాన్ని సూటిగా హృదయానికి తాకునట్లు చెప్పబడునేకానీ, కవి ప్రౌఢోక్తులవలె కఠినావబోధంగా ఉండదు. వ్యాకరణపు మూసలో యిముడదు. అందుచే వారిభాషను శిష్టులు గ్రామ్యమని ఎద్దేవాచేస్తారు. కారణం తెలుగు భాషా, సాహిత్యాల క్రమపరిణామ వికాస చరిత్రపై నిబద్ధతతో కూడిన అవగాహన లేకపోవడమే. ఒక్క మాటలో చెప్పాలంటే పట్టభద్రుడగు పండితునకు బాలశిక్ష చదువు నవస్థ పునాదియైనట్లే శిష్టసాహిత్యానికి కూడా జానపద సాహిత్యమే పునాది. అందులోని ఛందో లయ, ధ్వన్యనుకరణపదం, ప్రాస, అనుప్రాసలు, అనుసరణం మొదలగునవి భాషకి సౌందర్యాన్ని చేకూర్చేఅంగాలు. అందువలననే K. Vossler అనే పాశ్చాత్య పండితుడు 'Its phonetic body is equivalent to its poetic capacity' అని పేర్కొన్నాడు. ఈ మాట జానపదభాషకు కూడా పూర్తిగా అన్వయిస్తుంది. ఆ కారణంచేతనే ఎమర్సన్ అనే పండితుడు కూడా 'As this is the first language, so it is the last' - అనగా 'జానపదుల భాషే ప్రాచీనమైంది, మొదటిది' అన్నాడు.

జానపదగేయ సాహిత్యమందుండు భాష వాడుకభాషకనుక యిది కావ్యభాషా వ్యాకరణానికి లొంగదు. వ్యాకరణ విరుద్ధాలగు భాషావిశేషాలు బహుమెండుగ ఉంటాయి. వ్యవహారిక పదరూపాలు, దుష్టసంధులు, దుష్ట సమాసాలు, భ్రష్టరూపాలు, శివకవులు పయోగించినట్టి పదసముదాయం ఎక్కువగా కనిపిస్తాయి. వైయాకరణులకు సమ్మతంకాకున్నా భాషాశాస్త్రజ్ఞులకింపు గొలుపుతాయి. మరియు కోట్ల జనుల నిత్య వ్యవహారంలో ప్రయోగింపబడుటచేనివి తమ వ్యాకరణాన్ని తామే నిర్మించుకొన్నట్లు కనిపిస్తాయని కీ.శే. ఆచార్య బిరుదురాజు రామరాజు గారభిప్రాయపడినారు.

దినవెచ్చము, ప్రాణగొడ్డము వంటి శబ్దములను శిష్టసాహిత్యంలో ప్రయోగించిన శ్రీనాథుడు జానపదులకై రచించిన పలనాటి వీరచరిత్రలో అట్టి శబ్దాలు ప్రయోగించారు. కొలువులో నాయుడు కొనరెట్టవట్టి, కులపగదీర్పనీకొడుకితడంచు" అనేచోట 'కులపగ' మిశ్రమ సమాసం. అలాగే 'ఘనమైన పంజలు, కనకతప్పెటలు'. ఇది కూడ మిశ్రమసమాసాలే. ఇలా వ్యాకరణమంగీకరింపకున్నను శిష్టకవిప్రయోగమునను, ప్రయోగబాహుళ్యము చేతను సాధువైనది. అట్లే 'ఇతరవస్తులు మోసి యేతెంచునట్టి'-వస్తువులనుటకు మారుగా వస్తులనుటచే ప్రథమా విభక్తి ప్రత్యయం లోపించింది. ఇట్టి ప్రయోగాలు శివకవులధికంగా చేశారు. 'దేశింగురాజుకథ'లో

'ఘనగుఱ్ఱము' వంటి మిశ్రమ సమాసాలు అధికం. కోళ్ళ (కొల్లగొట్టుట), ఒళ్ళుకు (ఒడలికి) వంటి వ్యవహారిక రూపాలున్నాయి. 'బొబ్బిలిపదం'లో తయారుగన్నండి. భేటికి రన్నండి, తెన్నండి వంటి రూపాలు తయారుగండు, భేటికి రండు, తెండు అనుటకు మారుగా వాడబడినాయి. గొల్లున, భల్లున నవ్వులనుటకు మారుగా ఘల్లు నవ్వులు అనినాడు. ఉల్పాయ, ఉలుపా (కానుక) శబ్దానికి వ్యవహారికరూపం. 'అలంగారము యెక్కినారు భేరీస్త్రీలు' అనుచోట 'అలంగము'శబ్దం అలంగారముగా మారింది. అలంగము అంటే కోట ప్రాకారపు గోడకు మట్టిచేతగాని, రాళ్ళచేతగాని ఏర్పరుపబడిన కొఱడు. అలాగే రవిడిగుండ్లు దొరలించినారు భేరీస్త్రీలు'. శత్రువులపై కోటమీద నుండి దొరలించెడి గుండ్లు. రావడిగుండ్లు రవిడిగుండ్లైనాయి. ఈ విధంగా బొబ్బిలిపదంలో అధికంగా వ్యావహారిక ప్రయోగాలున్నాయి. ఇది సిసలైన జానపదగేయం కాబట్టి భాషయంతయూ వ్యావహారికమే ఉదాహరించుట అనవసరం; మరొక పదమైన 'కాంభోజరాజుకథ'లో బ్రాహ్మణుడు రాజుగారిని, 'స్వయంపాకము ఇప్పుడియ్యుము సదావర్తి ఇప్పుడియ్యుము' అంటాడు. సదావృత్తి అనేది సదావర్తిగా మారింది. 'సదావృత్తి' అనగా బైరాగులు లోనగు వారికిచ్చెడి వంటసామాగ్రి. మాణిక్యాలదేవిని 'శరాబందికాన' లో ఉంచిరి. చెరమరియు బందిఖానా శబ్దాలుకలిసి 'కత్తిచాకు; గేటుతలుపు' వలె శరాబందికాన యైంది. తల్లి చెరలో నుండగా పుట్టినవాడు కాబట్టి 'శరాబందిరాజు' అయినాడు. ఇలాంటివే క్షత్రియగొడుగు (ఛత్రము గొడుగు) మరియు బారాపన్నెండు వంటివి. 'అట్లే శ్రీవరాహ చరిత్రంలోని మృగజంతువు, సప్తయేడు లోకాలు, రణయుద్ధం మొదలగునవి. ఇక స్త్రీల పాటలన్నీ సాధారణంగా వ్యవహారిక రూపాన వుంటాయి. పాడుకొనునప్పుడు శబ్దాలు దీర్ఘాలు హ్రస్వాలుగా, హ్రస్వాలు దీర్ఘాలుగా ఎగుడుదిగుడు లవుతుంటాయి. వాటిననిన్నిటినీ పరిశీలిస్తే జానపదులభాషలోని సొగసుదనం వ్యక్తమవుతుంది. అట్లే కాలజ్ఞానతత్వాలలో కూడా విభక్తులులేని ప్రయోగాలు, వ్యాకరణవిరుద్ధ ప్రయోగాలు, సమాసాలు ఎక్కువగా కనిపిస్తాయి. వాటిన్నింటినీ ఆయా గేయ సాహిత్య పరిశీలనలో గ్రహించవలసిందే.

అన్యదేశ్యాలు :

భాషాభావాలు, ఛందస్సులు, వర్ణనలు, అనుభూతులు కాలానుగుణంగా మారుచూ క్రమపరిణామ వికాసము లందుచుండుట సహజం. అన్యభాషల సంపర్కంచే క్రొత్తమాటలు, క్రొత్త సంప్రదాయాలు, క్రొత్త కవిసమయాలు సాహిత్యంలో చేరిపోతూంటాయి. ఇట్టివి జానపద(గేయ) సాహిత్యంలో అధికంగా కనిపిస్తాయి. ఎన్నియో ఉర్దూ, ఆంగ్లపదాలు, వాని అనువాదాలు వ్యవహారికభాష యందు ప్రవేశించాయి. వానిని కాదనుటకు వీలులేదు. సంస్కృతాంధ్రాంగ్లాది ప్రౌఢ సాహిత్యాల పుక్కిట బట్టిననూ దేశీయ పలుకుబడులతో, దేశీయఛందములందు సూటియగుమాటలతో అల్పాక్షరాల అనల్ప భావసంపదను వెలార్చు జానపదగేయాలు సహృదయహృదయాహ్లాదకరాలై పండితపామర జనరంజకాలై ఒప్పుచున్నాయి.

నదికి, భాషకు అవినాభావ సంబంధముంది. జనన నది ఎంతో చిన్నదిగ ఉండి, పోనుపోను పెద్దదైనటులే ప్రతి జీవద్భాష దాని పుట్టుక సమయాన అల్పంగా వుండి, క్రమంగా ఒకచోటునుండి, మరొకచోటునకు, ఒక నోటి నుండి మరొక నోటికెక్కినపుడు అన్యభాషా సంపర్కం చేతను, అన్యవిషయాలచేతను శబ్దసంఖ్య పెరిగి వికాసం జరుగును. ఇది ప్రపంచభాషలన్నింటికీ వర్తించుసూత్రం. అన్యభాషా పదములు లేనట్టి మడికట్టుకున్న భాష ప్రపంచంనందొక్కటైననూ లేదు. వ్యవహారదూరమైన భాషలు దీనికి అపవాదు. దేవభాషయగు సంస్కృత పదాలెన్నో ఇతరభాషలలో కలిసిపోయాయి. తెలుగులో నున్న సంస్కృత పదజాలం అనల్పం. సాధారణులకివి చెప్పినప్పుడు ఆశ్చర్యపడుదురేకానీ వాడుకలో సంస్కృతాలని గుర్తింపలేనంతగా కలిసిపోయాయి. అలాగే మన దేశంపై, మనభాషలపై ఇతరుల ప్రభావం అధికంగా ఉండడంచే మనభాషలలోని అన్యభాషాపదాలను విడదీయడం చాలాకష్టం. భారతేశంలోగల భాషలన్నింటి

లోనూ పుట్టుకననుసరించి ఉర్దూభాష కనిష్ఠసోదరి వంటిది, అరబ్బీ, పారశీ, సంస్కృత, ప్రాకృత దేశభాషా పదాలచే పరిపుష్టమై వెలలేని అందచందాలను, వేగవంతమగు వికాసాన్ని కూర్చుకుంది. తెలుగులో, అందులోనూ వ్యావహారిక భాషాకవిత్వమగు జానపద గేయాలలో ఉర్దూ, ఆంగ్లపదాలు ఎన్నో చేరినాయి. కేవలం జానపదమందేకాక శిష్టసాహిత్యమందు కూడా అన్య దేశ్యాలు అధికంగా కనిపిస్తాయి. జానపదగేయాలలో కూడా ఉర్దూ పదాలు ప్రవేశించాయి.

ఉదాహరణకు శ్రీనాథకర్తృత్వమనబడు పల్నాటి వీరచరిత్ర యందు 'మఖమల్లుగుడ్డలు వలనుకొని తెచ్చి' అనే ప్రయోగాన్ని పరిశీలిస్తే 'మఖ్మల్' అనే ఉర్దూపదం 'మఖమల్లుగా'గా మారింది. 'అన్నపుఖర్చున కాకుపోకలకు' అన్నప్పుడు 'ఖర్చు'ఉర్దూపదం, కాటమరాజుకథలో' చీట్లు వ్రాయించుమీ శీఘ్రూన తిక్క', చిఠ్ఠీ ఉర్దూపదం. 'వారి యాటోపంబు వారి ముస్తీబు' అన్నప్పుడు 'ముస్తాబు' అని వాడుక. ఇది ముస్తయీద్ ౧ముస్తీదు ౧ ముస్తీబు ౧ ముస్తాబుగా మారిన ఉర్దూపదం. అట్లే సర్దార్ శబ్దం సరదారైంది. అట్లే 'తోకకు తగిన బందెయును' అన్నప్పుడు బందిఖానా నుండి బందె వచ్చింది. చేలు మేసిన పశువులను 'బందె'లో తోలుతోలుతారు. అలాగే దేశింగు రాజుకథలో బాచ్చా, పాదూషా, ఫకీరు, డేరా, తఖ్తు, ఖైదు, జల్దీ, అచ్చా, సలాం, నమ్మకహారాం, వజీరు, దర్వాజా, మహలు, దర్బారు, మసీదు, నవాబు, సుబేదారు వంటి ఉర్దూ పదాలు; గ్లోబు, ఫైర్, మేజర్, సిగ్నల్ వంటి ఆంగ్లపదాలు కనిపిస్తాయి. బొబ్బిలి యుద్ధంలో 'కంబైటో కంబైటో విజయరామరాజు' అని బూసీ (బుస్సీదొర) అంటారు. ఇందులో 'కం' ఆంగ్లపదం (come) 'బైఠో' ఉర్దూపదం, కలిసి 'కంబైటో' అనగా వచ్చికూర్చోమని అర్థం. కాలజ్ఞాన తత్త్వాలలో బందు, ముసద్దీలు, సదరు, లుచ్చా, ధూత్తెరి మొదలైన శబ్దాలు వేదాంతులనోట వెలువడ్డాయి. అలాగే 'రామదాసు చరిత్ర'లో కూడా హుజూరు, అర్జీ, కిస్తీ, ఖర్చు, ఫిర్యాదు, ఖైదు, బందిఖాన వంటి పదాలున్నాయి. 'తెప్పోత్సవ ఓడపాట'లో రయిలొసు (Rail House), గులోబులు, వాలుషేడు (Shed) వంటి ఆంగ్ల పదాలున్నాయి.

ఈ విధంగా ఎన్నియో పరభాషాపదాలు తెలుగు వలువలు ధరించి అచ్చం తెలుపదాలైపోయాయి. ఎంతమడికట్టుకున్నా కనీసం ఒకటి రెండు మాటలనైనా నిత్యదైనందినవ్యవహారంలో పలుకని తెలుగువాడు లేడనుట నిత్యసత్యం.

జాతీయాలు (Idioms) :

మానవుడు పరిమిత ప్రయోజనం గలవాడై నిర్జన స్థలాలందున్నప్పుడు భాష పెరుగదు. ఉన్నభాష అవసరాలకు సరిపోతుంది. అలాకాక మానవుని అవసరాలు పెరిగినపుడు, సాంఘిక విషయాలందు మార్పు జరిగినప్పుడు, వ్యవహారాలధికమైనప్పుడు, కొత్త విషయాలు దిగుబడి అయినప్పుడు, వానిని గూర్చి మాట్లాడ వలసివచ్చినప్పుడు, తమభావాలకు వాగ్రూపమియ్య వలసి వచ్చినపుడు తనభాషయందు కొన్ని శబ్దాలను కల్పించుకోవలసివస్తుంది. ఆవిధంగా ప్రగతిశీలమగు జాతి తన భాషను కొత్త శబ్దకల్పనంచే పరిపుష్టం గావించుకొని భాషావికాసానికి దోహదపడుతుంది. ఈ నూతన పద, లేదా శబ్దసృష్టి కేవలం శిష్టులకే కాదు, భావవ్యక్తీకరణానికి పూనుకున్న ప్రతిఒక్కరికీ సంబంధించినదే.

"ఒకప్రత్యేక జాతికి సంబంధించిన ప్రత్యేక విషయాలను వ్యక్తీకరించేవే జాతీయాలు. అవి భాషలో బలమైన స్థానాన్నాక్రమిస్తాయి. జాతీయాలు లేని భాష పేలవంగా ఉండడమేకాక, జాతీయాలు లేని జాతి పూర్వచరిత్రకూడా పేలవంగా ఉంటుందనుకోవా"లని అంటారు నేదునూరి గంగాధరం గారు. కొత్తశబ్దాలతో పాటు భాషయొక్క జాతీయసంపద యనబడు మారుమూల పదాలు, నానుడులు, జాతీయాలు, మాండలికాలు భాషావికాసానికి తోడ్పడుతాయంటారు రామరాజుగారు. సాధారణంగా ఈ సంపద అనువాదాలకు లొంగదు. ఇట్టివాని మూలంగానే ఒకభాష ప్రత్యేకత మరొకభాషకు రాదు. అయితే ఈ జాతీయాలలో భాషకు సంబంధించిన అంశాలేకాక, సాహిత్యాంశాలు కూడా చోటుచేసుకుంటాయి. పదాల

కున్న సహజార్థాన్ని మరుగు పరచి, చెప్పవలసిన విషయాన్ని నేరుగా చెప్పక విలక్షణార్థంలో వ్యంగ్యంగా ప్రతిపాదింపబడేవి జాతీయాలనవచ్చు. వీనికే 'నుడికారాలు' అని మారుపేరు. ఉదాహరణకు 'అడవిగాచిన వెన్నెల, కత్తిమీదసాము, గుండెలు తీసిన బంటు, నీళ్ళునములు, మూగనోము, పడకేయు, మీసాలపై తేనియలు' మొదలగునవి. ఈ జాతీయాలను భాషా సంబంధాలు, వస్తునిష్టాలు, పురాణసంబంధాలు, చారిత్రక సంబంధాలు, కులసూచికాలు, స్థలసూచకాలు, సంకీర్ణాలు అని ఏడు విభాగాలుచేయవచ్చు.

జానపదులు ప్రయోగించిన జాతీయాలు: కాకి ముక్కుకు దొండపండు (గంగావివాహం), మున్నాళ్ళ ముచ్చట,పాలవంటికాపురం (మార్కండేయ జననం).

కొన్ని సామెతలు సందర్భానుసారంగా జాతీయాలుగా చెలామణి అవడం గమనిస్తాం. ఉదాహరణకు 'లోగుట్టు పెరుమాళ్ళకెరుక, అరణ్యరోదన, పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం, శ్రీరంగనీతులు,ఉత్తరకుమార ప్రజ్ఞలు మొదలైనవి.

స్త్రీలపాటలలోకూడా లెక్కలేనన్ని జాతీయాలు కనపడతాయి. 'గుండెనీరయిపోయి, చేటంతమొగము, కత్తికొక కండ, కడుపు చల్లగా, చిలుకలకొలికి తలలో నాలుక' ఇత్యాదులు' కీ.శే. ఆచార్య బి.రామరాజుగారు తన జానపదగేయ సాహిత్యంలో కొన్నిటిని పేర్కొన్నారు. నువ్వులు చల్లుట (బొబ్బిలియుద్ధం), పంచదార ములుకులు (కుశలవ యుద్ధం), ఉడుకు మనసు (విరాటపర్వం), వన్నెల విననకర్ర (వీరరాజమ్మకథ) దుమ్ములుపు (గాంధారికథ), ముంజేతి మీసం (బొబ్బిలిపదం).

ఈవిధంగా భాషలో ఇలాంటి వైశిష్ట్యపూర్ణ పదబంధాలు భాషకు ఇంపును సొంపును అందించి జాతీయభాషగా రూపొందిస్తాయి.

సామెతలు (Proverbs) :

కవితా కళకు పతాకస్థాయి సామెత. సామెతలన్ని భాషలందు ఉంటాయి. జీవితమే కవిత్వంగా అంగీకరించినచో సామెతలు జీవితానుభవాల సూత్రప్రాయమైన నగ్నస్వరూపాలుగా భావింపవచ్చు. పలువురు పలువిధాలుగా తమఅభిప్రాయాలను సామెతగురించి వ్యక్తంచేశారు. నానుడి, లోకోక్తి, శాస్త్రం, జనశ్రుతి అని సామెతకు పర్యాయపదాలు, రాయలసీమలో 'శాస్త్రం' అని అంటారు.

'అల్పాక్షరముల అనల్పార్థరచన కల్పించుటయె కాదె కవివివేకంబు' అనిన పాల్కురికి సోమన మాటలు దీనికి అన్వయించుకోవచ్చు. కొన్ని సామెతలు సూటిగా ఉంటాయి. కొన్ని ధ్వన్యాత్మకంగా ఉంటాయి. కొన్ని అలంకారయుతంగా ఉంటాయి. దీనిని బట్టి సామెతకు కొన్ని లక్షణాలు చెప్పవచ్చు. అవి-సంక్షిప్తత, వాక్యరూపంలో ఉండడం, అనుభవపూర్వకంగా ఉండడం, తీక్ష్ణత, సార్వజనీనత, వివేకయుతం, ఉపదేశాత్మకత, వ్యంగాత్మకం. ఈ లక్షణాలననుసరించి Thomas Fuller అనే పాశ్చాత్యుడు much matter decoted idea few words అన్నాడు. వీటన్నింటి ఆధారంగా ''అనుభవయుక్తం, నీతిబోధాత్మకం, ఉపదేశాత్మకం, సూత్రబద్ధంగా ఉండి సంక్షిప్తవాక్య రూపంలో ఉండే లోకుల చమత్కారోక్తియే సామెత'' అని నిర్వచించవచ్చు.

సామెతలలో సునిశితహాస్యం చోటుచేసికొని ఉంటుంది. ఈ సామెతలు స్త్రీలకు వచ్చినట్లుగా పురుషులకు రావు. కేవలం జానపదులేకాక శిష్టులు కూడా సామెతలను పయోగించారు. విషయప్రాధాన్యాన్ని బట్టి సూత్రపు సామెతలు, ఉపమానరూపకాలు, నీతిబోధకాలు, పౌరాణికాలు, ప్రశ్నోత్తర, ప్రశ్నార్థరూపకాలు, సాంఘికాచార రూపకాలు, వ్యక్తిగతాలు, హాస్యపరాలు, వ్యవసాయిక సంబంధాలు అని ప్రధానంగా విభజించవచ్చు. ఇవేకాక అశ్లీలమైనవి, న్యాయపరమైనవి, వైద్యపరమైనవి, స్థలపరమైనవి, గృహజీవనపరమైనవి అని కూడా సామెతలను వింగడించవచ్చు. తెలుగుభాషలో చెప్పుకోదగ్గ సామెతల గ్రంథాలు లేవు. కీ.శే. చిలుకూరి నారాయణరావు గారు సుమారు లక్ష సామెతలను సేకరించి ప్రకటించారు. అవన్నీ గ్రంథరూపం దాల్చలేదు. కీ.శే. బిరుదురాజు రామరాజు గారు తమ 'జానపదగేయసాహిత్యం'లో కొన్ని

జానపద గేయాలలోని సామెతలను తెలిపియన్నారు.

అందులో కొన్ని -

- గుర్రు మనగలేని కోపమెన్నటికి -బాలచంద్రుని యుద్ధం.
- గొల్లమీది పుల్లరి గోగుమీద బచ్చలు, ఉలవ లెత్తామంటె ఊళ్ళనడిగెదవు
- తెడ్డడిగినప్పుడే కొయ్యడిగినట్లు, పేదవానికోపం పెదవుల తీట
- రక్షించువారిని రమ్మని పిలిచి-భక్షింపజూచినపని యింతలేదు - కాటమరాజుకథ
- చల్లకోసంవచ్చి ముంత దాచగనేల, ముంజేయి కంకణ మరయుటకు ముకురముగావలెనా - దేశింగురాజుకథ
- తనుగట్టుటకు త్రాళ్ళు తాదెచ్చుకొన్నట్లు - నలచరిత్ర
- తానొకటితలచితే దైవమొకటి తలచు
- క్రొవ్వుచేతనుబోయి కొరత బడ్డట్లు - శశిరేఖాపరిణయం
- ఇల్లు ఇరకటమంచు ఆలిమరకటమంచు
- ఉడుమునకేలా ఊరి పెత్తనము వీరయ్య - వీరరాజమ్మ కథ

ఇలా జానపదగేయాలలో ఎన్నో ప్రసిద్ధమైన సామెతలు చోటుచేసికొన్నాయి. ఇక సామెతలలో ముఖ్యంగా చెప్పుకోవలసినది వ్యవసాయిక పరమైన సామెతలు. కారణం నూటికి తొంబదిశాతం గ్రామాలుండటమే. ఆకారణంచే అనేక వ్యవసాయిక సామెతలు మన జీవితంలో చోటు చేసికొన్నాయి. మచ్చునకు కొన్ని: రైతు దున్నితే రాజులకు అన్నం, నాగలి ఉన్న ఊళ్ళో ఆకలి చేరదు. కోటి విద్యలు కూటికోసం, కృషితో నాస్తి దుర్భిక్షం, దొరలు ఇచ్చిన పాలుకన్నా ధరణి యిచ్చిన ధాన్యంమేలు, జననిని, ధరణిని నమ్మినవాడు చెడడు, వానరాకడ ప్రాణం పోకడ తెలియవు, పెట్టుబడిలేని సేద్యం చద్దిలేని పయనం, ఎంతచెట్టుకంతగాలి, కాపులకష్టం భూపతినంపద, సొమ్ముఒకడిది సోకొకడిది.

ఇలా ఈ సామెతలన్నింటినీ పరిశీలిస్తే ఇవి సమాజ అధ్యయానికి అభ్యుదయానికి సాధనాల వంటివని అంగీకరించక తప్పదు.

పొడుపుకథలు (Riddles) :

జానపద గేయ ప్రక్రియలాగే పొడుపుకథలు కూడా మానవుల ప్రయత్నపూర్వక మేధాశక్తితో జనించాయి. శుద్ధమైన పొడుపుకథ జానపదుల హృదయాంతరాళాల నుండి ఉద్భవించింది. సామెతలు ఒకవిధంగా ఏక కర్తృకమై, పిమ్మట సామూహికముద్రను వేసుకోగా, పొడుపుకథలు సామూహిక కర్తృత్వంచేత ఏర్పడి జానపదగేయాలవలె అప్రధానకర్తృకమైనాయి. అయితే భారతదేశంలోని పలు ప్రాంతాల పొడుపుకథలకు వేదాలలోని పొడుపు కథలే మాతృకలని పలువురు విద్వాంసుల అభిప్రాయం. 'పొడిచేలా ప్రశ్నించు' అనే అర్థంలో పొడుచు లేదా పొడుపుకథ అనవచ్చు. 'కథ' అనడంలో ఇక్కడ 'విషయం' అని అన్వయించవచ్చు. సమాధానం చెప్పలేని వ్యక్తి దానికి మారుగా మరొక విషయాన్ని (కథ) వాడడం పరిపాటి. అందుచే దీనిని 'మారుకథ' అని కూడా అనవచ్చు. రాయలసీమలో, ముఖ్యంగా చిత్తూరు మండలంలో దీన్ని 'మారుకథ' అంటారు. అనంతరపురం మండలంలోని కొన్ని ప్రాంతాల్లో అడ్డుకథ, అడ్డుకత అంటారు. కడపజిల్లాలో పొడుపుకథ, విచ్చుకత, విప్పుకత అని అంటారు. తెలంగాణాలోని కొన్ని ప్రాంతాల్లో 'శాస్తం' అంటారు. శాస్త్రార్థమెంత కఠినమో వీనిని విడదీయడం అంత కష్టమని కాబోలు పొడుపు కథలకు 'శాస్త్ర'మని పేరొచ్చింది. ఆంగ్లంలో వీనిని (Riddles) రిడిల్స్ అంటారు.

సాధారణంగా పొడుపుకథ ప్రశ్నరూపంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, సంపూర్తిగానో, అసంపూర్తిగానో సంప్రదాయబద్ధంగా ఉంటుంది. చూడటానికి అసంబద్ధంగా, పరస్పరవిరుద్ధంగా కనిపిస్తుంది. కానీ ఒక విశిష్టదృష్టితో పరికిస్తే అది కేవలం సత్యాన్నే వెల్లడిస్తుంది. ఈ పొడుపు కథల గురించి అనేక నిర్వచనాలున్నాయి. వాటినన్నింటిని పరిశీలిస్తే తేలిన అంశమేమంటే 'ఊహచే సమాధానాన్ని

వెదకి, వినోదాశ్చర్యాలతోపాటు గూఢార్థాన్ని వెలువరించే, సవాలు చేసే ప్రశ్నార్థక రూపకాతిశయోక్తి ప్రక్రియ పొడుపు కథ". ఈ పొడుపుకథల్లో ఉపమాన వాచ్యంగాను, ఉప మేయం సూచ్యంగాను ఉంటుంది. అంటే వాచ్యమైన ఉపమానంతో సూచ్యమైన ఉపమేయాన్ని గుర్తించటం సమాధానమనిపించుకుంటుంది. ఇది యిందులోని ప్రధానాంశం.

జానపద విజ్ఞానం 'వివరణాత్మకాలు, పరిహాసాలు, వివేకయుతాలు, విడికథలు, అనుకరణకథలు అని విభజింపబడినా, భాషాశాస్త్రాధ్యయానానుగుణంగా రూపప్రధానాలు, క్రియా ప్రధానాలు, అర్థప్రధానాలు అని ప్రధానంగా వర్గీకరింపబడినాయి. ఒక సరళవాక్యంలో కానీ, ఎక్కువ సరళవాక్యాలలో కానీ లేదా గొలుసు రూపంలో ఒకదానిలో మరొకటి ఇమిడిపోయిన శబ్దాలతో కూడినవి రూప ప్రధానాలు (former based) అంటే వర్ణనాత్మకనామవాచకం యిందులో ప్రధానం. ఉదా హరణకు- 'పెద్దయిల్లు-పెద్ద యింట్లో చిన్నయిల్లు - చిన్నయింటిలో గుంట- గుంటలో స్తంభం మీద రాజు కూర్చొని తపస్సు చేస్తాడు. సమాధానం: గ్లోబు (Globe). ఇక సరళమైన, సమానమైన, నిషేధాత్మకమైన క్రియా పదాలతో కూడినవి క్రియా ప్రధానాలు (action based). ఉదాహరణకు 'దేహమెల్లకండ్లు దేవేంద్రుడు కాడు, నరవాహనమెక్కి నడచిపోతాడు, నిండుప్రాణంలేదు. తాను జీవులచంపు. సమాధానం-'వల'.

ఇక ముక్తపదగ్రస్తంలా వుండి, అర్థప్రాధాన్యంకలిగి మొదట చెప్పిన విషయంలోని చివరిశబ్దం, రెండోసారి చెప్పిన విషయానికి ముందు చేర్చబడి వుండే (Sementicaly controlled) అర్థంప్రధాన పొడుపుకథలు మూడవరకం. ఉదాహరణకు 'అంభాలు- అంభాలు మీద కుంభాలు (కాళ్ళు, పిరుదులు)- కుంభాలుమీద కుడితి బాన (కడుపు)- కుడితిబానమీద ఈరపలక (రొమ్ము)- ఈరపలక మీద ఇనుప గుండు (తల), ఇనుప గుండుమీద ఇద్దరు జవానులు (కళ్ళు), ఇద్దరు జవాన్ల మీద సీకుపాద (వెంట్రుకలు) సీకు పాదలో పది రేసు కుక్కలు (పేన్లు). ఇలా పొడుపు కథలను మూడు విధాలుగా విభజించినా, కథలోని విషయాన్ననుసరించి ప్రశ్నించే పద్ధతే సరియైన పొడుపుకథ అనిపించు కుంటుంది.

చివరిగా పొడుపుకథలను విషయ ప్రాధాన్యాన్ని బట్టి కూడా వర్గీకరించవచ్చు. అవి-

ప్రశ్నార్థక పొడుపుకథలు :

ప్రశ్నల్లా వుండి, సమాధానాన్ని కోరేవి. ఉదాహరణకు - 'ఒక్క అడుగు పోయిన కొద్ది కొంచెం తగ్గుతుంది. దాని పేరేమి? సూది, దారం.

వినోదాత్మకాలు :

హాస్య ప్రధానమైనవి. ఉదాహరణకు-చాపను చుట్టలేం, చక్కబెట్టలేం - ఆకాశం;

రూకలెంచలేం, చాపచుట్టలేం - నక్షత్రాలు, ఆకాశం

కథాత్మకాలు :

కథను ఇమడ్చుకొన్నవి.

ఉదాహరణకు - ఒక వ్యాపారి తిరిగి తిరిగి అలసి పోయాడు. ఆకలి మండిపోతోంది. తిండి దొరకలేదు. ఒక యిల్లాలు చింతగుజ్జు వేసి, విడి ఆకుల్లో అన్నం వడ్డించి నెయ్యివేసింది. అప్పుడా వ్యాపారి దానికను గుణంగా ఇలా అన్నాడు. పంగలా పంగలా ఆకులు, సీనులాసీకులా అన్నం, చుక్కల చుక్కల చారు, పైగా గొర్రె సీమిడి వేసి తిను అంటే ఎలాతినేదమ్మా!

వృత్తి సంబంధాలు :

వ్యవసాయానికి సంబంధించినవి.

ఉదాహరణకు - ఇంటిగొల్లవాడు యిద్దర్ని పొడుచు - ముల్లుకర్ర

ఏడుబారలమాను వంగి నీళ్ళుతాగు - కపిలెమోకు.

సంఘ జీవన సంబంధాలు :

శరీరావయవాలు, నగానట్రా మొదలైన రూపకాలంకారంతో వుండేవి.

ఉదా॥ రెండు మిద్దెలకు ఒకటే దూలం - ముక్కు.

మిద్దెమీద మిరపచెట్టు, నీళ్ళు లేక ఎండిపోయె - దీపం.

చిత్రశబ్దాత్మకాలు :

ఒక పదం లేదా అక్షరాల్లో వస్తువును గుప్తంగా వుంచడం.

ఉదా॥ వంకరటింకర 'శా' - శాంతి; వానితమ్ముడు 'అ' - అల్లం;

నల్లని పిల్లా 'మి' - మిరియం ; నాకేమిస్తావు 'తే' - తేనె,

అశ్లీలార్థకాలు :

పైకి అశ్లీలంగా కనిపించి, కథవిప్పినప్పుడు చమత్కారంగా ఉండడం.

ఉదా॥ ఆలూ మొగుడు వాటేనుకుంటే అల్లీ సాయిబొచ్చి విడిపించాడు.

సమాధానం : బీగం

ఇలా పొడుపు కథల కాలక్షేపంకోసం సృజింపబడ్డ ప్రక్రియేయైనా పెద్దలు, పిన్నల మధ్య ఒక విధమైన సామాజిక విషయసామాగ్రిగా వుంటూ వినోదం, విజ్ఞానం ప్రసాదించే లక్షణం కలిగి వుంటాయనడంలో సందేహం ఏమాత్రం లేదు.

తిట్లు (Folk Abuses) :

తిట్లకు పట్టుకొమ్మలు మన పల్లెసీమలు. తమ హృదయాలను గాయపరచినప్పుడు ఎటువంటి తిట్టునైనా తిట్టడానికి వెనుకాడరు మానవులు. జానపదులలో ఈ అంశం మరీ ఎక్కువ. అందులో కొందరి తిట్లు మరీ ఘోరంగా ఉంటాయి. ఎక్కువగా ఆడవాళ్లే తిట్లను ఉదయం ఇంటి ముంగిట కసవు తోయడం దగ్గర మొదలుపెట్టి ఎక్కడో అంతం చేస్తారు. మాటలతో ఆరంభమైన జగడం చేతులదాకా పోవడం సంభవిస్తుంది. ఇతరులు వినలేనంత కర్ణకఠోరంగా, అసహ్యంగా, అసభ్యంగా నోటిదురద తీరేదాకా కొనసాగుతాయి. అందుకే 'నోరు మంచిదైతే ఊరుమంచిదవుతుందనే' సామెత పుట్టింది. సాధారణంగా బలహీనులే తిట్లను అధికంగా ఉపయోగిస్తూంటారు. నాలుగు తన్నులు తిన్నా నోటి దురదను మాత్రం తీర్చుకోకుండా ఉండలేరు. అలాగే దబాయించుకు తిరిగే వాళ్ళుకూడా తిట్లనధికంగా ప్రయోగిస్తూంటారు. అందువల్ల తేలినదేమంటే ఎప్పుడో ఒకప్పుడు, ఏదోవిధంగా సభ్యంగానో, అసభ్యంగానో 'తిట్టు'ను అస్త్రంగా ప్రయోగించే వారే అధికం. కాబట్టి 'మనకు ఆప్తులైన వారు పెడదారిని పట్టినప్పుడు గానీ, లేక యెందులో నైనా కల్తీ, వెలితి కనిపించినప్పుడు గానీ సహజంగా మనకు కోపం వస్తుంది. అందువల్ల వాగ్రూపమైన కోపాన్ని 'తిట్టు' అని చెప్పవచ్చు" నని డా॥ తూమాటి దొణప్పగారు తెలిపారు.

తిట్టును ఆంగ్లంలో Abuse అంటారు. Abuse n+fñ to make a wrong use of, to ill treat, to violate, to revile అనే క్రియాపద రూపాలు, ill use, improper treat insulting అనే నామవాచక రూపాలున్నాయి. హిందీలో 'గాలియా', ఉర్దూలో 'గాలీగలీచ్' అని తెలుగులో దూరు , నిందించు, శపించు అనే అర్థాలున్నాయి. (తిట్టు+లు=తిట్లు). తెలుగు భాషలో తిట్లు ఎక్కువగా కనిపించినా తెలుగుభాషపై ప్రభావంచూసిన ఉర్దూ, హిందీ, ఆంగ్లభాషలలో కూడా ఎక్కువగా కనిపిస్తాయి. ఉదాహరణకు 'సువ్వర్-హిందీ; బాంచోద్, మాదర్‌చోద్ - ఉర్దూ; ఫూల్, రాస్కెల్, ఇడియట్, డాంకీ, మంకీ, పోర్‌ట్వంటి, మఫ్- ఆంగ్లం; నాయాలు, నమక్ హరాం-అన్యభాషాసంపర్కం.' ఈ విధంగా ఉన్న తిట్లు లేదా తిట్టు యొక్క పరమార్థం ఇతరులకు హానికలగాలని ఆశించడం. తిట్టేవారు మాన మర్యాదలను లెక్కచేయరు. సమాజంలో ఇవి అసభ్యమని తెలిసినా, లేదా, నిషిద్ధమని తెలిసినా వాటిని ఉల్లంఘించి ఉచ్చరించడం అలవాటు చేసుకున్నాడు మానవుడు.

అయితే అన్ని తిట్లు చెడ్డవే అని చెప్పలేం. కొన్ని ప్రీతిపాత్రంగా, విశ్వాసపాత్రంగా ఉంటాయి. ఉదాహరణకు 'ఏరా వెధవా ఇంత ఆలస్యం' అన్నప్పుడు ఎదుటివాడు సమాధానంగా 'పోరా నా కొడకా' అనడం. అట్లే ఇద్దరు పోట్లాడుకుంటున్నప్పుడు ఒక పెద్దమనిషి

కలుగజేసుకొని 'దొంగనాకొడుకుల్లారా! తిని ఎక్కువైందిరా మీకు. పనిపాట్లు లేవురామీకు. పోండ్రా పొండి' అనడం వంటివి. ఈ తిట్లను కూడా పలురకాల భేదాలతో సూచించ వచ్చు. డా.రావూరి దొరస్వామి శర్మగారు 'తెలుగులో తిట్టుకవిత్వం' అనే గ్రంథం ద్వారా శాపరూపమైన తిట్టు; అసహ్యం, అనభ్యమైన తిట్టు, అన్యాపదేశతిట్టు, వాదరూపతిట్టు, వ్యంగ్యరూప తిట్టు, ఆదిగా పలు విభజనలు చేసియున్నారు. ఇంకా ఆచార్య తూమాటి దొణప్ప గారి 'తెలుగులో కొత్త వెలుగులు', డా॥. జి.ఎస్. మోహన్ గారి 'జానపదుల తిట్లు', నేదునూరి గంగాధరం గారి 'పసిడి పలుకులు' మొదలైన గ్రంథాల ద్వారా చర్చించిన తిట్ల పురాణాల ద్వారా పలురకాలుగా తిట్లను విభజించవచ్చు. అవన్నీ జానపదుల వ్యవహారాల్లో నిత్యం ఏదోఒక విధంగా ప్రయోగింపబడేవే. అవి-

1. అంగవైకల్య సూచకాలు : గూనోడు, కుంటోడు, గుడ్డోడు
2. జాతి కుల సూచకాలు : కోమటోడు, కోమటినాయాళ్ళు, ఎర్రినాయాలు.
3. వృత్తి సూచకాలు : పాకీముండ, దొంగ సన్నాసి,
4. జంతువాచకాలు : అడ్డగాడిద, దున్నపోతు నాయాలు, గాడిదనా కొడుకు,
5. లైంగిక సంబంధాలు : నాయాల్ది, నీతల్లి
6. రోగసూచకాలు : నీకు పెద్దరోగం రాను, నీ నోరుపడిపోను
7. శాసనార్థాలు : నీకొంపకూల, నీకు పిండంపెట్ట, నీయిల్లు తగలడ, నీ నోట్లోమట్టిపడ..
8. శీలసంబంధాలు : బోగంలంజ, రంకుముండ
9. స్త్రీ ఐదవతనం పోవాలనుకోవడం : నీ తాడుతెగ, నీ దుంపతెగ, నీ ముండమొయ్య....
10. మానవస్వభావసూచకాలు : జిడ్డునాయాల, బండనాకొడక...
11. అమ్మవారికి ఆగ్రహం కలగాలని తిట్టడం : నిన్నమ్మోరెత్తుకెళ్ళ, నిన్ను గంగానమ్మ ఎత్తుకెల్ల.

ఈ విధంగా సామెతలవలె, పొడుపుకథలవలె, తిట్లు కూడా జానపదుల నిత్యజీవితంలో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు జానపద గేయసాహిత్యం: ఆచార్య బిరుదురాజు రామరాజు
2. జానపద విజ్ఞానాధ్యయనం : ఆచార్య జి.ఎస్.మోహన్
3. జానపద విజ్ఞానం : ఆచార్య ఆర్వీ ఎస్.సుందరం.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సాహితీ దురంధరుడు 'ఆచార్య పేర్వారం జగన్నాథం'

– డా॥ పంతంగి వెంకటేశ్వర్లు, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాయం, వరంగల్.

తెలుగు సాహితీ ప్రపంచంలో లబ్ధప్రతిష్టులైన కవి పేర్వారం జగన్నాథం గారు. కవిగానే కాకుండా ఆచార్యుడిగా, పరిపాలకుడిగా ఎంతో గుర్తింపు పొందిన వ్యక్తి వీరు. వరంగల్ జిల్లా సాహిత్య సాంస్కృతిక రంగాలలో వీరికి విడదీయరాని అనుబంధం ఉంది. వరంగల్ నగరంలో ఏ కవి సమ్మేళనం జరిగినా, ఏ పండితగోష్ఠి జరిగినా, ఏ కొత్త కావ్యం వెలువడినా పేర్వారం గారి ప్రత్యక్ష, పరోక్ష ప్రమేయం లేకుండా జరిగేది కాదంటే అతిశయోక్తికాదు.

ఆధునిక సాహిత్యంలో వ్యంగ్య కవితకు సముచిత స్థానాన్ని కల్పించిన వ్యక్తి పేర్వారం జగన్నాథం గారు. వచన కవితా రచనలో ఆయనదొక ప్రత్యేక ముద్ర, కొత్తగొంతు. అనాగరికతను ప్రత్యక్షంగా తిట్టకుండా వ్యంగ్యాన్ని జోడించి మనసుకు హత్తుకునే విధంగా సమాజంలోని అన్యాయాలను, అక్రమాలను, లోపాలను ఎత్తిచూపుతూ ఉన్నతమైన నైతిక విలువలను, కళాభిజ్ఞతలను సమాజంలో స్థాపించడమే ధ్యేయంగా సాగిపోయిన వ్యక్తి ఆయన. జగన్నాథం గారి కవిత్వంలో వ్యంగ్యం, హాస్యం, అధిక్షేపం సమపాళ్ళలో ఉండి పాఠకుల మనస్సును రంజింపజేస్తూ ఉంటుంది.

ఆచార్య పేర్వారం జగన్నాథం గారు పుట్టింది సర్దార్ సర్వాయి పాపన్న వంటి యోధులను, రంగరాజు కేశవ రావు వంటి పండిత కవులు పుట్టిన ఖిలాషాపురం గ్రామంలో. ఇది ఇప్పుడు జిల్లాగా మారిన జనగామకు పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉంది. వీరి పూర్వికులు మహారాష్ట్ర నుండి తెలంగాణకు వచ్చి స్థిరపడిన ఆరె కులస్థులు. వీరు మాట్లాడే భాషకూడా వేరుగా ఉంటుంది. తమ మాతృ భాషను కుటుంబం వరకే పరిమితం చేసి ఏనాడో తెలుగువారితో కలిసిపోయారు ఈ కులస్థులు.

జగన్నాథంగారి మొదటి గురువు వారి తండ్రి సంతాజీ గారే. సంతాజీగారు ఖిలాషాపురంలో పెద్ద రైతు. పరమ సాత్వికులు, భాగవతోత్తములు. విష్ణుభక్తులైన సంతాజీ గారు ఆగర్భశ్రీమంతులు కాకపోయినా దానధర్మాలకు పెట్టింది పేరు. మత, సాంఘిక, రాజకీయ రంగాల్లో బాధ్యతగల గ్రామవాసిగా, జీవితాన్ని అనుభవించిన వ్యక్తి ఆయన. భారత, భాగవత, రామాయణాది పురాణేతి హాసాలతో పాటు ఆధ్యాత్మిక గ్రంథాల పఠనంతో అంత రంగాన్ని గుబాళించుకున్న వ్యక్తి సంతాజీగారు. చుట్టూ పక్కల గ్రామాల్లో సంతాజీగారి మాట వేదవాక్కు. సంతాజీ గారికి తన కొడుకు జగన్నాథం అంటే పంచప్రాణాలు. జగన్నాథం గారి పసితనంలోనే తల్లి సయ్యమ్మ చని పోయింది. నాయనమ్మ బుచ్చమ్మ, పినతల్లి వీరమ్మ తల్లిలేని లోటును తీర్చి అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేశారు. రామాయణ, భారత, భాగవతాది గాథలను చిన్నప్పటి నుండే జగన్నాథంగారు తండ్రి నుండి నేర్చు కున్నారు.

జగన్నాథంగారి ప్రాథమిక విద్య ఖిలాషాపురంలోనే చొల్లేటి నరసింహశర్మ గారి దగ్గెర జరిగింది. మాధ్యమిక విద్య 'ఆంధ్రభాషాభివర్ధిని' జనగామలో, ఉన్నత విద్య మరియు ఇంటర్‌మీడియట్ వరంగల్లులో పూర్తి చేశారు. బి.ఏ., ఎం.ఏను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదివారు. విద్యార్థి దశలోనే కవిత్వం రాయడంతోపాటు సాహిత్య కార్యక్రమాలలో ముమ్మరంగా పాల్గొనేవారు.

జగన్నాథంగారు విద్యార్థిగా ఉన్న కాలంలోనే నిజాం నిరంకుశత్వానికి దమనకాండకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటం సాగింది. ఆ పోరాటంతో ఖిలాషాపురం గ్రామం తనవంతు పాత్రను పోషించింది. విప్లవోద్యమ నిర్మాణానికి, పటిష్టతకు విప్లవకారులు అప్పుడప్పుడు ఖిలాషాపురంలో సభలు, సమావేశాలు నిర్వహించేవారు.

ఆ సందర్భంగా వాళ్ళు పాడే పాటలు, ముఖ్యంగా ఉద్యమగేయాలు, కమ్యూనిష్టు కార్యకర్తల ఉపన్యాసాలు,

బుర్ర కథల వంటివి జగన్నాథం గారిని ఎంతగానో ప్రేరేపించాయి. ఉద్యమ పాటలకు ఆకర్షితుడై వాటిని నేర్చుకొని పాడుతుండేవారు. చిన్ననాటి తండ్రిగారి పురాణబోధ ఖిలాషాపురంలోని సాహిత్య కార్యక్రమాలు, సాయుధ రైతాంగ పోరాటం ఇవన్నీ కవిగా జగన్నాథం గారు రూపుదిద్దు కోవడానికి కారణమయ్యాయి.

1953-55 మధ్య కాలంలో వరంగల్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లోనే జగన్నాథం గారు కవిత్వం రాయడం మొదలు పెట్టారు. ఆనాటి పత్రికల్లో 'ఆశాదీపం", 'ఓరుగల్లు', 'వర్ష బిందువు' మొదలైన కవితలు అచ్చయ్యాయి. విద్యార్థి దశలోనే 'తొలికారు' అనే కవితా సంకలనాన్ని వెలువరించి యువకవులను సాహిత్యలోకానికి పరిచయం చేశారు.

జగన్నాథం గారి మొదటి కవితా సంపుటి, 'సాగర సంగీతం'. ఇది 1960లో వెలువడిన అధిక్షేపాత్మక రచన. అనంతరం 1967, 1970ల్లో ' చేతనావర్తం' పేరుతో రెండు కవితా సంకలనాలు వెలువడ్డాయి. ఇవి చేతనావర్త కవులుగా పేరుపొందిన కోవెల సుప్రసన్నాచార్య, కోవెల సంపత్కుమారాచార్య, వేణుముద్దల నర్సింహారెడ్డి, పేర్వారం జగన్నాథంగార్లు కలిసి రచించిన కవితా సంకలనాలు. 1982లో "సాహిత్యావలోకనం', 1992లో 'సాహితీ వసంతం' పేరుతో వీరి సాహిత్య వ్యాసాలు ప్రచురించబడ్డాయి. 1984లో 'వృషభపురాణం' అనే పేరుతో వ్యంగ్య కవితా సంపుటిని వెలువరించారు. 1995లో 'గరుడ పురాణం' అనే మరో వచనా కవితా సంపుటిని వెలువరించారు. 1986లో 'ఆరె జానపద గాథలు', 1987లో 'ఆరె జానపదగేయాలు' రచించారు.

జగన్నాథం గారి, సాహిత్య సృజన ఒక ఎత్తైతే, అనేక ప్రాచీన గ్రంథాలను పరిష్కరించి, ప్రచురింపజేయడం మరొక ఎత్తు. ఇలా వెలుగులోకి తీసుకువచ్చిన గ్రంథాలు ఎన్నో.రంగరాజు కేశవరాజు "ఇంద్రద్యుమ్నీయం' అనే ప్రౌఢ ప్రబంధాన్ని పరిష్కరించి 1968లో ప్రచురింపజేశారు. అలాగే రంగరాజుగారి 'అధ్యాత్మ రామాయణం' కూడా పరిష్కరించి, ప్రచురించారు. ఒద్దిరాజు సోదరుల సౌధామిని పరిణయాన్ని పరిష్కరించి వెలుగులోకి తెచ్చారు. విద్యారణ్యునిపై జరిగిన సెమినార్ వ్యాసాలను 'విద్యారణ్య భారతి' పేరుతో ముద్రించారు. 1987లో 'అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు' అనే పేరుతో ఆధునిక కవిత్వంపై వ్యాస సంకలనాలు ప్రచురించారు. ఈ గ్రంథం జగన్నాథం గారికి మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. 'ఆరె జానపద సాహిత్యంపై తెలుగు ప్రభావం' అనే అంశంపై 1989లో పరిశోధన చేసి పిహెచ్.డి పట్టా పొందారు.

సాహిత్యాన్ని విధ్వంసం చేయడాన్ని, నినాదాలు కవిత్వంగా చెలామణి కావడాన్ని ప్రతిఘటిస్తూ, జాతీయత, వ్యక్తి సంస్కరణ, సామ్యవాదం మూలధాతువులుగా గ్రహించి చేతనావర్త కవిత్వాన్ని వెలువరించారు. సాహిత్య రంగంలో ప్రతిఘటించే తరాన్ని తయారు చేసి, నిర్మాణాత్మక దృష్టిని బలపరిచారు. స్వాతంత్ర్యానంతర భారతీయ సమాజం పొరుల కలలను ఎలా విచ్ఛిన్నం చేసిందో వృషభ పురాణంలో శక్తివంతంగా వ్యక్తీకరించారు. సమకాలీన సమాజానికి చెందిన బలమైన వస్తువును ఎన్నుకొని, తమ ప్రత్యేక శైలిలో దాన్ని వెలువరించారు.

సాహితీ సంస్థలతో జగన్నాథంగారికి ఎనలేని అనుబంధం ఉంది. తెలంగాణలోని సాహిత్య సంస్థలకు అండదండగా ఉన్న ఎందరో మహానుభావుల్లో వీరొకరు. మడికొండ మణిపూసలైన కాళోజీ సోదరులు, పల్లా దుర్గయ్య, బిరుదురాజు రామరాజు, అనుముల కృష్ణమూర్తి మొదలైన వారు పేర్వారం గారిని సాహితీ క్షేత్రంలో మహోన్నత యువశక్తిగా తీర్చిదిద్దినారు. వరంగల్లులో కాళోజీ ఇల్లు తరువాత కవితాగోష్టులకు, సాహితీ చర్చలకు పేర్వారం గారి ఇల్లే పెట్టింది పేరు. 1955లోనే హన్మకొండలో 'సాహితీ బంధు బృందం" అనే పేరుతో సాహిత్య సంస్థను స్థాపించి అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. యువతకు మార్గదర్శకులై, పలు సాహిత్య సంస్థలకు మూలస్థంభాలైనారు. 'చైతన్యసాహితి', 'సాహితీ సమితి' మొదలైన సంస్థలకు ఊపిరిపోసింది జగన్నాథం గారే.

వీరిలో కార్యదీక్ష ఎక్కువ. తను అనుకున్న ఏ పనినైనా

పట్టుదలతో సాధిస్తారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా నిరాశ చెందకుండా ముందడుగు వేస్తారు. పల్లెటూళ్ళలో సాహిత్య కార్యక్రమాలు నిర్వహించడం జగన్నాథం గారికి ఆనందాన్ని ఇచ్చేది. ప్రముఖ కవులను, పండితులను గ్రామలకు పిలిపించి, వారి చేత ఉపన్యాసాలు ఇప్పించి, ప్రజల్లో ఉత్సాహాన్ని, చైతన్యాన్ని, సాహిత్యాభిరుచిని పెంపొందించే వారు. వీరికి వరంగల్ సాహిత్య సంస్థలతోనే కాకుండా రాష్ట్రస్థాయి సంస్థలైన ఆంధ్ర సారస్వత పరిషత్తు, సాహిత్య అకాడమి వంటి సంస్థలతో సన్నిహిత సంబంధం ఉండేది. ఆంధ్ర సారస్వత పరిషత్తుతో జగన్నాథం గారికి 15 ఏళ్ళ గాఢమైన అనుబంధం ఉంది. పరిషత్తు కార్యవర్గ సభ్యునిగా పనిచేస్తూ దేవులపల్లి రామానుజరావు గారికి అండగా ఉన్నారు. ఆ తరువాత పరిషత్తు ఉపాధ్యక్షులుగా పనిచేసి సాహిత్యసేవలు అందించి సాహిత్య అకాడమిలో కూడా కార్యవర్గ సభ్యునిగా పనిచేసి దేశంలోని కవి పండితులకు ఎందరికో సన్నిహితులయ్యారు. తరువాత సంయుక్త కార్యదర్శిగా ఎన్నుకోబడి తనవంతు బాధ్యతలు సక్రమంగా నిర్వహించారు. బెజవాడ గోపాల్‌రెడ్డి వంటి గొప్ప వ్యక్తుల మన్ననలు అందుకున్నారు. 1990లో మానవ వికాస రచయితల సంఘాన్ని స్థాపించి రాష్ట్ర స్థాయి సభలు నిర్వహించారు. ఇక వరంగల్ విషయానికి వస్తే వీరి భాగస్వామ్యంలేని, వీరు పాల్గొనని సాహిత్య కార్య క్రమాలు ఉండవంటే అతిశయొక్తి కాదు.

అచార్య పేర్వారం జగన్నాథం గారు మంచి పరిపాలనా దక్షులు.1961లో వరంగల్‌లోని ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా చేరి అచార్య స్థాయి వరకు పదోన్నతి పొంది ఉత్తమ అధ్యాపకులుగా ప్రశంసలు అందుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాయలయం తెలుగు శాఖాధ్యక్షులుగా. పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షుడిగా, కాకతీయ అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా, అధ్యాపక సంఘం అధ్యక్షుడిగా, సి.కె.యం కళాశాల ప్రిన్సిపాల్‌గా, ఇంటర్మీడియట్ తెలుగు పాఠ్య గ్రంథాల సంపాదకుడిగా పనిచేసిన అనుభవంతో మంచి పరిపాలనా దక్షులుగా ఎదిగారు. మూడు సంవత్సరాలపాటు తెలుగు విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా ఉండి, తన శక్తి యుక్తులన్నీ ధారపోసి విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు.

1992లో జగన్నాథం గారు వి.సి పదవిని అధిష్టించే నాటికి యూనివర్సిటీ అన్ని రంగాల్లోనూ తగినంత అభివృద్ధి సాధించే ఉన్నది. అలా అని వీరు ఊరుకోలేదు. కొత్తగా ఏదైనా చేసి ప్రత్యేకత పొందాలన్న తాపత్రయం వీరిలో ఎక్కువ. అందువల్ల కొంతమంది విద్యావేత్తలను, ఆయా రంగాల్లో నైపుణ్యంగలవారిని అహ్వానించి, ఒక ఉన్నతస్థాయి సంఘాన్ని నియమించి, దాని నివేదిక ఆధారంగా పునర్వ్యవస్థీకరణ ప్రారంభించారు. ఫలితంగా వరంగల్లులో జానపద, గిరిజన విజ్ఞాన పీఠం ఏర్పడింది. జర్నలిజంతో పాటు లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్ శాఖను ఏర్పాటు చేశారు. భాషాభివృద్ధి పీఠాన్ని పునర్విభజించడంతో భాషాశాస్త్ర శాఖ, అనువాదశాఖ ఏర్పడింది. కూచిపూడిలోని సిద్దేంద్ర కళాక్షేత్రానికి 'ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల స్థాయిని కల్పించారు. అంబేద్కర్ రచనలను తెలుగులోకి అనువదింపజేశారు. ప్రాకృతంలో డిప్లొమా కోర్సును ఏర్పాటు చేయించారు. 'వ్యాఖ్యాలహరి' పేరుతో ప్రాచీన కావ్యాలకు వ్యాఖ్యానాలు రాయించి ప్రచురించారు.

ఆధునిక కాలంలో వ్యంగ్య కవితకు సముచిత స్థానం కల్పించిన ప్రముఖులు పేర్వారం జగన్నాథం గారు. వచన కవితా రచనతో తనదైన కొత్తగొంతుతో, వినూత్నమైన బాణీలతో విశిష్టస్థానాన్ని పొందారు. వీరి కవిత్వంలో హాస్యం, వ్యంగ్యం, అధిక్షేపం ముప్పిరిగొన్నట్లు ఉంటాయి. వృషభ పురాణంలోని ప్రతి కవితలో వీరి ప్రత్యేక శైలి గోచరిస్తుంది. వీరు స్వతహాగా మానవత్వం మూర్తీభవించిన వ్యక్తి. జాతీయ భావ సంపన్నులు సాత్వికులు కనుకనే వీరి కవిత్వంతో ఆర్ద్రహృదయం తొంగి చూస్తుంటుంది. ప్రాపంచిక అనుభవాలను ఎంతో సహేతుకంగా, సమగ్రంగా ఆవిష్కరించగల కవి. స్నేహశీలత, వినమ్రత, మిత్రులపట్ల ఆత్మీయత, ఆదరాభిమానాలు చూపడం వంటి అరుదైన సద్గుణాలు వీరి సొంతం. మృధుభాషి

అయిన్పటికీ వీరి సంభాషణల్లో చతురోక్తులతో కూడిన హాస్యం తొణికిసలాడుతుంటుంది. కవిగా, రచయితగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా, పరిపాలన దక్షతగల వ్యక్తిగా పేరుపొందినప్పటికీ గురువులపట్ల వినయం, శిష్యుల పట్ల వాత్సల్యం తొణికసలాడే ఆదర్శమూర్తి వీరు. తెలుగు సాహితీ ఉద్యానవనంలో అవిశ్రాంతంగా శ్రమించిన సాహితీ దురంధరులు పేర్వారం జగన్నాథం గారు. పోలీయో కాలు వల్ల, చివరి దశలో పూర్తిగా నడవలేకపోయినా చనిపోయేవరకు వన్నె తగ్గని సాహిత్య ఉత్సాహాన్ని ప్రదర్శించిన గొప్ప సాహితీమూర్తి ఆయన.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జానపద సంస్కృతి - కళలు వాటి వైశిష్ట్యం

- డా॥. వి. శివనాగార్జున రెడ్డి , తెలుగు అధ్యాపకుడు, ట్రిపుల్ ఐటి, ఒంగోలు.

జానపద సంస్కృతి నిర్వచనం :

జనపదమంటే పల్లెటూరు లేదా చిన్నగ్రామం జన పదాల్లో వుండేవాళ్ళు జానపదులు వాళ్లకు సంబంధించి నది ఏదైనా జానపదం అవుతుంది. అక్షర జ్ఞానంలేని పల్లె ప్రజలు పాడుకునే పాటల్ని లేదా గేయాల్నే జానపద గేయాలు అంటారు. అమరకోశంలోను, వ్యాసమహా భారతంలోను జానపదులు అంటే గ్రామీణులు అనే అర్థంలోనే వాడబడింది. అమరంలో వింధ్య హిమా లయాల మధ్య ఉన్న భూమి ఆర్యావర్తమని, ఆ పుణ్య భూమి జనపదాలతో నిండిందని చెప్పబడింది. జనపదవాసులే జానపదులు. ఎర్రన అరణ్య పర్వంలో

''జానపదుల్ పురీజనులు నంతనముంబ్రదం
బెలర్పనీ
దైవశుభోదయంబు హృదయంబుల
గోరుచున్నవారు.....

అని జానపదులు గ్రామీణులు అనే అర్థంలో వాడాడు.

జానపద విజ్ఞాన (ఫోక్ లోర్), జానపద సంస్కృతి (ఫోక్ కల్చర్), జానపద జీవనం (ఫోక్ లైఫ్) ఈ మూడు పదాలు వేరు కావు. జానపద విజ్ఞానం అనే మాటని ఇంగ్లీషులోని ''ఫోక్‌లోర్''కు సమానార్థకంగా తెలుగులో వాడుతున్నాం. 'ఫోక్‌లోర్' అనే పదాన్ని మొట్టమొదట ''డబ్ల్యు.జె. థాంస్'' 1846లో రూపొందించాడు. ''ది అథనీయం'' అనే పత్రికకు రాసిన ఉత్తరంలో ఫోక్‌లోర్ పదాన్ని వాడమని సూచించాడు. జానపదులకు సంబంధించిన ఆచారాలు, నమ్మకాలు, కథాగేయాలు, సామెతలు మొదలైన విజ్ఞానమే ''ఫోక్‌లోర్'' అని థాంస్ చెప్పాడు.

ప్రసిద్ధ జానపద విద్యాంసుడైన ''అలన్‌డండస్'' జానపదులు కేవలం గ్రామవాసులే కాననసరంలేదు. నగరాల్లో కూడా అలాంటి మనస్తత్వం ఉన్నవాళ్ళు ఉం డవచుని ''ఫోక్''ను నిర్వచిస్తూ ''సమానధర్మాలు కల్గిన ఏ జనసమూహాన్నయినా జానపదులని పిలవచ్చు అన్నాడు. సమాన ధర్మం అంటే ఒకే జాతికి మతానికి వృత్తికి సంబంధించిన వాళ్ళు అన్నాడు.

జానపదకళలు :

జానపద విజ్ఞానంలో జానపద సాహిత్యం, సాంఘిక జానపదాలు, వస్తు సంస్కృతి, జానపదుల భాష వంటివి ప్రధాన శాఖలుగా చెప్పుకోవచ్చు. అయితే జానపద విజ్ఞానంలో జానపద ప్రదర్శన కళలకు ఎంతో ప్రాధాన్యం, ప్రాశస్త్యం ఉన్నాయి. మానవ సంస్కృతిని ప్రతిబింబించేవి జానపద కళలు. ఈ కళల్లో ఎంతో సాహిత్యం కూడా చోటు చేసుకొని ఉంది. ప్రజల జీవన విధానం ఆచార వ్యవహారాలు. సంప్రదాయాలు వంటివి జానపద కళల్లో ఉంటాయి. ఒకనాటి ఆటవిక కళలే జానపద కళలుగా రూపాంతరం చెంది నేటి ఆధునిక కళలకు మూలమై నాయి.

జానపద కళల్ని స్థూలంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి 1) ప్రాయోజిత కళలు 2) ప్రదర్శన కళలు.

ప్రాయోజిత కళలు :

ఒక ఉపయోగం లేదా అవసరం లేదా ప్రయోజనం కోసం ఉద్దేశింపబడిన కళల్ని ప్రాయోజిత కళలని చెప్పవచ్చు. కుండలు చేయడం, దుస్తులు, చాపలు, బుట్టల అల్లికలు, చర్మక్రియలు, కొయ్యపని అంటే నాగలి, వడ్రంగి, కుమ్మరి వంటివి ప్రాయోజిక కళలుగా చెప్పవచ్చు.

ప్రదర్శన కళలు :

వీటిని డా॥ బి. రామరాజు నాలుగు రకాలుగా చెప్పాడు. 1) సంగీత ప్రధానమైనవి, 2) నృత్య ప్రధానమైనవి, 3) రూపక ప్రధానమైనవి, 4) వివిధాలు.

సంగీత ప్రధానమైనవి :

వీటిలో వాద్య, గాత్ర, మిశ్రమ సంగీతాలను పేర్కొనవచ్చు. ఒగ్గు కథ, జముకుల కథ, కడ్డివాద్యం, అలాగే జానపద వృత్తిగాయకులు పాడే పాటలు కూడా సంగీత ప్రధానమైనవి.

నృత్యప్రధానమైనవి :

బతుకమ్మ, గొబ్బి, జట్టిజాము, గుర్రపు నాట్యం, కోలాటం, ఉరుములు, వారనాట్యం, డప్పు నాట్యం వంటివి. వీటిలో సంగీతం, సాహిత్యం, వేషం అలంకారాలన్నీ కూడా ఉంటాయి.

రూపకమైనవి :

పగటివేషాలు, బొమ్మలాటలు, వీధి బాగోతాలు, యక్షగానాలు, కొరవంజి, చెంచునాటకం, చిందు భాగవతం, గొల్ల భాగవతం, యానాది భాగవతం మొదలైనవి. ఇవి సమాహార కళలు అంటే వీటిలో సంగీతం, నృత్యం, అభినయం, చిత్రలేఖనం వంటి కళలన్నీ కలిసి ఉంటాయి.

వివిధాలు :

గంగిరెద్దులు, బుడబుక్కల, కాటిపాపలు, మోడి, దొమ్మరి, గారడి, సాధన శూరులు, సాము, విప్రవినోదాలు వంటివి.

ఈవిధంగా జానపద కళల్ని ప్రదర్శించే వారిని జానపద కళాకారులు అంటారు. ఇందులో కొంతమందిని గురించి వివరిస్తే.

జానపద భిక్షుక గాయలు :

తెలుగు జానపద సంగీతానికి ఎన్నోవందల ఏళ్ళు ప్రాణభిక్ష పెట్టిన వాళ్ళు భిక్షుక గాయకులు. వీరినే జానపద వృత్తిగాయకులు అంటారు. జానపద భిక్షు గాయకులలో చాలావరకు దేశదిమ్మరులే ఉన్నారు. జానపద గేయాలు భిక్షుక గాయకులకు తిండి పెట్టినా, వారే గనక లేకుంటే చారిత్రక గేయాలు, పెద్దపెద్ద కథాగేయాలు కాలగర్భంలో ఏనాడో కలిసిపోయి ఉండేవి.

జానపద గాయక భిక్షులలో ఎన్నో కులాల వారున్నారు. పిచ్చుకకుంట్లు, శారదకాండ్రు, వీరముష్టులు, జంగాలు, దాసర్లు, భాగవతులు, బీరన్నలవారు, పూసలబలిజలు, గొల్లసుద్దులు, బాలసంతువారు, గంగిరెద్దుల్లవారు, చిందు మాదిగలు, బుడబుక్కలవారు, బవనీలు, జోగులవారు, జక్కులవారు, హట్కరులు, కొమ్ములవారు, వీరవిద్యావంతులు, మాష్టీలు, డక్కలెవారు, బొమ్మలాటగాళ్ళు వీరంతా భిక్షాటన చేస్తూ ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వెళ్తుంటారు.

పిచ్చుకకుంట్లు :

వారినే పిచ్చుకగుంట్లు, పిచ్చకుంట్ల, భిక్షకుంట్ల అని కూడా అంటారు. భిక్షుక శబ్దం నుండే పిచ్చుక శబ్దం ఆవిర్భవించింది, పిచ్చుకుంట్లు ప్రధానంగా కాపులను అంటే రెడ్లను అడుక్కొని జీవిస్తారు. వీళ్ళు రెడ్లకు వంది మాగదుల్లా ఉంటారు. రెడ్ల కులగోత్రాలను, వంశావళుల్ని కీర్తిస్తారు. తెలంగాణా ప్రాంతాల్లో పిచ్చుక కుంట్లు గొల్లవారిని కూడా అడుక్కుంటారు. వీళ్ళు పర్వతాల మల్లారెడ్డి, బసవపురాణమనే రెడ్ల చరిత్ర, సదాశివారెడ్డి, చిన్నపురెడ్డి, సూర్యచంద్ర రాజులు, కావమ్మ, బాల నాగమ్మ, రాములమ్మ వంటి కథాగేయాలను పాడుతారు. శ్రీశైలంలోని మల్లికార్జునుడు వారి ఆరాధ్యదైవం. వీరికి జంగాలు గురువులుగా ఉంటారు.

శారదకాండ్రు :

శారదకాండ్రు జాతిమున్నూరు, ముతరాసి వంటి తెగల కులాల నుండి పుట్టినవారు. శారదకాండ్రు తెలంగాణాలోనే ఆవిర్భవించారు. ఈ రచనలో అంత్య ప్రాస నియమం ఉంటుంది. ఈ పదాలోల సాహిత్యం కొంచెం ఎక్కువగా ఉంటుంది. ''ఓ భారతి కరుణా మతి, భళి శారద కరుణానిధి అనే మాటలను ఊత పదాలుగా వాడడంవల్ల వీళ్ళకు ఈ పేరు వచ్చిందంటారు. పురుషుడు ఎడమచేతి బొటనవేలికి అందెలు ధరించి భుజంపై ఉంచుకున్న కిన్నెరను కుడిచేత్తో మీటుతుంటాడు. దీనినే శారద అంటారు. శారద అంటే సరస్వతి. శారదాదేవి స్తోత్రం పాడిపాటను ప్రారంభిస్తారు. కాబట్టి వీళ్ళను శారదకాండ్రు అంటారు. పురుషుడు పాటను పాడుతుంటే పక్కనుండే ఇతని భార్య వంత పాట పాడ్తూ బుర్రను

కొడ్తుంటుంది. తెలంగాణాలో ప్రచారంలో ఉంటే సదా శివారెడ్డి, సర్వాయిపాపని కథ, బాలనాగమ్మ, బొబ్బిలి, పల్నాటి పదాలు కూడా పాడ్తారు. ఒక్కొక్క కథను వాళ్ళు మూడు నాలుగు రోజులు పాడ్తారు.

వీరముష్టివారు :

వీరినే వీరముష్టి, వీరభట, భద్రపాద వంటి పేర్లతో పిలుస్తారు. ముష్టి అంటే పిడికిలి, వీరులైనయోధులని వీర(శైవ) భిక్షుకులని అర్థాలున్నాయి. వీరు కోమట్లు (వైశ్యులు), జంగాలను యాచించి జీవిస్తారు. వీరి వాద్యం ఒక జేగంట లేదా తప్పెట. దీనిని వాయిస్తూ వీరశైవానికి సంబంధించిన కథాగేయాలు, భక్తుల కథలలో పాడుతూ భిక్ష మెత్తుతారు. వీరు కన్యకాపరమేశ్వరి అమ్మపాటలు పాడుతారు. వీరికి గురువులు ఆరాధ్య బ్రామ్మణులు, వీరు దవడలను ఇనుపచువ్వలతో గుచ్చుకోవడం, నాలుకను తెగ్గోసుకోవడం వంటివి చేస్తారు. వీరు విభూది పండ్లను చేసి అమ్మడం, భిక్షమెత్తడం వంటి వృత్తులను కలిగి ఉన్నారు. వాళ్ళలో లింగధారులు తప్ప మిగిలిన వాళ్ళంతా మద్య మాంసాలను తీసుకొంటారు. వీరు మంగలి దగ్గర కెల్లరు అంటే గడ్డాలు, మీసాలు పెంచుకొని ఉండడం వీరి ఆచారం.

గొల్ల సుద్దులు :

గొల్ల సుద్దులు గొల్లవారికి చెందినవారు. వీరు ముఖ్యంగా గొల్లలను యాచించి జీవిస్తారు. కాటమరాజు కథ కృష్ణలీలలు వంటి కథాగేయాలను పాడుతుంటారు. అయ్యలరాజు నారాయణామాత్యుడు హంస వింసతిలో వీరు కొమ్ములు, వీణలను వాయిస్తూ కృష్ణలీలల్ని, కాటమ రాజు కథల్ని పాడ్తారని పేర్కొన్నాడు. గొల్లసుద్దుల కథలలో కథావివరాలను పెద్దపెద్ద బట్టలపై చిత్రించబడి ఉంటడం విశేషం. వీరు కొమ్ములు వీరణాలతో పాటు శంఖాన్ని కూడా ఊదుతారు. గొల్లలలో అత్యధికులు వైష్ణవులు, అయితే వీరిలో కొంతమంది శైవులు ఉన్నారు. గొల్లల ప్రధాన వృత్తి మేకలను పెంచడమైతే, గొల్లసుద్దులు భిక్షాటనతో పాటు మేకలను కూడా పెంచుతారు.

దాసర్లు :

దాసర్లు వైష్ణవ మతస్థులు. వైష్ణవంలో ఉండే దాసభావం వల్ల ఈ జాతివారికి దాసరులనే పేరు వచ్చి ఉండొచ్చు. వీరశైవం లాగే వీరవైష్ణవం కూడా అనేక వర్ణాల వారికి ఆశ్రయం కల్పించింది. వెనుకబడిన జాతుల్లో వైష్ణవం స్వీకరించిన భిక్షకులైన వారంతా దాసరులనే పిలుస్తారు. వీరిలో బుక్కదాసరి, పాగదాసరి, దండెదాసరి, భాగవత-బుట్టదాసరి, చిన్నదాసరి, మాలదాసరి వంటి తెగలున్నాయి. దండె దాసరులు తొలుత వైష్ణవపీఠాధి పతుల అందాలను మోసేవారట, వీరు ఒకప్పుడు నేల మీద దీపస్తంభాన్ని ఉంచి, ఒకరు శంఖం ఊదుతుంటే ఇంకొకరు చిరుతలు వాయిస్తూ, విష్ణు సంకీర్తన పాడ్తూ నాట్యం చేసేవారట. వీరి స్త్రీలు మాత్రం భిక్షం ఎత్తరు. దువ్వెనలు, పూసలు, అద్దాలను అమ్మేవారు. దాసరులు వాయించే వాద్యాలలో చిరుతలు, తంబూరా, కిన్నెర, తాళాలు, గజ్జెలు వంటివి ప్రముఖమైనవి. వీరిలో భిక్ష మెత్తడంతోపాటు చేపలు పట్టడం, పావురాల్ని పట్టడం, తాటాకు చాపల్ని అల్లడం, తాటిబుట్ట లల్లడం వంటివి చేస్తారు.

వీరవిద్యావంతులు :

వీరు గుంటూరు ప్రకాశం జిల్లాలో ఉంటారు. ప్రతి సంవత్సరం కారెంపూడిలో జరిగే వీరా రాధనలో వీరు ముఖ్యపాత్ర వహిస్తున్నారు. పల్నాటివీర గాథల్ని గానం చేస్తారు. వీరు వైష్ణవ మతానికి చెందిన మాలలు. పల్నాటి గాథల్ని పాడేటపుడు పంబజోడు, తిత్తి, డాలు వంటి వాటిని వాడ్తారు.

పంబలవాళ్ళు :

పంబలవాళ్ళు చిత్తూరు జిల్లాలోని గోదావరి ప్రాంతా ల్లోను, ఇంకా కొన్ని ప్రదేశాలలో ఉన్నారు. వీరు పంబ జోడును వాయిస్తూ శక్తి కథలను పాడ్తారు. చిత్తూరు జిల్లాలో గంగమ్మ జాతర సమయంలోను, కడివీధి గంగమ్మను కొలిచే సమయాల్లో వారు పంబల వాయిస్తూ గంగమ్మ కథను పాడ్తారు. పంబలవారు దళితుల్లో ఒక తెగ.

బీరన్నలవారు :

వీరినే ఒగ్గొళ్ళు లేదా ఒగ్గువారని అంటారు. వీరు కురమ జాతికి చెందినవారు. కురుమలకు బీరప్ప లేదా బీరన్న ఆరాధ్య దైవం. బీరన్న కొలువులు కొలవడం, బీరన్న కథలు చెప్పడం వీరికి బీరన్నల వారనే పేరు వచ్చిం దంటారు. వీరు కథలను చేప్పేటప్పుడు కానీ బిచ్చ మెత్తేటప్పుడు గానీ ఒగ్గు వాయిస్తారు. కాబట్టి వీరికి ఒగ్గువారనే పేరు వచ్చిందంటారు. బీర్నలవారికి ఒగ్గు ప్రత్యేక వాద్యం. శివునిచేతిలో ఉండే డమరుకాన్నే తెలుగులో ఒగ్గు అని అంటారు. వీరు ఒగ్గుతోపాటు గొల్లసుద్దులు ఉపయోగించే పెద్దడోళ్ళు, తప్పెటలను కూడా వాడ్తారు. గొల్లవారిలో తక్కువ జాతివారు కురుములు. వీరు కంబళ్ళను కూడా నేస్తారు. బీరన్నల వారు కురుమలకు పౌరోహిత్యాన్ని వహిస్తారు. వీరు కురుమలను యాచిస్తారు. వీరు కొమరెల్లి మల్లన్న కథను చెప్తారు.మల్లికార్జునుడైన మల్లన్న కురుములకు ఇలవేల్పు.

ఉపసంహారం :

ఈ విధంగా ఆంధ్రదేశంలో జోగులవారు, జక్కుల వారు, బాలసంతులవారు, సాతానులు, బుడబుక్కల వారు వంటి జాతులవారు జానపద భిక్షుగాయకులై తెలుగువారి యొక్క జానపద కళల్ని ఆదరించి, పోషించి వారి యొక్క జీవనాన్ని కొనసాగించేవారు. ఇలా అనేక రకాల జానపద కళాకారులు వారి కళల్ని పల్లెల్లో వారి శ్రమను మర్చిపోయెందుకు పంటల కోత సమయంలో, పండుగలు, జాతరులు, తిరునాళ్ళు, ఉత్సవాల సందర్భాల్లో వారు ఆడి పాడి ప్రజల్ని ఆనందింపజేసేవారు. ఈ జానపద కళలే పల్లెలకు అందంగా, అలంకరణగా చూడముచ్చటగా ఉండేవి. ఇవి రాను రాను పెరుగుతున్న టెక్నాలజి, ప్రపంచీకరణ నేపథ్యంలో, డబ్బు సంపాదనలో "ఎవరికి వారే యమునాతీరే" అలాగే వ్యక్తిగత జీవిత స్వార్థం కోసం పరుగెత్తే ఈ తరం వారు ఈ కళల్ని ఆదరించక, వారిని పోషించక మర్చిపోతుండడంతో జానపద కళాకారులు కూడా వారి వృత్తిని వదిలి వేరే జీవిత మార్గంను ఎంచుకుంటున్నారు. ఈ కళలు ఎప్పటిలాగే అలరించాలంటే "మనవంతు కళాకారుల్ని గౌరవిద్దాం. వారి కళల్ని ఆస్వాదిద్దాం". "భావితరాలవారికి జానపద కళలను అందిద్దాం."

ఆధార గ్రంథాలు :

1. తెలుగు జానపదగేయ సాహిత్యం - ఆచార్య బి. రామరాజు
2. తెలుగు జానపదగేయ గాథలు - నాయని కృష్ణకుమారి
3. ఆంధ్రుల జానపద విజ్ఞానం - డా॥ ఆర్వీయస్. సుందరం
4. జానపద విజ్ఞాన వ్యాసావళి - డా॥ జి.యస్. మోహన్
5. జానపద విజ్ఞానం, ఎం.ఎ. తెలుగు బుక్ - ఎస్.వి. యూనివర్శిటి

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆంధ్రప్రదేశ్ తోలుబొమ్మలు - వాటి విశిష్టత

- కోట మృత్యుంజయరెడ్డి, విభాగాధిపతి, లలితకళల విభాగం, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

క్రీ.శ. 2వ శతాబ్దం నుండే మనదేశంలో తోలుబొమ్మలాట ఉనికి ఉంది. భరతుడు, వాత్సాయనుడు, పాల్కురికి సోమనాథుడు వీటి ఉనికిని, వివిధ కాలాలలో తమ తమ గ్రంథాలలో వీటిని గురించి ప్రస్తావించారు. భారత దేశంలో ప్రధానంగా నాలుగు రకాల తోలు బొమ్మలు ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో తయారైన తోలుబొమ్మలు ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధమైనవి. ప్రజల వినోదం కోసం రామాయణ, మహాభారతంలలో ప్రధాన ఘట్టాలను ఇతివృత్తంగా తీసుకొని ప్రదర్శించేవారు. హాస్యపాత్ర ''కేతిగాడు'' పాత్ర బహు ప్రజాదరణ పొందింది. తొలినాళ్ళలో జంతు చర్మాలను వీటి తయారికి ఉపయోగించినా, మారిన సామాజిక పరిస్థితులలో వీటి తయారీ పలు మార్పు లు చేసుకొన్నాయి. స్వాతంత్ర్య పోరాట సమయంలో మన వీరులు కోసం గూఢచారులు గాను, తర్వాత సాంఘిక దురాచారాలను అరికట్టటలో, ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయటంలో విరివిగా ఉపయోగపడ్డాయి. సాంకేతిక విప్లవ సృష్టిలో వీటి ప్రాధాన్యత తగ్గిపోయినా, యానిమేషన్ చిత్రాలకు, మరమనిషి తయారికీ మాతృకలు తోలుబొమ్మలే అని చెప్పాలి.

ముఖ్యపదాలు :

దేశ దిమ్మర్లు, యక్షగానం, బొమ్మలాటపల్లి, కేతిగాడు, రంగనాథ రామాయణం, గూఢచారులు - సాంకేతిక విప్లవం, యానిమేషన్ చిత్రాలు.

సృష్టికర్త బ్రహ్మ తన జీవన సహచరి సరస్వతి వినోదం కోసమై రెండు తోలు బొమ్మలను సృష్టించెనట. వీటిని ఆడించేందుకు ఓ సూత్రధారిని (ఆటగాడిని) సృష్టించటం జరిగిందట. ఇలా భారత పురాణ, ఇతిహాసాలు ప్రకారం మన తోలుబొమ్మల ప్రస్తావన ఇక్కడి నుంచి మొదలైందని మనం భావించవచ్చు. తోలుబొమ్మల్ని ప్రపంచవ్యాప్తంగా అన్ని సమకాలీన నాగరికతలలో మనం చూడగలము. ఈజిప్టులో మతపరమైన నాటకాలలో వీటిని వాడేవారని తెలియును. కాంట్రాక్టర్ అనే చరిత్రకారుడు ప్రాచీన యుగంలో దుష్టశక్తులను వదిలించేందుకు, రోగి యొక్క మానసిక ఆందోళనలు, భయాలను తొలగించేందుకు వీటిని ఉపయోగించేవారని పేర్కొన్నారు. ఆ మల్కిన్ అనే మరో చరిత్రకారుడు తొలినాళ్ళలో ఈ బొమ్మలు ప్రజాదరణ పొందినా, తర్వాతి కాలంలో వీటికి ఆపాదించ బడిన తాంత్రిక ముద్రతో చర్చి అధికారుల ఆగ్రహానికి గురయి నిషేధించబడినవి తెలిపాడు.

మన కళాచరిత్రకారుడు ఎ.కె. కుమారస్వామి తన పరిశోధనలో క్రీ.పూ. నాలుగవ శతాబ్దపు సంస్కృతకవి పాణిని, క్రీ.పూ. 2వ శతాబ్దమునకు చెందిన యోగసూత్ర రచయిత పతంజలి, నాట్యశాస్త్ర రచయిత భరతుడు తమ తమ గ్రంథాలలో తోలుబొమ్మలను గురించి ప్రస్తావించెనని తెలిపెను. వాత్సాయనుడు తన కామసూత్రలో వీటి గురించి ప్రస్తావిస్తూ ఇలాంటి తోలుబొమ్మల ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ద్వారా కన్యలను ఆకర్షించ వచ్చని, దారాల సహాయంతో కదిలెడి ఈ బొమ్మలను ''మరమనుషులు''గా వర్ణించెను. కాళిదాసు తన అభిజ్ఞాన శాకుంతలంలోని, రాజశేఖరుడు తన బాల రామాయణం లోని ఈ బొమ్మల గురించి ప్రస్తావించెను. ఈ బొమ్మలాట పండితుల చేత రూపుదిద్దుకొనబడినవి అని ఆనాడే అమరకోశంలో శ్లోకాలను నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఈ తోలుబొమ్మలను నాలుగు రకములుగా చెప్పవచ్చు.

1) ముంజేతి తోలు బొమ్మలు, 2) దండపు తోలు బొమ్మలు, 3) దారాల సహాయంతో కదిలే బొమ్మలు, 4) మరుగు లేదా ఛాయా తోలుబొమ్మలు.

13వ శతాబ్దములో పాల్కురికి సోమనాథుడు తన ''పండితారాధ్య చరిత''లో తెలుగునాట రెండు రకముల

తోలుబొమ్మల సాంప్రదాయాలు వాడుకలో ఉన్నట్లు పేర్కొన్నాడు. అవి దండపు తోలుబొమ్మ, మరుగు తోలు బొమ్మ. తరువాత కాలంలో ఈ బొమ్మలాటలో మరింత వైవిధ్యం కోసం రెండు సాంప్రదాయాలను మిళితం చేసి సరిక్రొత్త సాంప్రదాయం పరిచయం చేయబడింది. అందువలన ఆంధ్రప్రదేశ్ తోలుబొమ్మలు మిగతా రాష్ట్రాల బొమ్మలు కంటే బహుళ ప్రజాదరణ పొంది దేశ, విదేశాలలో కీర్తి ప్రశంసలు సంపాదించాయి.

వీటి పుట్టు పూర్వోత్తరాలను పరిశీలిస్తే వందల సంత్సరాల క్రితం మహారాష్ట్రలో జీవనోపాధి కోల్పోయి అక్కడ తోలుబొమ్మ కళాకారులు ప్రాచుర్యం కోల్పోయి మన సరిహద్దు ప్రాంతాల్లో నివాసం ఏర్పరచుకొని తర్వాత అక్కడే స్థిరపడిపోయారు. బొందిలి క్షత్రియులుగా పిలువబడే వీరు తర్వాత కాలంలో తెలుగు సంస్కృతిలో మమేకం అయినారు. వీరు స్థిరపడిన గ్రామానికి బొమ్మలాటపల్లి అనే పేరు కూడా వచ్చింది. తర్వాత దశాబ్దాలలో దేశీయ పరిజ్ఞానం ఉపయోగించి మేలైన తోలుబొమ్మలు తయారు చేసి ప్రదర్శనలు ఇచ్చేవారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ కళ మూడు ముఖ్య ప్రాంతాలలో కూడా వృద్ధి చెందింది. కడప జిల్లా కమలాపురం, పోరుమామిళ్ళ, అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకా "నిమ్మలకుంట", వరంగల్ జిల్లా గూడూరు, పానగల్లు, నెల్లూరు జిల్లా ధర్మారావు చెరువుపల్లి, గుంటూరు జిల్లా నరసరావుపేట, విశాఖపట్నం జిల్లా శృంగవరపుకోట, తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో మాధవపట్నంలో ఈ కళకు ముఖ్య కేంద్రాలుగా విరాజిల్లాయి.

తోలుబొమ్మలాటకు ప్రధాన ఇతివృత్తాలు మన రామాయణ, మహాభారతల్లోని ప్రధాన ఘట్టాలను తమ బొమ్మలాటకు ఇతివృత్తంగా తీసుకొనేవారు. ముఖ్యంగా లంకా దహణం, రావణ సంహారము, ఉత్తర గోగ్రహణం లను ఆసక్తికరంగా మలిచెడివారు. అందువల్ల కేతిగాడు లాంటి హాస్య పాత్రలు మినహాయించి అన్ని పురాణ పాత్రలే.

తోలుబొమ్మల తయారీ విధానము :

మొదటి దశ : ఈ బొమ్మల తయారీ చాలా శ్రమతో కూడుకున్న పని. సుమారు 30 రోజుల నుండి 40 రోజుల వరకు వ్యవధి పడుతుంది. జింక, లేడి, కొండమేక లాంటి జంతువుల తోళ్ళను తోలుబొమ్మల తయారికి వాడుతారు. పచ్చితోళ్ళను వేడినీటిలో కాసేపు ఉంచితీసి తోలుపై వెంట్రుకలు తొలగిస్తారు. ఆ చదునైన ఉపరితలంపై పరచి తోలుపై ఉన్న వృథా పదార్థాలను తీసివేస్తారు. తరువాత దానిని సున్నపునీటిలో 15 రోజులపాటు నానబెడతారు. పలుచని చర్మపు పొరను వేరుచేసి రెండు మూడు సార్లు గోరు వెచ్చని నీటిలో శుభ్రం చేస్తారు. ఎలాంటి మరకలు లేకుండా చేసిన చర్మాన్ని చతురస్రాకారపు చెక్కబల్లకు మేకుల సహాయంతో బిగుతుగా బిగించి ఆరబెడతారు. ఈ పద్ధతిలో తయారైన తోలు పలుచని పారదర్శకమైన పొరగా కాంతిని తనగుండా ప్రసరింపచేసే గుణం ఉంటుంది.

ఈ విధంగా తయారైన తోలుపై కావాల్సి పాత్ర ఆకృతిని రేఖా చిత్రంగా గీస్తారు. తరువాత ఆ బొమ్మను తల, మొండెం, కాళ్ళు, చేతులను విడివిడి భాగాలుగా కత్తిరిస్తారు. బొమ్మ మరింత సునాయాసంగా కదలటం కోసం మళ్ళీ ఆ కాళ్ళు చేతులను మూడేసి భాగాలుగా కత్తిరిస్తారు.

దేవతా మూర్తుల బొమ్మలు తయారీలో కేవలం జింక, లేడి చర్మాలనే వాడుతారు. రావణుడు, ధుర్యోధనుడు లాంటి దుష్టపాత్రలకు మేక చర్మాన్నే వాడతారు. కథలో హాస్యపాత్ర కేతిగాడు లాంటి పాత్రలకు విరివిగా దొరకే గొర్రె చర్మాన్ని వాడుతారు.

తోలుబొమ్మలు తయారీలో రెండు పద్ధతులు అవలంభిస్తారు. అవి ఏకపటం, సూత్రం బొమ్మ, ఏకపటం బొమ్మకు కేవలం రెండు చర్మాలను ఉపయోగిస్తారు. సూత్రం బొమ్మలో మూడు తోళ్ళను ఉపయోగిస్తారు. తల, మొండెంలను ఒక చర్మాన్ని, చేతులకు విడివిడిగా చర్మాలను వాడుతారు.

రెండవ దశలో తోలు బొమ్మలు దుస్తులు, నగల అలంకరణ ఉంటుంది. ముఖ్యంగా నగల అలంకరణకు ఎక్కువ ప్రాముఖ్యత నిస్తారు. నగలు, దుస్తులు

అలంకరణ ఉన్న ఆకారం వెంబడి తోలు బొమ్మల పై రంధ్రాలు చేస్తారు.

మూడవ దశలో సాంప్రదాయ పద్ధతిలో రంగులు వేయటం ప్రారంభిస్తారు. తొలినాళ్ళలో సహజసిద్ధంగా తయారైన రంగులు వాడేవారు. వీటిని కరక్కాయ, చింత గింజల పొడి, అన్నబేధి మొదలైన వాటి నుంచి తయారు చేసిన రంగులను తోలుకు ఇరువైపులా పూస్తారు. ముందుగా మెత్తని గుడ్డ ముక్కని ఉండగా చుట్టి రంగులో ముంచి తోలుకు ఇరువైపులా పూస్తారు. తరువాత ఆయా ప్రాంతాలలో రంగు సమానంగా విస్తరించేందుకు మరొక మెత్తని బట్టతో తోముతారు. కాలక్రమంలో బజార్లలో దొరికే రసాయనిక రంగులను వాడటం ప్రారంభించారు. ఈ రంగులు ఆకర్షణీయంగా, చౌకధరలో, పలు రంగుల్లో విరివిగా దొరకటం కారణంగా బొమ్మలు మరింత ఆకర్షణీయంగా కనిపించడంవల్ల జనరంజకమైనవి.

రంగు స్వభావమును పాత్ర స్వభావముతో పోల్చి, ఆయా పాత్రలకు స్థిరమైన రంగులు వేస్తారు. దేవతల బొమ్మలకు తెలుపు, పసుపు, గులాబి రంగు ఎక్కువగా వాడేవారు. దుష్టపాత్రలకు నలుపు, ఎరుపు రంగులను వాడేవారు. స్త్రీలకు పుసుపురంగును ఎక్కువగా వాడేవారు. ఈ విధంగా సిద్ధం అయిన బొమ్మ వివిధ భాగాలను వదులుగా ఉండేటట్లు దారాలతో ముడివేస్తారు. ఒక వెదురుబద్దను తీసుకొని తలనుండి క్రింద వరకు వచ్చునట్లు, అమర్చి కాళ్ళ భాగం వద్ద కొంచెం మిగులునట్లు చేతితో పట్టుకొనే వీలుగా అతికిస్తారు. మరొక చేతితో వదులు దారాలను కదుపుతూ సన్నివేశాలకు తగినట్లు కదలికలు సృష్టిస్తారు. వివిధ సన్నివేశాలను దేశీయ పరిజ్ఞానం ఉపయోగించి యుద్ధకాండ, లంకాదహనం వంటి సన్నివేశాల సహజత్వం కోసం రణగొణ ధ్వనులు, మంటలు సృష్టిస్తారు. వీటి ప్రజాదరణ ఎంత గొప్పదంటే గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఈ తోలు బొమ్మలాటకు అనుకరణ వర్గాలు తయారయ్యాయి. కాలక్రమంలో అవి అసలు బొమ్మలాట స్థాయిని అందు కోలేక కనుమరుగై పోయాయి.

మిగిలిన ప్రాంతాలలో తోలుబొమ్మల కన్నా ఆంధ్రప్రదేశ్ తోలుబొమ్మలు విశిష్టమైనవి. నాణ్యతలోను, పరిమాణంలోను ఆకర్షణలో మేటిగా నిలిచాయి. వీటి పరిమాణం 5×3 అడుగులు, 7×3.5 అడుగులు వరకు తయారు చేస్తారు. నెల్లూరు బొమ్మలు అన్ని సంప్రదాయాల కంటే పరిమాణంలో పెద్దవిగా నిలిచాయి. హనుమంతుడు, రావణాసురుడు వంటి పాత్రలను భారీ రూపంలో తయారు చేస్తారు. స్త్రీ పాత్రల బొమ్మలు పురుష పాత్రల బొమ్మల పాత్రలు కంటే చిన్నవిగా యుంటాయి. నడుము సన్నగాను, కటిస్థలము పెద్దదిగా, ప్రస్ఫుటంగా కనిపించేటట్లు తయారు చేస్తారు. దేవతారూపాల పాత్రలను 'చక్కని స్వరూపంతోను, ధృడత్వముతోను ఉండునట్లు, రాక్షస పాత్రలు వికృత రూపంలో ఉండేట్లు తీర్చిదిద్దుతారు. బ్రాహ్మణుని పాత్రను జుట్టు ముడితోను, సమాజంలో ఉన్నత పాత్రలను వారి వరివారం సహాయంతో చూపుతారు. రాజు, రాణి పాత్రలను వారి వెంట పరివారము, ఏనుగులు, గుర్రాలు, పల్లకీలతో చూపుతారు.

తోలుబొమ్మల కళాకారులు సాధారణంగా దేశదిమ్మర్లు, పగలంతా ఊరురా తిరుగుతూ తమ ప్రదర్శనకు అనువుగా ఉండే నాలుగు రోడ్ల కూడలిని గాని, ఆ ఊరి దేవాలయం దగ్గరలో గాని, ఆ ఊరి పంచాయితీ ఆఫీసు దగ్గరగాని ఎంపిక చేసుకొంటారు. వీరి ప్రదర్శనకు వేసవికాలం అనువైన కాలం. ఆ ఎంపిక చేసుకున్న స్థలంలో 20 అడుగుల వెడల్పుతో రెండు కొయ్య గుంజలను భూమిపై నిలువుగా నిలబడునట్లు పాడి పెడతారు. మరో రెండు గుంజలను వారికి అడ్డంగా అమర్చి దీర్ఘచతురస్రం ఆకారంలో ఉండునట్లు బిగిస్తారు. పలుచ తెల్లని గుడ్డను తెరగా దానికి బిగిస్తారు. తెరకు వెనుకవైపుకు మూడు వైపులా గుడారం వేసిన గుడారంలో ప్రదర్శనకు కావాల్సిన సరంజామా, బృందం గానం చేసేవాళ్ళు, ఆడవాళ్లు, పిల్లలతో సహ ఉంటారు. సాధారణంగా ఆడవారు మగవారికి ప్రదర్శనలో సహకరిస్తారు. తెరకు వెనుక కాంతి జనకములను 1 1/2

అడుగుల దూరంలో ఉంచి తెరను కాంతివంతం చేస్తారు. తెరకు కాంతి జనకమునకు మధ్య తోలుబొమ్మను తెరకు కొంచెం దగ్గరలో ఆనించి బొమ్మను కథకు అనుగుణంగా కదిలిస్తారు. ప్రేక్షకుడికి నీడలా కనిపిస్తూనే రంగులు గూడా ఆకర్షణీయంగా కనిపిస్తాయి.

బొమ్మల లక్షణాలు మరియు దక్షిణ భారత చిత్రకళా ప్రభావము :

ఏ సమాజంలోనైనా ఆయా ప్రాంతాల జానపద కళలపై నాటి ఆస్థాన కళ ప్రభావం కొంచెం అయినా ఉంటుంది. తోలుబొమ్మల కళాకారుడు తనదైన శైలిలో, దక్షిణ భారత కుడ్యచిత్రాల లక్షణాలను కొన్నింటిని తన బొమ్మలకు జోడించి తనకంటూ ఓ దృశ్య భాష సృష్టించగలిగాడు. వీటిపై లేపాక్షి కుడ్యచిత్రముల ప్రభావం చూడగలము. చారిత్రాత్మక ఆధారాలు ఈ విషయాలను స్పష్టం చేస్తున్నాయి. 16వ శతాబ్దపు విజయనగరరాజు కోనారెడ్డి కోరికపై రంగనాథ రామాయణం వ్రాయబడింది. మొల్ల రామాయణం ఆధారంగా వ్రాయబడిన ఈ కావ్యంలో తోలుబొమ్మలాటకు అనుకూలమైన సన్నివేశాలు, ముఖ్యంగా తోలుబొమ్మల అలంకరణకు కావల్సిన సూత్రాలు వ్రాయబడ్డాయి. స్త్రీ, పురుష పాత్రల ముఖములన్ని అర్ధముఖ ఆకృతిలో చూపబడ్డాయి. రావణాసురుని ముఖం మాత్రం పూర్తిగా చూపబడుతుంది. ముక్కుసూదిగానూ, కళ్ళు పెద్దగా ఉబ్బినట్లు ఉండును. మగవారి పాత్రల మీసాల శైలి మొఘలు కళ నుండి గ్రహించినట్లుగా కనిపిస్తాయి. ఛాతి భాగము ప్రేక్షకుడికి ఎదురుగాను, మరియు కటిస్థలము నుండి కాళ్ళ పాదాల వరకు ప్రక్కలకు తిరిగి ఉంటాయి. మరియు బొమ్మ ఆసాంతం ప్రక్కకు ఒరిగినట్లు కనిపిస్తుంది. ఇవన్ని లేపాక్షి కుడ్యచిత్రాల లక్షణాలను స్ఫురణకు తెస్తాయి. కుడ్యచిత్రాల దుస్తులు, ఆభరణ అలంకారాలు ఒకోసారి యక్షగాన రీతిని పోలి ఉంటాయి. ఆభరణములు దుస్తుల అలంకరణలకు బహు ప్రాముఖ్యతనిస్తారు.

ఆభరణముల మరియు దుస్తుల ఆకారంలో తోలుపై చతురస్రపు, త్రిభుజాకారపు వృత్తాకారపు రంధ్రాలు చేస్తారు. తోలుబొమ్మలను ఆడించేటప్పుడు పారదర్శకత కలిగిన తోలుపై రంగులతో పాటూ రంధ్రముల గుండా ప్రసరించే కాంతి ప్రేక్షకుడి కంటిపై జిగేలుమనిపించి నిజమైన ఆభరణాలా అన్నట్లు అనుభూతిని గలిగిస్తాయి. ఈ రకమైన నగల అలంకరణకు ఉన్న ప్రాధాన్యత మనకు లేపాక్షి కుడ్య చిత్రాలు, ముఖ్యంగా కేరళ కుడ్యచిత్రాలు గమనించగలము.

ఆధునిక కళ అంటే మనకు ఠక్కున గుర్తుకు వచ్చేది యూరోపియన్ కళే. కాని మన తోలుబొమ్మల కళలో నిక్షిప్తం అయిన రేఖాచిత్ర లేఖనం, రంగుల అలంకరణ, శిల్పము, నాట్యము, సంగీతము, నాటకము మరియు భీభత్సము, లంకాదహన కాండలలో ప్రత్యేకంగా అనుసరించిన పద్ధతులను మేళవించి చూస్తే నేడు మనం మాట్లాడుకునే 'మిక్స్‌డ్ మీడియా', 'ఇన్‌స్టలేషన్', 'ఫర్ఫార్మింగ్ స్కల్ప్‌చర్'లు ఆనాడే మన తోలుబొమ్మల రూపంలో కనిపిస్తాయి.

12వ శతాబ్దము నుండి 18వ శతాబ్దము వరకు రామాయణ, మహాభారతాలను, పురాణాలను వాటి పాత్రలను మన మధ్య సజీవంగా నిలిపి మన సంస్కృతిని పరిరక్షించాయి. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఎందరో దేశభక్తులకు స్ఫూర్తినిచ్చే ప్రదర్శనలు ఇచ్చి ఉత్తేజపరచేవి. ఆనాటి కాలంలో స్వాతంత్ర్య పోరాట యోధులకు, అంగ్ల సిపాయిల కదలికలు తమ పాట చాటున చెప్పి సహకరించడమే కాక వారి దురాగాతాలను ప్రజలకు చెప్పేవి. ఆనాటి ప్రభుత్వాలకు, పాలకులకు గూఢాచారులుగా పనిచేసి దేశద్రోహులు, రాజద్రోహులు, దొంగ వ్యాపారుల గుట్టు మట్లు తెలిపి సహకరించేవి. అంటే ఈ కళాకారులు రహస్య వేగులుగా పనిచేసేవారన్నమాట.

19, 20వ శతాబ్దంలలో నాటకరంగం ప్రభావం ఎక్కువగా ఉండటం, పద్యనాటకానికి ప్రాధాన్యత పెరగటం, అంతకంటే తాను మాతృకగా నిలిచిన, లూమియర్ అన్నదమ్ముల సాంకేతిక విప్లవ సృష్టిలో వెలసిన సినిమాల ముందు ఈ తోలుబొమ్మలు మసకబారాయి.

దూరదర్శనిలో వచ్చిన వందలాది చానళ్లతో పోటీ పడలేక తమ ప్రాభవాన్ని కోల్పోయాయి. అయినా అడపా తడపా తమ ఉనికిని చాటుకుంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకొనిపోయే రాయబారిగా వ్యవహరించాయి. మారుమూల గ్రామాల్లో సాంఘిక దురాచారములపట్ల ప్రజలకు అవగాహన కోసం కొన్ని స్వచ్ఛంద సంస్థలకు సహకరిస్తున్నాయి.

ఎన్ని గడ్డు పరిస్థితులు ఎదురైనా తమ మూలాలను కోల్పోకుండా రూపాల్ని మార్చుకుంటూ 22, 3డి యానిమేషన్ చిత్రాలకు మొదటి అడుగు వేశాయి. నాస్కామ్ నివేదిక ప్రకారం ఈ యానిమేషన్ చిత్రాల నికర వాణిజ్య విలువ వంద కోట్లు. సాంకేతిక విప్లవ సృష్టిలో పురుడు పోసుకున్న "మరమనిషి (రోబో)"కు మాతృక ఇవేనని చెప్పగలము.[8] సమాజంలో వచ్చిన సాంకేతిక మార్పులు ఈ తోలుబొమ్మల తయారీల్లో కూడా మనం చూడగలము. వన్యమృగ సంరక్షణ చట్టాల మూలంగా జింక, లేడి చర్మాల స్థానంలో మేకలు, బర్రెల తోళ్లను వినియోగించడం మొదలు పెట్టారు. అప్పడప్పడు దళసరి ఎక్స్ రే ఫిల్మ్లను తోళ్ల స్థానంలోనూ, పారదర్శక మైన ఫోటో రంగులునూ వాడటం జరిగింది. కళాకారుల సహకార సంఘాలు, జాతీయ హస్తకళల డిజైన్ సంస్థల సహకారంతో తోలుబొమ్మలు దేశ విదేశాలకు ఎగుమతు లౌతున్నాయి. మరియు అలంకరణ వస్తువులుగా ధనవంతుల మరియు మధ్య తరగతి కుటుంబాల్లో కూడా అలరిస్తున్నాయి. విదేశాలలో జరిగే ఉత్సవాలలో వీటిని ప్రదర్శించేందుకు ఈ కళాకారులు వెళుతున్నారు. ఇంతటి ఉన్నతమైన ఈ కళా ప్రక్రియ నేడు అతి కొద్దిమంది బృందాలతో జీవిస్తున్నది. తోలుబొమ్మల దీపపు కాంతులు చరమాంకంలో ఉన్నాయి. ఈ బొమ్మ లకు సంబంధించిన చరిత్ర, రచనలు, తయారీ పద్ధతులు, ఇమిడియున్న దేశీయ పరిజ్ఞానంలకు లిపి లేకపోవడం దురదృష్టకరం. ఇకనైనా మరిన్ని మెలుకువలు జోడించి ఆధునిక మానవుని చెంతకు ఈ తోలు బొమ్మలను తీసుకెళ్ళవలసిన అవసరం ఎంతైనా ఉంది. స్వచ్ఛంద సంస్థలు, పరిశోధ కులు, విశ్వవిద్యాలయాలు వీటి 'పునరుజ్జీవనానికి' ఎంతైనా కృషి చేయాల్సి అవసరం ఉంది.

నిర్దేశిత గ్రంథాలు :

1. ఏన్ ఇంట్రడక్షన్ టు ఏషియన్ పపెట్స్ : ఏన్ ఎగ్జిబిషన్ ప్రెజెంటెడ్ బై యు.ఎల్.సి.ఎ. మ్యూజియం ఆఫ్ కల్చరల్ హిస్టరి, 2011, పేజి నెం. 7.
2. అనుపమ్ షా & ఉమా జోషి, "పపెట్స్ అండ్ ఫోక్ డ్రామాస్", 1992, పేజీలు 3, 4.
3. సంపా ఘోష్ & ఉత్పల్ కుమార్ బెనర్జి,"ఇండియన్ పపెట్స్", న్యూఢిల్లీ, 2012, పేజీలు 14, 16.
4. ఎల్లోరా, "ప్రాచీన కళలు - పుట్టు పూర్వోత్తరాలు", పేజీలు 146, 147.
5. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.తెలుగుఫెస్టివల్స్.కామ్ / తోలు బొమ్మలాట.
6. మల్లికార్జున్ సి.హెచ్. "లెదర్ పపెట్రి"; "ది ఆర్ట్ అండ్ ట్రెడిషన్", ఇండియన్ ఫోక్ లైఫ్, సంకలనం, నెం. 29 : వై.ఏ. సుధాకర్ రెడ్డి & పి.ఎస్. కనకదుర్గ.
7. న్యూస్.సూర్య.కామ్ / ఫీచర్ / ఆర్టికల్ 1-2896.
8. మృత్యుంజయరావు కోట "ది లివింగ్ ట్రెడిషన్స్-× : ది పపెట్రి ఆఫ్ సౌత్ ఇండియా", ప్రొసీడింగ్స్ ఆఫ్ ది సౌత్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 31వ యాన్యువల్ సెషన్, కడప, 2011, పేజి నెం. 716.

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగుసాహిత్యంలో పత్రికావిలువల చిత్రీకరణ విమర్శనాత్మక పరిశీలన

- భర్గవ్ నిమ్మగడ్డ, పీహెచ్‌డీ స్కాలర్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ఆధునిక తెలుగు సాహిత్య గమనానికి దినపత్రికలు ఎంతగానో దోహదం చేశాయి. ఇంకా చేస్తున్నాయి. పరస్పర ప్రేరకాలైన సాహిత్యం, సమాజాన్ని పత్రికారంగం నిత్యం ప్రభావితం చేస్తునే ఉంది. ఈ నేపథ్యంలో తెలుగు సాహిత్యం పత్రికల విలువల మీద పరిమతంగానైనా స్పందించింది. వార్తలను సేకరించి ప్రచురించే విలేఖరుల జీవితం ఇటీవల నవల సాహిత్యంగా వెలువడింది. ఈ పరిణామం ప్రపంచ వ్యాప్తంగా ఏనాడో మొదలైనప్పటికీ, తెలుగులో రావాల్సినంత జర్నలిస్టు జీవితాల సాహిత్యం రాలేదు. ఇందుకు అనేక కారణాలున్నాయి. పత్రికల మీద కలాలు ఎక్కుపెట్టడం అనేది సాహసోపేతమైంది. తిరిగి అది ఏ పత్రికలోను అచ్చుకాదనే నగ్నసత్యాన్ని గ్రహించిన రచయితలు దాన్ని వస్తువుగా స్వీకరించలేకపోయారు. పైగా నాణానికి ఒకవైపు మాత్రమే చూసినట్టు కేవలం పత్రికలు పోషించే మంచిపాత్రను గురించి మాత్రమే గుర్తించారు కవులు, రచయితలు. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల జీవితాల్లోని చీకటి వెలుగులను చిత్రించిన నవలా సాహిత్యంపై ఇంకా చర్చ జరగలవలసే ఉంది.

ప్రజాస్వామ్యదేశంలో ప్రజలనాడిని తెలియచేసే భాద్యత జర్నలిజం వృత్తిదే. ఈ పత్రికారంగం యొక్క తీరుతెన్నులను "అద్దంపట్టే" విధంగా తెలుగులో రచించిన మూడు నవలలను అధారము చేసుకుని కొన్ని సాహిత్యాంశాలను చర్చించడమే ఈ పరిశోధనా వ్యాస ముఖ్యోద్దేశ్యం. మొదటిది పత్రికారంగంలోని విలువలు, ప్రమాణాల గురించి చర్చించే ఈ నవలలు సంబద్ధమైనవేనా? రెండవది, తెలుగు జర్నలిజంపై సామాజికవిశ్లేషణను పెంపొందించడంలో వీటి పాత్ర ఏమిటి? సంక్షిప్త సాహిత్య సమీక్ష సాహిత్యం మరియు సామాజిక విశ్లేషణ చాలా సందర్భాలలో ఊహించలేని విధంగా సమాంతరంగా సాగిపోతూ ఉంటాయి.

కొన్ని సందర్భాలలో సామాజిక శాస్త్రీయ విశ్లేషణకి ముందే సాహిత్యం సమస్యను మన ముందు ఉంచడం జరుగుతుంది. చర్చలోకి వెళ్ళబోయే ముందు ఈ సంబంధానికి ఉదాహరణలుగా చరిత్రలో నిలిచిపోయే రచనలుగా చెప్పుకోదగిన వాటిని ఇక్కడ సంక్షిప్తంగా ప్రస్తావించడమైనది. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు Thomas Man అథామస్‌మాన్ చేసిన సాహితీ రచనలు మరియు మిఇ ఔవఎవతీ చేసిన సామాజిక పరిశోధనలు వేరు వేరు ప్రాంతాలలో, విభాగాలలో ఉన్నపటికీ అత్యంత భావసారూప్యతను కలిగి ఉంటాయి. వారి ఇరువురి వ్యక్తిత్వం (individuality), పెట్టుబడిదారి వ్యవస్థ యొక్క సాంస్కృతిక పునాదుల మీద రచనలు పరిశోధనలు గావించారు. అంతకు మునుపే రష్యన్ తత్వవేత్త, జర్నలిస్టు అయిన నికొలయ్ చర్నిషెవీస్కీ విరచితమైన "What is to be done"అనే నవల చేత ఉత్తేజితుడై ప్రపంచ రాజకీయ పటాన్నే మార్చేసిన విప్లకారుడు లెనిన్ యథాతదంగా తను 1902వ సంవత్సరంలో రాసిన విప్లవ కరపత్రానికి శీర్షికగా పెట్టుకున్నారు. ఈ విషయాలపై ఫ్రెంచ్ తత్వవేత్త లూసిన్ గోల్డ్‌మెన్ 1977 మరియు 1980 పరిశోధన గ్రంధాలలో వివరించడం జరిగింది.

అలాగే బ్రిటిషు దేశస్తుడైనప్పటికీ భారతదేశంలో

జన్మించిన జార్జ్ ఆర్వెల్ కూడా ఫాసిజం, స్టాలినిజంకు వ్యతిరేఖంగా రచించిన Animal Farm (1945); 1984 (1949) నవల స్ఫూర్తితో సాహిత్యాన్ని అధ్యయనం చేసే క్రమములో ఇంగ్లాండ్ విశ్వవిద్యాలయాలలో 1960 వ దశకంలో పేరిట 'కల్చరల్ స్టడీస్' ఆంగ్ల సాహిత్య విభాగాలలో ఒక ఉప విభాగం అయ్యింది. ఈ ఉప-విభాగాన్ని సాహిత్య విమర్శ మాటున దాగి ఉన్న సోషియోలజి (concealed sociology)అని కుడా అంటారు. జర్మనీ, ఫ్రాన్స్ మరియు ఇంగ్లాండ్ దేశాలలో సాహిత్యానికి సైన్సుకి నడుమ విశ్వవిద్యాలయాలలో సామాజిక శాస్త్రం ఉద్భవించిన తీరుని Wolf Lepenies (1992) సవివరంగా ముందుచుతారు.

మనదేశ మహాపండితుడు రాహుల్ సాంకృత్యాయన్ రచించిన ఓల్గా నుండి గంగావరకు, ప్రాచీన చరిత్ర పై డి.డి.కోశాంబి పరిశోధనల మధ్య సారూప్యత ఉండటమే కాక చరిత్ర రచనలో (historiography) ఒక నూతన ఒరవడి సృష్టించారు. ఇక "మాకొద్దీ నల్ల దొరతనము" అని తన పద్యంతో హూంకరించిన కుసుమ ధర్మన్నది, తమిళనాడులోని పెరియార్ రామస్వామి నాయకర్‌ది ఒకటే స్ఫూర్తి. అప్పటి నుంచి నేటి అరుంధతీ రాయ్ రచనలలోని, సోషియాలజిస్టులైన నందినీసుందర్, అల్ పాషా చేసిన పరిశోధనలలోని విషయాలు(రాజ్యం, అణచివేత, పొరహక్కులు) ఒకటే అవ్వడం సాహిత్యం సామాజిక విశ్లేషణ యొక్క సంబంధాన్ని ప్రతిబింబిస్తాయి.

పరిశోధనా విధానము, వివరాలు :

డాక్టరేటు పరిశోధన నిమిత్తం 2012 నుండి 2016 వరకు తెలుగు విలేఖరులు, సంపాదకులు, యాజమాన్యాల ఇంటర్వ్యూలు తీసుకోవడం జరిగింది. అదే విధంగా ఈ దశాబ్దంలో వచ్చిన జర్నలిస్టుల జీవిత చరిత్రలు, ఆత్మకథలు సేకరించడం జరిగింది. ఈ చర్చ ఫ్రెంచి సోషియోలజిస్టు పియర్ బౌర్డ్యూ (Pierre Bourdieu) ప్రతిపాదించిన ఫీల్డ్ థియరీ ప్రకారం స్వయం లేదా ఆత్మ సంవేదనాశీలతతో కూడుకుని సాగుతుంది.

నేను ఆంగ్ల జాతీయ దినపత్రికలో రిపోర్ట్‌గా పని చేసిన పిదప, పై చదువులకు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో తెలుగు జర్నలిజం మీద పరిశోధన చేస్తున్నాను. ప్రస్తుత వ్యానం కొరకు జర్నలిస్టులని, జర్నలిజం వృత్తిని కథావస్తువుగా తీసుకొని జర్నలిస్టులే రచించిన నవలలని పరిశీలించడం జరిగింది.

అవి :

1) కలాల వనంలో కలుపుమొక్కలు (క్రిష్ణారావు, 2016)
2) కలంసత్రం (మమేష్ కొంగర, 2017)
3) పెంపుడుజంతువులు (పతంజలి, 1982, 2012).

చర్చ :

మొదటిగా పేర్కొన్న రెండు నవలలను చర్చించుకుంటే, అవి జర్నలిస్టుల జీవితాలని మన ముందు ఆవిష్కరించడం కంటే దిగజారిపోతున్న పత్రికా విలువలు, సంప్రదాయాలు, ప్రమాణాల గురించే ఎక్కువ ప్రబోధిస్తాయి.

ఎందుకంటే ఆ నవలలకు ప్రేరణ కలిగించే అంశాలు సమాజంలోని వాస్తవాలకంటే, సమాజంలోని జర్నలిజం మీద సామాజిక వ్యాఖ్యలు చేసిన పాలగుమ్మి సాయినాథ్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తున్నది. ఈ ప్రతిపాదనను నిరూపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాయినాథ్ గారు 2000వ దశాబ్దం ఉత్తరార్ధం నుంచి చెల్లింపువార్తల పై యుద్ధం ప్రకటించారు. దేశంలోనే మరీ ముఖ్యముగా తెలుగు ప్రాంతాలలో స్ట్రింగర్ల (గ్రామీణ విలేకర్ల) వ్యవస్థ రూపంలో పత్రికా యాజమాన్యాలు రాజకీయ నాయకుల దగ్గర నగదు తీసుకొని వారికి అనుగుణంగా వార్తలు రాస్తున్నారు అని అభ్యతరం బాహాటంగానే తెలిపారు. అందరికీ తెలిసిన ఇదే విషయాన్ని మరింత వివరంగా క్రిష్ణారావుగారు, మహేష్ కొంగరగారు తమ నవలల ద్వారా

తెలియచేస్తారు. క్రిష్ణారావు గారి నవలలోని కథా నాయకుడు (అశోక్ వర్ధన్) రెండవతరం జర్నలిస్ట్ ఐతే, కలంసత్రంలోని హీరో (చక్రి) జర్నలిజం పట్టభద్రుడు. ఇరువురు పట్టణ ప్రాంతాలకు చెందినవారే. వీరిరువురికీ కులముపట్ల సామాజిక స్పృహతో కూడిన అవగాహన ఉన్నపటికి వీరికి మటుకు కులం ఉండదు. ఉన్నా మనకి తెలియదు (కులం గురించి భారతదేశంలో ప్రస్తావించనవసరంలేని " అదృష్టవంతులలో" అత్యధికశాతం అగ్రవర్ణాలకి చెందిన వారేనని ప్రముఖ సోషియోలజిస్టు సతీష్ దేశ్‌పాండే (2013) తన పరిశోధనలో విశదీకరించారు.

భ్రష్టు పట్టిపోయిన మీడియాలో పనిచేయలేక సతమతమవుతున్న అశోక్‌కి వారి తండ్రి సూర్యప్రసాద్ బాసటగా నిలిస్తే, చక్రికి సాగర్ అనే సీనియర్ జర్నలిస్టు నైతిక మద్దతు తెలుపుతుంటారు. అశోక్ వర్ధన్ పత్రికలు రాజకీయ నాయకులు వ్యాపారవేత్తలు కుమ్మక్కైపోయి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ప్రజాభీష్టానికి వ్యతిరేఖంగా ప్రారంభించాలని విఫలయత్నం చేస్తారు. విసిగి వేసారి పోయిన అశోక్ పక్కకి తప్పుకుంటాడు. దానికి కారణం తన పత్రికలోని సహోద్యోగులు, తన పైన పని చేసేవారే కారణం అని అనుకుంటాడు. ఏదో మానవేతర కారణాల వలన అతని నిజాయితీని యాజమాన్యం కూడా గుర్తిస్తుంది. అప్పటికే తన తండ్రిగారు, క్రౌడ్ ఫండింగ్ సహాయంతో దేశంలోనే ప్రప్రథమంగా మల్టి-ఎడిషన్ సాయంకాల న్యూస్ పేపర్ ప్రారంభిస్తాడు. ఇంచు మించుగా చక్రీది కూడా ఇదే కథ. కాకపోతే విద్యుత్ కేంద్రం బదులు కపాల బాబా అనే ఒక దొంగస్వామీజి గుట్టురట్టు చేయడంతో అతను హీరో అవుతాడు. అతని అభినందన సభలో కురిపించినచప్పట్ల వర్షంతో తడిసి ముద్దవుతాడు.

ఇదే క్రమంలో మహేష్ కొంగరగారు గ్రామీణ విలేఖరులు అకృత్యాలు చేయడంలో నిత్యం నిమగ్నమయి ఉంటారు అన్నట్టు చిత్రీకరిస్తారు. ఒక పక్క నిమ్న కులంలో పుట్టికష్టాలకు ఎదురొడ్డి చదువుకుని ఒక ఆంగ్ల "జాతీయ" దినపత్రికలో పాత్రికేయుడైన రాజు (అనే పాత్ర) అకాల మరణం చెందాడాన్ని హృద్యంగా రచించారు. హైదరాబాదు, ఢిల్లీలో పనిచేసే జర్నలిస్టులందరికి తెలుసు అది ఒక వాస్తవపాత్ర అని. అది ఒక సామాజిక విషాదం అని. అదేసమయంలో అంతంత మాత్రంగానే చదువుకుని పాత్రికేయ వృత్తిలోకి ప్రవేశిస్తున్న కింది కులాలకు చెందిన గ్రామీణ విలేఖరులను తక్కువచేసి చూపడం అసంబద్ధముగా ఉంటుంది. వారికి జర్నలిజం అనే వృత్తి విద్యను అభ్యసించకపోవటమే లోపమా? అసలు ఆ వనరులకి దూరంగా ఉండటమే వారు చేసుకున్ననేరమా? క్రిష్ణారావు గారైతే పతంజలి గారి పెంపుడు జంతువులు నాకు స్ఫూర్తి అని తెలుపుతారు. అంతేకాక నిత్యం పాఠకులను దగాపరుస్తున్న "అక్షరమోసగాళ్ళ" వైనాన్ని తెలియ చేయడమే ఆయన రాసిన నవల ప్రధాన లక్ష్యం అని అంటారు. అసలు పాఠకులు గురించి మొదటిసారిగా ప్రస్తావించింది నవలలో చివరిసారిగా వ్రాసిన మాటలలోనే. మహేష్ గారి నవలలో ప్రముఖ జర్నలిస్టుల (సాయినాథ్ గారితో సహా) వ్యాఖ్యలు పొందు పరచడం జరిగింది.

అప్పుడప్పుడు ఫోర్త్ ఎస్టేట్ ఔన్నత్యాన్ని ప్రవచించడం తప్ప ఈ రెండు నవలలూ కొత్త విషయాలను అవిష్కరించినది ఏమిలేదు. పైగా19వశతాబ్దంలోని పారిశ్రామిక విప్లవంనాటి మానసిక నవలల్ని తలపిస్తాయి. వీటి శిల్పం గురించి Goldmann (1977) ఇలా అంటాడు: మానసిక నవలల్లో... పతనమయి పోయిన సమాజంలో (Degraded society) హీరో ఉంటాడు. అతను నైరుప్య ఆదర్శ భావాలు కలిగి ఉంటాడు. అవి అతనికి సమాజంలో కనపడక పోవడంతో సంక్షోభంలో పడతాడు. వీటిలో

మూడు రకాల ముగింపులుంటాయి. ఒకటి, అన్నీ తానై సమాజాన్ని కథానాయకుడు గాడిలో పెడతాడు. హీరోగా నిలుస్తాడు. సూత్రధారి అవుతాడు. రెండు, సమాజంలోని స్థితిగతులకి తన నైరూప్య ఆదర్శానికి మధ్య కొట్టుమిట్టాడి అసౌకర్యంగా ఉన్నప్పటికీ సర్దుకుపోతాడు. మూడు (ఇది ఇక్కడ అప్రస్తుతం), పైకి మామూలుగా ఉన్నట్టు నటిస్తూ డీవియం ప్రవర్తన అలవర్చుకుని అసాంఘీక శక్తిలా తయారవుతాడు. కాని మనమున్నది 21వ శతాబ్దములో అని ఈ ఇద్దరు రచయతులు మరిచి పోయినట్టున్నారని అనిపిస్తుంది. వాళ్ళు చెప్పే విషయాలు నవల చదివే పాఠకులకి తెలియదు అని బలంగా నమ్ముతున్నారేమో అన్న భావన కలుగుతుంది.

ఈ రెండు నవలలలో ప్రధానంగా చెప్పుకోవలసినవి మూడు సమన్యలు ఉన్నవి. మొదటిది, దేశాన్ని కుదిపేసిన టూ జి, బొగ్గు మొదలగు అనేక కుంభ కోణాలలో సూత్రధారులైన జర్నలిస్టులను, రాజకీయ నాయకులను, ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగులను, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్లను వదిలేసి వార్త రాసి ఒక పదో పరకో సంపాదించుకునే గ్రామీణ విలేఖరుల వ్యక్తిగత జీవితాలను, వారు చేసే పనులను బెదిరింపు చర్యలు గాను చూపడం అత్యంత సమస్యాత్మకమైనది. రెండవది, కథా వస్తువు సమాజంలోనుంచి అయినా రావాలి లేదా రచయిత ఊహలోనుండి అయినా పుట్టాలి. ఈ రెండు నవలలలో పాత్రలు, సందర్భాల సృష్టి ఇప్పటికే ప్రాచుర్యంలో ఉన్న చెల్లింపు వార్తలు వాటి దుష్పరిణామాలు మరియు దిగజారిపోతున్న పత్రికా విలువలు అనే రోడ్డకోట్టుడు సామాజిక విశ్లేషణ ఆధారముగా జరిగినట్టు అనిపిస్తుంది. మూడవది, జిల్లాలలో పాత్రికేయులపై దాడులు జరిగినప్పుడు లేదా వారి హక్కుల కోసం పోరాడే జర్నలిస్టు సంఘాల నేతలను తాగుబోతులుగా, డబ్బుకి అమ్ముడుపోయేవారిగా చూపడం మనము కూర్చున్న కొమ్మను మనమే నరుక్కున్న చందాన ఉంటుంది ఈ నవలల్లో. అదీకాక ఇతర వ్యవస్థలు అన్ని సక్రమముగా ఉండి, ఒక్క పత్రికా వ్యవస్థలోనే విలువలు పడి పోతున్నట్టు చిత్రీకరించడము అంత సమంజసముగా అనిపించదు.

అసలు ఫోర్త్ ఎస్టేటుగా పిలువబడుతున్న జర్నలిజం గురించి విలువల కోల్పోతున్న పాత్రికేయవృత్తి గురించి తన నవయుగాల బాటలో నార్ల వెంకటేశ్వర రావు గారు (1956 -1976) ఈ క్రింది విధముగా పద్యరూపంలో వ్యక్తీకరించారు.

"ఎడిటరైనవాడు ఏమైనవ్రాయును
ముల్లెయొకటె తనకుముఖ్యమైన్
పడుపువృత్తిలోన పట్టింపులుండునా?
పత్రికా రచనను పడుపువృత్తిగమార్చు
వెధవకంటె పచ్చివేశ్యమేలు:
తనువునమ్ము వేశ్య, మనసును కాదురా!"

స్వతంత్ర భారతదేశంలోని తొట్టతొలి ప్రెస్ కమిషను లోనూ (1954) అప్పుడే జరిగిన సార్వత్రిక ఎన్నికలలో జరిగిన నగదుకి వార్తలు వ్యవహారం మీద అసహనం వ్యక్తపరచడం జరిగింది. ఇక నార్ల వారికి ప్రెస్ కమిషన్ రిపోర్టుకి మునుపే మహాకవి శ్రీశ్రీ అయితే ఆంధ్రుల దినపత్రికను ఏకంగా "పెట్టుబడికి కట్టుకథకి పుట్టిన విష పుత్రిక" అని 1953లోనే ప్రకటించారు.

శ్రీశ్రీకి తన తొలినవల 'ఖాకీవనం'ను అంకితం ఇచ్చిన పతంజలి రెండవ నవల పెంపుడు జంతువులు. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం రచించిన ఈ నవలలో ప్రస్తుతం మనం నేర్చుకునే విషయం ఏముంటుంది అని మొదట అనిపించవచ్చు. అయితే పైన ప్రస్తావించిన రచయితలు తమ అనుభవాలను ఉపకరణముగా వాడుకుంటే, పతంజలిగారు కథావస్తువుగా వాడుకున్నారు. వాస్తవానికి అప్పటికి (1982) ఇన్ని పత్రికలులేవు. ఎమర్జెన్సి ముగిసి

సరిగ్గా ఐదేళ్ళు. ఉవ్వెత్తున ఎగసిన జయప్రకాష్ నారాయణ సంపూర్ణ విప్లవం శరవేగంతో నేలను తాకింది. కేవలం ఈ నవలను పత్రికా రంగానికే పరిమితిచేసి చూస్తే జర్నలిస్టిక్ ఫీల్డ్ ఎకనామిక్, సోషియల్, పొలిటికల్, బ్యూరోక్రటిక్ ఫీల్డులతో అనాడు ఎంతగా పెనవేసుకు పోయిందో సాహితీ విలువలతో కూడిన సామిజిక విశ్లేషణ మనకి పతంజలి గారి వ్యంగ్యంలో కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది. దాన్ని అర్ధం చేసుకోవాలంటే మొనొపొలి కమీషన్ (1982) రిపోర్టు చదివితే తెలిసిపోతుంది. ఖాకీవనంతో రాజ్యం యొక్క అణిచివేసే గుణాన్ని ఆవిష్కరించిన పతంజలి, పెంపుడు జంతువులతో పాలకవర్గాల భావజాలాన్ని "సహజమైన" భావజాలంగా పత్రికల ద్వారా ఎలా సాధిస్తుందో సూచిస్తారు.

వరద గోదారి అంత ఉధృతమైన పెట్టుబడిదారి వ్యవస్థ ముందు, పోలీసు వ్యవస్థ, రాజకీయాలు, రౌడియిజం కలసి పోయిన సమాజంలో ఎడిటరైన శేషసాయి కళ్లు, చెవులు మూసుకొని కార్టూనిస్టు అద్దె ఇళ్ల యజమానుల మీద గీసిన చిత్రాన్ని చూసి, ఎడిటోరియలు కూడా రాయవలసింది అనుకుంటాడు. పత్రిక ఎండీ దగ్గర చివాట్లు కాసిన అయిన ప్రతిఘటనా మనసులో పాలేకర్ వస్తున్నాడురా అని నంబర పడటంతోనే సరిపోతుంది. (పాలేకర్ అప్పటి జర్నలిస్టు కనీస వేతన బోర్డు కమీషన్ ఛైర్మన్). శేష సాయి ముట్నూరి కృష్ణారావు గారి దగ్గర నేర్చుకున్నది, నార్లవారు నేర్పినది అక్కరకు రావు. ఈ నవలలో సూత్రధారులు ఉండరు. కేవలం పాత్రధారులు మాత్రమే ఉంటారు. కొన్ని పాత్రలు చెప్పే విషయాలు నవలా పాఠకులనేకాదు సామాజిక విశ్లేషకులని కూడా నేటికీ ఆలోచనలో పడేస్తాయి.

ఇదంతా ఒక విధానంలో అర్ధం చేసుకోవడం మాత్రమే. స్వయం ప్రతిపత్తిలేని విషయాన్ని వారు వెంటనే గ్రహించి తదుపరి నవలా రచనలు చేసినట్టు అనిపిస్తుంది. నిజానికి మొదటి నుండే లేదని ఆయన ఒక సందర్భంలో అనడం కూడా జరిగింది (1985). "అక్షరాన్ని బూటుతో అదిమి చూడు ఒకనెత్తుటి చుక్క చిందుతుంది. సత్యాన్ని కత్తితో కోసి చూడు ఒక బాధా కుసుమం బైటపడుతుంది. ఒక వార్తను ఉరితీసి చూడు గద్దెమీద వాడి నవ్వు వినబడుతుంది," అని అంటారు. దానికి కొనసాగింపు: "పత్రికా స్వేచ్ఛకు రాజ్యాంగంలో ప్రత్యేక ప్రతిపత్తి లేకుండా చేయడం పత్రికల మీద జరిగిన కుట్ర. స్వతంత్ర భారతదేశ చరిత్రలో పత్రికల మీద, పత్రికా రచయితల మీద, సంపాదకుల మీద, విలేఖరుల మీదా జరిగిన అత్యాచారాలన్నీ, దాడులన్నీ, జులమంతా ఆ తొలి కుట్ర ఫలితమే" (పతంజలి, 1985, 2012, 254). రాజుగోరు (1983), వీరబొబ్బిలి (1984), అప్పన్నసర్దార్ (1986), గోపాత్రుడు (1992), పిలక తిరుగుడు పువ్వు (1995) రచనలతో పతంజలి ఒక సాహితీ విశ్వాన్ని సృష్టించారు. అందుకే పతంజలి రచనలలో బహుళార్ధం (polysemy) ఉందని ప్రముఖ సాహిత్య విమర్శకులు, సామాజిక పరిశోధకుడు, వ్యాఖ్యాత ఎన్.వేణుగోపాల్ గారు (2015) పేర్కొనడం జరిగింది. ఆయన పతంజలి గారి రచనలోని బహుళార్ధం వెనుకాల రెండు కారణాలు దాగి ఉండొచ్చని తెలిపిన మాటలు అత్యంత కీలకమైనవి. అవి ఏంటంటే:

"ఒకటి, విస్తృతమైన అధ్యయనం వల్ల, వస్తు శిల్పాలలో అపార వైవిధ్యం ఉన్న సాహిత్యాన్ని చదవడం మాత్రమే గాక, జీర్ణం చేసుకున్నందువల్ల ఆయన రచనల్లోకి ఈ బహుళార్ధకత సహజంగా ప్రవహించి ఉంటుంది. రెండు, ఆయన రచనలన్నిటిలోను మానవ అనుభవ, మానవ అస్తిత్వ సారాంశాన్ని నైసర్గికంగా, సహజంగా పట్టుకున్నారు గనుక మానవ అస్తిత్వంలో గుణాత్మక మార్పు వచ్చేవరకూ ఆ విభిన్నకోణాలు పఠిత స్ఫురణకు వస్తూనే ఉంటాయి. అంటే ఆ బహుళత్వం వ్యక్తీకరణ

పొందుతూనే ఉంటుంది. అలాగే, మానవ అస్తిత్వసారం అన్నప్పుడు కూడ సాధారణంగా సాహిత్యా నికి, ప్రత్యేకంగా తెలుగు సాహిత్యానికి తెలిసిన పరిమిత, సంకుచిత, ఏకైక రూపంలో ఆయన అర్థం చేసుకోలేదు. దాన్ని కేవలం వేదనగానో, సంతోషంగానో, చికిత్సగానో మాత్రమే ఆయన అర్థం చేసుకోలేదు, అన్నీ కలగలసి నదిగా, విశాలమై నదిగా, లోతైనదిగా అర్థం చేసుకున్నారు. అందువల్ల కూడ ఆయన రచనలకు బహుళార్థ బోధకత వచ్చి ఉండవచ్చు.

సరిగ్గా పతంజలిగారు ఈ రంగాలపైన నవలారచన సాగిస్తున్న సమయంలోనే ఫ్రాన్స్‌లోని Pierre Bourdieu "థియరీ ఆఫ్ ప్రాక్టీస్" అని ప్రతిపాదించి వరుసగా సాహిత్యం, రాజ్యం, పాలనావ్యవస్థ, న్యాయవ్యవస్థలని ఫీల్డుగా చూస్తూ గణాత్మకంగా, గుణాత్మకంగా బేరీజు వేసి ఒక్కో రంగం యొక్క స్వభావాన్ని ఫ్రెంచ్ సమాజంలో విశ్లేషిస్తాడు. కేవలం ఫీల్డునేకాక అందులోని ఏజెంట్స్ యొక్క ఆలోచనలు, అవగాహన, వ్యక్తీకరణలు మరియు చర్యలను రూపొందడానికి చారిత్రాత్మకంగా మరియు సామాజికంగా ఉన్న పరిస్థితులు కల్పించే సామర్థ్యాన్ని అంచనావేయాలి అని సూచిస్తారు.

ఈ థియరీ ఆఫ్ ప్రాక్టీస్‌ను ఆధారం చేసుకోని ఐరోపా మరియు అమెరికా దేశాలలో అనేక సామాజిక, మానవీయ శాస్త్రీయ విభాగాలలో పరిశోధనలు నేటికీ జరుగు తున్నాయి. (ఈయన రచనలు ఆంగ్లములోకి అనువాదం అవ్వడం కొంత ఆలస్యం అయినది). ఈయన మీడియా టెలివిజన్ మీద కూడా తన థియరీ ఆఫ్ ప్రాక్టీస్ ద్వారా పరిశోధించి ఇతర ఫీల్డులతో పోల్చి మీడియాలోని ఆచ రణలను (practices) సరిదిద్దుకోకపోతే దాని స్వభావ రీత్యా సంప్రదాయాత్మక విప్లవం (conservative revolution) చేస్తున్నట్టే ఉంటుంది అని సూత్రీకరించారు.

ముగింపు :

ఈ దృష్టిలో నుంచి పతంజలి గారి రచనా ప్రపంచాన్ని పరిశీలిస్తే సామాజిక విశ్లేషకులకు (ప్రత్యేకించి తెలుగు ప్రాంతాలలో) అది చక్కటి సంబద్ధమైన ఉపకరణంగా నిలిచిపోతుంది. సాహితీ విమర్శకులు ఎప్పటికప్పుడు వీరి రచనలను ఎటూ పరిశోధిస్తూనే ఉంటారు. కాని ప్రత్యేకముగా పాలసీ సైన్సెస్‌గా పిలువబడే సోషియాలజి, రాజకీయశాస్త్రం, మానవీయశాస్త్రం (Anthropology), ప్రాంతీయ అధ్యయనాల (Regional Studies) విభాగాలకి కూడా ఇవి ఉపకరిస్తాయి.

ఆధార గ్రంథాలు:

1. Bourdieu, Pierre. (1990). The logic of practice. Stanford, California: Stanford University Press.
2. Bourdieu, Pierre.,& Nice, R. (1977). Outline of a theory of practice. London: Cambridge University Press.
3. Bourdieu, Pierre. (2014). On the state: Lectures at the Collège de France, 1989 - 1992 (P. Champagne, R. Lenoir, F. Poupeau, & M.C. Rivière, Eds.; D. Fernbach, Trans.) Cambridge Malden, MA: Polity.
4. Bourdieu, Pierre.,Wacquant, L. J. D., &Farage, S. (1994). Rethinking the state: Genesis and structure of the bureaucratic field.Sociological Theory, 12(1), 1.
5. Bourdieu, Pierre.,& Johnson, R. (1993). The field of cultural production: Essays on art and literature. New York: Columbia University Press.

6. Bourdieu, Pierre. 1988. Homo academicus. Stanford, Calif: Stanford University Press.
7. Bourdieu, Pierre. 1987. The Force of Law: Toward a Sociology of the Juridical Field, 38, Hastings Law Journal.
8. Deshpande, Satish. 2013. Caste and Castelessness: Towards a Biography of the General Category, Economic and Political Weekly, Vol. 48, No. 15 (April 13), pp. 32-39
9. Goldmann, Lucien. 1977. Towards a sociology of novel. New York: Tavistock publications.
10. Goldmann, Lucien. 1980. Essays on method in the sociology of literature. New York: Telos Press.
11. ధర్మన్న, కుసుమ. 2003. మాకొద్దీ నల్ల దొరతనము. హైదరాబాదు: హైదరాబాదు బుక్ ట్రస్ట్.
12. క్రిష్ణారావు, బెందాళం. 2016. కలాలవనంలో కలుపు మొక్కలు.
13. కొంగర మహేష్. 2017. కలంసత్రం. హైదరాబాదు: శ్రీభగవాన్ పబ్లికేషన్స్.
14. పతంజలి, కె.ఎన్.వై. 2012. పతంజలి సాహిత్యం. మొదటి సంపుటం, సంపుటాలు. హైదరాబాదు: మనసు ఫౌండేషన్.
15. పతంజలి, కె.ఎన్.వై. 1985/2012.పంచదార పత్రికలుండాలి, ఉదయం, మే5. పతంజలి సాహిత్యం, రెండవ సంపుటం. హైదరాబాదు: మనసు ఫౌండేషన్.
16. వేణుగోపాల్, ఎన్. 2014. అవ్యవస్థపై అపహాస్యం, ధిక్కారం పతంజలి అక్షరం. సారంగ సాహిత్య వారపత్రిక మే14.

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అగ్నివసంతం -ఒక విశ్లేషణ

- జొల్కం రాములు, తెలుగు ఉపన్యాసకులు, ఆర్. జి.యు. కె.టి బాసర.

కష్టజీవి శ్రామికుడు కష్టపడుతు స్వేదం చిందస్తూ ఆ స్వేదంలోనే తన జ్ఞానంను సేలయేరుగా, కవిత్వాలను ప్రవాహాలుగా మార్చి కావ్యాలను వెలువరిస్తున్న కవి డా॥ బొలి బాలకృష్ణ సాహిత్యం అంటే కవిత్వం అంటే తెలియదంటూనే కవిత ప్రపచంలోకి తనదైన భావాలను నింపుకొని ఎగురుతున్న కవి బాలకృష్ణ. తన మొదటి కవిత సంపుటిలోని శ్రేష్టులంటే ప్రశంసలు అందుకున్నాడు. కృష్ణవేణి కలంతో రచనల పరంపర కొనసాగిస్తున్నాడు. 2005వ సంవత్సరంలో తాను ఎం.ఏ (తెలుగు) ద్వితీయ సంవత్సరం చుదువకొంటునే ''అగ్నివసంతం'' కవిత సంపుటిని కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్ ప్రచురణలో ప్రచురించి తన దైవ సమానులైన తల్లిదండ్రులు బొల్లిమల్లమ్మ, పోచయ్యలకు అంకితం ఇచ్చాడు.

అగ్నివసంతం కవితా సంపుటి యందు "41" కవితలు కలవు. కవిత ప్రపంచంలోనే ప్రవేశించిన కవి కేరటం బాలకృష్ణ. ఆయన కవితా సంపుటిలోని భావాలన్నియు కవి అంతరంగంలో ఉద్భవించినవి. సమాజంలోని కష్టాలను కన్నీళ్ళలను సౌందర్యాన్ని అసమానతల్ని చూసి ఆక్రోశించి జారిన కన్నీటి భాషలే ఈ కవితా సంపుటిలోని కొన్ని కవితల యందు ప్రాసలు మరి కొన్నింటి యందు దీపాల కాంతులున్నాయి. చెప్పి విషయం స్పష్టంగా సూటిగా నిజాయితీగా చెప్పడం బాలకృష్ణ కవిత లక్షణం అని 'కవి కిషోరం'' ముందు మాట రాసిన "ఆచార్య డా॥ ఎల్లూరి శివారెడ్డి" వివరించాడు. ఈ సువిశాల కావ్య ప్రపంచానికి కవియే సృష్టికర్త. ఈ అగ్ని వసంతంలో కష్టాలు. కడగండ్ల జీవితంలోని మధుర్యాలు ఉన్నాయి కవి చెప్పే విషయం ఎటువంటి మాయ మర్మం లేకుండా సూటిగా చెప్పాడని ఈ ఖండికలోని అక్షరాల జ్వాలలై వెలుతురును చిమ్మాయి అని "ఆచార్య కసిరెడ్డి అక్షరాల జ్వాల అనురాగ హేల'' ముందు మాటలో బాలకృష్ణకు ఆశీర్వచనాలు అందించాడు.

బాలకృష్ణ ఎం.ఏలో నా విద్యార్థి కవిత్వం ఒక తీరని దాహం. దాహార్తియైన బాలకృష్ణ అనంతమైన సాహితీ సాగరంలోకి ప్రవేశించాడు. ఈ సాహితీ సాగరంతో సేదతీరి అద్భుతమైన కావ్యాలు రచించాలని "ఆశిషమ్" ముందు మాటగా "డా. పి. సుమతీ నరేంద్ర" బాలకృష్ణ కవిత పటియను కొనియాడారు. "చైతన్య కిరణాలు" ముందు మాట రాసిన డా॥ ఎం. బాగయ్య మెదడుకు మేతవేసే రచన ఇది. నేడు ప్రజాస్వామ్య వ్యవస్థ లేదని దోపిడిదారు వ్యవస్థ ఉందని ఇలాంటి వారిని ప్రశ్నించే కవితలు అగ్నివసంతలో వున్నాయని విశ్లేషించాడు. నా తల్లిదండ్రుల వల్లే నాకు ఈ సాహిత్యపటిమ అబ్బింది. నా ఉన్నతికి పాటుపడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞత పూర్వక వందనాలు అని కవి తన "మనసులో మాట" ముందు మాటగా చెప్పాడు.

డ్రిల్లింగ్ మిషన్‌ను గట్టిగా
భూగర్భంలోకి చొప్పిస్తున్నారు
ఖాళీ అయిన గోతుల్లోకి
కూలీలను పూడ్చేస్తున్నారు"

(అగ్నివసంతం పుట.1)

మేడేలు వస్తున్నాయి పోతున్నాయి. శ్రామికునికి మాత్రం సరైన ప్రతిఫలం లభించడం లేదు. తెల్లవారితే శ్రామికుడు సుత్తె పట్టుకొని ఎముకలు అరిగెలాగా కష్ట పడుతు, అరిగిన ఎముకులతోనే అందమైన వంతెనలు నిర్మిస్తున్నాడు. తన రక్తమంత చెమట రూపంలోకి మార్చి తన వెన్నుపూసల వెంట కాలువ వలె ప్రవహింపజేస్తున్నాడు. పగలంత కష్టపడి పనిచేస్తే కోల్పోయిన తన శక్తి కోసం గ్లూకోజుకు బదులు సారాని ఎక్కిస్తున్నారు. ఆ మత్తులో అన్ని మరిచిపోయి భవన నిర్మాణాల కోసం తవ్విన గోతులలోనే కూలీలను పూడ్చేస్తున్నారు. అంటు శ్రామిక జీవి గుండె గొంతుకను కవి వినిపించాడు.

తమ శక్తిని ధారవోసి
తమ చెమటను నీరుచేసి
అమృతాలు పండించే రైతన్నలకు
ఆత్మహత్యలే శరణ్యమా !

(అగ్నివసంత పుట.10)

ఆరుకాలం కష్టపడి తమ చెమటను నీరుగా మార్చి పంటలు పండిస్తే ఆ పంటలకు గిట్టుబాటు ధరలు లేక దళారుల చేతిలో మోసపోయి చేసిన అప్పులు తీర్చలేక కుటుంబ భారాన్ని పోషించలేక సమాజంలో తన గౌరవ మర్యాలు పోగొట్టుకోలేక తాను నమ్ముకున్న నేల తల్లిని వదిలి పెట్టలేక పురుగుల మందును పెరుగన్నంలాగా ఉరితాళ్ళను ఊయ్యలగా చేసుకొని ఆత్మార్పణం చేసుకుంటున్నారు అని రైతుల కన్నీటి బాధను వినిపించాడు.

లోకులు పలు కాకులు
ఎడుస్తూనే ఉంటారు
ఎద్దు పుండు కాకికి ముద్దు

(అగ్నివసంతం పుట. 29)

పక్కవాని బాధను పట్టించుకోకుండా తాను సంతోషంగా ఉంటేచాలని కాకుల మనసత్వం వారిది. లోకులు మైకుల లాంటివారు వినేవారు ఉంటే ఎవైన అబద్ధాలు చెప్తారు. ఒకడి ఎదుగుదలను ఎన్నడు మనస్ఫూర్తిగా కోరుకోరు. వెనక గోతులు తవ్వే మనస్తత్వం వారిది. లోకులు వారి మనసత్వంను గూర్చి పరిపరి విధాలుగా వివరించాడు.

మురికిలో మురికై
చిత్తు కాగితా లేరుకుంటూ
పాలిథిన్ కవర్లను వెతుకుంటూ
చెత్తకుండీలలోని కూడుకోసం
వీధి కుక్కలతో పోటీ పడుతూ

(అగ్నివసంతం పుట -43)

నేటి బాలలే రేపటి పౌరులు కాని తినడానికి తిండి లేక తలదాచుకోవడానికి చోటులేక నా అనే బంధాలు లేక మురికివాడలో బతుకుతూ చిత్తు కాగితాలు. పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకుంటూ, చెత్తకుండీలోని తిండి కోసం కుక్కలతో పోటీ పడుతూ కష్టాలు కన్నీళ్ళు అను కొలిమిలో రాటుదేలుతూ బీడి,గుట్కాలతో దోస్తీ చేస్తూ బీరు బ్రాందీలకు బానిసలై మున్సిపాలిటి నీళ్ళ పైపులనే అమ్మలాలనగా ఏకాకిగా పెరిగి అనాధగానే కన్నుమూస్తున్నారని నేటి అనాధ బాలల దీనగాథను కవి వివరించాడు.

తన కలానికి పదును పెట్టి సాహితీ ప్రపంచంలో సాహితీ ప్రియులకు తనదైన భావాలను నింపుకొని అనేక కావ్యాలను అందించాలని ఇలాంటి అనేక కవిత సంపుటాలు కవి కలంనుండి జాలువారాలని మన స్ఫూర్థిగా ఆశిద్దాం.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. అగ్ని వసంతం
2. విరహసమీరాలు.

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

భండారు అచ్చమాంబ మహిళా సంఘాల్ని స్థాపించిందా?

– డా॥ షేఖ్ మతీబూబ్ బాషా, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ హిస్టరీ, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, హైదరాబాద్.

వలసాంధ్రలో మహిళోద్యమాన్ని నిర్మించిన క్రియాశీలక మహిళా మేధావుల్లో ఒకరైన భండారు అచ్చమాంబ అబలా సచ్చరిత్ర రత్నమాల వంటి గొప్ప రచనలు చేసి తను జీవించిన కాలంలోనే విద్వాంసురాలిగా, మేధావిగా ప్రఖ్యాతి చెంది అనేకమంది స్త్రీలు తనను ఆదర్శంగా తీసుకొనే స్థాయికెదిగింది. కేవలం ముప్పై సంవత్సరాలు మాత్రమే జీవించి ఆశ్చర్యం గొలిపే విధంగా క్రియాశీల సాహితీ జీవితాన్ని గడిపిన అచ్చమాంబకు తెలుగులో 'తొలి' కథా రచయితగా ఇప్పుడు గుర్తింపు లభించింది. పలు 'తొలు'లలో శ్లాఘించబడుతున్న భండారు అచ్చమాంబ చరిత్రలోని ఒక చారిత్రక అవాస్తవాన్ని సరిచేయడం, ఆమెకు సంబంధించి మరుగున పడిపోయిన ఒక వాస్తవాన్ని వెలుగులోకి తేవడం ఈ వ్యాసం ఉద్దేశాలు. రెండో విషయంతో మొదలుపెడ్దాం.

ఆంధ్ర ప్రాంతం నుండి దూరంగా ఉండడం కారణంగా (భర్త భండారు మాధవరావుతో కలిసి మధ్య పరగణాల్లోని పలు పట్టణాల్లో జీవించిందామె; ఆయన ఉద్యోగరీత్యా) తొలి తెలుగు పత్రికా సంపాదకురాలు అయ్యే అవకాశం తన తలుపు తట్టినా ఆమె సున్నితంగా తిరస్కరించిందనే వాస్తవం మరుగునపడిపోయింది. 'స్త్రీల ఉపయోగార్థము' హిందూ సుందరి మాసపత్రికను ఏప్రిల్ 1902లో ప్రారంభించిన సత్తిరాజు సీతారామయ్య పత్రికను ప్రారంభించినప్పట్నుంచీ ఎవరైనా ఒక స్త్రీని సంపాదకురాలిగా యేర్పర్చాలనుకుంటూ కొంతమంది స్త్రీలను సంప్రదించారు. వారిలో భండారు అచ్చమాంబ ఒకరు. ఆంధ్ర ప్రాంతం నుండి దూరంగా వుండడం కారణంగా హిందూ సుందరి సంపాదకత్వ బాధ్యతను స్వీకరించ లేనంటూ 23.12.1903న దుర్గ నుండి అచ్చమాంబ రాసిన లేఖను తన స్వీయ చరిత్రలో ప్రచురించారు సీతారామయ్య. ఆ లేఖలోని కొంతభాగం : 'అన్నయ్యా ... అత్యంత హీనస్థితి యందున్న మమ్ముల నున్నత స్థితికి దీనుకొని వచ్చుటకై యత్నింపుచున్న మీయందు మేమందరము శిస్త్రీలమురి మిక్కిలి కృతజ్ఞులమై ఉండవలెను ... మా బాగునకై మీరు మాకు చెప్పిన పనిని శిపత్రికా సంపాదకత్వ నిర్వహణరి కొంచెము సామర్థ్యము కలిగి యున్నను వేము చేసి మీకానందము కలిగింపవలెను. ఇందువలన మీయనుజ్ఞ ప్రకారము నేను సామర్థ్యము లేని దానినైనను శిహిందూరి సుందరిని కొనుటకు సిద్ధముగానున్నానుగాని ఇంత దూరదేశము నుండి నేను దానిని నడుపుటకనేక చిక్కులు గలుగును గాన పేరు నాదైనను భారమంతయు మీపైనే యుండును. అట్లు మీపై భారముంచుట నాకెంత మాత్రము సమ్మతిగా లేక వెనుకనేను సమ్మతింపనైతిని. ఈ సంగతి మీకు తెలియనది కాదు ...'. తనకొచ్చిన అవకాశాన్ని అచ్చమాంబ వినమ్రంగా వదులుకొన్నదనే విషయం దీనిద్వారా స్పష్టమవుతుంది. తర్వాత మొసలి గంటి రమాబాయమ్మ, వెంపల శాంతాబాయమ్మలు డిసెంబరు 1903 నుండి హిందూసుందరి సంపాదకత్వ బాధ్యతను స్వీకరించి తొలి తెలుగు ("హిందూ") స్త్రీ సంపాదకులయ్యారు.

ఆంధ్రలో 'తొలి' స్త్రీల సమాజాన్నేర్పర్చింది అచ్చమాంబేననీ, ఆమె 'స్థాపించింది' అనుకొంటున్న 'బృందావనపుర స్త్రీ సమాజం' యావదాంధ్రలోనే మొట్ట మొదటి స్త్రీల సమాజమనీ ఒక చారిత్రక అవాస్తవం చలామణీలో ఉంది. కొండవీటి సత్యవతి 'తొలి కథ రాసిన అచ్చమాంబే తొలి స్త్రీల సమాజం కూడా స్థాపించింది. తెలుగుదేశంలో అప్పటివరకు స్త్రీలకోసం ఒక సమాజం స్థాపించడం అనే ఆలోచనకూడా లేదు. అలాంటిచోట అచ్చమాంబ చొరవతో మొట్టమొదట స్త్రీ సమాజం 'బందరు స్త్రీ సమాజం' ఏర్పాటయ్యింది' అని స్త్రీ సమాజ స్థాపనా విషయంలో అచ్చమాంబను 'తొలి'గా నిలబెట్టే ప్రయత్నం చేశారు. ముదిగంటి సుజాతారెడ్డి ఇంకొంచెం

ముందుకెళ్లి బృందావనపుర స్త్రీ సమాజాన్నే కాకుండా కాకినాడలోని 'శ్రీ విద్యార్థినీ సమాజా'న్ని కూడా అచ్చమాంబే స్థాపించిందన్నారు. అచ్చమాంబకు బృందావన పుర స్త్రీ సమాజంతో వున్న సంబంధమెలాంటిదనే విషయాన్ని పరిశీలించేముందు అసలు ఈ సమాజం 'తొలి' సమాజమా కాదా అన్న విషయాన్ని చారిత్రకా ధారాలతో చర్చించుకుంటూ పోదాం. దానికన్నా ముందు 'తెలుగుదేశంలో అప్పటివరకు స్త్రీలకోసం ఒక సమాజం స్థాపించడం అనే ఆలోచన కూడా లేదు' అనే అపోహను తొలగించుకొందాం.

ఆంగ్లేయ వలసవాద సంస్కృతితో ప్రభావితులై సంఘ సంస్కరణ పక్షం వహించిన కొందరు పురుషులు తమ కుటుంబాల్లోని స్త్రీలని, మరీ ముఖ్యంగా తమ భార్యల్ని, సభలూ సమావేశాలకు తీసుకెళ్లాలనుకునేవాళ్లు. కుటుంబ ఒత్తిళ్లనీ, సంఘం ఛీత్కారాలనీ లెక్కచెయ్యలేదు వీళ్లు. 1897 జూన్ 9వ తేదీన ఏలూరులో జరిగిన గోదావరి జిల్లా సాంఘిక సభకు 'ఆవఱకెప్పుడును ... పురుషుల సభలకు' రాని స్త్రీలు హాజరవడాన్ని 'విశేషము'గా చెప్పాడు వీరేశలింగం. ఆ రోజే 'బహిష్ఠ' అయినప్పటికీ తన భార్యను తీసుకొచ్చాడు దాసు శ్రీరాములు పంతులు. 'సంబంధమును వదలుకొనెదమని యన్నలు బెదిరించినను లక్ష్యము చేయక' తన భార్యని తీసుకొచ్చాడు సత్తిరాజు కామేశ్వరరావు. తన 'తల్లికి నమ్మతముగ' లేకపోయినప్పటికీ తన భార్య రాయసం రత్నమ్మను తీసుకెళ్లాడు రాయసం వేంకట శివుడు. 'శికందుకూరిరి రాజ్యలక్ష్మమ్మ గారును సభకేతెంచిరి. ఇంక గొందఱు స్త్రీలు కూడ సభకు వచ్చి, స్త్రీల కొఱకు బ్రత్యేకించిన ప్రదేశమున నాసీన లయిరి.' ఈ విధంగా మొట్టమొదటి బహిరంగ సమావేశాలకు - మిక్స్‌డ్ సోషల్ గేదరింగ్స్ ఫర్ సోషల్ కాజెస్ - పురుషుల ప్రోద్బలంతో హాజరయ్యారు ప్రధానంగా బ్రాహ్మణ కులాలకు చెందిన ఆంధ్ర స్త్రీలు.

ఇప్పటిదాకా లభించిన ఆధారాలను బట్టి స్త్రీ ప్రయత్నంతో / చొరవతో స్త్రీలను సమీకరించే పని మొట్టమొదట చేసింది కందుకూరి రాజ్యలక్ష్మమ్మ. స్త్రీలకోసం ప్రత్యేకంగా 'స్త్రీ ప్రార్థనా సమాజాన్ని' నడిపిందామె. ఈ సమాజాన్ని ఏ తేదీన ప్రారంభించారో నిర్దిష్టమైన సమాచారం లభించడం లేదు. వీరేశలింగం ప్రారంభించింది మాత్రం 1878లో -తన ఇంట్లో. 1897కు ముందే 'స్త్రీ ప్రార్థనా సమాజం' ఉనికిలోకొచ్చి బాగా పనిచేసిందనడానికి మాత్రం నిర్దిష్టమైన ఋజువులున్నాయి. 'ఆమె శికందుకూరి రాజ్యలక్ష్మమ్మరి చుట్టుపట్లనుండెడు స్త్రీలను వారమునకొకసారి మధ్యాహ్నము మా యింట గుమ్మికూర్చి యేకేస్వరోపాసనమునకు పురికొల్పి స్త్రీ ప్రార్థన సమాజమును స్థాపించుటయు ...' అనీ '... రాజమహేంద్రవరములో నా భర్యచేత స్థాపింపబడిన స్త్రీ ప్రార్థన సమాజమును మేము చెన్నపట్టణములో నున్న కాలములో చి॥సీతమ్మయే శికొటికలపూడి సీతమ్మరి జరుపుచువచ్చెను' అనీ వీరేశలింగం తన స్వీయ చరిత్రములో ప్రస్తావించారు. భార్యతో కలిసి మద్రాసులో ఆయననున్న కాలము 1897-1905 కాబట్టి 'స్త్రీ ప్రార్థన సమాజము' 1890ల్లోనో లేక అంతకన్నా ముందో ప్రారంభం అయి వుండాలి. దీన్ని బట్టి స్త్రీల ప్రయత్నంతో ప్రారంభమైన మొట్టమొదటి స్త్రీల సమాజం రాజ్యలక్ష్మమ్మ స్థాపించి నిర్వహించిన 'స్త్రీ ప్రార్థన సమాజ'మే అవ్వాలి. ''ఇది 'ప్రార్థన'ల సమాజమే కానీ స్త్రీల 'సెక్యులర్' విషయాల చర్చకు సంబంధించింది కాదు కదా'' అని అభ్యంతరం లేవదీసి దీన్ని మొట్టమొదటి స్త్రీ సమాజంగా ఎవరైనా గుర్తించ నిరాకరించినప్పటికీ 'బృందావనపుర స్త్రీ సమాజా'నికి 'తొలి' స్త్రీ సమాజమనే గౌరవం దక్కదు. ఎందుకంటే స్త్రీల సెక్యులర్ విషయాలను చర్చించిన స్త్రీ సమాజమొకటి ముందే యేర్పడి వుంది.

'తొలి' స్త్రీ సమాజమనుకుంటున్న 'బృందావనపుర స్త్రీ సమాజం' నవంబరు 1902లో మచిలీపట్నం (బందరు)లో యేర్పాటైంది. దానికి సుమారు రెండు నెలల ముందే ప్రస్తుతం ఒడిశాలో ఉన్న గంజాం జిల్లా (అప్పుడు ఉత్తర సర్కారుల్లోని నార్దర్న్‌మోస్ట్ జిల్లా) అస్కా/అసికాలో 18 సెప్టెంబరు 1902లో 'అసికా స్త్రీ సమాజము' స్థాపించ బడింది. ఈ సమాజానికి బుఱ్ఱా బుచ్చిబంగారమ్మ అనే

క్రియాశీలక మహిళా మేధావి కార్యదర్శిగా పనిచేసింది. స్త్రీల పత్రికలయిన తెలుగు జనానా, హిందూసుందరి, సావిత్రిలలో ఈ సమాజ కార్యకలాపాలకు సంబంధించిన అనేక వివరాలున్నాయి. 'ప్రారంభము మొదలు మాసమునకొకతూరి సభలు' జరిపిన ఈ సమాజం స్త్రీ విద్యాభివృద్ధికై బాగా పనిచేసింది. అసికా గ్రామ బాలికలు పాఠశాలకెళ్ళి రావడానికి సమాజ స్త్రీలద్వారా చందాల మూలంగా డబ్బులు సేకరించి ఒక బండినేర్పాటు చేసింది. 18 సెప్టెంబరు 1903న మొదటి వార్షికోత్సవం జరిగే నాటికి 13 సభలు, రెండో వార్షికోత్సవం నాటికి 36 సభలు జరిపిందీ సమాజం. 'ప్రతి సభకును సగటున 22 శిమందిరి స్త్రీలు వచ్చిరి. ఒక్కొక్కప్పుడు 50 సభ్యురాండ్రవఱకు గూడవచ్చిరి'. హిందూస్త్రీల స్థితి, స్త్రీ విద్యావశ్యకత, స్త్రీలలో ఐకమత్యం, స్త్రీ సంఘాల అవసరం, పతిభక్తి, రాజభక్తి, గృహనిర్వహణ, స్త్రీలకు ఇంగ్లీషు విద్యావశ్యకత మొదలైన విషయాలపై చర్చించడం, ఉపన్యాసాలివ్వడం చేసేవారు ఈ సమాజ స్త్రీలు. మొదటి వార్షికోత్సవానికి విశాఖపట్టణం డిప్యూటీ కలెక్టరు భార్య అయిన బుద్ధవరపు వీరలక్ష్మమ్మ అధ్యక్షత వహించింది. ప్రథమ వార్షికోత్సవానికి ఎంత పెద్ద యెత్తున స్త్రీలు వచ్చినారంటే 'ఈ టవును హాలును ప్రజలకు మించిను దొరవారు ఇచ్చినది లగాయతు, ఇట్టిసభ ఎన్నడును జరగకుండెను. టవునుహాలు పెద్దదై యుండియు చాలకపోయెను. ఇట్టి శుభకార్యముల కాటపట్టై ఈ అసికా గ్రామమెంత శోభిల్లుచున్నదో చదువరులారా చూడుడు. ఇట్లవలంబించుడు' అని ప్రథమ వార్షికోత్సవ వివరాలను రిపోర్టు చేసిన ఒక 'స్త్రీ విద్యాభిమాని' ఆనందంతో అన్నారు. ద్వితీయ వార్షికోత్సవానికి పులుగుర్త లక్ష్మీనరసమాంబ అధ్యక్షత వహించింది. వెూచర్ల లక్ష్మీ నరనమ్మ, న్యాపతి రాముడమ్మ, ఎ.గిరిజాబాయమ్మ, రా.లక్ష్మీబాయమ్మ, త్రి.లక్ష్మీ నరసమ్మ, వల్లూరి జోగమ్మ, వల్లూరి మాణిక్యాంబ, గాదె చూడికుడుతమ్మ మొదలైన అనేకమంది స్త్రీలు ఈ సమాజాభివృద్ధికి కృషి చేశారు. కొంతమంది ఆంగ్లేయ స్త్రీలు కూడా తమవంతు తోడ్పాటునందించారు. కొన్ని సాధారణ సభలకు 'బాలికా పాఠశాలలకధికారిణియగు మిస్ గౌ దొరసానిగారు' అధ్యక్షత కూడా వహించారు. 'ఈ సమాజమునకు విద్యావతులును, స్వజాత్యభివృద్ధి గోరువారును, ధనికులునునగు స్త్రీలు సమాజకురాండ్రు గనుండుటవలన సమాజాభివృద్ధికొఱకు గావలసిన వసతులకు లోపమేదియులేదని చెప్పుటకతి సంతోషముగానున్నది' అని కార్యదర్శి బుఱ్ఱా బుచ్చిబంగారమ్మ ప్రకటించింది. 'ఈ సమాజము స్థాపించిన ప్రప్రథమున సమాజోద్దేశములను దెలియజాలని కొందరు స్త్రీలు సభాభవనమునకు వచ్చుటకు జంకినను స్త్రీల యజ్ఞానాంధకారమును దూరీకృతముగా జేయు జ్ఞాన సూర్యుని వంటిదీ సభయని తెలిసిన పిమ్మట నీ సభ సర్వజనాదరణీయమై క్రమక్రమమున నిన్నటికన్న నీ దినమునను నిరుటికంటె నీ సంవత్సరమునను వృద్ధియై వర్ధిల్లుచున్నయది' అని సమాజాభివృద్ధి జరుగుతున్న తీరును వివరించింది.

'బృందావనపుర స్త్రీ సమాజ'మేర్పడేనాటికే ఈ సమాజమూ, యింకా ఒకటీ రెండూ స్త్రీ సమాజాలూ[13] పని చేస్తుండినాయన్న అవగాహన సమకాలీన మహిళా మేధావులకు - ముఖ్యంగా భండారు అచ్చమాంబకూ, పులుగుర్త లక్ష్మీనరసమాంబకూ- వుంది. 24 డిసెంబరు 1902న 'మచిలీ బందరులో... జరిగిన స్త్రీల సభలలో మిన్.హోనా కృష్ణమ్మ, ఎమ్.ఏ. గారు అగ్రాసనాసీనురాలుగానుండ' భండారు అచ్చమాంబ ఉపన్యసిస్తూ '... అయితే స్వదేశమునందుండి శిఆంధ్రలోరి యచటి స్త్రీ సమాజములకు సాయపడు భాగ్యము నాకు లభింపకుండినను నీ మధ్య తెలుగుదేశమునందొకటి రెండు స్త్రీసమాజములేర్పడి పనిచేయుచున్నటుల విని సంతసింపుచుండెడి దానను..' అనడాన్ని బట్టి ఆమెకు 'అసికా స్త్రీ సమాజం' గూర్చి తప్పకుండా తెలిసివుండి వుంటుందని భావించవచ్చు. పులుగుర్త లక్ష్మీనరసమాంబకు బుఱ్ఱా బుచ్చిబంగారమ్మ స్థాపించిన 'అసికా స్త్రీ సమాజం' గూర్చి స్పష్టంగా తెలుసు. 30 జనవరి 1903న

తను కాకినాడలో స్థాపించిన 'విద్యార్థినీ సమాజం' యొక్క ప్రథమ వార్షికోత్సవ వివరాలనూ విద్యార్థినీ సమాజ స్థాపనా చరిత్రనూ వివరిస్తూ 'మన సోదరీమణియు, గుణమణియు, విదుషీమనియు... నగు శ్రీమతి బుఱ్ఱా బుచ్చిబంగారమ్మగారిచే "అస్కా" అను గ్రామమునందు స్థాపింపబడిన స్త్రీ సంఘమునందలి సామాజికురాండ్రు కొంత ధనమును జందాచేసి యచ్చటి గరల్సు స్కూలు నకు బోవు బాలికలకు బండి మొదలగు సదుపాయ ములు చేయుచు ... ఖ్యాతినొందుచుంట మీఱంద ఱెఱింగియే యుందురు' అనడాన్ని బట్టి అప్పటికే అసికా స్త్రీ నమాజం గూర్చి బాగా తెలిసే వుండిందని స్పష్టమవుతుంది.

స్పష్టమైన ఆధారాలు లభిస్తున్నంతవరకు వల సాంధ్రలో స్త్రీల సెక్యులర్ విషయాలను చర్చించిన మొట్టమొదటి స్త్రీ నమాజమైన 'అసికా స్త్రీ సమాజ' నిర్మాతా, కార్యదర్శీ అయిన బుఱ్ఱా బుచ్చి బంగారమ్మ గూర్చి కొంత తెలుసుకుందాం. విశాఖపట్నం వాస్తవ్యులూ పెన్సన్డ్ డెప్యూటీ కలెక్టరూ అయిన దివాన్ బహదూర్ బుద్ధవరపు నారాయణమూర్తి పంతులు బుచ్చి బంగా రమ్మ తండ్రి. వలసాంధ్రలోని వివిధ ప్రాంతాల్లో డిస్ట్రిక్ట్ మునసబుగా పనిచేసిన బుఱ్ఱా వెంకటేశ్వరరావు పంతులు బంగారమ్మ భర్త. సరియైన పాఠశాల విద్యకు నోచుకోని బంగారమ్మ ఇంటివారి సహకారంతోనూ, స్వయంకృషి తోనూ ఇంగ్లీషు భాష సహా వివిధ విషయాల్లో మంచి జ్ఞానాన్నార్జించింది. వలసాంధ్రలో మహిళోద్యమాన్ని నిర్మిం చిన అగ్రగణ్యుల్లో ఒకరైన బంగారమ్మ భర్త ఉద్యోగరీత్యా ఏ ఊరికి బదిలీ అయితే ఆ వూర్లో స్త్రీలను సమీకరించి మహిళా సంఘాలనేర్పర్చేది. 1904లో విశాఖపట్నంలో 'భారతీ సమాజము'నూ, 1910లో కర్నూలులో 'హిందూ స్త్రీ విద్యాభివర్ధనీ సమాజము'నూ స్థాపించింది బంగా రమ్మ. 23, 24 మే 1912న నిడుదవోలులో జరిగిన మూడవ 'ఆంధ్రమహిళా మహాసభ'కు అధ్యక్షత వహిం చింది. మహిళోద్యమం పట్ల ఈమెకు ఎంతగా అంకిత భావం వుండిందంటే నిడుదవోలు సభకు కేవలం ఒక్కరోజు ముందే తన తల్లికి శస్త్రచికిత్స జరిగినా ఉద్య మానికే అధిక ప్రాధాన్యతనిచ్చి అక్కడికి చేరుకుంది. ఈ విధంగా ఆంధ్ర, రాయలసీమల్లో స్త్రీ సంఘాల స్థాపన ద్వారా, బాలికా పాఠశాలల స్థాపన ద్వారా సోదరీతత్వ భావాల పరిమళాన్ని గుబాలింపజేసిన బుఱ్ఱా బుచ్చి బంగారమ్మకే మొట్టమొదటి సెక్యులర్ మహిళా సమాజ నిర్మాతగా గౌరవం దక్కాలి. ఆమెను గూర్చి చెప్పుకోవాల్సిన ముఖ్య విషయం, క్రైస్తవ స్త్రీలతో ఆమె చాలా స్నేహంగా ఉండడం.

ఇక అచ్చమాంబకు 'బృందావనపుర స్త్రీ సమాజం'తో వున్న సంబంధాన్ని పరిశీలిద్దాం. నిడదవోలు వెంకట్రావు అముద్రిత రచన (అనుబంధం) "భండారు అచ్చమాంబ జీవితం" ఆధారంగా కొండవీటి సత్యవతి ఈ సమాజాన్ని "స్థాపించింది" అచ్చమాంబ అంటున్నారు. ఈ సమాజ స్థాపనా విషయాన్ని ప్రస్తావిస్తూ క్రెడిటంతా పురుషులకే వచ్చేవిధంగా రాసుకున్నారు అయ్యదేవర కాళేశ్వరరావు నవ్యాంధ్రము : నా జీవిత కథలో! అచ్చమాంబ సమ కాలీకుల్లో కూడా బృందావనపుర స్త్రీ సమాజ ప్రారంభకత్వ విషయానికి సంబంధించి గందరగోళం ఉంది. కొన్ని ఆధారాల ప్రకారం ఓరుగంటి సుందరీ రత్నాంబ స్థాపకు రాలైతే కొన్ని ఆధారాలు రత్నాంబ, అచ్చమాంబలిద్దర్నీ సంస్థాపకులుగా యిచ్చాయి. సమాజ కార్యదర్శి అయిన మోటుపల్లి రాజాబాయమ్మ 1905-1906 సంవత్సరానికి గాను కార్యదర్శి నివేదికను సమర్పిస్తూ 'సమాజం యొక్క పుట్టుక' గూర్చి యిలా రాసింది : 'ఈ బృందావనపుర సమాజము అబలాసచ్చరిత్ర రత్నమాల గ్రంథకర్తయగు గతించిన శ్రీమతి భండారు అచ్చమాంబగారి వలనను శ్రీమతి ఓరుగంటి సుందరీ రత్నమాంబ ఎమ్.ఏ.గారి వలనను 1902 సం॥రం నవంబరు నెలలో స్థాపించ బడినది. రెండు సభలు మాత్రమే జరిగినవి. అదేమి దురదృష్టమోగాని అంతటితోనే యంతరించెను ...'

ఈ విధంగా అంతరించిన స్త్రీ సమాజాన్ని ప్రభల సత్యవతమ్మ, నాధావధుల సరస్వతమ్మ, వల్లూరు పార్వతమ్మ, టి.సింగమ్మ, సి.పంకజమ్మ తదితరులు 'విశేష

శ్రమచేసి కష్టనిష్టూరములకోర్చి' 17 సెప్టెంబరు 1904న పునరుద్ధరించారు. తొలుత కార్యదర్శులుగా పనిచేసిన సింగమ్మ, సరస్వతమ్మలు మద్రాసు వెళ్లిపోవడంతో రాజాబాయమ్మే 'సెక్రటరీ, ట్రెజరరు, లైబ్రేరియన్'గా పనిచేయాల్సొచ్చింది. 17 సెప్టెంబరు 1905న 'సమాజమను బాలికామణికి ప్రథమ సంవత్సరీకోత్సవము' చేయడం, 17 సెప్టెంబరు 1906న 'ద్వితీయ సంవత్సర మహోత్సవము' చేయడాన్ని బట్టి టెక్నికల్‌గా నవంబరు 1902ను సమాజ ప్రారంభ సంవత్సరంగా తీసుకొన్నప్పటికీ వాస్తవంగా (ప్రాక్టికల్‌గా) పునరుద్ధరించిన 17 సెప్టెంబరు 1904నే ఈ సమాజ పుట్టినరోజుగా సమకాలీన మహిళలు భావించారని స్పష్టమవుతుంది. ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా ప్రసంగించిన ద్రోణంరాజు దుర్గమ్మ ఓరుగంటి సుందరీ రత్నమాంబనే ఈ సమాజపు 'తల్లి'గా వర్ణించింది. ఆమె మాటల్లో : 'యీ బృందావన స్త్రీ సమాజమను బాలికకు కన్నతల్లిగారగు ఓరుగంటి సుందరీ రత్నమాంబగారు 1902వ సంవత్సరములో గర్భవతియయి నవంబరు నెలలో యీ సమాజమను శిశు రత్నమును ప్రసవించెననియు ఆ శిశువును పెంచుటకు ఆమెకు వీలుపడనందున నలుగురిని పోషకులుగా నిపెంపుడు తల్లులుగా నేర్పరచిరనియు, వారు పుత్రికా వాత్సల్యముతో నామెను పెంచుచు 1904వ సంవత్సరము సెప్టెంబరు నెలలో నామకరణము చేసిరనియు తెలియు చున్నది.' దీనిని బట్టి ఓరుగంటి సుందరీ రత్నమాంబే ఈ సమాజపు స్థాపకురాలు. 7 ఫిబ్రవరి 1909 నాటి కృష్ణాపత్రిక ఆధారంగా భండారు అచ్చమాంబ, ఓరుగంటి సుందరీ రత్నమాంబలనిద్దరినీ స్థాపకులుగా చెప్పినారు ప్రముఖ చరిత్రకారులైన వకుళాభరణం రామకృష్ణ.

కానీ వాస్తవంగా ఓరుగంటి సుందరీ రత్నమాంబనే 'బృందావనపుర స్త్రీ సమాజ' సంస్థాపకురాలిగా తీసుకోవాలి. 24 డిసెంబరు 1902న బృందావన పురం (బందరు / మచిలీపట్నం)లో జరిగిన స్త్రీల సభలో భండారు అచ్చమాంబ మాట్లాడినదాన్ని బట్టి మనమీ నిర్ధారణకొస్తున్నాము. ఆమె మాటల్లో : '... నేనిట్లు మీ ముందు మాటలాడ సాహసించుటకంతయు నీయూర గల కొందరు సోదరుల ప్రోత్సాహమును, నాకుగల స్త్రీ జనాభిమానమును గారణము ... నేనీ గ్రామమునకు వచ్చిన పిదప విద్యావిశారదయగు మిస్ హ్యన్నా రత్నము గారీ యూర సతీసమాజమునొకదాని నేర్పరుచుటకై యత్నింపుచున్నారని నాకు దెలిసె ... ఆమెగారి యొక్కయు, తదితరుల యొక్కయు అనుగ్రహము వలన నేడిట్లు మనమందఱము కలిసికొని మాటలాడు భాగ్యము కలిగెను ...' తర్వాత స్త్రీ సమాజాల ప్రాముఖ్యతను వివరిస్తూ అమెరికా ఉన్నత స్థానంలో వుండటానికి స్త్రీ సమాజములే ముఖ్య కారణమనీ, స్త్రీ సమాజాలు ఐకమత్యాన్ని పెంచుతాయనీ, దాంతో కొద్దిపాటి శ్రమతోనే దేశహిత కార్యక్రమాలు చేయొచ్చనీ చెబుతూ అలాంటి అవకాశాన్ని ఓరుగంటి రత్నమ్మ బృందావనపుర సమాజ యేర్పాటు ద్వారా కలుగజేసిందని స్ఫురించేటట్లుగా 'దీనికంతకు ముఖ్యురాలైయుండి మనకందరకు మిక్కిలి శ్రేయోదాయకమగు నీ సమాజము నేర్పరుప నుత్సహించిన మిస్ రత్నముగారి యెడ మనము కృతజ్ఞులమై యుండవలెను' అని సమాజ సంస్థాపనా కర్తృత్వాన్ని ఓరుగంటి సుందరీ రత్నమాంబకిచ్చేసింది అచ్చమాంబ. దీన్ని బట్టి 'బృందావనపుర స్త్రీ సమాజ' స్థాపకురాలు ఓరుగంటి సుందరీ రత్నమాంబేననీ, అచ్చమాంబ కాదనీ, అచ్చమాంబ రాకతో అది ప్రారంభమవ్వడం ఒక సందర్భం మాత్రమేననీ, స్త్రీ సమాజాల్ని స్థాపించాలనే 'ఆలోచన' అచ్చమాంబ కలుగజేయకముందే కొందరు ఆంధ్ర స్త్రీలకుండిందనీ విస్పష్టమవుతోంది.

మిస్ హ్యన్నా రత్నం ఉరఫ్ ఓరుగంటి సుందరీ రత్నాంబ అనే దేశీయ క్రైస్తవ స్త్రీ బృందావన స్త్రీ సమాజ స్థాపకురాలు. మధురైలో బారిష్టరుగా పనిచేసిన మిస్టర్ హెన్స్‌మన్ ఆమె భర్త. భర్త మరణానంతర మీమె బెంగుళూరులోని వాణీ విలాస స్త్రీల కళాశాలకు ప్రిన్సిపల్‌గా పనిచేసింది. ఇండియన్ లేడీస్ మేగజైన్ సంపాదకురాలైన కమలాబాయి సత్యనాథన్ ఈమె సహోదరి. వీరి తండ్రి ఓరుగంటి శివరామకృష్ణమ్మ.

ఇంతదాకా మనం వివరించుకుంటూ వచ్చిన విషయాలు బృందావనపుర స్త్రీ సమాజాన్ని అచ్చమాంబ స్థాపించలేదనీ, అసలా సమాజం ఆంధ్రలో యేర్పాటైన మొట్టమొదటి సమాజం కానేకాదనీ, తొలుదొల్త యేర్పాటైన కొన్ని సమాజాల్లో అది కూడా ఒకటినీ, అచ్చమాంబ 'రాక' ఒక సందర్భం కలుగజేసిందనీ స్పష్టం చేస్తాయి. కేవలం 'ప్రోత్సాహకురాలి'గానే తీసుకోవడం వల్ల ముప్పై సంవత్సరాల్లోనే ఒక నిండు జీవితానికి సరిపడా కార్యాన్ని చేసి మనముందో నిలువెత్తు ఆదర్శాన్ని నెలకొల్పిపోయిన అచ్చమాంబ ఖ్యాతికొచ్చే ధోకా ఏమీ లేదు.

అంత్య సూచికలు :

1. ఇటీవల భండారు అచ్చమాంబ కథల్ని సంపాదించి ప్రచురించిన సంగిశెట్టి శ్రీనివాస్ కానీ, అచ్చమాంబ చరిత్రను రాసిన కొండవీటి సత్యవతి కానీ ఈ విషయాన్ని ప్రస్తావించలేదు.
2. అలా ఆయన సంప్రదించిన వారిలో పులుగుర్త లక్ష్మీనరసమాంబ కూడా ఒకరు. నిజంగానే అతడు ఒక స్త్రీని సంపాదకురాలిగా యేర్పర్చాలనుకున్నాడా లేక త్వరలో నరసమాంబ స్థాపించబోతూండిన సావిత్రి వల్లనూ, తెలుగు జనానాకు సంపాదకత్వం వహించబోతూండిన వీరేశలింగం వల్లనూ హిందూ సుందరి ఎక్కడ వెనుకబడిపోతుందోననే భయం వల్లనా అని చూస్తే, రెండో విషయమే ఎక్కువ ప్రభావం చూపిందని తెలుస్తుంది ఆయన స్వీయ చరిత్రలో వ్యక్తమైన ఆందోళన చూస్తే. తొలి సంపాదకురాలి నాయకత్వంలోని పత్రిక అన్పించే దానికోసమై హిందూసుందరి, సావిత్రి పత్రికల మధ్య అనారోగ్యకరమైన పోటీ నడిచింది. ఈ విషయాన్ని యింకో వ్యాసంలో చర్చించుకుందాం. ఏది ఏమైనా జనవరి 1904లో లక్ష్మీనరసమాంబ సంపాదకత్వంలో సావిత్రి ప్రచురింపబడ్డానికి కేవలం పదిరోజుల ముందు అంటే 20 డిసెంబరు 1903లో మొసలిగంటి రమాబాయమ్మ, వెంపల శాంతాబాయమ్మలను సంపాదకులుగా యేర్పాటు చేసి స్త్రీల సంపాదకత్వంలో వెలువడ్డ మొట్టమొదటి స్త్రీల పత్రిక హిందూసుందరి అన్పించేశాడు సత్తిరాజు సీతారామయ్య!
3. వు. 81-82. 20వ శతాబ్ది తొలి దశకంలో మహిళోద్యమాన్ని, ముఖ్యంగా స్త్రీల పత్రికల చరిత్రనీ అర్థం చేసుకొనేదానికి ప్రత్యేకంగా వుప యోగపడే ఈ విలువైన స్వీయచరిత్రని సీతా రామయ్య మనుమడైన సత్తిరాజు హనుమంత రావుగారు ప్రచురించారు. వీరి అల్లుడైన డాక్టర్. కె.వి.యస్.యస్. నరసింహం గారి ద్వారా మా గురువుగారు కొప్పర్తి వేంకట రమణమూర్తి నాకందేలా చూశారీ పుస్తకాన్ని. వారిద్దరికీ కృతజ్ఞతలు.
4. కొండవీటి సత్యవతి, భండారు అచ్చమాంబ సచ్చరిత్ర, హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, హైదరాబాద్ 2012, పు.36. ఈ పుస్తకం రాసి ఆధునికాంధ్ర చరిత్రకే కాకుండా ఆధునిక భారతదేశ మహిళోద్యమ చరిత్రకూ గొప్ప మేలు చేశారామె.
5. ముదిగంటి సుజాతారెడ్డి, 'తెలంగాణ అందించిన తెలుగు 'తొలి కథలు'', సంగిశెట్టి శ్రీనివాస్ (సంపాదకుడు), భండారు అచ్చమాంబ తొలి తెలుగు కథలు, కవిలె : తెలంగాణ రీసెర్చ్ అండ్ రెఫరల్ సెంటర్, హైదరాబాద్, 2010, పు.viii. ఇది అవాస్తవం. శ్రీ/స్త్రీ విద్యార్థినీ సమాజాన్ని స్థాపించింది పులుగుర్త లక్ష్మీనరసమాంబ : అచ్చ మాంబ కాదు. ఈ విషయాన్ని లక్ష్మీ నరసమాంబ మాటల్లోనే తెలునుకుందాం : 'నేనించుక విద్యారుచి నెఱింగినది మొదలు (అనగా నైదారు సంవత్సరముల నుండి) సోదరీ బృందమగు మనమందఱము నొక సమాజముగా గూడి ... విద్యాభివృద్ధిని, జ్ఞానాభివృద్ధిని గలుగజేయు సదంశముల ముచ్చటించుకొనుచు ... జన్మ సార్థకతను బొందుదమను నుద్దేశము గల్గి యుండెడిదానను. ... ఇట్టి సంఘమునేర్పరచికొని

సోదరీమణులందరితో జ్ఞాన విద్యాధనముల సంపాదించుకొనుదమను నభిలాష గలదాననై, మన సఖీమణియగు శ్రీమతి భండారు అచ్చమాంబగారు మనకు దర్శనంబొసంగుట కీయూరు వేంచేసిన సుదినంబునకు మరునటి దినంబున (అనగా 1903 జనవరి మువ్వదవ తేది శుక్రవారమున) నా సతీమణి యొక్క సదాగమనము సదా మనహృదయములయందు జ్ఞప్తి యుంచుకొనునట్లుగా నాయమతో గూడి యిచ్చటి సఖుల నెల్లర బిల్చికొనివచ్చి మా యింటనొక సభ జరిగించితిని. ... శ్రీమతి అచ్చమాంబగారి యాగమన దినంబును మన శ్రీ, విద్యార్థినీ సమాజము యొక్క జన్మదినంబును నొకటిగా నానందింపుచుండగల్గుదుము ...'. చూడండి : 'శ్రీ, కాకినాడ విద్యార్థినీ సంఘము యొక్క ప్రప్రథమ చర్యా విషయ జ్ఞాపనము', సావిత్రి, మార్చి 1904, పు.1-7; ఈ ఉపపత్తుకై పు.1, 4-5. కొండవీటి సత్యవతి తదితరులు అచ్చమాంబని 'తొలి' స్త్రీ సమాజ స్థాపకురాలంటుంటే, జనవరి 1950 నాటి ఆంధ్రమహిళ (దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ సంపాదకత్వంలో వెలువడింది) పులుగుర్త లక్ష్మీ నరసమాంబ గూర్చి రాస్తూ ఆశ్చర్యకరంగా 'ఆంధ్ర దేశములో మొట్టమొదటి స్త్రీ సమాజమును స్థాపించినదీమెయే' అని అంది! పు.43.

6. కందుకూరి వీరేశలింగం, స్వీయచరిత్రము, రెండవ భాగము, పు.86-87.
7. రాయసం వెంకటశివుడు, ఆత్మచరిత్రము, ఆంధ్ర పత్రికా ముద్రణాలయము, మద్రాసు, 1933, పు. 293-294.
8. రెండవ భాగము, పు.434-435 మరియు 402-403. ఇంకా చూడండి : కనుపర్తి వరలక్ష్మమ్మ, 'ధర్మవత్ని రాజ్యలక్ష్మమ్మ'; కామరాజు హనుమంతరావు, 'పంతులుగారి సంస్థలు', యుగ పురుషుడు వీరేశలింగం, శ్రీకందుకూరి వీరేశలింగం స్మారకోత్సవముల సంఘం, హైదరాబాదు, పు.(వరుసగా) 43 మరియు114.
9. ఈ సమాజ తొలి వార్షికోత్సవాన్ని రిపోర్టు చేసిన ఒక 'స్త్రీ విద్యాభిమాని' బుఱ్ఱా బుచ్చి బంగారమ్మ ఈ సమాజ స్థాపకురాలని ఒక్కరికే క్రెడిట్ యివ్వకుండా 'అసికా పట్టణములో కొందరు స్త్రీలు దీనిని స్థాపించి'నారని చెప్పి స్త్రీల ఉమ్మడి ప్రయత్నాన్ని స్ఫురింపజేశారు. 'అసికా స్త్రీ సమాజపు సంవత్సరోత్సవము', శ్రీతెలుగురి జనానా పత్రిక, అక్టోబరు 1903, పు.115-17. కానీ వార్షికోత్సవంలో మాట్లాడిన శ్రీమతి సుబ్బమ్మ సమాజావిర్భావానికి ప్రధాన కారకురాలు బంగారమ్మేనని నొక్కి చెప్పింది. పు.116.
10. బుఱ్ఱా బుచ్చిబంగారమ్మ, 'అసికా స్త్రీ సమాజము యొక్క ద్వితీయ సంవత్సర జ్ఞాపనము', సావిత్రి, అక్టోబరు 1904, పు.1-4. (ఇకపై 'ద్వితీయ సంవత్సర జ్ఞాపనము')
11. 'అసికా స్త్రీ సమాజపు సంవత్సరోత్సవము', తెలుగు జనానా పత్రిక, అక్టోబరు 1903, పు.117.
12. 'ద్వితీయ సంవత్సర జ్ఞాపనము', పు.3-4. ఈ సమాజం నిర్వహించిన జమాలెక్కల పద్దు ఎంతో ముచ్చటగా అన్పిస్తుంది. ప్రతి విషయంలోనూ ఎంతో పారదర్శకత కనిపిస్తుంది.
13. మొసలిగంటి రమాబాయమ్మ రాజాం, చోడవరం మొదలైన ప్రాంతాల్లో స్త్రీ సమాజాల్ని స్థాపించి మహిళాభివృద్ధికి పాటుపడ్డట్టుగా స్త్రీల పత్రికల్లో సమాచారం లభిస్తున్నప్పటికీ సదరు సమాజాల స్థాపనాకాలానికి సంబంధించి నిర్దుష్టంగా తెలియక పోవడంతో వాటిని ఈ వ్యాసంలో చర్చించలేదు.
14. 'అచ్చమాంబగారి ఉపన్యాసము', హిందూ సుందరి, జులై 1903, పు.1-12; ఈ ఉపపత్తుకై పు.2.
15. 'శ్రీ, కాకినాడ విద్యార్థినీ సంఘముయొక్క ప్రప్రథమ చర్యా విషయ జ్ఞాపనము', సావిత్రి, మార్చి 1904, పు.4.

16. 'పత్రికా సంపాదకురాలి వ్యాసము', వివేకవతి, సెప్టెంబరు 1912, పు.353-354.
17. 'భారతీ సమాజము, విశాఖపట్టణము', వివేకవతి, జులై 1912, పు.301-302.
18. 'హిందూ స్త్రీ విద్యాభివర్ధనీ సమాజము', వివేకవతి, మే 1912, పు.254.
19. 'ఆయాచోట్ల జరిగిన సంగతులు : ఆంధ్ర మహిళాసభ', వివేకవతి, జులై 1912, పు.318.
20. ".... బండారు అచ్చమాంబగారు ఆమె భర్త కూడ బందరుకు మా ఇంటికి వచ్చి 4,5 రోజులుండిరి. అవుటపల్లి నారాయణరావుగారు శిక్షాపత్రిక ఉపసంపాదకులురి ... నాకు గొప్ప స్నేహితులు. ఆయనతో సంప్రదించి బందరుకు అచ్చమాంబ గారు వచ్చిన అవకాశమును తీసుకొని యొక స్త్రీ సమాజమును స్థాపించవలయునని తలచి ఒక ఆహ్వానమును పంపగా బందరులోని లాయర్లు, ఉపాధ్యాయులు మొదలైనవారంతా తమతమ స్త్రీలను ఆ సభకు పంపినారు." పు.63.
21. హిందూ సుందరి, డిసెంబరు 1906, పు.10-16; ఈ ఉపపత్తుకై పు.10-11.
22. పైదే.పు.10-16.
23. ద్రోణంరాజు దుర్గమ్మ, 'బృందావనపుర స్త్రీ సమాజము', హిందూసుందరి, డిసెంబరు 1906, పు.7-10; ఈ ఉపపత్తుకై, పు.7-8.
24. వి.రామకృష్ణ, సోషల్ రిఫామ్ ఇన్ ఆంధ్రా (1848-1919), వికాస్ పబ్లిషింగ్ హౌస్ ప్రై.లి., న్యూఢిల్లీ, 1983, పు.98.
25. 'అచ్చమాంబగారి ఉపన్యాసము', హిందూసుందరి, జులై 1903, పు.1-2.
26. పైదే.పు.3.
27. అయ్యదేవర కాళేశ్వరరావు, నవ్యాంధ్రము : నా జీవిత కథ, తెలుగుసమితి, హైదరాబాదు, 2006, పు.38.

కృతజ్ఞతలు :

పితృతుల్యులు ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ, ప్రొఫెసర్ షేక్ మస్తాన్ గార్లకూ, గురువర్యులు శ్రీ కొప్పర్తి వెంకట రమణ మూర్తి గారికీ, మిత్రులు శ్రీ జి.శ్రీనివాస్, ఐఏఎస్ గారికీ, షేక్ పులివీడు గఫార్ భాయ్, డాక్టర్ బి.ఆర్. ప్రసాద్ రెడ్డి, శ్రీ రామినేని భాస్కరేంద్రరావు గార్లకు హృదయపూర్వక కృతజ్ఞతలు.

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

గోండి సంస్కృతి - దండారి నృత్యం

- వై. శ్రీనివాస్ రాథ్, తెలుగు అధ్యాపకులు

భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం. భారతదేశంలో అనేక కులాల, మతాల వారు జీవనాన్ని కొనసాగిస్తున్నారు. వారిలో గిరిజనుల అనే వారు కూడా ఒక తెగకు చెందిన వారు. భారతరాజ్యాంగం ప్రకారం గిరిజనులను, ఆది వాసులు, సంచార జాతులు అనే పేర్లు ఉన్నాయి. నేను ఈ వ్యాసంలో మూడు పేర్లను ఒకే ఉద్దేశంతో వాడడం జరిగింది.వారిలో తెలంగాణలో జీవనం కొనసాగిస్తున్న గొండుల ఒకరు. వీరి ఆచారంలో ఒక భాగం దండారి నృత్యం. ఆ నృత్యం గురించి వివరించడమే ఈ వ్యాసం యొక్క ఉద్దేశం.

గిరిజనుల పుట్టుక, సంస్కృతి గురించి ప్రముఖ రచయిత బాలగోపాల్ అభిప్రాయాన్ని గమనించినట్లయితే " గిరిజనులు అనగానే తలలో ఈకలు, మొలలో గజ్జలు ఉండే విచిత్ర జీవులని, సామాన్య నాగరికులు భావిస్తారు. ఎక్కడో అడవులల్లో నివశిస్తు తెల్లబట్టలు కనబడగానే పారిపోయే బయస్తులు అని కొంత చదువుకున్న వారు భావిస్తారు. గిరిజనుల మాటల్లో చెప్పాలంటే వాళ్ళు తమను తాము 'కొండమనుషులు' గాను 'అడవి మనుషులు' గాను వర్ణించుకుంటారు. ఈ రకంగా చూస్తే వాళ్ళకు మనం పెట్టుకున్న గిరిజనులు, ఆటవికులు అనే పేర్లు వాళ్ళ చైతన్యం యొక్క సంస్కృతీకరణేనని వివరించు కుంటున్నాము" అని భావించారు.

మూలాలను పునర్దర్శిండం, పున: స్మరించడమే సంస్కృతి.ఒక సమాజ జీవనంలో మిళితమైన ఆచారాలు, పద్ధతులు, ఆహారపు అలవాట్లు, వస్త్రధారణ, భాష, మతం, ఆటలు, విశ్వాసాలు, కళలు, అభివాదాలు, లౌకిక, వైజ్ఞానిక, భావోద్వేగ అంశాలు అన్ని కలిసి ఆ సమాజ సంస్కృతి అవుతుంది.

గోండి నంస్కృతి విభిన్నమైనది. మూలాలను పునర్దర్శిండం, పున: స్మరించడం అనే విలక్షణత గోండి సంస్కృతిలో ప్రత్యేకించి దండారీ నృత్యంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

మనిషి బ్రతుకులో అనుభవించే సంతోషం, దు:ఖం, వేదన, ఆప్యాయత, పుట్టుక, చావు మొదలైనవి లయాత్మక మైన కదలికలుగా మారి నృత్యమని పించుకున్నాయి. నృత్యం మానసికమైన అవసరం. మనిషికి తృప్తినిస్తుంది. మనిషి నమ్మకాలకు, ఆచారాలకు, సంప్రదాయాలకు నృత్యం ప్రతినిధిగా నిలుస్తుంది. నృత్యం మానవుని మొదటికళ. ఆదిమానవుడు ప్రకృతిని అనుకరిస్తూ, ఆరాధిస్తూ, గంతులు వేసి ఆడి నృత్యం నేర్చుకున్నాడు.

జానపద, గిరిజన నృత్యాలలో వ్యక్తి కంటే సమష్టికే ప్రాధాన్యం సామూహిక ఐక్యతను ప్రేరేపించే వాహికలు గిరిజన నృత్యాలు. నేటి జానపద నృత్యాలకు గోండులు, కోలాములు, కోయలు మొదలైన గిరిజన జాతులు చేసే నృత్యాలే ఆధారం. గిరిజన నృత్యాలలో గోండుల దండారి నృత్యం ప్రముఖమైనది. ఆచార్య బి. రామరాజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ జానపద నృత్యాలలో గోండుల గుసాడి(దండారి) నృత్యానికి ప్రముఖ స్థానమిచ్చాడు.

గోండుల సంక్షిప్త చరిత్ర :

క్రీ.శ. 870 నుండి గోండు నాయక వ్యవస్థ అందు బాటులో ఉంది. గోండు నాయకుడు కోల్‌భిల్ క్రీ.శ. 1220లో గోండు రాజ్యస్థాపన చేశాడు. అతడి సంతతి వారు క్రీ.శ.1751 వరకు గోదావరి నది ఉత్తర ప్రాంతం నుండి వింధ్య సాత్పుర పర్వతాల వరకు గల విశాల భారత భూభాగాన్ని పాలించారు. ఛత్తీస్‌గఢ్, బస్తర్,

చాందా, చంద్రపూర్, మానిక్‌గఢ్, ఉట్నూర్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలలో విశాలమైన గోండురాజ్యముండేది. బ్రిటీష్ వారి నుండి నైజాము నుండి గోండు రాజులు వీరోచిత పోరాటాలతో తమ రాజ్యాన్ని కాపాడుకున్నారు. క్రీ.శ. 1803 నుండి పెన్‌గంగా నదికి గల దక్షిణ ప్రాంతం, నిజాం ఆధీనంలోకి ఉత్తరప్రాంతం బ్రిటీష్ వారి ఆధీనంలోకి వెళ్లిపోయాయి.

గోండుల సంస్కృతి :

భారతీయ సంస్కృతిలో గోండి సంస్కృతి చాలా పురాతనమైనది. విశిష్టమైనది. మానవుడు ప్రాకృతిక వ్యవస్థలో ఉన్నపుడు గోండి సమాజ నిర్మాణం జరిగింది. గోండులు కనిపించని అదృశ్య శక్తులతో పాటు ప్రకృతిని ఆరాధిస్తారు. ప్రత్యేక ఆచార వ్యవహారాలతో జీవిస్తారు. గోండి సంస్కృతి చాలా నియమనిబంధనలతో రూపకల్పన చేయబడింది. స్త్రీలకు, పురుషులతో సమాన గౌరవ మర్యాదలున్నాయి. గోండులు తమ జీవితంలోని ప్రతి ముఖ్య ఘట్టాన్ని పండుగలు, నృత్యాలతో సమష్టిగా ఆవిష్కరించుకుంటారు. దీపావళి పండగ సందర్భంగా దండారి నృత్యాన్ని చేస్తారు.

దండారి నృత్యం విశిష్టత :

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సంఖ్యాపరంగా, సాంస్కృతికంగా ప్రబలంగా ఉన్న గిరిజన తెగ గోండు గిరిజన జాతి. వీరి పండగలు, జాతరలు విభిన్నంగా ఉండి ప్రత్యేకతను సంతరించుకున్నాయి. గోండుల జీవన విధానం సమష్టి తత్వాన్ని కలిగి ఉంటుంది. జాతరైనా, పండగైనా, ఆచారమైనా, సంప్రదాయమైనా వ్యవహార మైనా, వ్యవసాయమైనా సామూహికంగా పాలుపంచుకొని జరుపుకుంటారు.

గోండులు జరుపుకునే పండుగల్లో దీపావళి ఎంతో ముఖ్యమైనది. జొన్న,మొక్కజొన్న ఇతర ఆహార పంటలు ఇంటికి వచ్చే పండుగ కాబట్టి ఈ పండుగ పంటల పండుగ. గోండులు దీపావళి సందర్భంగా జరుపుకునే సంబురం దండారి. ఈసందర్భంగా గూడెంలోని చిన్నా, పెద్దా, ముసలీ, ముతకా కలిసి చేసే నృత్యాన్ని 'దండారి' నృత్యం అని పిలుస్తారు. 'దండు' లేదా సమూహంగా జరుపుకుంటారు కాబట్టి దండారి అనే పేరు వచ్చింది. ఈ నృత్యంలో నెమలి ఈకలు, రంగుటద్దాలతో తయారు చేసిన తలమకుటం ధరించి విచిత్ర వేషధారణతో ఉండేవారిని 'గుసాడీ'లు అంటారు. దండారిలో గుసాడీలు కూడా పాలు పంచుకొని చేసే నృత్యం కాబట్టి 'గుసాడి' నృత్యం అని కూడా పిలుస్తారు.

గూడెం లోని ప్రతి వ్యక్తి పాలు పంచుకొని ఆడుతూ పాడుతూ చేసే నృత్యం దండారి. ఇందులోనే గుసాడీలు తమ ఆటపాటలతో అలరిస్తూ, అల్లరి చేస్తూ నృత్యం చేస్తారు. 'గుసాడి' అంటే గోండి భాషలో 'అల్లరి' అని అర్థం. గుసాడి నృత్యం దండారీలో ఒక భాగం. దండారి నృత్యాన్ని గోండుల దివాడ్ (అశ్వయుజ) నెలలో ప్రారంభించి దీపావళి రెండు రోజులకు ముగిస్తారు.

దండారి, గుస్సాడి ఒక్కటేనా :

దీపావళి పండుగ రోజుల్లో ఒక సమూహంగా, దండుగా గోండులు చేసే నృత్యాన్ని దండారి అని పిలుస్తారు. దండారిలో నృత్యం చేసే కళాకారున్ని గుస్సాడి అంటారు. గుస్సాడిలు చేసే నృత్యం కాబట్టి గుస్సాడి నృత్యం అని వ్యవహారంలో స్థిరపడిపోయింది. కానీ, గుస్సాడిలు ఒక్కరుగా కానీ, బృందంగా గానీ కాకుండా ఒక దండుగా నృత్యం చేస్తారు. కాబట్టి గుస్సాడిల నృత్యం అని బహువచనంలో వ్యవహరించాలి. గుస్సాడి నృత్యం అని పలకడం సమంజసం కాదు. దండారి నృత్యం అన్నదే సమంజసమైనది.

దండారి నృత్య ప్రదర్శన :

గోండులు వస్త్రాభరణాలు అలంకరించుకొని బృందంగా ఏర్పడి కొమ్ములూదుతూ, తొప్పట్లు వాయిస్తూ

తమ పురాణ గాథలలోని 'దండారియారౌడ్', 'సిసిసెర్మా రౌడ్' అనే కథానాయకులను స్మరిస్తూ వలయాకారంగా ఏర్పడి లోపలి వైపు తిరిగి నిల్చొని దండారి నృత్యం చేస్తారు. బృందం ఎడమవైపు నెమ్మదిగా అడుగులు వేస్తూ, అడుగులు వేసినప్పుడల్లా కుడిపాదాన్ని ఎడమకాలి మీదికి ఊగిస్తుండడంతో నృత్యం ప్రారంభమవుతుంది. నర్తకుల చేతిలో రెండు కోలాటం కర్రలుంటాయి. ఒకదానితో మరొకటి తాకిస్తారు. అడుగులు వేస్తూ వంగి కర్రను నేలకు తాకించి నాలుగు దిక్కులకూ అడుగులు వేసి దేవతలకు ప్రణమిల్లుతారు. అనంతరం కర్రలు పాదాల వద్ద ఉంచి పాటకు అనుగుణంగా చేతులతో చప్పట్లు కొడతారు. ఒక బృందం చరణాన్ని ముగించగానే రెండవ బృందం రెండవ చరణాన్ని అందుకొంటూ బృందగానం చేస్తారు. వీరికి గుమేలా, డప్పు, తుడుం, పిప్రే, బాకా, కాలీకోమ్ మొదలైన వాయిద్యాలతో వాద్యబృందం హుషారు కలిగిస్తూ లయబద్ధంగా నృత్యం చేసేలా చూస్తారు.

దండారిలోకి గుసాడీల ప్రవేశం - నృత్యం :

దండారి నృత్యం కొనసాగుతుండగా హఠాత్తుగా గుసాడీలు వలయంలోకి చొచ్చుకొని వస్తారు. తలకు నెమలిపింఛాలు, రంగుటద్దాలతో తయారుచేసిన మకుటం ధరిస్తారు. కృత్రిమ గడ్డాలు,మీసాలు శరీరంపై జింక లేదా మేక చర్మం ధరించే గుసాడీల చేతుల్లో కర్రలుంటాయి. మెడలో గవ్వల హారాలు, తుంగకాయల హారాలుంటాయి. నడుముకు, మణికట్టుకు గజ్జెలుంటాయి. శరీరమంతా బూడిద, కంటిచుట్టూ తెల్లరంగు పూసుకుంటారు. మొలకు నారింజరంగు లంగోటి తప్ప ఏ ఇతర ఆచ్ఛాదన ఉండదు. శరీరంపై నలుపు చారల చుక్కలతో వింత వింత అలంకరణలుంటాయి. సామగ్రి పెట్టుకోవడానికి ఒక సంచి ఉంటుంది. ఈ గుసాడీలు నృత్యంలోకి ప్రవేశించగానే దండారీలు చెల్లా చెదురౌతారు. ఇది ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతుంది. 'గుస్సాడి రోకల్' అనే దండాన్ని పట్టుకొని లయబద్ధంగా నృత్యం చేస్తారు. గుసాడీలు నృత్యం చేయడానికి ఒక గూడెం నుండి మరొక గూడేనికి తలరివెళ్తారు. గుసాడీలు అత్యంత నియమనిష్ఠలతో ఉంటారు. వేషం ధరించిన నాటి నుండి పండుగ ముగిసే వరకు స్నానం చేయరు. వేషం తీయరు.

'భోగి' రోజున పటేల్ ఇంటి ముందు నృత్య పరికరాలు, గుసాడి వేష వస్తువులు ఒకచోట చేర్చి పెర్సాపేన్ పూజ చేసి దండారి నృత్యాన్ని ప్రారంభిస్తారు. అదే రోజు గుసాడీలు వేషం ధరిస్తారు. 'కొలబోడి' రోజున దండారిలో ఉపయోగించిన పరికరాలు, వస్తువులను పటేల్ ఇంటి ముందు ఉంచి పూజలుచేసి ఎవరి వస్తువులు వారి ఇళ్లకు తీసుకువెళ్తారు. ఇదే రోజున గుసాడీలు వేషం తీసి, స్నానం చేస్తారు. ఈ విధంగా భోగితో మొదలైన దండారి నృత్యం కొలబోడితో ముగుస్తుంది.

దండారి అస్తిత్వం - భవిష్యత్తు :

గోండులు నాగరికత ప్రభావానికి లోనైనా తమ సంస్కృతిని అస్తిత్వాన్ని కాపాడుకుంటున్నారు. కాల గమనంలో వచ్చే మార్పులు గోండుల సంస్కృతిలోకి ప్రవేశిస్తున్నాయి. దీంతో వారి సంస్కృతి మార్పులు చెందే ప్రారంభదశలో ఉంది. నృత్యాల్లో ఆధునిక వేషధారణలు చోటు చేసుకుంటున్నాయి. కేవలం దండారి సమయంలోనే తీయాల్సిన తలమకుటాలను ప్రభుత్వ కార్యక్రమాల కోసం, ఇతర ప్రదర్శనల కోసం తీస్తున్నారు. నాయకులకు స్వాగతం పలికే సందర్భాల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో గుసాడీలు నృత్యం చేస్తున్నారు. పాత తరం గోండులు తమ నియమ నిష్ఠలకు భంగం కలుగుతోందని వాపోతున్నారు.

తెలంగాణ ప్రభుత్వం గోండుల దండారి నృత్యాన్ని తెలంగాణ సాంస్కృతిక ప్రతీకగా ప్రకటిస్తే తన అస్తిత్వాన్ని

కాపాడుకొని భవిష్యత్తు తరాలకు సంప్రదాయ గోండుల నృత్యం కలకాలం వీక్షించే అవకాశం కలుగుతుంది.

లేకపోతే చాలా నృత్యాలు కనుమరుగయినట్టు, ఈ నృత్యం కూడా కనుమరుగయ్యే అవకాశం ఉంది.

ఉపయుక్త గ్రంథసూచి :

1. మనోహర్, మెస్రం.1999. గొండి సంస్కృతి. ఉట్నూర్: స్వీయ ప్రచురణలు.
2. రాధాకృష్ణమూర్తి, మిక్కిలినేని. 2011. తెలుగువారి జానపద కళారూపాలు. హైదరాబాదు : తెలుగు విశ్వవిద్యాలయం.
3. రామరాజు, బి. 1997. పోక్‌లోర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్. న్యూఢిల్లీ: నేషనల్ బుక్ ట్రస్ట్.
4. శాస్త్రి, బి.యన్. (సం) 1990.ఆదిలాబాద్ జిల్లా సర్వస్వము. హైదరాబాదు: మూసీ ప్రచురణ.
5. అడవిలో వెన్నెల (గిరిజన పోరాట కథలు) -1985.

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వసంతరావ్ దేశ్‌పాండే నవలలో గిరిజనుల వెతలు

- బానోతు కృష్ణ, తెలుగు విభాగం, అంబేడ్కర్ విశ్వవిద్యాలయం.

గిరిజన సాహిత్య పరిచయం :

తెలుగు సాహిత్యానికి దాదాపు వేయి సంవత్సరాల చరిత్ర ఉంది. అదేవిధంగా గిరిజన సాహిత్య ప్రస్తావనను చూపినట్లయితే నామమాత్రంగా ఉందని చెప్పవచ్చు. ఇక ఆధునిక సాహిత్యం విషయానికి వస్తే సాహిత్య ప్రక్రియలలో సమకాలిన జీవితానికి దర్పణంగా గిరిజన రచనలు స్పృశిస్తున్నాయి. తెలంగాణ ప్రాంతలో గిరిజన సాహిత్యం కేవలం ప్రతిపక్ష భావజాలంతో వచ్చిన సాహిత్యం తప్ప ఏ రచన అంతగా రాలేదు. తెలంగాణ ప్రాంత పోరాటం వివిధ దశలను నవలలుగా, కథలుగా, కవిత్వంగా ప్రతిఫలించిన తెలుగు సాహిత్యంలో కొమురం భీం నాయకత్వాన జరిగిన సాయుధ తిరుగుబాటును చిత్రించిన రచన ఏదీ రాకపోవటాన్ని బట్టి గిరిజన సాహిత్యం వెనుకబాటుతనం ఉందనే బాల్‌గోపాల్ మాటల్లో ఎంతో వాస్తవం ఉంది. తెలంగాణలో వెలువడిన గిరిజన సాహిత్యం జీవిత చిత్రణ కంటే గిరిజనుల యొక్క పోరాటం, వెతలు ముడిపడిన సంఘటనలను ఇతివృత్తంగా తీసుకున్నారు. గిరిజనులు ప్రకృతిపైన విచిత్రమైన భ్రమలను ఏర్పరచుకుంటారు. కాని గిరిజనుల సంస్కృతి విధానమంతా అనేక విశ్వాసాలతో కన్పిస్తుంది. గిరిజన సంస్కృతిలోని ఉన్నతమైన లక్షణాలను కాపాడాలంటే ఈ ఆధునిక గిరిజన సాహిత్యంలో సమకాలిన పరిస్థితులకు అనుకూలంగా రచనలు అధికంగా రావాలి.

తెలుగు సాహిత్యంలో దాదాపు గిరిజనేతరుల నవలలు మాత్రమే వచ్చాయి. గిరిజనుల యొక్క పోరాట శక్తిని, సాధక బాధలను ఇతివృత్తంగా తీసుకొని నవలలుగా రూపొందించబడ్డాయి. ఇలాంటి నేపథ్యం వసంతరావు దేశ్‌పాండే చేత పురుడు పోసుకున్న నవలలు అడవి ఊరు.

అడవి నవల :

వసంతరావు దేశ్‌పాండే వ్రాసిన 'అడవి' నవల ఒక సంచలనం ఈ వనలలో ముఖ్యంగా గిరిజన జీవితం ఎలా ఉండేదో, అరణ్య ప్రాంతాలలోని అమాయకులైన గిరిజనులపై అధికారుల ఆకృత్యాలకు బలైపోయిన విధానం, గిరిజనులలో జంగు, కొమురం భీం మార్గ దర్శకత్వం, గిరిజనులలో చైతన్యాన్ని నింపి నిజాంకు వ్యతిరేకంగా పోరాడే తీరును సజీవంగా చిత్రించాడు. ఇంద్రవెల్లి సంఘటనలలో గిరిజనుల దీన స్థితులను ఇతివృత్తంగా తీసుకొని రచించిన నవల 'అడవి' స్వాతంత్ర్యానికి పూర్వమే గిరిజనుల జీవన స్థితిగతులు, అడవి బిడ్డలు అడవుల్లో బతకలేకపోతున్నారు. గిరిజనులు సేద్యం చేసుకొనే భూమి పట్టాకోసం జీవితాంతం పోరాటం చేయాల్సిన పరిస్థితి. జమీందారులు, భూస్వాములు వారి పేర్ల పైన పట్టా చేసుకుంటారు. ఇలా అమాయక గిరిజన ప్రజలపై దాడులు చేసుకుంటూ వారికి అందినంత దోచుకోవడంలో వారి నిరంకుశత్వాన్ని ఈ నవల ద్వారా తెలియజేస్తాడు.

స్వాతంత్ర్యానికి పూర్వమే గిరిజనులపై జరుగుతున్న దోపిడీ దౌర్జన్యాలు 'అడవి' నవలలో చిత్రించారు. గిరిజనులు నివసించే ప్రాంతాల్లోకి, జీవితాల్లోకి పెట్టుబడిదారులు, దోపిడీ దారులు రావడం వలన అమాయక గిరిజనులు ఎలా నష్టపోయారో ఈ నవలలో రచయిత తెలియజేస్తాడు. నిజాం కాలం నుండి ప్రస్తుత కాలం వరకు ఎలా బ్రతకాలో, ఎలా పోరాటం చేయాలో వంటి విషయాలలో 'అడవి' నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తుంది.

ఇంద్రవెల్లి సంఘటన 1981 సంవత్సరంలో గొండు నాయకులు, కొలాములు మొదలైన గిరిజనుల బాధాకరమైన జీవితాన్ని సమర్థవంతంగా చిత్రించిన నవల 'అడవి' 1918కి ముందు అడవి భూములను ప్రభుత్వానికి ఎటువంటి అధికారం లేదు. సివాయి జమాబంది (పన్ను

లేకుండా దున్నుకునే భూములు) గిరిజనులు ప్రాంతానికి వ్యాపారం చేయడానికి వచ్చి అమాయక గిరిజనులను హింసించేవారు. దేవుబాయి నువ్వులు తీసుకొని వచ్చి మళ్ళీ కొలిచాడు. తక్కువ రావడం వంటి మోసపూరిత నిర్ణయాలు కళ్ళకు కట్టినట్లు చిత్రిస్తాడు రచయిత. పిట్ట బొంగారం గ్రామ మొకాషి అత్రం రామారావు హఠాత్తుగా చనిపోతాడు. రామారావు పేరుపై రెండు వందల ఎకరాలు న్నాయి. రామారావు కుమార్తె దేవుబాయిపై తాసీల్‌దారు కళ్ళు పడ్డాయి. ఆమెను అత్యాచారం చేయబోయాడు కాని దేవుబాయి తప్పించుకొని వచ్చింది. కాని ఆమె తండ్రి పేరుపై ఉన్న రెండు వందల ఎకరాలను తాసీల్‌దారు అండతో పటేల్ ఖరీజ్ ఖాతాలో కలిపేసుకుంటారు. దేవుబాయి తండ్రి చనిపోయిన తట్టుకున్న తన భూమి సర్కారు కబ్జా చేసిందంటే విషాద ఛాయలు అలుము కున్నాయి. ఇదే కాకుండ ఇంక ఫక్రు, కుస్రు కొండకు, మాధు పోడు వ్యవసాయం చేయడానికి వెళ్తుంటే చౌకీదారు ఎదురై చాలా హింసిస్తాడు.

జంగ్లాత్ కొలాములపై చేసే హింసాత్మక సంఘటన లను ఈ నవలలో పేర్కొన్నారు రచయిత. శ్యామకొలామ్ ఇంటికి వచ్చి పన్ను కట్టాలని శ్యామకొలమ్ లేని సమయంలో వారి భార్యపిల్లలపై అఘాయిత్యానికి పాల్పడుతాడు సేనేదార్. పన్ను కట్టలేని కొలాములపై తీవ్రంగా దాడులు చేసే వారి భయభ్రాంతులను చేసే సంఘటనలను ఈ నవలలో చూడవచ్చు.

అడవి నవలలో కరుణరసాన్ని పోషించిన మరొక్క సంఘటన దేవుబాయి, జంగు, సోములను గంజాయి చెట్లు ఎక్కడ ఉన్నాయో తెలియజేయాలని వారిని చిత్రహింసలు పెట్టడం పాఠకులకు కళ్ళకు నీళ్ళు వచ్చే విధంగా వసంతరావ్ దేవ్‌పాండే కరుణాత్మకంగా చిత్రించాడు. దయ, సానుభూతి ఏ మాత్రం లేని అమీన్, ఠానేదార్‌లు సోమును గంజాయి చెట్లు ఎక్కడ ఉన్నాయో చెప్పమని గుర్రానికి కట్టి ఈడ్చుకెళ్లి చిత్రహింసలు పెడతారు. సోమును ఆ పరిస్థితిలో చూడలేక బావ అయిన జంగు గుంజతో ఠానేదార్ తల పగలగొట్టి, అరణ్యంలోకి పారిపోతాడు. జంగుకు అరణ్యంలో కొమురం భీమ్ పరిచయం అవుతాడు. వారి పరిచయంతో గోండుల హక్కుల సాధనకై నిజాం ప్రభువుతో పోరాటం చేస్తాడు. ఇలా కొమురం బీమ్‌తో కలిసి ఉండడం వలన జంగును 15 సంవత్సరాలు జైలుశిక్ష వేశారు. తరువాతి కాలంలో మళ్ళీ దేవుబాయిని కలిసి తుకారం కొడుకును కంటారు. గిరిజనులపై జరిగే అరాచకాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ ఇంద్రవెల్లి ఘటనతో జంగు, దేవుబాయి, తుకారాంతో కలిసి పాల్గొంటారు. ''అడవి ఆత్మాహుతిలో పునీతమైన ఈ నేలతల్లి కడుపులోంచి కొత్త వ్యవస్థ మొలకెత్తుతుంది. కొత్త జీవిత విచ్చుకుంటుంది. కొత్త మనిషి జీవించడం ఆరంభిస్తాడు'' అనే ఆశావహ వాక్యాలతో 'అడవి' నవల ముగుస్తుంది.

ఊరు నవల :

1981 సంవత్సరంలో జరిగిన ఇంద్రవెల్లి కాల్పుల సంఘటనలను, నేపథ్యాన్ని చెప్పిన నవల 'అడవి'. ఈ నవలకి కొనసాగింపే 'ఊరు' నవల. వసంతరావు దేశ్‌పాండే ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసులు ఎదుర్కొం టున్న దోపిడి విధానాల నేపథ్యంలో వచ్చిన నవల 'ఊరు' పోలీసులకు, నక్సలైట్లకు మధ్య ఆ గిరిజనులు ఎలా నలిగిపోతున్నారో, నిజాయితీ అధికారులకు ఎదురయ్యే చేదు అనుభవాలు గిరిజన స్త్రీల దీన గాధలు, గిరిజనులు ఆహారం కోసం అలమటించే ఆవేదనలు, చివరికి అక్షరాస్యతతోనే పై వాటికి శాశ్వత విముక్తి దొరుకుతుందని సమర్ధవంతంగా చిత్రీకరించారు రచయిత.

సిద్ధార్థ అల్లిగూడెంలో ప్రైవేటు డాక్టరుగా ఉంటాడు. గిరిజనులకు, విప్లవకారులకు ఉచిత వైద్యం చేస్తుంటాడు. వీరిపై అభిమానంతో వైద్యం చేస్తున్న సిద్ధార్థ పాత్ర ఆదర్శపాత్రగా చిత్రీకరించాడు రచయిత. గిరిజనుల అన్ని సమస్యలకు కేంద్రం భూమి, దావూద్‌సేర్ గిరిజనుల నుండి అక్రమంగా, ఆర్జించిన మూడు వందల ఎకరాల భూమిని నక్సలైట్లు స్వాధీనం చేసుకొని అల్లిగూడెంలో భూమిలేని వారికి ఇచ్చారు. ప్రభుత్వం గిరిజన ప్రాంతా లలో అభివృద్ధి నిధులు ఇచ్చినప్పటికీ, నిజాయితీ

అధికారులు ఆ నిధులను దుర్వినియోగం కాకుండ గిరిజనుల అభివృద్ధికి పాటుపడుతున్న సందర్భంలో గిరిజనేతరులు అభివృద్ధికి అడ్డుకట్ట వేసి గిరిజనుల ఎదుగుదలకు అడ్డుపడుతున్నారు.

జంగు తన పశువులకు ఆహారం పెట్టలేక కార్ఖానా వారికి అమ్మాలని అనుకుంటాడు. అందుకు భార్య ఒప్పుకోదు. దేవుబాయి తమ పశువులను ఇంద్రవెల్లిలోని ధనికుడైన కిషన్‌చంద్‌కు అప్పగించ 'మా పశువులు ఎక్కడో ఒక్క దగ్గర సుఖంగా ఉంటే చాలు' అని చెప్పి డబ్బులు అవసరం ఉన్న తీసుకోకుండా తిరిగి వచ్చినా మాతృహృదయం కలిగిన స్త్రీ దేవూబాయి.

1897లో జరిగిన అల్లంపల్లి ఎన్‌కౌంటర్ తరువాత సర్కారు ఆలోచనలో పడింది. గిరిజనుల అభివృద్ధి కోసం గిరిజన యువతకు ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చి విప్లవ ఉద్యమాలు దారిని తప్పించింది. చివరికి ''కన్నకొడుకు ఆకలితో అనాధగా ఏడుస్తుంటే చెరపట్టిన వాడు రొమ్ము కొట్టి రక్తం తాగుతుంటే, నేలతల్లి విముక్తి కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తుంది. అని ముందు వస్తున్న భవిష్యత్‌పైన నమ్మకంతో ముగుస్తుంది 'ఊరు' నవల.

ముగింపు :

అడవి, ఊరు నవలలో భూమిని అడవిని కాపాడుకునే ప్రయత్నంలో ప్రభుత్వంను, దోపిడీదారులను ఎదుర్కొన్న తీరును సజీవంగా చిత్రించారు. గిరిజనుల జీవన విధానంకు ప్రతిబింబం ఈ నవలలుగా చెప్పవచ్చు. ఈ నవలలో గిరిజనులు పడిన కష్టాలు హృదయ విదారకంగా ఉందని చెప్పవచ్చు. తెలంగాణ ప్రాంతంలోని అడవులు, పోడు వ్యవసాయం నుంచి గిరిజనులను తరిమికొట్టి ప్రయత్నం అవినీతి అధికారులు చేస్తున్నారు. ఇలాంటి హృదయార్ధత కలిగించే సంఘటనలను తన నవలకు తనదైన ఒరవడిని అనుసరించిన రచయిత వసంతరావు దేశ్‌పాండే ఇందుకు ఆయన రాసిన నవలలే ఒక ఉదాహరణ.

ఉపయుక్త గ్రంథాలు :

1. తెలంగాణ తెలుగు నవల - సంపాదకులు - డా॥. పంతంగి వెంకటేశ్వర్లు.
2. తెలంగాణ నవల (1995-2005) జన జీవిత చిత్రణ (సిద్ధాంత గ్రంథం) కాకతీయ విశ్వవిద్యాలయం.
3. అడవి నవల - వసంతరావు దేశ్‌పాండే.
4. ఊరు నవల - వసంతరావు దేశ్‌పాండే.

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అంబటిపూడి వెంకటరత్నం గారి - 'మొరాన్‌కన్య' కావ్యంలో తాత్విక నేపథ్యం

- డా॥. దోనెప్పుడి రామాంజనేయశర్మ, మధురై, తమిళనాడు.

సంక్షిప్త పరిచయం :

శ్రీ అంటిపూడి వెంకటరత్నం గారు రాసిన 12 పద్య కావ్యాలలో "మొరాన్‌కన్య" ఒకటి. కవి ఏ కావ్యం లేదా నాటకం రాసినా ఒక ఉద్దేశ్యాన్ని, లేదా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని రాయడం జరుగుతుంది. ఈ మొరాన్ కన్య కావ్య రచన వెనుక ఉన్న అంతర్యాన్ని పరిశీలించడమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశ్యం.

కీలక పదాలు :

ఖండకావ్యం, కావ్య ప్రయోజనం, పురుషార్థాలు, కామము, ఔచిత్యము.

కథా సారాంశం :

అరిషడ్వర్గాలలో కామానికున్న శక్తి అమేయం. అందుకే అంటారు - ఎంతవారలయినా కాంత దాసులే అని.

కానీ వివేకి అయిన పురుషుడు తాను పతనం చెందకుండా నిత్య జాగరూకుడై ఉండాలి. అది ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఇంద్రియాలు ఒక్కొక్కసారి అత్యంత బలం గలవై సాధకుని తప్పుడు మార్గంలో పోయేలా వివశుణ్ని చేస్తాయని గీతాచార్యుడు ప్రవచించాడు.

"యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః।
ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః॥
- గీత 2.60

సరిగ్గా పై శ్లోకానికి వ్యాఖ్యాన ప్రాయమైనదే ప్రస్తుత 'మొరాన్‌కన్య' కావ్యం.

ఈ కావ్యంలో రాజు అత్యంత ధర్మనిష్ఠుడు. మతాచారాల ప్రకారం నడచుకోవాలనీ, ఎవరూ ధర్మం తప్ప రాదనే భావించేవాడు. ప్రజలకూ అదే బోధించేవాడు. మహా ప్రతాపశీలి. అటు అంగ్లేయులకు ఇటు కాబూలీలకూ సింహస్వప్నంలా ఉండి, అన్ని యుద్ధాలలో అజేయుడై ప్రజలను కంటికి రెప్పలా 40 సంవత్సరాలుగా కాపాడుకొంటూ వచ్చాడు. అతని ధర్మ నిబద్ధతకు ఈ క్రింది వాక్యాలు నిలువుటద్దాలు -

"మతము పవిత్రము జీవ । న్మృతు డతడెవ్వాడు దాని మీణి చరించు
బ్రతుకతనికి గదని తీ । వ్రతరస్ఫుట బోధ సేయ బడలడు సభలన్ 11
ఒక తెను బెండ్లాడవలె। సకలము గని మున్నె తనకు సరియైన సతి
వికృతిని గూర్చెడు యువతీ । నికరము గని తొలగుడనుచు నీతుల గరపు 12
యుష్మద్ధితకర సుపథో । గ్రోష్మసహిష్ణుండవగుచు నొక్కట నేనే
యుష్మదహితముగ నడువ। భీష్మమ్ముగ శిక్షసేయ తెరువకుడు నను" 14

అలా రాణా రణజిత్ సింహుడు ఒక సాధకునిలా రాజ్యపాలనం చేస్తూ ఉన్నాడు. కానీ విధి బలీయం. ఒకనాడతని దర్బారులో ఆ రాజ్యంలోనే అందగత్తెగా పేర్కొందిన నాట్యకళాకారిణి, గణిక అయిన మొరాన్‌కన్య ప్రవేశించింది. తన నాట్య వైశారద్యం ప్రదర్శించింది. కళా తపస్వి అయిన ప్రభువు సభ్యులతోపాటు తానూ మైమరచిపోయాడు. ఆమె నాట్య సమ్మోహన శక్తికి క్రింది పద్యం నిదర్శనం.

గడచె నడిరేయి యెవ్వరు కదలలేదు
దాని సమ్మోహదృష్టి ముగ్ధమ్ము మృదుల
నిశిత మవ్యాహతమ్ము సున్నితపు గతుల
జరిగి రణజిత్తు హృదయ వజ్రమును దాకె. 24

అలా అతని ధర్మపథ దీక్షా దక్షమయిన వజ్ర హృదయం కూడా ఈ మన్మథ మొలక ముందు మొక్క బోయింది; బ్రద్దలయింది. అందులో కామం మోసు లెత్తింది. వారం గడవక ముందే మొరాన్‌కన్య, రణజిత్ ప్రభువు యొక్క రాణివాసంలో చేరింది. వా రానంద ధునిలో తేలియాడుచున్నారు. ఇటు ఇన్నాళ్లు తమ ప్రభువు చేసిన ధర్మప్రబోధాలను నెత్తికెక్కించుకున్న ప్రజ క్రుద్ధమయింది. వాళ్ళ ఆగ్రహం కట్టలు తెంచు కున్నది. అతని కుడి భుజమయిన పులసింహునికి ఫిర్యాదు చేశారు. వారు ఇలా భావించారు -

మతము పావన మన్న మతి యేడ కేగెనో
సాని కెమ్మోవిలో జారెనేమొ
ఏక పత్నీ వ్రతం బింత వాకొను బుద్ధి
వెలయాలి కడగంట కొలగినదియొ..... 32

అప్పటికి రాజుకు తెలివి కలిగింది. మొదట భీతి కలిగింది. తరువాత జంకు కలిగింది; అటుపై తంద్ర మధికమయి ప్రభువు నిర్వీర్యుడయినాడు. ఆలోచనలో పడ్డాడు. ఇలా భావించాడు -

"వలపుల గాలిమేడలు ద । బక్కున నేలకు గూలి పోయె నె
ట్టులు తలయెత్తి లోకుల ప । టు క్రుధ కోరిచి నిల్వపచ్చు? రా
జల బలమెల్ల శత్రువుల । చొప్పున జెల్లునొ యేమొ - పాలిత
జ్వలదరుణాగ్ని రేగునెడ । సాధ్యమె జీవము లేని దుక్కుటల్" 36

తన ప్రతాపం శత్రువుల పట్ల చెల్లుతుంది గాని, తానే ధర్మం తప్పినప్పుడు ఆగ్రహించిన ప్రజలపట్ల చెల్లదని నిశ్చయించుకున్నాడు. వివేకవంతుడయినాడు. పుల సింహుని పిలువనంపాడు. తన తప్పును ఒప్పుకొని క్షమింమన్నాడు; దీనుడయి అతని పాదాలపై బడినాడు. దానికి పులసింహుడు - శిక్షించే అధికారున్న ప్రజలనే వేడుకోమన్నాడు. అటుపై ప్రభువు పశ్చాత్తాప భావన చక్కగా వర్ణించబడింది. చివరి కడతు -

"వచ్చి తల యెత్తకయె లోన వగచి వగచి పెదవి గదలింపకపయె
కాలు కదపి చనియె" (96)

అటుపై అంతపురంలో రణజిత్ దిగులుగా ఉండటం, మొరాన్ పల్కరించటం, ప్రభువుకు తన తప్పిదాన్ని (మొరాన్‌ను వివాహమాడటం) తెల్పటం, ప్రజలు వేయబోయే శిక్ష గురించి చింతించడం జరిగిన తరువాత - మొరాన్‌కన్య ప్రభువునిలా అడిగింది - "ఒకవేళ ప్రజలు నన్ను వదలివేయమంటే వదలివేస్తారా?" అని అడిగి నప్పుడు ప్రభువు మిన్నకుండిపోయాడు. ఆ మౌనం భవిష్యత్ కథా సూచకం. ఆ తరువాత మొరాన్ ఏడ్పుల పర్వము. దానికి ఏ మాత్రం ప్రభువు స్పందించలేదని చెప్తూ - మొరాన్‌ను ఇక వదలివేయటం ఖాయమన్న భవిష్యద్ధర్శనానికి మరొక సూచన చేశాడు కవి -

.....

కనికర మింత లే దతడు । కర్కశుడే యగునేమొ, - ఏడ్వగా
జనదనియేని దగ్గఱ డ । చంచలుడై చనె భూపు డిస్సిరో. 61

ఇక్కడ సాధకుడయిన రేడు తన తప్పు గ్రహించి, మరల తన్ను తాను సరిదిద్దుకునే ప్రయత్నంలో దృఢంగా నిలిచాడని తెలియజేశాడు కవి. కనుకనే అటుపైని శిక్షకొప్పుకొని రెండు కూడా కొరడా దెబ్బలు కూడ తిన్నాడు. అటు తరువాత పులసింహుడు అతని ప్రజారంజక పాలనా శక్తిని, అరివీర భయంకర పౌరషమును, దిగ్దిగంతము లయందు వ్యాపించిన కీర్తిని పొగడి, ప్రజలను ఒప్పించి, వారి హర్షధ్వానాల మధ్య అతనికి వేసిన శిక్షలన్ని తప్పిం చాడు. అప్పుడు ప్రజలంతా -

.....

జయము రణజిత్‌ప్రభో నీకు జయము జయము
జయము పాంచాలకేసరీ జయము" 94

అన్నారు. చివరికి ప్రజలంతా అతణ్ని తమ ప్రభువుగా అంగీకరించారంటూ -

కట్లు విడిపోయె ణేనికి కనులవెంట
బాష్పముల పోత ఆగని వరద యయ్యె
జనులముందు వితర్దిపై జనవిభుండు
నిలిచి 'ప్రజలార నన్ను మన్నింపు' డనియె. 95

అన్న పద్యంతో కావ్యం ముగుస్తుంది.

కావ్యారంభంలో చెప్పుకున్నట్లు - వివేకి, సాధకుడు అయిన ప్రభువు ఒక వ్యసనానికి లోనయినా, వెనువెంటనే దానిని తెలుసుకొని, పశ్చాత్తాపపడి, ప్రజలచేత శిక్షించబడి, మరల తన ప్రభుతనాన్ని నిలబెట్టుకున్నారు.

అదే అఖిలషణీయం. మనిషి అయినవాడు ఒక్కొక్క సారి పొరపాటు పడవచ్చు. తప్పుచేయవచ్చు. కానీ వివేక వంతుడు ఆ పొరపాటు మరల మరల చేయడు. తనను తాను సంస్కరించుకుంటాడు. అదే రాజులో కన్పింప జేశాడు కవి.

రాజు మాధ్యమంగా కవి సమాజానికిచ్చిన సందేశ మేమంటే, పాలకులు ఎంత అప్రమత్తంగా ఉండాలో కథాముఖంగా చెప్పటమే. శీలమే ధనం. అది లేని నాడు, ఎన్ని ఉన్నా, అన్నీ వ్యర్థమే.

సాధకుడుగా కనిపించిన ప్రభువే నాయకుడు గదా! మరి కావ్యానికి 'మొరాన్ కన్య' అని నామకరణం చేయటంలో గల అంతరార్థమేమిటి? అని ఆలోచిస్తే - రాశీభూత సౌందర్య అయిన ఆమె, అంత కఠోర దీక్షనూ భగ్నం చేయగలిగింది. గనుక హెచ్చరికగా ఉండటానికే అయి ఉంటుందని నా భావన.

ఇక భాష విషయానికొస్తే - కవి సంస్కృతాంధ్రాల రెండింటిలో పారంగతుడు. అయిన రచనా సరళి ఒకచో తిక్కనను తలపించగా, మరొకచో ప్రౌఢ సమాన భూయిష్టమై శ్రీనాథుని రచన ననుకరిస్తుంది. పలుకట అనే అర్థంలో 'లపించు' అనే క్రియా పదాన్ని వారు మాత్రమే ప్రయోగించగలరు. తెలుగు పదాల పోహ ణింపులో ఇంపు నింపిన పద్యమిది -

జలజలపూలు రాల, పువు। జప్పర మొల్కెడి హాయిలో వెతల్
తొలగ, తలంపుల జవులు। లోగక రేగెడి వేళ కోకిలల్
గలరవ మాలపింప, పసి। గాడ్పుల సంజ ప్రవేశమై, యెటో
తెలియక పచ్చుకామిని గ। తి బ్రభుపాలన తన్పు
బాలితు 10

ఇక సంస్కృతాంధ్ర భాషా ప్రావీణ్యతకు -

తద్రిష్టక్ష్ణ తధార భీకర బ్రహ। ద్ధాత్రీధరం బౌనొ పూ
ర్వోద్రేక ప్రచల ద్రుషోర్మకల రం। హోదీప్తి చల్లార శ
త్రుద్రాఘిష్ఠ సరిత్కదంబ మచల। ద్రుస్థూలరించోళిగా
'భద్రం తే రణజిత్సువీర భవతు స్వస్త్యస్తుతే' యం
చను 5

ప్రభవ, అగ్రీయత్వం, మొదలయిన పదాలు అయన గీర్వాణ వాణీ ప్రభుత్వానికి ఎత్తిన పతాకలు.

ఇలా కవిగారు ఈ కావ్యంలో అటు సందేశాన్ని, ఇటు కమనీయ వర్ణనా వైదుష్యాన్ని (వైదగ్ధ్యాన్ని) రంగరించి పాఠకులకు పసందైన విందు చేశారు. కనుకనే ఈనాటికీ వారి కావ్యాలు రసిక జన మనోరంజకాలుగా నిలిచాయి.

ముగింపు :

ఈ కావ్యంలో - మనిషి తాత్త్విక నేపథ్యంలో చూస్తే, తాను ఎంత అప్రమత్తంగా ఉన్నా, ఎలా పొరపాడు పడే అవకాశం ఉందో, ఈ కథ ద్వారా వ్యక్తీకరించారు కవి గారు. ఇది కేవలం పాలకులకూ, సాధకులకూ మాత్రమే వర్తించే విషయము కాదు. ఈనాడు పాశ్చాత్య సంస్కృతీ ప్రభావానికి లోనై పెడదారి పడుతున్న యువతను పరోక్షంగా హెచ్చరించడానికి కవి ఈ కథాంశాన్ని స్వీకరించాడని చెప్పవచ్చు. కనుక, ఒక కథ ద్వారా కవి పైన చెప్పిన రెండు ప్రయోజనాలూ సాధించాడని చెప్పవచ్చు.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మతానికీ మగపెత్తనానికీ మధ్య బలైన 'నాదిరా'

– డా॥. ఎం.ఎం. వినోదిని, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

స్వాతంత్ర్యానంతర భారతదేశంలో ముస్లింల జీవిత లోతులను ప్రతిబింబించిన రచనలు చాలా తక్కువ. వలస పాలన నుంచి విముక్తి పొందిన భారతదేశం - భారత్-పాకిస్థాన్‌లుగా విడిపోగా పాకిస్తాన్‌కి వెళ్లకుండా భారతదేశంలోనే ఉండిపోయిన ముస్లింలు ముందు ఒక అభద్రతలో నిలబడిపోయారు. ఆనాటికి దేశంలో నెలకొన్ని పరిస్థితుల కారణంగా ముస్లింలు నేరస్తుల్లా మిగిలి పోయారు. ఏమీ మాట్లాడలేని నిస్సహాయ స్థితిలో మౌనం వహించారు. తమ వెనుకబాటును, దుఃఖాన్ని సైతం ప్రకటించకుండా ఉండిపోయారు. తిరిగి ముస్లింలు గొంతువిప్పి తమగురించి తాము మాట్లాడటానికి కొన్ని దశాబ్దాలు పట్టింది. ఈలోగా భారతీయ ముస్లిం సమాజం మరింత పేదరికంలోకి వెనుకబాటుతనంలోకి వెళ్లి పోయింది. ముస్లిం సమాజం నిజజీవితంలో ఎదుర్కొనే సమస్యలు సాహిత్యంలో తక్కువగా ప్రతిబింబించాయి. ఇస్మత్ భుగ్తాయ్, జిలానిబాదో లాంటి రచయితలు ఉన్నతవర్గ, మధ్యతరగతి సమస్యలను ప్రతిబింబించే సాహిత్యాన్ని రచించారు. కానీ ముస్లిం పేద కుటుంబాలు, పేద స్త్రీలు ఎదుర్కొనే సమస్యలను జనంలోకి తీసుకొచ్చిన సాహిత్యం చాలా తక్కువ. మొత్తం భారతదేశంలోనే ముస్లింలు ఎంతో వెనుకబడి వుండగా ముస్లిం సమాజం లోని స్త్రీల పరిస్థితి మరింత దుర్భరం. అటువంటి ముస్లిం స్త్రీల స్థితిని ప్రతిబింబించే నవల 'నాదిరా'. సమాజం లోనూ, సాహిత్యంలోనూ పూర్తి నిర్లక్ష్యానికి గురి అయిన ముస్లిం స్త్రీల వాస్తవ జీవనస్థితిని ఈ నవల కళ్లకు కట్టినట్టు చూపించింది. 'పారా అబూబకర్' కన్నడంలో రచించిన 'చంద్రగిరి తీరదల్లి' (చంద్రగిరి తీరంలో) నవలకు తెలుగు అనువాదం 'నాదిరా'. తెలుగులో స్త్రీవాద సాహిత్యం బలపడుతున్న రోజుల్లో ఈ నవలా రచన జరిగింది. ఈ నవల తమిళం, మలయాళం, ఇంగ్లీషు భాషల్లోకి అనువాదం అయింది. నాదిరా నిండా ఇరవై సంవత్సరాలు కూడా నిండని యువతి. పేదరికంలో పుట్టి, పురుషాధి పత్యం నీడన పెరిగి, మతం పెట్టిన ఆంక్షల మధ్య నలిగి ప్రాణం తీసుకున్న ఒకమ్మాయి కథ ఇది.

నవలా సారాంశం :

ఫాతిమా, మహమ్మద్ ఖాన్‌ల పెద్దకూతురు నాదిరా. కర్నాటకలోని చంద్రగిరి ఏటిగట్టున వున్న కిలియూరు వీళ్ల గ్రామం. వీళ్లకున్న ఆస్థి కేవలం ఒక జత ఆవులు, మూడు నాలుగు మేకలు, ఒక ఎకరం కొబ్బరితోట, కొన్ని కోళ్లు. వీటి మీద వచ్చేకొద్దిగొప్పా ఆదాయంతోపాటు ఆడవాళ్లు ఇంట్లో బీడీలు చుట్టడం ద్వారా వచ్చే ఆదాయమే వీళ్ల జీవనాధారం.

మహమ్మద్ ఖాన్ మోటు మనిషి. కోపిష్టి. బాధ్యత లేనివాడు. మతాచారాల పట్ల విధేయత గలవాడు. మతం మగవాళ్లకిచ్చిన వెసులుబాటును, ఆధిపత్యాన్ని చక్కగా వినియోగించుకునేవాడు. ఫాతిమా నెమ్మదస్తురాలు. అన్ని బాధల్ని మౌనంగా ధరించే స్త్రీ. కుటుంబానికి అవసరమైన సంపాదన మొదలు అందరికీ వండి పెట్టడం, సంసారాన్ని దిద్దుకోవడం, పాలంపని, బీడీలు చుట్టడంతోపాటు మహమ్మద్ ఖాన్ పెత్తనాన్ని, కోపాన్ని భరించడం ఆమె విధి.

వీళ్లకు ఇద్దరు కూతుళ్లు. నాదిరా, జమీలా. పద్నాలుగేళ్ల వయసులో నాదిరా పెళ్లి రశీద్‌తో జరుగుతుంది. రశీద్ మంచివాడు, అభ్యుదయవాది. భార్య చదువుకోవాలని అనుకుంటాడు. నాదిరాకు కూడా భర్తంటే ఇష్టం. అతని ప్రేమ, సున్నితత్వం ఆమెకు మరింత ఇష్టం. నాదిరా, రశీద్‌లకు ఒక కొడుకు పుట్టాక వారి బంధం మరింత బలపడుతుంది. ఎంతో ఆనందంతో సాగిపోతున్న జీవనానికి నాదిరా తండ్రే అడ్డంకిగా మారి వాళ్ల ఆనందాన్ని ముక్కలు చేస్తాడు.

మహమ్మద్ ఖాన్ తన రెండో కూతురైన జమీలా పెళ్లికోసం రశీద్‌ను డబ్బు అప్పు అడగ్గా రశీద్ తన దగ్గర అంత డబ్బు లేదంటాడు. ఇద్దరి మధ్యా మాటా మాటా పెరిగి గొడవ అవుతుంది. మూర్ఖుడైన మహమ్మద్ ఖాన్ ఏమీ ఆలోచించకుండా తన కూతుర్ని, మనవడ్ని తీసుకొని వెళ్లిపోతాడు. భార్యాభర్తల్ని విడదీసి తలాక్ ఇప్పిస్తాడు. కూతురికి బాగా డబ్బున్న వయసు మీదపడ్డ మరొకతనితో పెళ్లి చేసి ఎదురుడబ్బు పొందాలని ఆశ పడతాడు.

ఈ మొత్తం వ్యవహారంలో నాదిరా మానసికంగా ఎంతో వేదనకు గురవుతుంది. తను చచ్చినా రశీద్ తప్ప వేరేవాళ్లకి తను భార్యను కాలేనని చెబుతుంది. గత్యంతరం లేక తిరిగి నాదిరాను రశీద్ దగ్గరకు పంపాలనుకుంటాడు. మహమ్మద్ ఖాన్. కానీ ఒకసారి తలాక్ ఇస్తే, తిరిగి ఆ జంట కలవడానికి మతం కొన్ని అంక్షలు విధించింది. తలాక్ ఇచ్చిన భార్య తప్పనిసరిగా వేరేవాళ్లని పెళ్లి చేసుకొని అతనితో ఒక రాత్రి గడిపి, ఇద్దత్‌కాలం ముగిసిన తర్వాత మాత్రమే తిరిగి తన మొదటి భర్తను పెళ్లి చేసుకొని అతనితో సంసారం చేయగలుగుతుంది. మతం పెట్టిన ఈ తిరకాసు నాదిరాను మానసికంగా కుంగదీస్తుంది. దీంతో ఆమె చంద్రగిరిలో దూకి ఆత్మహత్య చేసుకుంటుంది. ఇదీ ఈ నవల సారాంశం.

ఈ నవల కథాంశం, ఇందులోని స్త్రీ పురుషుల పాత్రల స్వభావం, ముఖ్యంగా నాదిరా మనసులో మెలితిరిగే ప్రశ్నలు, ఆలోచనలు చర్చించదగ్గవి. నాదిరా యేమీ చదువుకోని యువతి. పెద్దగా ప్రపంచం తెలియనిది. అయినా ఆమె ఆలోచనలు ఇవాల్టి స్త్రీ వాదానికి, ముస్లిం వాదానికి కూడా స్ఫూర్తిని, చైతన్యాన్ని ఇస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే భారతీయ స్త్రీవాద సిద్ధాంతానికి అవసరమైన ముడి సరుకుని నాదిరా మానసిక సంఘర్షణమంచి సంగ్రహించవచ్చు.

పితృస్వామ్య భావజాలంతో మూర్ఖుడైన తండ్రి మహమ్మద్ ఖాన్ నాదిరా జీవితం నాశనానికి కారకుడు. పెళ్లి భర్తతో ప్రేమ జీవితం గడుపు మూర్ఖత్వం కారణంగా చిన్నాభిన్నం అయింది.

నిజానికి నాదిరా భర్త రశీద్ మంచివాడు. సున్నిత మనస్కుడు. నాదిరాను అమితంగా ప్రేమిస్తాడు. నాదిరాకు ఒక భర్తగా అధికార దర్పంతో కాక ఒక స్నేహితుడిగా, ప్రేమికుడిగా ఆమె హృదయాల్ని గెలుచుకున్నాడు. అటువంటి వారిద్దరి అన్యోన్యమైన సంసారాన్ని, కేవలం అల్లుడు తనకు అప్పు ఇవ్వలేదన్న కారణంగా విచ్ఛిన్నం చేశాడు మహమ్మద్ ఖాన్.

నాదిరా పెళ్లి చేసుకొని వెళ్తున్న రోజున నాదిరా తల్లి ఫాతిమా "యా అల్లా! నా బిడ్డ నావకు ఏ తుఫానులు ఎదురు పడనియ్యకయ్యా అని చేతులు పైకెత్తి వేడుకుంటుంది". కానీ ఆమెను కన్నతండ్రి ఆమె పాలిట తుసానై ముంచేశాడు. కూతరు గురించి ఒక్కక్షణం కూడా ఆలోచించకుండా భర్త మంచి వేరే చేసి ఆమెను చంటిబిడ్డతో సహా తెచ్చేశాడు. చంటిబిడ్డతో సహా "అతడు మోటు మనిషి. కోపిష్టి, మూర్ఖుడు. ప్రతి విషయంలోనూ తనదారి తనదే. ఒక పెత్తందారు" ఆయనలోని పురుషాధిపత్యపు అహంబావాన్ని ఆయన భార్య ఫాతిమా మౌనంగా భరించింది. తన పిల్లలకూ అలా భయపడటాన్ని నేర్పింది. ఆ మౌనమే నాదిరా జీవితం మొగ్గలోనే బుగ్గవడానికి కారణమైంది.

తండ్రి పుట్టింటికి తెచ్చేశాక నాదిరా భర్తరాక కోసం ఎదురు చూసింది. ఎలాగైనా భర్తవచ్చి తనని తీసుకెళ్తాడని ఆశపడింది. తన కోసం, కొడుకు పాపూ కోసం తన భర్త తప్పక వస్తాడని కలలుకన్నది. కానీ ఆమె కలలు కల్లలు గానే మిగిలిపోయాయి. భర్త రాలేదు. అయితే భర్త రశీద్, నాదిరాను తన దగ్గరకు రప్పించుకునేందుకు 'పారూ' అనే చేపలమ్మే స్త్రీ ద్వారా ఉత్తరం పంపిస్తాడు. తన ప్రేమను ప్రకటిస్తాడు. కానీ తన తండ్రి అనుమతి లేకుండా చంద్రగిరిని దాటడానికి నాదిరా సాహసించ లేకపోతుంది. "ఈ ముస్లిం ఆడవాళ్లెంత నిస్సహాయంగా, దయనీయంగా బతుకుతున్నారు? స్వయానా తన భర్తేనది అవల నుంచి రమ్మని పిలుస్తున్నా తండ్రికి చెప్పకుండా వెళ్లలేకపోతుంది". ఆమె తన మనసులో అనుకున్న ఈ మాటలు ఆమె నిస్సహాయతను, ఆమె మానసిక సంఘ

ర్షణకు అద్దం పడుతున్నాయి. ఆమె మనసునీ, కదలికలీన్న తండ్రి రూపంలోని పితృస్వామ్య వ్యవస్థ ఎంతగా నియంత్రణ చేసిందో ఈ మాటలతో తేలతెల్లమవుతుంది.

మహమ్మద్ ఖాన్ దృష్టిలో ''స్త్రీ అంటే హృదయమూ, అనుభూతులూ లేని ఓ ప్రాణి. ఆమె ధర్మం తండ్రికీ, భర్తకూ ఆ తర్వాత కొడుక్కీ అణిగి మణిగి పడి ఉండటమే.'' తను అనుకున్నది జరగాలని, తనది పై చేయిగా ఉండాలని ఆలోచించే ఖాన్ కూతురి హృదయంలో రేగిన గాయాన్ని పట్టించుకోలేదు. పైగా నాదిరా దగ్గర్నుంచి ఆమె పసికందుని అత్త ఎత్తుకుపోతే ఆ పసివాడు రశీద్ బిడ్డ కాబట్టి. వాడ్ని పెంచే బాధ్యత రశీద్‌దే కాబట్టి ఎత్తుకు పోవడం ఖాన్‌కు న్యాయంగానే అనిపించింది తప్ప నాదిరా పిల్లవాడి కోసం పడిన తపన.. ఆమె ఏడుపు ఖాన్‌కి వినిపించలేదు, కనిపించలేదు. అనలు అవన్నీ ఖాన్ దృష్టిలో చాలా అవివేకమయిన విషయాలు.

కానీ నాదిరా మాతృహృదయంలో బాధ రెట్టింపయింది. ఆమె చనుబాలు కాలంగడిచే కొద్దీ ఎండిపోయినా ఆమె హృదయంలో బాధ గడ్డలుగా పేరుకొని సలుపుతూనే వుంది.

రశీద్ తనకు దూరం కావడానికి తండ్రి మూర్ఖత్వం ఒక్కటే కారణం కాదని నాదిరా విశ్వాసం. ఇస్లాం మతం పురుషుడికి ఇచ్చిన ఆధిపత్య అధికారాలు, హక్కులు కూడా రశీద్‌కు తాను కాకుంటే ''ఇంకో నలుగురు దొరుకుతారు. అది ఖురాన్ ఇచ్చిన తీర్పే! అడిగే వాళ్లెవరు? పిల్లలు తండ్రికే చెందుతారు. విడాకులిచ్చాక మగపిల్లలయితే ఏడేళ్లు, ఆడపిల్లలయితే పద్నాలుగేళ్లు తల్లితో వుండవచ్చు. చనుబాలు మరవగానే తీసుకు పోవచ్చు నీ మౌల్వీలు కూడా చెప్తారు.'' మతం కూడా పురుషుడి పక్షమే వహించాక ఇక తన హృదయాల్ని అర్థం చేసుకొనే దిక్కెవరూ లేరని నాదిరా లోపల్లోపల కుంగిపోయింది. అయినా ఆమె మనసుని ఆవహించిన అనేక ప్రశ్నలు ఆమెని ఉక్కిరి బిక్కిరి చేశాయి.

ఇంతకీ షరియత్ అనబడే ముస్లిం పర్సనల్ లా ఏం చెప్పింది? ''ఒకే సమయంలో ఒక మహమ్మదీయుడికి నలుగురు భార్యలు ఉండవచ్చు. నలుగురు భార్యలు ఉండగా వారు చాలక అయిదవ భార్యను వివాహము చేసుకుంటే ఆ వివాహం అపసవ్య వివాహంగా పరిగణించ బడుతుంది'' అని చెప్పింది. అంటే ఈ అవకాశాన్ని ముస్లిం పురుషులంతా వినియోగించుకుంటున్నారని కాదు. కానీ పురుషులకోసం మతం కల్పించిన వెసులుబాట్లు కొన్నిసార్లు తన లాంటి స్త్రీ బతుకు నాశనం కావడానికి కారణం అవుతున్నాయని నాదిరా తనలో తాను గొణుక్కుంటుంది.

నాదిరా మనసులో చెలరేగిన ఏ భావాలూ, ప్రశ్నలూ ఆమె గొంతుదాటి బయటికి రాలేదు. అన్ని ప్రశ్నలూ ఆమెని ఉక్కిరి బిక్కిరి చేసినా ఏ రోజూ పెదవివిప్పి మాట్లాడలేదు. తండ్రి చేసిన అన్యాయాన్ని మూసిన రెప్పల కింద కన్నీళ్లతో భరించింది. తనకు మంచి రోజులు వస్తాయని ఎదురు చూసింది. ''కన్నతండ్రే మోసం చేసి భర్త నుంచి తలాక్ ఇప్పించినా తన భర్త మీద నమ్మంతో, ప్రేమతో ఆమె అతని కోసం ఎదురుచూసింది. గుండెలు అగ్ని పర్వతంలా బద్దలైనా పైకి ప్రశాంతంగానే వుంది'' తనకు జరిగిన అన్యాయాన్ని గురించి ఎవర్ని నిందించాలో తెలియక చంద్రగిరి ఒడ్డున కూర్చొని నదితో తన వేదనని పంచుకుంది. ''ఎంతలో ముగిసిపోయింది తన జీవితం! పదిహేడేళ్లన్నా నిండకుండానే పెళ్లి కావడమూ, ఓ బిడ్డ పుట్టటమూ, సంసారం చెయ్యడమూ, ఇప్పుడు తలాక్ తీసుకోవడమూ జరిగిపోయింది.'' ఎంత దుర్మార్గం? జీవితంలోని ఆటుపోట్లు, ఎత్తు పల్లాలు పదిహేడేళ్లకే ఎదురవడం? కనీసం 'టేనేజ్' కూడా పూర్తి కాకుండానే, జీవితం కష్టాల ఊబిలో అట్టడుగు వరకూ కూరుకు పోవడం!

నాదిరా పెళ్లి విడాకులయిన తర్వాత మహమ్మద్ ఖాన్ నాదిరాను డబ్బున్న మరొకతనితో పెళ్లి చేయాలనుకున్నాడు. నాదిరా ససేమిరా అనడంతో గత్యంతరం లేక ఆ ఆలోచన మానుకున్నాడు. కానీ ఆరోగ్యం దెబ్బతిని, మానసికంగా కుంగిపోయిన ఖాన్ అవసాన దశలో నాదిరాను ఆమె భర్త దగ్గరకు తిరిగి పంపిచాలనుకున్నాడు.

కానీ దానిక్కూడా మతం అవరోధమయింది. ''ఖురాన్ చెప్పేదాన్నిబట్టి భర్త మూడుమాట్లు తలాక్ చెప్పేసినా డంటే ఇంక ఆయనకూ, ఆయన పెళ్లానికీ సంబంధాలన్నీ తెగిపోయినట్టే మళ్లా వాళ్లిద్దరూ కలవాల్నునుకున్నారంటే, ఆ పెళ్లాం ఇంకో మొగాయన్ను పెళ్లాడి, ఆ రెండో మొగుడి దగ్గర్నుంచి తలాక్ తీసుకోవాల. ఒక్క వాటి కోసమైనా సరే, ఆమె ఇంకో పెళ్లి చేసుకొని, ఆ మొగోడితో ఒక్కరాత్రి వుండాలన్న మాట'' ఎంత క్రూరమైన ఆచారాన్ని మతం విధించింది. స్త్రీ హృదయంతో పనిలేని ఈ అనాగరిక ఆచారం నాదిరా గుండెల్ని పిండేసింది. నిజానికి ఇస్లాంలో ఇలాంటి ఆచారం ఉందా? అంటే 'షరియత్' ఉందనే చెబుతుంది. ''దీనినే ఇంటర్నీడియట్ మ్యారేజ్ లేక మధ్యంతర వివాహము అందురు. మధ్యంతర వివాహము జరిగి, రెండవ భర్తతో విధిగా సంభోగము జరిగి వుండవలెను'' అప్పుడు మాత్రమే తిరిగి తమ మాజీ దంపతులు పునర్వివాహము చేసుకొని ఒకటి కాగలుగు తారు.

'తలాక్' నాదిరా జీవితంలో ఉప్పెనయితే ఈ మద్యం తర వివాహం ఆమె ఉనికినే ఛిన్నాభిన్నం చేసిన సునామీ.

మతం విధించిన ఇటువంటి ఆంక్షలు స్త్రీలను మనుషులుగా బతకనివ్వవు. స్త్రీల స్వేచ్ఛను హరించి, హక్కులను కాలరాసి, గుప్పెట్లో బంధించి కదలనివ్వక మెదలనివ్వక ఊపిరి సలపనివ్వక ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. ఒక్క ఇస్లాం మతమే కాదు. స్త్రీ విషయంలో మతాలన్నిటిదీ పురుష ధోరణే. ఏ మతం అయినా స్త్రీలు ముళ్ల కంచెల మధ్య బతకాల్సిందే. ఈ కంచెలు ముస్లిం స్త్రీలకు ఇంకాస్త ఎక్కువ. అటువంటి కంచెల్ని దాటలేని స్త్రీల పరిస్థితికి నాదిరా ఒక ఉదాహరణ.

'చంద్రగిరి తీరదల్లి' నవల ఒక సంచలనం. ముస్లింల గురుంచి సమాజానికి తెలిసింది తక్కువ. అందునా వారి కష్టనష్టాలు, దుఃఖాల కన్నా వారిపై నిందలను, అపోహ లను చర్చించుకోవడంలో సమాజం దృష్టి ఎక్కువ. అటు వంటిది కన్నడ ముస్లిం సమాజంలోని పేదరికాన్ని, ఆ పేదరికంలో మగ్గిపోతూ ముస్లిం స్త్రీలు అనుభవిస్తున్న పురుషాధిపత్యాన్ని మత వివక్షను ఎత్తి చూపిన ఈ నవల విస్మరించిన వాస్తవాన్ని ఆవిష్కరించింది. ఎన్నో ఏళ్ళుగా గొంతులో పోసపడిన ముస్లిం స్త్రీల దుఃఖాన్ని బిగ్గరగా వినిపించింది.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'కరోనా'పై కదం తొక్కిన పాట

- సైదయ్య మల్లెపాకుల, లెక్చరర్, కొండనాగుల.

మానవ పరిణామ క్రమంలో మనిషితో పాటే పుట్టిన పాట, మనిషికున్నంత చరిత్రను కలిగి వున్నది. అర్థవంత మైన అక్షరాలకు, అద్భుతమైన రాగం తోడైతే అది మరుక్షణమే ప్రజాహృదయాల్లో పదిలమైన పాటగా మిగిలిపోతుంది. మనిషి శ్రమతో పాటే పుట్టిన పాట మానవాళి కష్టసుఖాలలో. నిరంతరం పాలు పంచు కుంటుంది. ఉద్యమానికి ఊపిరౌతూ ఆనందానికి అవధులు చెరుపుతూ ఒంటరితనాన్ని ఓదారుస్తూ ఓటమి పాఠాలు నేర్పుతూ.. పూసిన పున్నమి వెన్నెల వానూ నయాగరా జలపాత నడకలై గలగలా పారే గోదారి అలలై... కదిలిపోతున్నాది పాట, కాలంతో పాటుగా.

2019 డిసెంబర్ మాసం చివరిలో చైనా దేశంలోని 'వూహాన్' నగరంలో ఉద్భవించిన 'కరోనా వైరస్' చిలికి చిలికి గాలి వానలా మారి ప్రపంచాన్నే గడగడలాడించే మాయదారి మహమ్మారిలా పరిణమించింది. ఈ కరోనా కరాళ నృత్యం చేస్తూ భయంకరంగా విజృంభిస్తూ ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందిని పొట్టన పెట్టుకున్నది. ఈ మహమ్మారిని ఎదుర్కోలేక కొన్ని దేశాలు సైతం చేతులెత్తేసి నిస్సహాయ స్థితిలోకి వెళ్ళిపోయాయి. దేశాధినేతలు కూడా దీని బారి నుడి తప్పించుకోలేకపోయారు. చిన్నా, పెద్దా, కులం, మతం, వర్ణం, వర్గం అనే తేడా లేని దీనిముందు నిలువలేకపోయాయి.

ఇలాంటి భయంకరమైన పరిస్థితుల్లో మందులేని ఈ మహమ్మారిని ఎదుర్కోవడానికి ఈ ప్రపంచానికి ఒకటే మార్గం కనిపించింది. అదే భౌతిక దూరం ప్రపంచ వ్యాప్తంగా కొన్ని దేశాలు లాక్‌డౌన్ ప్రకటించడంతో మనదేశం కూడా ముందుచూపుతో ఆలోచించి లాక్‌డౌన్ ప్రకటించింది. ఈ లాక్‌డౌన్‌తో కరోనా వైరస్‌ను చాలా వరకు కట్టడి చేసినప్పటికీ, పొట్టకూటి కోసం పిల్లా పాపలతో బతకడానికి వెళ్ళిన వలస కూలీల బతుకులు భయంకరమైన దుర్భర పరిస్థితుల్లోకి వెళ్ళాయి. లాక్‌డౌన్ కారణంగా వేలాదిమంది వలసకూలీలు తిండీ, తిప్పలు లేకుండా, పిల్లా, పాపలతో తమ స్వంత గూటికి చేరుకోవా లని, వందలాది కిలోమీటర్లు రాత్రింబవళ్ళు అనే తేడా లేకుండా కాలి నడకనే ప్రయాణమయ్యారు. దినసరి కూలీల బతుకులు దినదిన గండంగా మారాయి. అడ్డా కూలీల బతుకులు రోడ్డున పడ్డాయి. కరోనా చావులతో పాటు ఈ దేశంలో ఆకలి చావులు కూడా పెరిగిపోయాయి.

ఇలాంటి దుర్భర పరిస్థితుల్ని స్వయంగా చూస్తూ, ఎంతోమంది కవులు, కళాకారులు తమ కలాలతో కవాతు చేస్తూ, గళాలతో గర్జించారు. తమ పాటలతో కరోనా మహమ్మారిపై ప్రజల్లో అవగాహన కలుస్తూనే, నిత్యం దాన్ని ఎలా ఎదుర్కోవాలో ప్రజలకు భరోసనిస్తూ వచ్చారు. ''వందలాది మంది పాట కవులు తమ పాటల ఆయుధాలనెత్తి కరోనా మహమ్మారిపై కదం తొక్కారు.

తెలంగాణ ప్రజాకవి గోరటి వెంకన్న 'వినకా పోతివి గదరా ఎరుక గలిగిన పదం' అంటూ మనిషి ప్రకృతిని భయంకరంగా ధ్వంసం చేస్తున్నాడు. దాని ఫలితంగానే మనకీ గతి పట్టిందని గగ్గోలు పెట్టాడు. ఈ ప్రకృతిలో ఏ జీవి కూడ తన రేపటి ఆహారం, సంపాదన కోసం ఆరాట పడదు. ఒక మనిషి తప్పా! ఎన్ని సంపాదించినా చివరికి మనిషికి మిగిలేది ఏడడుగుల నేనే కదా! తిని తాత్విక బెఎఓధ చేస్తాడు.

దయ్యము వోలె నిన్ను పట్టుకున్నది ధనము!
యుగములు గడిచినా మారలేదు నిగుణము.
పురుగూ భూషికి పుట్టా బొరియలుంటె చాలు!
నరుడా నీవేమో వందల ఎకరాలు బొంది!!
ఏడడుగుల జాడ చివరికి నీ గూడన్నా!
బైరాగి భోదను పెడచెవినా పెడితివన్నా॥
గాటి ఎద్దువోలె మదిని గుంజికట్టు!
కాసే పున్నమి కాంతి నీ లోపలనే పుట్టు!!

అంటూ మనిషిలో చెలరేగే ఆశలని అదుపులో పెట్టుకోవాలని, స్వర్గం ఎక్కడో లేదూ, నీ లోపలే ఉం దనీ మానవ జాతికి గొప్ప సందేశమిచ్చాడు. ఈ ప్రకృతి కవి.

ప్రకృతి కవి జయరాజు ప్రకృతికి ప్రణమిల్లే తరుణమిది/నీమై నీవు చేసే యుద్ధమిది/కాలం గతి తప్పిన ఫలితమిది/కరోన లాంటి వ్యాధులెన్నోమరి/ ప్రాణాలనే అరచేతిలో పట్టుకొని ప్రపంచమే వణుకుతోంది చూడు మరి" అంటూ మనిషి ప్రకృతిని ధ్వంసం చేసే వచ్చే ఫలితమిదేనని, ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే మనకు ఇలాంటి గతే పడుతుందని హెచ్చరించాడు. అదేవిధంగా బహుజన వాగ్గేయకారుడు డా॥. ఏపూరి సోమన్న యాడి నుంచి వచ్చిందిరో కరోన / ఒక మనమెట్ల బతకాలిరో" అంటూ కరోన చేస్తున్న విలయతాండవాన్ని ఆవేదనాత్మ కంగా వర్ణించాడు. ఇక సినీ గేయ రచయిత డా॥. కందికొండ తెలంగాణా నేలమీద వేసెయ్ ఒట్టు/ కరోనాను తరిమికొట్టు/గుండెల్లోన అరె క్వారంటైన్ దీక్ష పట్టు/మహమ్మారిని మట్టుపెట్టు/అంటూ ప్రజల్లో అవగాహనను కల్పిస్తూ రానిన పాట అందరిని ఆకట్టుకుంది. మరో సినీ గేయరచయిత నుద్దాల అశోక్‌తేజ ఎవరిరా ఇది ఎవ్వతిరా/ఈ కరోన రక్కసి ఎవ్వతిరా/ఎంతదిరా ఇదీ ఎంతదిరా/మన సంకల్పం ముందెంతదిరా/చెయ్యి కలిపితే దయ్యమైతది/నమస్కార మనె కత్తి కరోన గొంతు కొయ్యవలె/దానంతు చూడాలె అని అంటాడు. కరోనాను ఎట్లా ఎదుర్కోవాలె అనే అనగా హనను ప్రజల్లో కల్పిస్తూ, దాన్నెదుర్కోవడం పెద్ద కష్టమేమి కాదని ఆత్మస్థైర్యాన్ని నింపుతారు.

మరొక సీనియర్ వాగ్గేయకారుడు 'నిసార్' కరోన కరోన నీతో యుద్ధం చేస్తం/మా భారత భూభాగాన/కరోన కరోన నిన్ను మట్టి కరిపిస్తం/నూత ముప్పై కోట్ల జనం సరేనా/ అంటూ కరోనా పై యుద్ధం ప్రకటించాడు.

మరో వాగ్గేయ కారడు 'యశ్‌పాల్' సోషల్ మీడియా వదంతులు నమ్మకురా/సోషల్ డిస్టెన్స్ పాటిస్తే మంచిదిరా" అంటూ కరోనాను అరికట్టాలంటే ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో చెప్పుకొచ్చాడు. అదేవిధంగా సాంబరావు యాదగిరి "భూమంతా నాదేననీ/సర్వస్వం నేనేననే/ మానవ అహంకారాన్ని కూల్చుతున్నది/తరతరాల విధ్వంసం తిరగబడుతున్నది'. అని మానవ తప్పిదాలను మరోసారి గుర్తు చేశాడు.

ఇక అమ్మ పాటతో రెండు ఖండాంతరాలకు విస్తరిం చిన పత్తిపల్లి తిరుపతి "కనివిని ఎరుగని కల్లోలం/కరోనాతో వణుకుతున్నది భూగోళం" అంటూ ప్రజలను చైతన్య పరిచే గేయం రాశాడు. మరో యువ వాగ్గేయకారుడు మాట తిరుపతి "మందులేని రోగమో/ఇది మంది ఎంట వడ్డదో" అంటూ జనం గోసను పాటగట్టి పాడాడు. ఈ కరోనా మహమ్మారిపై ఇంకా ఎందరో కవులు, కళాకారులు తమ కళల, గళాల కొరడాలు ఝళిపించారు.

సంగీత దర్శకులు బోలె శావలె "అనుకోని వైర సొచ్చె తమ్ముడో/నువు అనుకోని తిరగకురా తమ్ముడా/విడగొట్టిన రోగమిది తమ్ముడా/దాన్ని పగబట్టి సంపాలి తమ్ముడా" అంటూ ఒగ్గు కథా బాణీలో చాలా చక్కన వివరించాడు. అలాగే మరో ఉద్యమ వాగ్గేయకారుడు అభినయ శ్రీనివాస్ "చేయి చేయి కలిపి నడవని వినూత్న పోరాటం/ఇది ఎవరికి వారై ప్రకటించిన యుద్ధం" అంటూ కరోనాకు మనం దూరంగా ఉంటూనే దానిపై యుద్ధం చేద్దామని ప్రకటించాడు.

ఈ కరోనా కష్టకాలంలో ఏ ఊర్లో చూసినా సుప్రభాతమై మారుమ్రోగిన పాట "చేతులెత్తి మొక్కుతా చేయి చేయి కలపకురా/కాళ్ళుగూడ మొక్కుతా అడుగు బయటపెట్టకురా/ ఉన్నకాడె ఉండరా గంజిదాగి పండరా/ మంచిరోజులొచ్చె దాక నిమ&్మలంగా ఉండరా" అంటూ ఈ పాటను చౌరస్తా బ్యాండ్ రామ్ రాసి పాడాడు. తెలంగాణాంధ్రలో ఈ పాట తెలియని వాళ్ళే లేరంటే అతిశయోక్తి కాదు. రొటీన్‌కు భిన్నంగా ర్యాప్, పాప్‌ను మిక్స్ చేసి పాడిన పాట ఇది. చేతులెత్తి మొక్కుతా, కాళ్ళు కూడ మొక్కుతా అంటూ ప్రజలను ప్రజలను బయటికెళ్లకండంటూ ప్రాధేయపడుతూ, కరోనాను ఇంట్లోనే ఉంటూ కట్టడి చేద్దామని గొప్ప సందేశాన్నిచ్చిచన

పాట. మరో కవి గాయకులు బోర రాంరెడ్డి "నువు అడగే వెట్టకు బయట/వస్తే చస్తవు బేటా/ఇది కరోన భాయ్ జర డరోనా" అంటూ లాక్‌డౌన్ అవసరాన్ని నొక్కి చెప్పాడు.

ఇక మరో వాగ్గేయకారుడు యోచన... "కత్తి పట్ట కుండానే నెత్తురంటకుండానే కుత్తుకలు కోసే యుద్ధ మొచ్చినాదిరా/కాలు బయటపెట్టినా చేయి చేయి కలి పినా కాటికి పంపే కాలమొచ్చినాదిరా" అంటూ లాక్‌డౌన్ ఎంత ముఖ్యమో ఈ పాట ద్వారా తెలియజేశాడు.

తనదైన ముద్రతో పాటలు రాస్తున్న మరో మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ అర్జున్, భిన్న సామాజిక సమస్యలను వస్తువులుగా తీసుకొని సినిమా శైలి బాణీలతో అద్భుతమైన పాటలను రూపొందించిన తాను కరోనా సందర్భంగా "యాడనుండీ ఈడకొచ్చావో/ఎన్ని మాకూ నేర్పించావో కానరాని సాకురే నువ్వు/కట్టె బట్టి గాడిల బెట్టావో" అంటూ ఆశల వలలో చిక్కి అస్తవ్యస్తంగా మారిన మనిషిని మళ్ళీ తిరిగి గాడిలోపెట్టడానికే వచ్చావంటూ గొప్ప సందేశాన్ని స్తాడు. మనషుల్ని దూరం చేసి మనసుల్ని కలిపావు, మళ్లీ కుటుంబ బంధాల విలువేంటో తెలిసావు అంటాడు. సావు భయమే సూపెట్టి బతుకు నేర్పావో మాకు బతుకనేర్పావో అంటూ చెదిరిన బంధాలను చేరదీశావు. అని తాత్వికంగా ఈ సమాజానికి తెలియజేశాడు.

'కరోనా'తో ఎంతోమంది వలసకూలీల జీవితాల్లో వల పోతే మిగిలింది. వారి బతుకుల ఆవేదనల్ని ఆదేశ్ రవి గారు "పిల్లజెల్లా ఇంటికాడా ఎట్లఉందో/ముసలి తల్లీ ఏమిబెట్టీ సాకుతుందో/పూటపూటా జేసుకోనీ బతికె టోళ్ళం/పూట గడువా ఇంతదూరం వొచ్చినోళ్ళం" అంటూ వలస బతుకులు కన్నీటి వ్యధను ఈ పాటలో సజీవంగా చిత్రించాడు. పేదరోగం కంటే ఈ ప్రపంచంలో పెద్దరోగం ఇంకేది లేదని వలసకూలీ దీనగాధను విశాదభరితంగా వినిపించినాడు ఈ పాటలో.

ఇంకా చెత్తఎత్తె చేతులకు చేతులెత్తి మొక్కుదాం/ పారిశుద్య కార్మికుల పాదాలను తాకుదాం అంటూ వరంగల్లు జర్నలిస్ట్ కేకే ఈ కరోన సమయంలో పారిశు ద్య కార్మికుల, వైద్యుల, పోలీసుల, సేవలను కీర్తించాడు. ఇక నక్క సురేష్ అనే యువ కలం. అన్నా కరెంటన్నా... మా యన్నా కరెంటన్నా... అంటూ కరోనా కాలంలో కరెంటు కార్మికుల త్యాగాలను పాటగట్టాడు.

అదేవిధంగా పైసపోతే పోనియిగానీ/పాణముంటే సాలన్నా/బలుసాకైనా తిందాంగానీ/బతికి ఉంటే సాలన్నా/ మన పుట్టుకలోనే ఉన్నదిరన్నా కొట్టాడే గుణము/నాడు గత్తరొస్తే సంపినెత్తిన ఎత్తినాము మనము/మన బతుకు లోనే దాగున్నదన్న తందానే తనము/నేడు కొత్తగొచ్చిన కొమ్ముల పురుగుకు పెడుదాము దినము. మళ్ల ఎత్తుదాము బోనము" అని సినీ కవి కాసర్ల శ్యామ్‌రాసిన పాట ఈ కరోనా నేపథ్యంలో ప్రజలకు గొప్ప భరోసా నిస్తున్నది. జానపద బాణీలతో సినిమాల్లో ఉరకలెత్తించే పాటలు రాసే కాసర్ల శ్యామ్ ఈ సారి కరోనాపై ఆలో చనాత్మక పాట రాశారు.

అలాగే వినూత్న కళాకారుడైన పోలీస్ ఆఫీసర్ నాగమల్లు ఒగ్గుకథ ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని కల్పించే ప్రయత్నం చేశాడు. మరో బహుజన వాగ్గేయకారుడు రెంజర్ల రాజేష్ "సకల శాస్త్రాలు బూటకమంటూ గుట్టు విప్పేసినావు/మీ దేవుని శక్తి ఉత్తదేనంటూ తెరలు తొలగించినావు." అంటాడు. అలాగే కేంద్ర సాహిత్య యువ పురస్కార అవార్డు గ్రహీత డా॥ పసునూరి రవీందర్ కరోనా కష్టకాలంలో కానికాలమొచ్చెనంటూ కన్నీరు పెట్ట బోకమ్మా... అంటూ పసునూరి రాసిన పాటలో... అమాసెల్లి పోయి పున్నమొచ్చినట్టు..... చీకటెల్లిపోయి.. వెలుగు రాకుంటదా..... అని భవిష్యత్తు పైన ఒక విశ్వాసాన్ని ప్రకటించాడు.

అలాగే నవతరపు వాగ్గేయకారుడు, రచయిత సైదులు మల్లెపాకుల కరోన నేపథ్యంలో మూడు పాటలు, ఒక కవిత రాయడం జరిగింది. "కరోన వైరస్ బారిన పడకండో ఓరి నాయినా/కష్టాలను కొని తెచ్చుకోకండో ఓరినాయనా" అంటూ కరోనా మహమ్మారిని అరికట్టాలంటే, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈ పాటలో చాలా చక్కగా వివరిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో వచ్చిన మొదటి పాట ఇది. ఇక "వద్దుర

ఓ తమ్ముడా కాలు బయటపెట్టా బోకురా/కరోన రోగమంటా మనుషులను ఖతం జేస్తున్నదంటా" అంటూ మరో పాట ద్వారా కరోన వైరస్ వ్యాపించే తీవ్రతను తెలుపుతూ... ఇంట్లోనే ఉండాలి, బయటికెళితే ఖత మవుతామంటూ లాక్‌డౌన్ ప్రాధాన్యతను తెలియజేసిన పాట. పారిశుద్య కార్మికులు, నర్సులు, పోలీసులు, డాక్టర్లు వీరు నిరంతరం కరోనాపై పోరాడుతూ, ప్రజలకు చేస్తున్న సేవలను వారి త్యాగాలను, "డాక్టర్లు, నర్సులు, పోలీసులూ, పారిశుద్య కార్మికులారా/వందనాలు మీకు వందనాలు మా వేలవేల వందనాలయ్యా" అనే పాటలో అద్భుతంగా ఆవేదనా భరితంగా వారి త్యాగాలను కళ్ళకు కట్టినట్లు వివరించారు. ఇంకా అరుణోదయ మిత్ర రాసి వద్దు కరోన జల్ది మరోనా అంటూ రాసిన పాట ప్రజల్ని ఆకట్టుకుంది. ఇక విభిన్న పంథాలో సినిమాలు తీస్తున్న సంచలన డైరెక్టర్ "రామ్‌గోపాల్ వర్మ ఇది కంటికి కనిపించని పురుగు" అంటూ విభిన్నశైలిలో పాట రాశారు. ఇంకా అనని శ్రీ సూది మందులేని ఓ మాయ రోగమా/ అంటూ కరోన నుండి మనం ఎలా జాగ్రత్తగా ఉండాలో స్పష్టంగా చెప్పాడు. ఇక రాచకొండ రంగన్న అమ్మా మన్నించమ్మా" అంటూ తన ఆవేదన వ్యక్తం చేశాడు. ఇంట్లో ఇంకా సినీ మ్యూజిక్ డైరెక్టర్ శ్రీ లేఖ వలస కూలీల ఆవేదనను తన పాటతో తెలిపింది. మరో మ్యూజిక్ డైరెక్టర్ కోటి కరోనాతో ఎలా జాగ్రత్తగా ఉండాలో తెలిపారు. అదేవిధంగా ఇంకా ఆదూరి వెంకటరత్నం. నెల్లుట్ల సుమన్, తాళ్ళ నవీన్, సారంగపాణి, మూసాయిపేట యాదగిరి, మిట్టపల్లి సురేందర్, మచ్చా దేవేందర్, కోవూరి అనిల్ కుమార్, దన్నారం శ్రీనివాస్, సాయిచంద్, దరువు ఎల్లన్న, దరవు అంజన్న, బోడ చంద్రప్రకాష్, ఎర్రమల్లు, శేఖర్ పగిళ్ళ, పయిలం సంతోష్, సదానందం, రమణ, తులసి, రాజేష్, సుభాషిణి, మహేష్, చీర్ల శ్రీనివాస్, కల్పకోల్ మద్ధిలేటి, మహ్మద్ రాహుల్, పాములాగులు, చితంగిరి, ప్రవీణ్, అంబటి వెంకన్న, విద్యాధరాచారి ఇంకా ఎందరో కవులు, కళాకారులు ఈ కరోన కష్ట సమయంలో ప్రజలకు భరోసానిస్తూ అండగా నిలిచారు. వీరే కాక ఇంకా ఎంతోమంది పాట కవులున్నారు. అందరికి జేజేలు పలుకుతున్నా....

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీ కృష్ణదేవరాయల పాలనాకాలంలో తెలుగు భాషా వికాసం

- ఎన్.వి. వసుమతి,
పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం,
యస్.వి యూనివర్సిటీ, తిరుపతి.

- ఐ. వరలక్ష్మి
అధ్యాపకురాలు, తెలుగు విభాగం, సి.యస్.యస్.ఆర్
& యస్.ఆర్.ఆర్.యమ్. డిగ్రీ కళాశాల, కమలాపురం.

మన జాతి చరిత్ర, భాషా, సంస్కృతుల ఔన్నత్యాన్ని మరచిపోతున్న ప్రస్తుత తరాన్ని జాగృతం చేయడం, వాటి ప్రాచీనతను, గొప్పతనాన్ని మన జీవిన విధానంలోని విశిష్టతను తెలియజేస్తూ ఆత్మౌన్నత్య భావాన్ని పెంపొందించుకొని ''నేను తెలుగువాడిని'' అని సగర్వంగా ప్రకటించుకొనేలా చేయడానికి కావలసని స్ఫూర్తిని, సమాచారాన్ని తెలియచేసేది ఒక్క కృష్ణదేవరాయల కాలమే.

విజయనగర రాజులలో ''కృష్ణదేవరాలు'' అనే పేరు తెలుగుజాతిని మేల్కొలిపి, ఉత్తేజపరచి దివ్యలోకాలలో విహరింపచేస్తుంది. కృష్ణదేవరాయలు సంస్కృతంలో పండితుడు అయి ఉండి కూడా తెలుగులో అముక్త మాల్యద వంటి ప్రబంధ రచన చేయడం ఆయనకు తెలుగుబాషతో, తెలుగు జాతితో ఉన్న మమేకతను తెలుపుతుంది. అందుకే ఆయనను 'సాహితీ సమరాంగణ సార్వభౌమ' అన్నారు.

రాయలకాలంలో తెలుగుభాషా వికాసం :

శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజాలనే కవులున్నారు అని నానుడి. ఒకే కాలంలో ఒకే ఆస్థానంలో ఇంతమంది కవులుండటం, వారందరూ మహాకవులు కావడం, వారికి ఆశ్రయమిచ్చిన మహారాజు అత్యున్నత ప్రమాణాలు గల గొప్ప కావ్యాన్ని వ్రాయగల్గిన మహాకవి కావటం భారతదేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖింప దగిన విషయం అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

తెలుగు సాహిత్య వికాసంలో శ్రీకృష్ణదేవరాయల కాలాన్ని స్వర్ణయుగమంటారు. దీనికి కారణం ఆ కాలంలో ఎక్కువమంది కవులుండటం కాదు. రాయలు గొప్ప సామ్రాజ్యాన్ని పాలించిన చక్రవర్తి కావటమూ కాదు. ప్రబంధమనే విశిష్ట సాహిత్య ప్రక్రియను పాఠకులకు అందించినందుకు కాదు. వీటన్నింటినీ మించి ఆకాలంలో తెలుగు భాషా సాహిత్యాలకు, తెలుగు కవులకు మేరు నమాన గౌరవం వుండేదన్నదే ముఖ్య కారణం. విజయనగర వీధులలో తెలుగు పద్యం వీర విహారం చేసింది. తెలుగు ప్రబంధాలను ఆనాటి ప్రభువులు శిరోధార్యాలుగా భావించారు. తెలుగు పలుకులోని తీయదనాన్ని మనసారా ఆస్వాదించారు. క్రింది పద్యం కృష్ణరాయల కాలాన్ని స్వర్ణయుగం అని ఎందుకు అంటారో నిరూపిస్తుంది.

ఎదురైనచో తన మదకరీంద్రయు డిగ్గి
కేలూత నిచ్చి యెక్కించు కొనియె
మను చరిత్రం బందుకొను వేళ పుర మేగ
పల్లకి తనకేల పట్టియెత్తె
బిరుదైన కవిగండ పెండెరమునకీవె
తగుదని వాముపాదమున దొడిగె
గోకట గ్రామాద్యనే గాగ్రహారమున్మ
లడిగిన సమీల యందునొసగ
ఆంధ్రకవితా పితామహా, అల్లసాని
పెద్దన కవీంద్రయని నన్ను పిలుచునట్టి
కృష్ణరాయలతో దివికేగలేక
బ్రతికియున్నాడ జీవచ్ఛవంబనగుచు॥

ఈ పద్యంలోని విషయాలే నిజంగాదని కొందరను మానించినను శ్రీ కృష్ణదేవరాయల సాహిత్యాభిమానాన్ని గురించి చెప్పే కవుల పద్యాలు, శాసనాలు పరిశీలిస్తే అందులో ఏమాత్రం అబద్ధం లేదనిపిస్తుంది. నంది తిమ్మన తన పారిజాతాపరహరణం అవతారికలో శ్రీకృష్ణదేవరాయులు ప్రతి సంవత్సరం వసంతోత్సవాన్ని

జరిపేవాడని ఆ సమయంలో వచ్చిన కవి సమూహం వినిపించే కావ్యాస్వాదనతో రోమాంచం చెందేవాడని స్పష్టంగా చెప్పాడు.

ప్రతివర్ష వసంతోత్సవ
కుతుకాగత సుకవినికర గుంభిత కావ్య
స్మృతి రోమంచవిశంకిత
చతురాంతఃపురవధూ ప్రసాదన రసికా!

పెద్దనామాత్యుని చూసి రాయలు ఒకసారి కావ్యం వ్రాయమని అడిగితే ఆయన ఏమి అడిగాడో చెప్పే పద్యమొకటి ఉంది. 'నిరుపహతి స్థలం', రమణీప్రియ దూతిక తెచ్చి యిచ్చుకప్పురవిడెము, ఉయ్యల మంచం కావాలన్నాడు. ఇలాంటివి అడగటమే తప్పు. అంతటితో ఆగక పెద్దన గారు ఒప్పు తప్పు తెలిసిన పాఠకోత్తములు కూడా కావాలని అడిగాడు. అలా అడిగే ధైర్యం పెద్దనకుం దంటే ఆ కాలం సాహితీవేత్తల పాలిటి స్వర్ణయుగ మనడంలో సందేహంలేదు.

రాయలవారి గురించి ఈ కాలపు వారికి తెలియ జేయవలసిన విషయాలెన్నో ఉన్నాయి. రాయలు కన్నడిగుడని చెప్పబడినా ఆంధ్రబోజుడన్నది మాత్రం అక్షరసత్యం. రాయలకు ఆంధ్రభాషపై ఎనలేని అభి మానం. ఈ అభిమానం ఎంతవరకంటే తన కంటే ముందు రాజ్యమేలిన వారిలా కాకుండా తన ఆస్థానంలో తెలుగు కవులకే పెద్ద పీట వేశాడు. శ్రీనాథునికి ప్రౌఢ దేవరాయలు కనకాభిషేకం చేసి కవిసార్వభౌముడనే బిరుదును ప్రసాదించిన తెలుగు కవిత్వం కోసం ఆ రాజు చేసింది అంతంత మాత్రమే. ఇతని ఆస్థానంలో ప్రవేశం కోసం శ్రీనాథుడు నానా అవస్థలూ పడి "అమ్మా కన్నడ రాజ్యలక్ష్మి దయలేదా నేను శ్రీనాథుడన్" అని చెప్పుకోవలసి వచ్చింది. కాని రాయలకాలంలో తెలుగు కవులకు అలాంటి దుస్థితి లేదు. రాయలకు అంత అభిమానం ఉండబట్టి తెలుగు వారు ఆయన పేరు చెప్తేనే పులకించి పోతారు. ఆంధ్రాభి మానానికి రాయలను ఒక సంకేతంగా తీసుకుంటారు. ఆంధ్రులు తమ ప్రాంతాలలో ఒకదానికి రాయలసీమ అని పేరు పెట్టుకున్నారు. ఆ మహారాజును స్మరించేందుకే "శ్రీకృష్ణదేవరాయ భాషాంధ్రనిలయం" లాంటివి తెలుగు వారిలో తెలుగు స్పృహను కల్పించడానికి ఏర్పడినది. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంది. ఒక్కమాటలో చెప్పవలెనంటే రాయ అంటే మన తెలుగు వారికి గుర్తు వచ్చేది శ్రీకృష్ణదేవరాయలే.

తెలుగదేలయన్న దేశంబు తెలుగేను
తెలుగు వల్లభుండ తెలుగొకండ
యెల్లనృపులు గొలువ నెరుగవే బాసాడి
దేశభాషలందు తెలుగులెస్స!

ఈ పద్యంలో మొదటి పాదాన్ని ప్రతి తెలుగువాడూ పఠించాలి. "తెలుగెందుకు" అని ప్రశ్నించేవాళ్ళకు ఐదు వదల ఏళ్ళనాడు శ్రీకృష్ణదేవరాయలు సమాధానం చెప్పాడు. తెలుగు భాషను, తెలుగు సాహిత్యాన్ని, తెలుగు మాధ్యమాన్ని, తెలుగు పాలనను త్రోసిరాజనే వారికి శ్రీకృష్ణ దేవరాయల మాటలు కనువిప్పు కావాలి. తన ఆస్థానంలో తెలుగు కవులకు ఆశ్రయమిచ్చి వారిచేత గొప్ప కావ్యాలు రాయించడమే కాకుండా అముక్తమాల్యద అనే అపూర్వ కావ్యాన్ని రాసి మార్గదర్శకుడయ్యాడు రాయలు.

శ్రీకృష్ణదేవరాయల కాలంలో తెలుగు భాషా వికాసాన్ని అముక్తమాల్యదతోనే మొదలుపెట్టాలి. ఆ రాజకవి ఆస్థానంలో ఎందరు మహాకవులున్నా, గొప్ప కావ్యాలు వ్రాసినా రాయల కావ్యం ఎంతో విశిష్టమైనది. రాయలు సంస్కృతాంధ్రాలలో మహా పండితుడు. ఆయన శైలి అనన్య సామాన్యం. అలాంటి శైలిని రాయలవంటి వారే సృష్టి చేయగలరు. అముక్తమాల్యదలో రాయలు ప్రతిపాదించిన రాజనీతిని దక్షిణ భారతచరిత్ర చదివే ప్రతి విద్యార్థీ తప్పక పరిశీలించవలసిందే. ఋతువర్ణనలతో అపూర్వ వర్ణనాశక్తికి ఉదాహరణలు చూపాలంటే అముక్తమాల్యదను ఆశ్రయించాల్సిందే.

"జలజదళస్థ తోయములు నందుల క్రిందుగ దోచుమింటినీ
డలు గనుపట్టె నత్తఱి దటాకములన్ లఘిమంబొ ంటిలో
దలియదరంగ బైకెగయు తేటుల చేరుల దూన్పు దోయము

ల్పలుచన దేలిమిన్నడుగు వట్టె గడుందళ మౌట నోయనన్"!

కొలనులోని తామరాకులపైన కొద్దిగా నీరు మెరుస్తున్నది. తామర పూదేనిలకోసం తుమ్మెదలు బారులు కట్టాయి. నీటి లోపల కూడ కొన్ని తామరాకులు మునిగి ఉన్నాయి. వాటి మధ్య నుండి ఆకాశం నీటిలో ప్రతిఫలిస్తూ తునకలు తునకలుగా కనపడుతున్నది. ఈ మొత్తం దృశ్యాన్ని రాయల వారు ఎలా ఉత్ప్రేక్షించారో చూడండి. తామరాకులే త్రాసుల పళ్లాలు. అలలు దండె, త్రాసుకు కట్టిన తాళ్లు తుమ్మెదల బారులు. ఇంతకూ ఈ త్రాసు నీరు తేలికా? ఆకాశం తేలికా? తెలుసుకోవడానికి. ఆకాశం ముక్కలు అడుగుపట్టాయి. నీరున్న తామర సిబ్బుపైకి ఉంది కాబట్టి నీరే తేలికని తేలిందంటాడు కవి. ఆకాశం కంటే శరత్కాలంలో నీరు నిర్మలంగా ఉన్నదనేది దీని తాత్పర్యం.

శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో కవులు దిగ్గజాల వంటివారు. పెద్దన ఆంధ్ర కవితా పితామహుడు, స్వారోచిషమను సంభవాన్ని శిరీష కుసుమ పేశల సుధామయోక్కులతో రాయమని రాయలు అడిగాడు. పెద్దన ఆనాటి ప్రబంధాలకే మార్గదర్శకమైన మధుర ప్రబంధాన్ని రాసి కవిత్వానికే పెద్ద అని పేరుపొందాడు. పెద్దనాదుల కవిత్వం ఎంత మధురంగా ఉందంటే తర్వాతి తరాల వారంతా ఈ కవులను అనుసరించి చివరికి కవిత్వమంటే మొహం మొత్తేలా చేశారు. అంతగా తర్వాతి తరాలపై ప్రభావం చూపారు పెద్దనాదులు. పెద్దన కానీ, తిమ్మన కానీ, దూర్జటి కానీ వర్ణనల కోసమే వర్ణనలు చేయలేదు. శృంగారంలో రసికతను చూపారు. కానీ అసభ్యమైన దాన్ని అతిశయం చేయలేదు. కాని తర్వాత వారికి కవిత్వమంటే కేవలం శృంగారమనే అభిప్రాయం కలిగి కట్టమంచి రామలింగారెడ్డి గారి లాంటి విమర్శకులు దుమ్మెత్తి పోయడానికి అంతా పారిజాత పుష్పం చుట్టు తిరుగుతుంది. ఆ పుష్పం ఎలాంటిదంటే

పరిమళము సెడదు వాడదు
పరువము తప్పదు పరాగ భరిభరితంబై
నిరతము జగదేక మనో
హరమగు నీ కుసుమ రాజ మంబుజ వదనా

ఆ పువ్వు ఎప్పటికీ వాడదట, నవనవలాడుతూనే ఉంటుందట. పరిమళం ఎప్పటికీ వీడదట జగదేక మనోహరంగానే ఉంటుందంట. ఈ నంది తిమ్మన ముక్కును అద్భుతంగా వర్ణించగా భుట్టుమూర్తి డబ్బిచ్చి కొని తన వసుచరిత్రలో చేర్చుకున్నాడట. అందువల్లనే నంది తిమ్మనకే ముక్కు తిమ్మన అనే పేరు వచ్చింది అంటారు. ముక్క మీద రాసిన పద్యం పువ్వుకు సంబంధించినదే.

"నానాసున వితాన వాసనల నానందించు సారంగమే
లానన్నొలదటంచు గంధఫలి బల్కాకన్ దపంబందియో
పానాపాకృతి బూని సర్వసుమన స్సారభ్య సంవాసియై
పూనెన్ భ్రేక్షణ మాలికా మధుకరీ పుంజంబు నిర్వంకలన్"

సారంగమంటే తుమ్మెద. గంధఫలి అంటే సంపెంగ. తుమ్మెద అన్ని పూలపై వాలుతుంది. కానీ సంపెంగ పువ్వుపై వాలదు. అందువల్ల సంపెంగ తపస్సు చేసి నాయిక ముక్కుగా జన్మించిందంట. అన్ని పూల సౌరభాన్ని ఆఘ్రాణించే భాగ్యం పొందిందట. దీంతో తుమ్మెదలకు బాధకలిగి మనం చేయవలసిన పనిని ఈ ముక్కుచేస్తున్నదనుకున్నాయేమో. ఆ తరుణి చూపులనే మిషలో తుమ్మెదలు ముక్కుకు రెండు వైపులా వరుసగా నిల్చున్నాయట. ఈ పద్యాన్ని తిమ్మన రాశాడో, భట్టుమూర్తి రాశాడో కాని పద్యం మాత్రం వసు చరిత్రలో ఉంది. ఇలాంటి కల్పనా వైభవంతో పాటు రామరాజ భూషణుని వసు చరిత్రలో రాగయుక్తంగా, శ్లేష అందములతో చదువదగిన పద్యాలు కూడా బోలెడున్నాయి. కల్పనా వైభవానికి పేరుగాంచిన కళాపూర్ణోదయం, భక్తిని అత్యద్భుతంగా ప్రదర్శించి శ్రీ కాళహచీక్షీస్తిమహత్మ్యము, శ్రీ కాళహస్తీశ్వర శతకము వంటివన్నీ రాయలయుగంలో వెలువడినవే. తెనాలి రామకృష్ణుని కథలు వికటకవిగా అయనను వర్ణిస్తుంటే పాండురగం మహాత్మ్యము మాత్రం అతనోక విశిష్ట కవి అని నిరూపిస్తున్నది.

శ్రీకృష్ణదేవరాయల కుమార్తె మోహనాంగి కూడా కవయిత్రియే. ఆమె మరీచీపరిణయమనే కావ్యం రాసింది. అందులో రాయలను గురించి "కవిజన రాజరాజ పూజన భోజన కవితా విరాజమాన ముఖాంభోజ విభ్రాజిత నవీన భోజుడని" కీర్తించింది. ముఖ్యంగా రాయల సాహిత్యాసక్తిని గురించి మోహనాంగి రాసిన పద్యం ఆనాడు కవిత్వమంటే రాయలకు ఎంత మక్కువో స్పష్టం చేస్తుంది. ఆ మక్కువే రాయల కీర్తిని అజరామరం చేసింది.

"పసితనమందు నేను దన ప్రక్కను జిందులు త్రొక్కుచుండ, క్రొం
బసిడి పసందుటంగియల బల్కెడి మువ్వల మ్రోత వింటకున్
వినవడు, నాదు పద్దెములు విద్దెల ముద్దియపైడి యందెలుం
దెసగెడు మ్రోతలంచు వినునిప్పుడు మజ్జనకుండు ప్రేమచే"!

ఉపసంహారం :

ఎన్నో రాజవంశాలు, సంస్కృత భాషపై మక్కువతో తెలుగు భాషను అలక్ష్యం చేశాయి. ఈ క్రమంలో తెలుగుభాషపై ఆసక్తితో ఎందరో తెలుగు కవులు ఆశ్రయం కల్పించే అపూర్వ కావ్యాలను వారిచే రచింప చేసి, తానే స్వయంగా గోదాదేవి, శ్రీరంగనాథులు అపూర్వ కథను అముక్తమాల్యద కావ్యంగా మలచిన శ్రీకృష్ణదేవ రాయలు చిరస్మరణీయులు. భావితరాలు తెలుగుపైనున్న చులకన భావాన్ని తగ్గించుకోవాలంటే ఇలాంటి ఉత్తమ రచనలను వారిచే పఠింప చేసి ఆ భాషా ఔన్నత్యాన్ని తెలియజేయాలి. శ్రీకృష్ణదేవరాయలు పాలించిన ఇరవై ఒక్క సంవత్సరాలలో. తెలుగుభాష సామ్రాజ్యంలో రాజభాషగా మంచి గుర్తింపు పొందింది. "దేశభాషలందు తెలుగు లెస్స" అని కీర్తింపబడింది. ఈ కాలంలో ప్రబంధాలు, నాటకాలు, కావ్యాలు, శాస్త్ర గ్రంథాలు విరచింప బడ్డాయి. శైవులు, వైష్ణవులు ద్విపద కావ్యాలు రాశారు. నీతి బోధ కావ్యాలు వ్రాయబడ్డాయి. అష్టాదశవర్ణనలు, ఊహాశక్తి, భాషావైచిత్ర ప్రబంధ కవితాలక్షణాలుగా గుర్తించబడ్డాయి. శ్రీకృష్ణదేవరాయలు తాను వ్రాసిన అముక్తమాల్యదను, శ్రీవేంకటేశ్వరస్వామికి అంకిత మిచ్చారు. అందువలన రాయలకాలం తెలుగు భాషా వికాస యుగంగా అభివర్ణించబడింది.

ఉపయుక్త గ్రంథాలు :

1. 'శ్రీకృష్ణదేవరాయల వైభవం', డా॥. డి. చంద్రశేఖరరెడ్డి, పేజి నెం. 1-3.
2. 'శ్రీకృష్ణదేవరాయలకాలంబున ఆంధ్రభాషాస్థితి', నాగపూడి కుప్పుస్వామయ్య, పేజి నెం. 381.
3. 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర, సురవరం ప్రతాపరెడ్డి'.
4. 'విజయనగర రాజుల కాలంనాటి సాంస్కృతిక జీవనం', డా॥. పేట శ్రీనివాసులరెడ్డి, పేజి నెం. 381.
5. 'రామరాయులు, అంతటి నిరసింహం', పేజి నెం. 89.
6. 'రాయలు కాలంనాటి రసికత జీవితం', పుట్టపర్తి నారాయణాచార్యులు.

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పూల కుండీలు నవల - దళిత స్త్రీ దృక్పథం

- ధర్నాకర్ల నాగయ్య, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

రచయిత పరిచయం :

శిరశెట్టి కాంతారావు గారి స్వస్థలం నల్గొండ జిల్లా తిర్మలగిరి మండలం, ఫణిగిరి గ్రామంలో జన్మించారు. తల్లి పిచ్చిమ్మ తండ్రి అనంతయ్య. ప్రాథమిక విద్య మరియు ఉన్నత విద్య వరకు కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలంలోని షేక్ మహమ్మద్‌పేటలో పూర్తి చేశాడు. వృత్తి రీత్యా ఓ ప్రభుత్వ కర్మాగారంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ప్రవృత్తి మాత్రం రచయిత. ఆధునిక తెలుగు సాహిత్యంలో తెలంగాణ ప్రాంతం నుండి మరియు ఆంధ్ర ప్రాంతం నుండి వివిధ ప్రక్రియలపై పరిశోధనాత్మకమైన రచనలు చేశారు. వీరు ప్రధానంగా సుమారుడు 80 కథలు, నాలుగు నవలలు 1. ఆకుపచ్చ విధ్వంసం, 2. వ్యూహం, 3. పూల కుండీలు, 4. వాళ్ళు గెలవాలి రాశారు. వీరు అటు కథలు, ఇటు నవలలోపాటు వివిధ సాహిత్య వ్యాసాలు, కవిత్వం కూడా రాశారు. వీరు వ్రాసిన కథలు వేరే భాషల్లోకి అనువాదం అయ్యాయి. వీరు రాసిన ఆకుపచ్చ విధ్వంసం అనే నవలకు కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత అంపవయ్య నవీన్ అందించే మొట్టమొదటి సాహిత్య పురస్కారం లభించింది. ఇతనికి కథలు చెప్పడం అన్న కథలు వ్రాయడం అన్నా అమితమైన ఇష్టం అని సగర్వంగా చెప్పుకునే ఆధునిక కథా, నవలా రచయితగా మంచి పేరొందిన రచయిత శిరంశెట్టి కాంతారావు. పూల కుండీలు నవల 2016 సంవత్సరంలో మొదటిసారిగా గ్రంథ రూపంలో అచ్చు అయ్యింది.

పూలకుండీలు నవల ఇతివృత్తం :

విద్యావంతులైన కొంతమంది ధనవంతులు (స్త్రీలు) పిల్లలను కనడం వలన వారి అందం తగ్గుతుందన్న ఆవేదనతో పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించి కార్పోరేట్ హాస్పిటల్స్ నుండి మధ్యవర్తుల ద్వారా 'సరోగసీ' అద్దె గర్భం ద్వారా వారికి కావాల్సిన పిల్లలను కనడానికి హాస్పిటల్ ఏజెంట్స్ నిరుపేద మహిళలకు డబ్బును ఎరగా వేసి తొమ్మిది నెలలు ఆ స్త్రీలు గర్భాలను అద్దెకు తీసుకొని, ఒక ఇంజక్షన్ ద్వారా ఒకరి పిండాన్ని మరొకరి గర్భంలోకి ప్రవేశపెట్టి ఆ స్త్రీ శిశువుకు జన్మనిచ్చిన అనంతరం తల్లి నుంచి బిడ్డను దూరం చేసి, డబ్బును చెల్లించి కావాల్సిన దంపతులకు చెందవల్సిన ప్రతిఫలాన్ని ఎక్కువ మొత్తంలో ఆర్.ఎం.పి డాక్టర్లకు కార్పోరేట్ హాస్పిటల్స్ ఏజెంట్స్ కమీషన్ రూపంలో దోచుకుంటారు. అలా దోపిడీకి గురి అయిన స్త్రీ శాంతమ్మ అనుభవించిన ఆర్తిని, ఆవేదనను రచయిత పూలకుండీలు అనే నవలలో చిత్రించాడు.

పూలకుండీలు నవల - వస్తు విశ్లేషణ :

శాంతమ్మ, ఎల్లయ్యల దంపతులది పాల్వంచ. భర్త ఎల్లయ్య పాల్వంచలోని రాష్ట్ర ప్రభుత్వరంగ పరిశ్రమ ఏ.పి. స్టీల్ కంపెనీలో అటెండర్‌గా పనిచేసేవారు. ఉద్యోగం పర్మినెంట్ అవుతుందని భావించిన కొద్దికాలంలో కంపెనీని మూసి వెయ్యడంతో నిరుద్యోగిగా వీధిని పడిన ఎల్లయ్య కూలి నాలి చేసుకుంటూ, సంసారపు బండిని అతి కష్టం మీద నడిపించడం జరుగుతుంది. శాంతమ్మ కాలనిలో ఇళ్లలో పనికి వెళుతుంది. తాతల కాలంనాటి మూడు గదుల పెంకుటిల్లు కాస్త మున్సిపాలిటి విస్తరణ భాగంగా తొలగించబడుతుంది. అందుకుగాను చాలా మంది పేదవాళ్ళకు నగరానికి కొంతదూరంలో సర్కార్ స్థలంలో ఇంటి జాగాలు ఇస్తుంది. గుడిసెలో నివాసం ఉంటున్న ఎల్లయ్య దంపతులకు ఇందిరమ్మ ఇల్లు కట్టాలనే కోరికతో శాంతమ్మ భర్తతో చెప్పి ఒప్పిస్తుంది.

ఇల్లు మొదలు పెట్టి పునాదులు తీసిన ఆరు నెల్లకుగాని బేస్‌మెంట్ లేవలేదు. "దరిద్రుడి పెళ్ళికి వడగళ్లవాన" అన్నట్లుగా రాష్ట్రంలో పాత ప్రభుత్వం పోయి

కొత్త ప్రభుత్వ రావడంతో! ఇందిరమ్మాయ ఇండ్ల నిర్మాణంలో అవినీతి జరిగిందంటూ విడుదల చెయ్య వల్సిన ఇండ్ల బిల్లులు నిలిపివెయ్యడంతో! ఎన్ని ప్రయత్నాలు చేసిన ఇల్లు కిటికి లెవల్ వరకు వచ్చి ఆగుతుంది. భర్త, అత్తమామలు ఎన్ని చెప్పిన వినకుండా శాంతమ్మ చేసిన ఆలోచనతో ఇంటి నిర్మాణం మొదలు పెట్టినందుకు చాలా ఇబ్బంది పడుతుంది. శాంతమ్మ కుటుంబం అప్పుకోసం ఎన్ని ప్రయత్నాలు చేసిన పుట్టక పోవడంతో ఇంటి కాగితాలు తీసుకొని స్థానికంగా ఆర్.ఎం.పి.గా పనిచేస్తున్న లింగయ్య వద్దకు అప్పుకోసం వెళ్ళారు. అయితే లింగయ్య మాత్ర అదను చూసి వడ్డీ రేటును పెంచే ఫైనాన్సియర్‌గా మారిపోతాడు. ఎల్లయ్య శాంతమ్మా దంపతులు ఇంటి కాగితాలను తాకట్టు పెట్టి రూ. 8/-ల వడ్డీ చొప్పున ముప్పై వేల రూపాయలు ఫైనాన్స్‌గా తీసుకుంటారు. కమీషన్ పోను చేతి రూ. 28,000/- వస్తాయి. అన్ని ఖర్చులు చూసుకుంటూ ఇంటికి స్లాబ్ పడకపోవడంతో సిమెంట్ రేకులు తెచ్చి కప్పుగా వేసుకుంటారు. సిమెంట్ బస్తాలనే కిటికీలకు, దర్వాజలకు తలుపులుగా కట్టుకుంటారు.

నెలనెల ఫైనాన్స్ కిస్తీ డబ్బులు కట్టలేక ఇల్లు గడవక చాలా ఇబ్బంది పడుతుంది శాంతమ్మ. ఇదే సమయంలో ఎల్లయ్యకు హెల్పర్ పని దొరుకుతుంది. కాని పనిచేసేది బొంబాయిలో అని భార్య శాంతమ్మకు చెపితే వద్దం టుందని చెప్పకుండానే బొంబాయి వెళ్తాడు. అక్కడ తనకున్న ఫ్యాన్ పోతుంది. భర్త కోసం ఎదురు చూసిన శాంతమ్మకు నిరాశే కలుగుతుంది. చివరికి భర్త బొంబాయిలో ఉన్న సంగతి తెలిసిన తరువాత శాంతమ్మ మనసు కొంత కుదుటపడుతుంది. శాంతమ్మ కాలనీలో ఇల్లల పనికి వెళ్తూ, ఇంటిని నలుగురు పిల్లలను అత్త మామలను సాకుతుంది. ఇంటికి తెచ్చిన ఫైనాన్స్ డబ్బులు కట్టలంటూ డా॥. లింగయ్య శాంతమ్మను మానసికంగా ఇబ్బండి పెట్టడం జరుగుతుంది. ఇంతలో శాంతమ్మ చిన్న కూతురుకు గుండె జబ్బు రావడంతో సర్కార్ ధవకానాల చుట్టూ తిరిగి తిరిగి ఆరోగ్య శ్రీ కార్డు గుండె ఆపరేషన్ చేయిస్తుంది. అలా తన బిడ్డ కోసం రోజుల తరబడి హాస్పత్రుల చుట్టూ తిరుగుతుంటే కాలనీలో పనికి పెట్టుకున్న ఇంటి యజమానులు శాంతమ్మను పనినుండి తొలగిస్తారు. చేసేదేమిలేక శాంతమ్మ దొరికిన పనికల్లా కూలికి వెళుతుంది. వచ్చిన కూలీ ఇంటి ఖర్చులకు, బిడ్డ మందులకే సరిపోవడంలే? ఒక కిస్తీ డబ్బులు కట్టలేక ఆర్.ఎం.పి. లింగయ్య అనే మాటలకు మానసికంగా ఇబ్బంది పడుతుంది. ఆమెరికాలో ఉంటున్న కిషోర్ అనిత దంపతులకు పిల్లలు పుట్టే అవకాశం లేకపోవడం వాళ్ళు హైదరాబాద్‌లో ఉన్న అజంతా హాస్పిటల్ చైర్మన్ కలిసి 'సరోగసీ' ద్వారా మాకు సంతాన కావలనడం, అతడు, తన ఏజెంట్ వెంకట్‌రెడ్డి, పిలిచి గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఉండే ఆర్.ఎం.పి లింగయ్య లాంటి బ్రోకర్‌ల ద్వారా పేదింటి స్త్రీలను ఎంచుకొని వారి వ్యాపారం చెయ్యడం జరుగుతుంది. ఈ వ్యాపారంలో లక్షల రూపాయలు అక్రమంగా సంపాదిస్తుంటారు. సరిగ్గా అదే సమయంలో హైదరాబాద్ నుండి ఆర్.ఎం.పి లిగయ్యకు ఏజెంట్ వెంకట్‌రెడ్డి నుండి అద్దె గర్భం చెయ్యడానికి స్త్రీ కావాలంటూ సమాచారం అందిస్తారు. అదే అదనుగా భావించిన లింగయ్య తన అప్పును, తనకు వచ్చే కమీషన్‌ను కూడ తీసుకోవద్దని అందుకు శాంతమ్మను ఎంచుకుంటాడు. శాంతమ్మకు అద్దె గర్భం గురించి వాళ్ళు ఇచ్చే 3 లక్షల రూపాయల గురించి చెప్పి నీ పేదరికం అంతా మాయం అవుతుంది. ఇల్లు, నీ పిల్లలు భవిష్యత్ అంతా కూడా బాగుంటుందని చెప్పి ఒక కొత్త ఆశను శాంతమ్మ మనస్సులో పడవేసి వెళ్తాడు. ఆ మాటలు విన్న శాంతమ్మ మొదట్లో వ్యతిరేకించినా, వచ్చే 3 లక్షల రూపాయలతో తన కష్టాలు అన్ని కూడా తొలగిపోతాయి అని భావించి అద్దె గర్భంకు ఒప్పు కుంటుంది. అడ్వాన్స్‌గా ఇచ్చిన పదివేల రూపాయలతో ఇంటికి కావాల్సిన కిరాణా సామాన్లు కొని అత్తమామకు ఇచ్చి పిలకు తల్లిగారి ఇంట్లో వదలి, తల్లి తండ్రికి మాత్రమే విషయం చెప్పి లింగయ్య ఇచ్చిన ఫోన్ అడ్రస్ పట్టుకొని శాంతమ్మ హైదరాబాద్ చేరుతుంది. అప్పటికే

శాంతమ్మ లాంటి పేద స్త్రీలను అద్దె గర్భాలకు ఒప్పించి అక్రమంగా డబ్బు సంపాదిస్తున్న బ్రోకర్ వెంకట్‌రెడ్డి వచ్చి శాంతమ్మను బేగంపేటలో ఉన్న అజంతా హాస్పిటల్‌కి తీసుకెళ్ళి మేనేజ్‌మెంట్‌కు అప్పగించి తనకు రావాల్సిన కమీషన్ శాంతమ్మకిచ్చే 3 లక్షల రూపాయల నుండే తీసుకుని వెళ్తాడు.

నర్సులు వచ్చి శాంతమ్మ నుండి కావాల్సిన వివిధ బ్లడ్ శాంపిల్స్ తీసుకొని కావాల్సిన పరీక్షలు చేసి అన్ని నార్మల్‌గా ఉన్నవి అని చెప్పడంతో పెద్ద డాక్టర్ వచ్చి శాంతమ్మను పరీక్షించి, వెంటనే శాంతమ్మ భర్తను పిలిపించి అన్ని డాక్యుమెంట్లపై సంతకాలు తీసుకోవాలంటూ చెప్పి వెళుతుంది. ఎల్లయ్య బొంబాయి పోయింది మొదలు ఐదు నెలల వరకు కనీసం ఫోన్‌గాని, ఉత్తరం గాని ఇంటికి ఇవ్వలేదు. దానితో ఇంటికి పూర్తిగా కమ్యూనికేషన్ కట్టయ్యింది. కాని పనితీనుకెళ్ళిన కాంట్రాక్టర్ పాల్వంచలో కొంతకాలం పనిచేసినప్పుడు, ఆర్.ఎం.పి. లింగయ్యతో పరిచయం ఉండటం వలన విషయం తెలుసుకున్న ఏజెంట్ వెంకట్‌రెడ్డి శాంతమ్మ భర్త ఎల్లయ్యతో ఫోన్‌లో నీ భార్యకు గర్భ సంచికి గడ్డ అయ్యిందని మీరు వెంటనే హాస్పిటల్‌కి వచ్చి సంతకాలు చేస్తే నీ భార్యకు ఆపరేషన్ చేస్తారంటూ, మాయమాటలు చెప్పి బొంబాయి నుండి శాంతమ్మ భర్తను రప్పించి అన్ని కాగితాలపై సంతకాలు తీసుకుంటాడు.

అసలు విషయం ఇది అని ఎవరు కూడా వివరించరు ఎల్లయ్యకు. పని ఒత్తిడి కారణంగా ఎల్లయ్య వచ్చిన మూడవరోజునే మళ్ళీ బొంబాయికి వెళ్తాడు. సరిగ్గా రెండు నెలలు తరవాత ఇంటికి వచ్చిన ఎల్లయ్యకు ఇంట్లో శాంతమ్మ లేకపోయే సరికి అనుమానం వస్తుంది. తల్లి దండ్రులను అడగడంతో పట్నంలో చంటి పిల్లలను పట్టుకోవడానికి వెళ్ళిందంటారు. తల్లి దండ్రి చెప్పిన విషయంపై నమ్మకం లేక ఎల్లయ్య శాంతమ్మ తల్లిగారి ఊరు అయిన భద్రాచలం వెళ్తాడు. ఇంతకాలం బిడ్డను వదిలి, పిల్లలను దాని మెడకు గుదిబండలా తాకించి వెళ్ళినందుకు అత్త 'జానకమ్మ' అల్లున్ని తిడుతుంది. ఎల్లయ్య మనస్సు గాయపడుతుంది. పిల్లలను తీసుకొని ఇంటికి వచ్చిన ఎల్లయ్యకు భార్య శాంతమ్మ ఎందుకు ఇంటికి రాలేదనే ఆలోచనలోబడి తాగి తిరుగుతుంటాడు. కాలనీలో ఉన్న జనం ద్వారా ఆర్.ఎం.పి లింగయ్య ద్వారా హైదరాబాద్‌లో ఏదోపని మీద వెళ్ళిందట! అన్న విషయం తెలిసిన ఎల్లయ్య నేరుగా లింగయ్య ఇంటికి వెళ్తాడు. అప్పటికే ఊర్లో కొచ్చిన ఎల్లయ్య విషయం తెలిసిన లింగయ్య తీర్థయాత్రలకు వెళ్తాడు. ఎల్లయ్య తల్లి దండ్రులను ఒప్పించి, పిల్లలతో సహా హైదరాబాద్ చేరుకొని, తన భార్యను పంపించాలంటూ హాస్పిటల్ వద్ద పెద్ద గొడవ చెయ్యటంతో, సెక్యూరిటీ అతన్ని బయటకి నెట్టి వేస్తారు. విషయం తెలిసిన స్థానికంగా ఉండే గల్లీ లీడర్లు ఎల్లయ్యకు న్యాయం చేస్తానంటూ రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న ఎల్లయ్యకు తాత్కాలిక మద్దతు తెల్పడంతో పోలీసులు వచ్చి ఎల్లయ్యను కొట్టడం జరుగుతుంది. హాస్పిటల్ ముందు జరుగుతున్న వ్యవహారం అంత కూడా స్వీపర్ కనకమ్మ సహాయంతో శాంతమ్మ తెలుసు కుంటుంది. సాటి స్త్రీకి న్యాయం జరగాలన్న తపనతో కనకమ్మ సిటీలో ఉన్న మహిళ సంఘాలకు శాంతమ్మకు జరిగిన అన్యాయంను తెల్పిడంతో! మహిళా సంఘాలు హాస్పిటల్‌ను చుట్టుముట్టి ధర్నా చెయ్యడంతో పోలీసు బలగం వెనుకకు తగ్గుతుంది. తనకు రావాల్సిన డబ్బు రాకపోగ అన్యాయంగా తన భర్తను కొడుతున్నందుకు ఆవేదన చెందిన శాంతమ్మ ఆర్.ఎం.పి. లింగయ్య. ఏజెంట్ వెంకట్‌రెడ్డి లాంటి బ్రోకర్‌కు బుద్ధి చెప్పాలంటూ తన లాంటి పేద మహిళలకు న్యాయం జరగాలంటూ ధర్నా చేస్తుంది. ఈ సమయంలోనే శాంతమ్మకు పురిటి నొప్పులు రావటంతో హాస్పిటల్ గేట్ వద్దనే డెలివరికి సిద్ధపడుతున్న క్షణాలను గమనించిన సాటి మహిళ లోకం అర్థం చేసుకొని ప్రక్కనే ఉన్న చిన్న గదిలోకి తీసుకెళ్తారు. శాంతమ్మ పండంటి మగబిడ్డకు జన్మనిస్తుంది.

ముగింపు :

ప్రపంచీకరణలో భాగంగా సాంకేతిక పరమైన కొత్తకొత్త

ఆవిష్కరణాలు జరుగుతున్న ఈ హైటెక్ యుగంలో మానవుడి జీవితంలో పెను మార్పులు సంభవిస్తున్నాయి. అటువంటి ఒక మార్పే నవమాసాలు మోయకుండానే కొందరు తల్లులు పిల్లల్ని కనేస్తున్నారు. 'సరోగసీ' లేదా అద్దె గర్భాలు అనే సరికొత్త పద్ధతిలో తమ గర్భంలో పెరగాల్సిన పిండాల్ని వేరొకరి గర్భంలో ప్రవేశపెట్టి ఆ శిశువును ప్రసవించాక అసలు తల్లులు ఆ శిశువుల్ని తీసికెళ్తున్నారు. అందుకుగాను ప్రతిఫలితంగా (సరోగేట్ మదర్స్‌కు) పెద్దమొత్తంలో డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. కాని మధ్యవర్తుల కారణంగా గర్భాలను అద్దెకిచ్చి డబ్బు ఎక్కువ మొత్తంలో బ్రోకర్స్ తీసుకుంటారు. అలా తమ ప్రాణాలు సైతం లెక్కచెయ్యకుండా పేద మహిళలు తమ గర్భాలకు అద్దెకిస్తే? చివరికి వారికి అందాల్సిన కనీస పరిహారం అందకపోవడం శోచనీయం.

ఉపయుక్త గ్రంథాలు :

1. పూలకుండీలు - నవల - శిరంశెట్టి కాంతారావు.
2. ఆంధ్రభూమి దినపత్రిక - 2016.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీ పోతులూరి వీరబ్రహ్మం గారి ఆధ్యాత్మిక విశేషాలు

- ఐ. చంద్రశేఖర్, పరిశోధక విద్యార్థి, రాయలసీమ విశ్వవిద్యాలయం, కర్నూలు.

బ్రహ్మతత్త్వం :

"బ్రహ్మమనగ వేఱె పరదేశమున లేడు
బ్రహ్మమనగ జూడు బట్టబయలు
తనకు దానె బ్రహ్మతారక మౌనురా!"

- కాళికాంబ సప్తశతి ప : 390

మానవుడు సహజస్థితి యందు యోగయుక్తుడై స్వయం ప్రకాశకమైన ఆత్మతత్త్వం చేత బ్రహ్మతత్త్వాన్ని అది నేనేనని ఎపుడు తెలిసికొంటారో అప్పుడు జీవుడే బ్రహ్మమగునని బ్రహ్మంగారు పై పద్యంలో బ్రహ్మతత్త్వాన్ని సాక్షాత్కరింపజేశారు.బ్రహ్మైక్య జ్ఞానం పొందిన జ్ఞానికి జనన మరణాలుండవని, సమస్తమైన భౌతిక తత్త్వములకు దూరమైన పరతత్త్వాన్ని తనను గూర్చి తెలుసుకొని నేను నాది అను ఎల్ల బంధముల నుండి విముక్తి పొందు తున్నాడని బ్రహ్మంగారు స్పష్టపరిచారు. దృశ్యమాన జగత్తు కంతటికి ఏదో ఒక బలమైన మహోత్తర శక్తి కారణమై ఉ ంటుందని అందరూ అంగీకరించక తప్పదు. కారణం లేని కార్యం జరుగదు. ప్రపంచానికి ఉపాదాన కారణముండ వలెను. కుండలు చేయు కుమ్మరికి మట్టియనే ద్రవ్య మొకటి కారణమున్నట్టే ఈ జగత్తుకు ఉపాదాన కారణ మేది యున్నదియని మనస్సులో కలుగుతుంది. ఏదో ఒక మహాశక్తి ఈ జగన్నిర్మాణానికి కారణమని మనం తెలుపుతున్నామో అది తనకంటే వేరగు ఉపాదాన పదార్థాన్ని తీసుకున్నట్లు లేదు. సర్వశక్తి సమన్వితమైన వస్తువుకు మరొక ఉపాదాన పదార్థమక్కర లేదు. ఏది ఈ జగత్తుకు కారణమో అదే ఉపాదాన నిమిత్తము లనెడి రెండు కారణాలు తానే అయి యున్నది. ఈ జగత్తును సృష్టించిన గొప్ప శిల్పి తనకంటే వేరైన పదార్థంతో ఈ లోకాలను సృష్టించిన యెడల ఆ శక్తి పదార్థం తన కంటే భిన్నమైన విపరీత లక్షణాలను కల్గియుంటుంది. ఆ విధంగా ఆలోచిస్తే తనకంటే వేరైన మరొక పదార్థం తాను అవుటకు అవకాశం లేదు. అందువలన అది ద్వైత భావమే అవుతుంది. కనుక ఉపాదాన నిమిత్తములనెడి రెండునూ అదే!

ఉపాదాన కారణం నుండి పుట్టిన వస్తువు దానియందే లయించుట జరుగుతున్నది. ఉదాహరణకు మట్టి ఉపాదాన కారణమై పుట్టిన కుండ చివరకు మట్టిలోనే కలస్తున్నది. కుండ అనే రూపాన్ని దాల్చిన సమయంలో తప్ప ఆదిలోను, అంతంలోను మట్టిగానే మనం భావిస్తున్నాం. కుండ అనే రూపం ఈ మధ్యకాలంలో మాత్రమే మనకు కనపడుచున్నది. అప్పుడు కూడా కుండయనే నామాన్ని రూపాన్ని వదలిన చివరకు మిగు లునది మట్టి మాత్రమే! ఆలోచిస్తే కుండ యందున్నది మృత్తికయే! అందువల్ల "తైత్తరీయ భృగువల్లి"లో, "యతో వా ఇమాని భూతాని జాయన్తే యేన జాతాని జీవన్తి యత్ప్ర యన్త్యభి సంవిశన్తి తద్విజిజ్ఞాసస్య తద్ధ్మేతి"[6] అన్నారు. దేని నుండి భూతకాలం పుడుతూ, దేనిచే జీవిస్తూ, దేని యందు అణగారుతున్నదో అదే మానవుడు తెలుసు కోదగిన జగత్కారణ మగు బ్రహ్మం. అందువల్ల ఈ జగత్తు పుట్టుక పూర్వం, గిట్టిన తర్వాత బ్రహ్మమే! ఈ మధ్య కాలమందే నామరూపాత్మక జగత్తు యొక్క వ్యవహారం. నామరూపాలను తొలగించి వస్తు యధార్థ స్థితిని గాంచిన వారికి కుండ మట్టి కంటే వేరు కాదని తోచినట్లు జగ మంతా బ్రహ్మమయమే అవుతుంది. అందుకే బ్రహ్మం గారు,

"విజ్ఞుడైన వాడు వేదాంతి యగువాడు
ఎఱుకవాడు, శక్తి నెఱుగువాడు
నీవెవండనిన నేను బ్రహ్మంబను"

- కాళికాంబా సప్తశతి - ప : 332

మరొక సందర్భంలో,

"బ్రహ్మమనగ నేమి ? బ్రహ్మ శబ్దార్థమ్ము

దేని గుణము వలన దెలియవచ్చు
నన్న ప్రశ్న ముదయ మంద నీవొదువు"

- కాళికాంబా సప్తశతి - ప : 686

- అని సూచించారు. ఈ హృదయ మందెవ్వడు బ్రహ్మము నెఱుగు చున్నాడో అట్టి వాడు సాక్షాత్ బ్రహ్మమే యవుతున్నాడని బ్రహ్మంగారు ప్రస్తావించారు.

ముండకోపనిషత్తులో,

"యథా నద్య స్యంద మానాసముద్రే
అస్తం గచ్ఛన్తి నామరూపే విహాయ
తథా విద్యాన్నామరూపాద్విముక్తం
పరాత్పరం పురుష ముపైతి దివ్యమ్"-7

- అని చెప్పబడింది. గంగ, యమున, గోదావరి మొద లైన నదులు ప్రవహించి, ప్రవహించి చివరకు తమ నామ రూపాలను వదలి నముద్రంలో కలున్తున్నట్లు తత్త్వజ్ఞుడగు పురుషుడు నామరూప భేదాలతో కనిపించే ఈ జగత్తు నుండి విడివడి బ్రహ్మ తత్వాన్ని పొందు తున్నాడు. ఈ బ్రహ్మం ఆత్మ కంటే వేఱు కాదు. ఆత్మ యందు ఏ లక్షణాలు గలవో బ్రహ్మ మందు అదే లక్షణాలున్నాయి. "సత్యం జ్ఞాన మనస్తం బ్రహ్మ" అని తైత్తరీయోపనిషత్తు తెలుపుతున్నది. ఏ లక్షణాలు ఆత్మ విషయకంగా ముఖ్యమైనవో అన్నీ బ్రహ్మమందున్నవి. ఏ జనన మరణ రూప సంసార విముక్తి ఆత్మ జ్ఞానం వల్ల కలుగుతున్నదో అవన్నీ బ్రహ్మ జ్ఞానం చేత కలుగుతున్నది. "బ్రహ్మ"న్ని తెలుసుకొన్న వానికి ఏ కోరికలుండవు. పరమోత్తమమైన కోరిక ఫలించిన తర్వాత కోరదగింది మరొకటుండదు. మానవునకు కావలసినది అదే!

ఎవడు నిరంతం పలు విధాలైన కోరికలను కోరు తుంటాడో వాటిననుభవించుట కొరకై అతడు పుట్టు చుండుట జరుగుతున్నది. కామ పరిసమాప్తి పొందిన కృతార్థ జీవునికి తన ఆత్మయందే అన్ని కోరికలు లీనమగు తున్నవి. దీనిని పొందిన తర్వాత జీవునకు మరొకటి పొందవలసిందుండదు.

బ్రహ్మవేత్త ఉత్కృష్టమైన పదవి పొంది బ్రహ్మానందాన్ని అనుభవిస్తున్నాడు.

"బ్రహ్మానంద సుఖమ్మును బ్రహ్మమ్మును గూడు నాడె పడయెతెనె జదెమ..." అంటూ బ్రహ్మంగారు కాళీమకుట కందాలు 64వ పద్యంలో బ్రహ్మానందాన్ని గూర్చి వివ రించియున్నారు. మానవులు బ్రహ్మైక్యమందినపుడే బ్రహ్మానందమనుభవిస్తారు. తైత్తరీయోపనిషత్తులో మనుష్యానందం, మనుష్య గంధర్వానందం, దేవ గంధర్వానందం, చిరలోకపిత్రానందం, అజానజ దేవా నందం, కర్మ దేవానందం, దేవానందం, ఇంద్రానందం, బృహస్పత్యానందం, ప్రజాపత్యానందం, హిరణ్యగర్భా నందం అను పదునొకండు ఆనందాలకంటే అత్యధిక మగు ఆనందం బ్రహ్మానందమని చెప్పబడింది. బ్రహ్మ తత్వ మెఱిగిన జీవుడు అమృతుడవుతున్నాడు. భయంకర మృత్యువనే కూపాన్ని దాటడానికి ఆ బ్రహ్మ నెఱుగు దారితప్ప మరొకటి లేదు. సర్వాకాల, సర్వదేశ, సర్వ వస్తువులందు వెలుగుతున్న పరమాత్మ మాయా కల్పితములైనట్టి శరీరాలందు "సాక్షి"గా వెలుగొందుతూ "నేను, నేను" యని వ్యవహరింపబడుతున్నది. ఇట్టి నేనే అనంతమగు బ్రహ్మమవుతున్నది.

"సర్వం ఖల్విదం బ్రహ్మ" ఇంద్రియ గోచరమగు ఈ జగత్తు సర్వం బ్రహ్మమే. "యశ్వరం బ్రహ్మ సర్వాత్రా విశ్వస్యాయతనం మహత్ సూక్ష్మాత్సూక్ష్మతరం నిత్యం తత్వమేవ త్వమేవతత్" సర్వానికి ఆత్మభూతమై ఈ జగం యొక్క పుట్టుటకు కారణమై సూక్ష్మాతి సూక్ష్మమై నిత్యమై వెలుగొందుతూ, ఏ పరబ్రహ్మ తత్వం ప్రకాశిస్తున్నదో ఆ బ్రహ్మం నీవే! ఆ బ్రహ్మ తత్వాన్ని తెలుసుకొనేటందుకు గొప్ప ప్రజ్ఞ కావాలంటున్నారు బ్రహ్మంగారు. "కలడొకండు వాని తెలియుట కష్టంబు వాని నరయ గొప్ప ప్రజ్ఞ వలయు అరసి నేని బ్రహ్మమానందమై తోచు" వీర కాళి కాంబా శతకం - ప : 465 పై పద్యంలో బ్రహ్మంగారు "కలడొకండు" అన్నాడు. అతడు సాక్షాత్తు బ్రహ్మమే! ఆ "బ్రహ్మం" గురించి తెలుసుకోవాలంటే విశేషమైన ప్రజ్ఞ కావాలి. ఆ ప్రజ్ఞను సంపాదించి నపుడే సాధకునకు బ్రహ్మను దర్శించే అర్హత కలుగుతుంది. ఆనంద రూపంలో బ్రహ్మం కనిపిస్తాడు. అపుడు బ్రహ్మానందమే

సాధకునకు లభిస్తుంది. ఇదే అద్వైత సిద్ధి. సాధకుని లక్ష్యం ఇదే కావాలని బ్రహ్మంగారు ప్రబోధించారు.

జీవన్ముక్తి :

సాధకుడైనవాడు పూర్వ సంస్కార గుణాలను మార్చు కొని బ్రహ్మ భావనకు అనుకూలంగా ఉండి, ఆత్మ జ్ఞానంతో నిరంతరం సాధన కొనసాగిస్తుంటే లోకమంతా బ్రహ్మమే అనే భావన ఉంటే అతడే జీవన్ముక్తుడని బ్రహ్మంగారు తన శిష్యులకు తెలియజేసినట్లు కాలజ్ఞానం లోని జీవైక్యబోధ ఆధారంగా మనకు తెలుస్తుంది. భగవంతుని మనం బాహ్య ప్రపంచంలో దర్శించలేము. మానవుడు తనలో ఉన్న అంతర్ శక్తిని బహిర్గతం చేయ డానికి ప్రయత్నించాలి. సాధన లేకుండా తన శక్తిని తెలుసుకోలేడు. బాహ్యంలో లభ్యమయ్యే అల్ప సుఖాల కాసించేవాడు ముక్తికి దూరమవుతూనే యుంటాడు. "స్వీయ సౌఖ్యములకు వెంపరలాడుచు క్రూరముగను పరుల కొల్లకొట్టు....." కాళికాంబా సప్తశతి - ప : 19 అశాశ్వతమైన సుఖాలకు అర్రులుచాచి వాటికోసం ఇతరులకు కీడు కల్గించు వాడెవ్వడు పరమాత్మ దర్శనం పొందలేడు. సాధకుడు అంతర్ముఖుడై ఆత్మానందాన్ని పొందిన తర్వాత బయట ప్రపంచ సుఖాల పట్ల విరక్తి భావంతోనే యుంటాడు. శాశ్వతసుఖం ముందు అశాశ్వత సుఖం వెలవెల బోతుంది. ఆత్మజ్ఞాని ఆత్మయందే నిలిచి దేదీప్యమానంగా ప్రకాశిస్తాడు. అటువంటి వారి యందు ఏ కోరికలూ ఉండవు. అతని మనస్సులో బ్రహ్మభావం తప్ప మరే భావముండదు. ఎల్లప్పుడూ తనలోని బ్రహ్మమందే నిలుస్తాడు.

"జీవన్ముక్తస్తు తద్వి ద్వా న్సా ర్వోపాధి గుణాన్ త్యజేత్।
సచ్చినంద రూపత్వాత్ భవేద్భ్రమర కీటవత్ ॥ "

భ్రమరం కీటకంగా మారినట్లు జీవన్ముక్తుడు ఆత్మ జ్ఞానం గల్గి బ్రహ్మ చింతనతో బ్రహ్మంగానే మారు తున్నాడు.

కనుక సాధకుడు మొదట ఇంద్రియ నిగ్రహాన్ని అలవర్చుకోవాలి. ఆత్మ సాక్షాత్కారానికి ప్రథమ సోపానమే ఇంద్రియ నిగ్రహం. అంతర్ముఖుడైన సాధకునికి ఇంద్రియాలు వాటంతటవే వశమవుతాయి. సమస్త దుఃఖాలను తొలగించుకోవడానికి ఆత్మజ్ఞానాని కంటే దివ్య మైన ఔషధం మరొకటి లేదు. ఈర్ష్వా, ద్వేష, అసూయాది గుణాలు రూపుమాపాలంటే ఆత్మమార్గ మొకటే సరియైనది. ఆత్మ జ్ఞానం వల్ల నిత్య సత్యం అవగత మవుతుంది. మానవుడు నిత్యానందంతో ఉండేటట్లు చేస్తుంది. ఆత్మజ్ఞానం కల్గినవాడు శరీరంతో యున్నప్పటికీ శరీరానికి సహజ గుణాలేవి అంట కుండానే జీవిస్తాడు. లౌకిక భోగైశ్వర్యాలు, సుఖదుఃఖాలు, కీర్తి ప్రతిష్ఠలు అనేవి జీవితాన్ని పతనావస్థకు తీసుకు వెళతాయని అతనికి తెలుసు. ఆత్మానుభవం పొందినవాడు మళ్లీ బహిర్ముఖుడై విషయ సుఖాల వైపు వెళ్లడు. చివరకు దేహం ధరించడమే ఒక బంధమని తెలుసుకొని దేహ సౌఖ్యాలకు దూరంగానే ఉంటాడు. లోకజ్ఞానం సంపూర్ణంగా కల్గి ఉన్నప్పటికీ లోకంలో ఏదీ అంటకుండానే జీవిస్తాడు. లోక జీవనం కోసం కార్యాలు చేయవలసి వచ్చినప్పటికీ అవేవి తనకు అంటకుండానే చరిస్తాడు. సమస్త బంధాల నుండి విడు దలై నిరంతరం బ్రహ్మ జ్ఞానపరుడై ఉంటాడు. అతనిని ఏ వస్తువులు ప్రేరేపించ లేవు. అనేక కష్టాలు చుట్టు ముట్టినప్పటికి ధైర్యం, ఓర్పు, సహనం అనే గుణాలను విడనాడడు. సుఖ దుఃఖాలకు సాక్షీ భూతుడుగా మాత్రమే ఉంటాడు. ఈ ఉపనిషద్విజ్ఞానాన్నే బ్రహ్మంగారు మనకందించారు.

"సర్వత్ర విగతస్నేహో యస్సాక్షివదవస్థిత్ణ నిరిచ్ఛో వర్తతే కార్యే స జీవన్ముక్త ఉచ్చతే ॥"

మహోపనిషత్తు ద్వితీయాధ్యాయం -

శ్లో : 51 స్నానం వల్ల, జప తప హోమాదుల వల్ల దంతధావన శౌచాదులవల్ల ప్రయోజనం లేదు. ఏకాంత స్థలమందు ప్రశాంతంగా కూర్చొని, మనస్సును పరమాత్మ స్వరూపమందు ఐక్యం చేసినవాడే జీవన్ముక్తుడు.

బ్రహ్మం గారు, "స్నానమందు లేదు పానమందును లేదు మంత్ర తంత్రములను మహిమ లేదు గుణము కుదిరె నేని ఘనయోగి తానేను" కాళికాంబ సప్తశతి - ప : 139 అంటూ బాహ్యాచారాలకు స్వస్తి చెబుతూ,

పరమాత్మానుభవానికి గుణమే ప్రధానమని నొక్కి వక్కాణించారు.

"యేన ధర్మ మధర్మం చ మనో మననమీ హితం ।
సర్వ మంత్ణ పరిత్యక్తం సజీవన్ముక్త ఉచ్చతే ॥ "

మహోపనిషత్తు ద్వితీయాధ్యాయం -

శ్లో : 52 వేదాల వల్ల, స్మృతులవల్ల, శాస్త్రాల వల్ల, ధర్మాధర్మాల వల్ల ప్రయోజనం లేదని అవన్నీ మరచి తదేకనిష్ఠతో బ్రహ్మానందంలో లీనమైనవాడే జీవన్ముక్తుడు. "వేద మంత్రములను వాదించి విడిచిన విధి నిషేద శాస్త్రవేత్తలైన గుణము కుదురుకున్న నిను గాంచగాలేరు" కాళికాంబా సప్తశతి - ప : 371 "చదివి చదివి ధర్మ శాస్త్రంబులన్నియు బ్రహ్మ మెఱుగనట్టి పామరుండు కూరలోని తెడ్డు తీరైన వాడౌను" కాళికాంబా సప్తశతి - ప : 670

పై పద్యాలలో బ్రహ్మం గారు సర్వశాస్త్రముల యొక్క మర్మాన్ని చేజిక్కించుకొన్నను గుణం కుదురకున్న అవన్నీ నిప్రయోజనాలే అనే అర్థాన్ని చెప్పారు.

కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరాలనే అరిషడ్వర్గాలకు లొంగక దేనియందు ఇచ్ఛలేక సకలమైన కార్యాలు చేస్తూ జాగ్రదవస్థ యందు సుషుప్తావస్థను బొందియుండు వాడే జీవన్ముక్తుడు.ఈ అరిషడ్వార్గాన్ని జయించుట మానవునికి బహు కష్ట సాధ్యమైన పని. అదే ప్రస్తావిస్తూ బ్రహ్మం గారు,

"ఆత్మ సీమనేల నార్గురు రాజులు
మదము, క్రోధ, లోభ, మత్సరములు
కామమోహములను ఘనులు దుర్జములయా"

- కాళికాంబా సప్తశతి - ప : 551

1. కామం : అశాశ్వతమైన కోరికలను కల్గి యుండుట.
2. క్రోధం : ఇతరులకు నిరంతరం చెడువు చేయవలయుననే స్వభావం.
3. లోభం : తాను సంపాదించిన ధనం ఇతరులెవ్వరికి ఇవ్వక తాను కూడా అనుభవించకుండా ఉండుట.
4. మోహం : తాను ఆర్జించిన ధనం తనవాళ్ళు మాత్రమే అనుభవించవలెనని కోరుట.
5. మదం : ధన, విద్యా, దేహ బలాలతో అలక్ష్యంగా సంచరించుట.
6. మత్సరం : ఇతరుల సుఖ సంతోషాలను జూచి ఓర్వలేని తనం.

పరమాత్మానుభూతిపై గురి నిలిపి మాయకు లోబడ కుండా నిరంతరం సాధన ద్వారానే ఈ అరిషడ్వర్గాలను జయించాలని బ్రహ్మంగారు సందేశమిచ్చారు. విగ్రహారాధ నాది పూజలను విడచి అహంకార రూపమైన సకల వాసనలను వదలి పరమాత్మ ధ్యానంతో ఉండువాడు జీవన్ముక్తుడని చెప్పవచ్చు. తామరాకు నందలి నీటి బిందువు తామరాకు నంటక నిలిచి యున్నట్లు ఆయా కాలాలందు ఏది తటస్థించునో ఆ పనుల చేస్తూ వాటి యందు కలుగు సుఖ దుఃఖాలు శరీరానికేగాని తనకు గాదని జీవన్ముక్తుడు అటు నిటు కదలక యుండు దీపంలాగా నిశ్చలంగా ఉంటాడు. తనకు కల్గిన అన్ని కార్యాలకు పూర్వ జన్మననుసరించి జరుగుతున్నవని తలచి ఆత్మ స్వరూపుడైన నేనేమి చేయలేదనే తలుస్తాడు.

జ్ఞానుల యొక్క ప్రారబ్ధ కర్మలు నశించునంతవరకూ దేహం ధరించుట తప్పదు. ప్రారబ్ధం నశించగనే జన్మ, జరా, మృత్యువులకు దూరమౌతాడు. జ్ఞానమనే అగ్నివల్ల పూర్వ కర్మలన్నీ దగ్ధమవుతాయి. శరీరం నశించిన పిదప దేహం లేనట్టి విదేహముక్తిని పొందుతున్నాడు జీవన్ము క్తుడు అంటూ బ్రహ్మం గారు వివిధ ఆధ్యాత్మిక భావాలను సమాజానికి అందించి ఆత్మ తత్వాన్ని ప్రబోధించారు.

ఆధార గ్రంధాలు :

1. గీతా మకరందం, విద్యా ప్రకాశనందగిరి స్వామి. పుట : 259.
2. వివేక చూడామణి, నోరి శ్రీనాథ వేంకటసోమయాజులు. పుట : 213.
3. విప్లవయోగి విశ్వకవి వేమన వేదశాస్త్రం, గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి. పుట :519.

4. సర్వభ్రాంతిరహిత బృహద్ విశిష్ఠ అచలబోధ గ్రంథము, పూర్ణానంద రాజయోగి. పుట : 1.

5. అచలరత్నావళి, దొండ్లవాగు వెంకటాచలం. పుట : 62

6. తైత్తిరీయ పంచోపనిషత్తులలో చేర్చిన భృగువల్లీ. లక్ష్మీనరసింహశాస్త్రి. పుట : 2

7. మండకోపనిషత్తు శంకరానందస్వామి. పుట : 73.

8. ఛాందోగ్యోపనిషత్తు. పండిత గోపదేవ్. పుట : 146.

9. కైవల్యోపనిషత్తు. స్వామి చిన్మయానంద. పుట : 59.

10. ఆత్మబోధ. ఎల్. చంద్రమోహన్. పుట : 212.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శాంతినారాయణ ఆవిష్కరించిన అనంత జీవనం

– డా॥ డి.యుగశ్రీ, సహాయ ఆచార్యులు, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

రాయలసీమ కాల్పనిక సాహిత్యాన్ని వెలయించిన ఆధునిక రచయితల్లో శాంతినారాయణ కూడా ఒకరు. ఈయన కవిత్వాన్నే గాక నవలలు, కథలు అనేకం రాశారు. తమ కథల్లో అనంతపుర జనజీవనాన్ని చక్కగా ప్రతిబింబింపజేశారు. వీరి "బతుకుబంతి" కథలకు నూతలపాటి సాహితీ కుటుంబ పురస్కారం రావడం అభినందనీయం.

"బతుకుబంతి" కథల సంపుటంలో పది కథలున్నాయి. ఈ కథల్లో స్త్రీల సమస్యలతో పాటు రైతు సమస్యలు, పేదలసమస్యలు, మత సమస్యలు, మానవ సంబంధాల చిత్రణ మొదలైన అనేక విషయాలు ఈ కథల్లో చోటు సంపాదించాయి. పాఠకుల మనసును దోచే ప్రాంతీయ మాండలికం ఈ సంపుటిలో జీవం పోసుకొంది.

"ఓబయ్య" కథలో సామాన్య జనజీవన చిత్రణ కనిపిస్తుంది. పల్లెటూళ్ళలోనూ, బస్తీల్లోనూ సాధారణంగా చోటు చేసుకొనే ఉదంతం ఈ కథలో ప్రధాన ఇతివృత్తం. మానవుల్లో కొందరు ప్రతీది వ్యాపార దృష్టితోనే ఆలోచిస్తారు. స్వలాభాపేక్షతోనే ప్రతి అడుగూ వేస్తారు. దీనివల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. జీవనం సంక్లిష్టమవుతుంది. దుర్భరమవుతుంది. ఈ దుస్థితిని తొలగించాలనే ఉద్దేశంతోనే ఈ కథ రాయబడినట్లు తోస్తుంది.

ఈ కథలో 5 జంటలున్నాయి. ఓబయ్య భార్య పద్మావతి. నరసింహారెడ్డి భార్య లక్ష్మీదేవి. రంగయ్య భార్య సుశీల. వీరు తమ శరీరాలను శాశ్వతంగా పరులకప్పజెప్పారు. పర్యవసానంగా మగవాళ్ళు భిన్నంగా స్పందించారు. తమ భార్యల మీద తమకే హక్కు ఉండాలనుకున్న మగవాళ్ళలో ఓబయ్య సర్దుకుపోయాడు. నరసింహారెడ్డి మానరక్షణ హక్కును కాపాడుకోవడానికి, భర్తృ హక్కును పరిరక్షించుకోవడానికా అన్నట్టు భార్య తలనరికి ఊరి వాకిలికి వేలాడదీశాడు. ఇక్కడ లక్ష్మీదేవి జీవించే హక్కుకు, స్వేచ్ఛా హక్కుకు తీవ్ర విఘాతం కలిగినట్టు చెప్పుకోవచ్చు. రంగయ్య మాత్రం తన పనులు కావాలి గదా! యని భర్తృ హక్కును గాలికి వదిలేశాడు. భార్యను పరోక్షంగా ప్రోత్సహించాడు. భర్త పరస్త్రీతో సంబంధం పెట్టుకొని తన భార్య హక్కుకు భంగం కలిగించాడని సంతానంతో పాటు మరో అనామక ఇల్లాలు మరణాన్ని ఆశ్రయించింది. ఎదుటి వారి హక్కుకు రక్షణ కలిగిస్తూ మసలుకున్న మగువ, మగవాడు నిర్మల - రమేష్‌లు. కాబట్టే వీరి జీవితం సుఖమయం కాగలిగింది. మొత్తానికి ఈ కథలో ముగ్గురి పురుషుల హక్కులు, ఒక స్త్రీ హక్కు హరింపబడినట్టు తెలుస్తూవుంది. ఎదుటి వారి హక్కును గుర్తించి మసలుకొంటే మనుగడ మహదానంద మయంగా వుంటుందని ఈ కథ సందేశం.

"అసలయినవి లేనప్పుడు" అనే కథలో గ్రామీణ వ్యవస్థ ప్రతిబింబిస్తుంది. వెనుకబాటుతనం గోచరిస్తుంది. అద్భుదయభావాలు గల కొందరు తమ గ్రామీణ వ్యవస్థను బాగు చేయాలనుకున్నారు. ఉద్యమించి అవసరమైన వాటిని సాధించుకొన్నారు.ఈ కథలో గ్రామీణుల పట్టుదల, హక్కులు సాధించుకోవడంలో ప్రదర్శించిన నేర్పు, కొట్టొచ్చినట్టు కన్పిస్తాయి.

ఆ రోజుల్లో ఊరిలోగానీ, ఇళ్ళల్లో గానీ మరుగు దొడ్లను నిర్మించకపోవడం వల్ల స్త్రీలు ఇబ్బందికి గురి కావలసి వచ్చింది. నీటి అవసరాలను తీర్చుకోవలసిన ప్రజల హక్కుకు విఘాతం కలిగింది. ఈ హక్కులను సంరక్షించుకోవడం కోసం ఊరివారు ఉద్యమించారు. అధికారుల దృష్టిని ఆకర్షించారు. హక్కుల సాధనకు ఇదే సరైన మార్గమని రచయిత ఇక్కడ ధ్వనింపజేసినట్టయ్యింది.

"బతుకుబంతి" కథలో తల్లి లక్ష్మీభాయి, కూతురు శిరీష తమ శీల సంరక్షణ హక్కును బుద్ధిపూర్వకంగానే

కోల్పోయారు. పరిస్థితుల ఒత్తిడి, భరించరాని దారిద్ర్యం వారినలా కోల్పోయేలా చేశాయి. హక్కులు పరిస్థితుల మూలంగా కూడా కోల్పోవలసి వుంటుందని ''బతుకు బంతి'' కథ తెలియజేస్తుంది. దీనిలో ఇతరులకు సహాయపడడం కోసం తన మాన సంరక్షణ హక్కును కూడా కోల్పోయేందుకు హరిత ముందుకు రావడం గమనించదగిన అంశం. తన మాన సంరక్షణ కన్నా న్యాయమైన ఇతరుల అవసరాలు తీర్చడమే ముఖ్యమని భావించిన హరితపాత్ర అభినందించదగిందే.

''ఈపాపం ఎవరిది'' కథలో కూతురి పెళ్ళి చేయాలను కొన్న తండ్రి రాఘవయ్య హక్కును మరో కూతురు సుజాత పాడుచేసింది. సెల్‌ఫోన్‌లోని ఫేస్‌బుక్ ద్వారా ప్రేమికుడైన మల్లేశ్ కపటనాటకాన్ని నమ్మి అక్క పెళ్ళి కోసం వుంచుకొన్న పదిలక్షల డబ్బును కార్తీక్ ద్వారా మల్లేశ్‌కు ఇచ్చివేసింది. సుజాత ప్రేమించే హక్కును, జీవితాన్ని సుఖమయం చేసుకొనే హక్కును మల్లేశ్ అతని స్నేహితుడు కార్తీక్ కలిసి పాడుచేశారు. దీని కంతటికీ సాంకేతిక శాస్త్రం కారణం కావడం విశేషం. ఎంతో కష్టపడి రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగపరచి తమ, ఇతరుల జీవితాలను నరకప్రాయం చేసుకోక సుఖమయ జీవన హక్కులను పరిరక్షించు కోవాలని రచయిత ఇక్కడ ధ్వనింపజేశారు.

''మైలపడుతున్న మనుషులు'' కథలో నకిలీ హక్కుల ప్రస్తావన సైతం కనిపిస్తుంది. ఇంటి ఆడపడుచులకు సైతం పుట్టింటి వారి ఆస్తి మీద హక్కు వుందని చట్టం చెబుతుంది. అయితే కుమారుడి సంపాదనతో కొన్న ఆస్తిమీద హక్కు వాళ్ళకుండదు. అయినప్పటికీ నాగమ్మ, పార్వతి పుట్టింటి వారు తమకేమి పెట్టలేదని ఆవేదన చెందడం ఈ కథలో కనిపిస్తుంది. ఇది తమకు లేని హక్కును వున్నట్టే భావించినట్టవుతుంది. మత వర్గాలను ఆధారంగా చేసుకొని అందరూ కలిసి వుండవలసిన మానవ హక్కులను కాలరాయడం కూడా సబబు కాదని ఈ కథ తెలియజేస్తుంది. ఈ కథలో నామదారులని, మోడుకాళ్ళని రెండు వర్గాల వారు కనిపిస్తారు. నామదార్లు వైష్ణవులైతే, మోడుకాళ్ళు శైవులు. ఒకరినొకరు ద్వేషించుకోవడం, ఇతరులతో మనలుకోవడం పట్ల ఆంక్షలు విధించుకోవడం ప్రాథమిక హక్కుల్లో ఒకటైన మత స్వేచ్ఛకు భంగం కలిగించినట్టే అవుతుంది.

''తిక్కోని చేతిలో రాయి'' కథలో రైతు సమస్య ప్రధానంగా చోటు చేసుకుంది. రైతు సక్రమంగా వ్యవసాయం చేసి ధాన్యం పండించి దాని ప్రతిఫలంగా నాలుగు రూపాయలు కళ్ళజూస్తాడు. అదే అతని హక్కు. అయితే ఈ కథలో పెద్దనోట్ల రద్దు అతని హక్కుకు భంగం కలిగించింది. డబ్బు అందుబాటులో లేకపోవడం వల్ల వ్యవసాయం సవ్యంగా జరగలేదు. పండినపంట కూడా పోవలసినంతగా అమ్ముడుపోలేదు. అమ్ముడుపోయిన ధాన్యం కూడా దొంగనోట్లకే అమ్ముడుపోవడంతో రైతు నాగన్న ప్రాణాలు కోల్పోవలసి వచ్చింది. ఈ కథలో రైతు హక్కు ప్రభుత్వం చర్యవల్ల బాగా దెబ్బతిన్నట్టు కనిపిస్తుంది. దోపిడి నుంచి తనను పరిరక్షించుకునే రైతు హక్కు ఇక్కడ ప్రశ్నార్థకంగా మారింది.

''చన్నుకట్టు జాతర'' కథలో మానవ సహజ హక్కయిన శీల సంరక్షణ మూఢాచారాల వల్ల ప్రభుత్వం వారి దుస్సాహసం వల్ల భంగం కావడం గమనించవచ్చు. జాతర మూఢాచారమయినప్పటికీ గిరిజనుల సాంస్కృతిక పరిరక్షణ హక్కు రక్షించబడినట్టు ఈ కథ తెలియజేస్తుంది.

''మకురు'' కథలో భద్రతతో సాగవలసిన మానవ మనుగడ యువకుల అనాలోచిత ప్రవర్తనతో అభద్రతకు గురికావడం కనిపిస్తుంది. వయసులో వున్న యువకులు స్వేచ్ఛగా, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలేమిటో ఈ కథ తెలియజేస్తుంది. దీనిలో జీవించే మానవ హక్కును అర్థరహితంగా, అనాలోచితంగా కాలరాయడం కనిపిస్తుంది. ఇతరుల హక్కులకు భంగం కలిగేలా తమ స్వేచ్ఛను ఉపయోగించుకోకూడదనే సందేశం ఈ కథ ద్వారా మనకు గోచరిస్తుంది.

''ముట్టుగుడిసెలు'' కథలో వెనుకబడిన మహిళలకు సంబంధించిన సమస్యలను తీసుకొని చర్చించడం

జరిగింది. సుఖంగా జీవించే హక్కు గొల్లల దొడ్డికి చెందిన మహిళలకు కూడా వుంది. అయితే ఆచారాల పేరుతో ఆ హక్కు కాలరాయడం జరుగుతూ వుంది. స్వతంత్రంగా జీవించే ప్రాథమిక హక్కు సైతం వారికి నిరాకరించ బడింది. బాలికలు రజస్వల అయినప్పుడు, స్త్రీలు ఇంటికి దూరమైనప్పుడు వారిని వెలేసినంత పని చేస్తారు. ప్రాథమిక వసతులు కూడా వారికుండవు. పురుగూబుట్ర నుంచి ఎటువంటి భద్రతా కూడా వారికుండదు. ఈ దుస్థితి మారేందుకు, వారి హక్కులు పునరుద్ధరించ బడేందుకు మారెక్క కంకణం కట్టుకొంది. తన స్నేహితు రాలు రాజేశ్వరి సహాయం తీసుకొని సెట్టూరు గొల్లల దొడ్డిలో సంస్కారాలు ప్రవేశపెట్టించింది. పెనుమార్పులకు దోహదం చేసింది. ఆవిధంగా ఆ ఊరి స్త్రీల మానవ హక్కులను, అందునా ప్రాథమిక హక్కులను పరిరక్షించేం దుకు ఆమె దోహదపడింది.

"అంగడి సరుకై" కథల్లో పాలుతాగే పసిపిల్లల జీవన హక్కు ప్రస్తావనకు వచ్చింది. పేదతల్లులు పేదరికానికి తట్టుకోలేక తమ పిల్లలను పస్తుపెట్టి మాతృస్తన్యాన్ని విక్రయించుకోవడం ఈకథలోని ప్రధానాంశం. పేదరికాన్ని ప్రభాస్, సుబ్బారావు లాంటి కొందరు వ్యాపారంతో సొమ్ము చేసుకోవడం, ఉదారులుగా ముద్రవేసుకోవడం వారి నకిలీ మానవత్వాన్ని ఆవిష్కరిస్తుంది. పసికందుల మానవ హక్కులు పురిటిలోనే పోవడం సమంజసం కాదని, అది దేశాన్నే నిర్వీర్యం చేస్తుందని రచయిత ఈ కథలో తెలియ జేసినట్టయ్యింది.

"బతుకుబంతి" కథల్లో, రచయిత వివిధ సమస్యల గురించి ప్రస్తావించాడు. అనంతపురం ప్రాంతంలో నెల కొన్న పరిస్థితులను పాఠకుల దృష్టికి తీసుకువచ్చాడు. వివిధ విషయాల మీద సముచితాభిప్రాయాలను పాఠ కులలో కలిగించేందుకు ప్రయత్నించాడు. మొత్తానికి అనంతపుర జీవితాన్ని అశేషాంధ్రలోకానికి పరిచయం చేయడమేగాక పాఠకుల హృదయ ఫలకం మీద చెరగని విధంగా ముద్రించాడు.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు దృశ్య శ్రవణ వ్యాపార ప్రకటనలు : దూరదర్శిని ప్రకటనలలో తెలుగు భాషా వినియోగం పై విమర్శనాత్మక అధ్యయనం

- ప్రియాంక రొచబత్తుని, రీసెర్చ్ ఫెలో, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

దూరదర్శిని ప్రకటనల్ని అధ్యయనం చేసేటప్పుడు, అందులోని భాషని విసంకేతించాలంటే తప్పని సరిగా మొదట స్క్రీన్ ట్రాన్సిలేషన్ను అధ్యయనం చేయాల్సి ఉంటుంది. దృశ్య శ్రవణ అనువాదం అనేది అనువాద, అధ్యయనాలలో ఒక శాఖ. మొదటగా, దృశ్య, శ్రవణా లతో పాటు ప్రకటనల్ని ఎలా అనువదించాలో చెప్పే అనువాద ప్రక్రియను గూర్చి ఈ పరిశోధన పత్రం అధ్యయనం చేస్తుంది. ఇతర భాషల నుండి తెలుగులోకి ఎలా అనువాదం చేయాలో చెప్పే అనువాద ప్రక్రియను కూడా అధ్యయనం చేస్తుంది. అంతేకాకుండా అనువాద కుడు ఏయే వ్యూహాల/పద్ధతుల ద్వారా భాషను అను వదించాడో కూడా ఈ పత్రంలో విశ్లేషించబడింది. అనువాదకుడు ప్రస్తుత వ్యాపార ప్రకటనల్లో ఆంగ్ల, హిందీ భాషల్లోని పదాలను అనువదించే సందర్భంలో ఉత్పన్నమయ్యే అనువాద సమస్యలను ఏ విధంగా సునాయాసంగా అధిగమిస్తున్నాడో ఈ పత్రం చర్చిస్తుంది. ఇతర భాషలోని ఒక జాతీయ దృశ్య శ్రవణ ప్రకటన, తెలుగులోకి అనువదితమైన తరువాత స్థానికీకరణ ప్రక్రియ ద్వారా స్థానికీకరించి ఒక వస్తూత్పత్తి ప్రచారానికి ఏ విధంగా ఉపయోగిస్తారో కూడా విశ్లేషించబడింది. ఈ పత్రంలో విశ్లేషణ నిమిత్తం కొన్ని దృశ్య శ్రవణ ప్రకటన లను ఉదాహరణగా తీసుకోవడమైంది. వాటిని ఆ సందర్భానుసారంగా పరిశీలించి మూల, లక్ష్య భాషల్లో ఏ విధంగా కనబడుతున్నాయో విశ్లేషించడమైనది. వివిధ అనువాద పద్ధతుల ద్వారా మూల, లక్ష్య భాషల మరియు దృశ్య, శ్రవణ అనువాదాల మధ్య ఏ విధమైన తేడాలు లేకుండా వాచ్యంగా అనువదిస్తారో, తత్ప్రక్రియలో అనువాదకుడి స్థానం ఎంతటి ప్రధాన భూమికను పోషిస్తుందో ఈ పత్రంలో చర్చించడమైంది.

చూడగానే అర్థమయ్యే ఒక ముఖ్య విషయమేమిం టంటే, భాషాసంస్కృతులు రెండూ ఒక దానితో ఒకటి అనుసంధానమైనవి. ఏ వ్యాపార ప్రకటన అయినా ఒక వస్తువు, లేదా ఒక సేవను వాడుకోమని తెలియ చేయాలనే ఒక ముఖ్య ఉద్దేశంతో నిర్మాణమై ఉంటుంది. ఈ వ్యాపార ప్రకటల తయారీ ఎంతో ఖర్చుతో కూడికున్న పని కాబట్టి ప్రకటనా సంస్థలు అధిక శాతం అనువాదం మీదనే ఆధారపడుతున్నాయి. మరో ముఖ్య విషయ మేమిటంటే మక్కికి మక్కీగా సాంస్కృతిక అనుసరణ లేకుండా చూసుకోవాలి. మూలంలో ఉన్న దృశ్య, శ్రవణ ప్రకటనల్లోని వేషభాషలు రెండూ ఏ విధంగా ఆ మూల భాషా సంస్కృతిని ప్రతిఫలింపజేస్తున్నాయో, అదేవిధంగా లక్ష్యభాషా సంస్కృతికి అనుగుణంగా అనువదించే గురుతర బాధ్యత ఆ అనువాదకుడిదేననే విషయాన్ని గుర్తించాలి.

ఏ ఉత్పత్తినైనా ప్రచారం చేయాలంటే ఒక మంచి ప్రకటన ఎంతో అవసరం. వ్యాపార ప్రకటనలు లేకుండా ఎంత గొప్ప పేర్గాంచిన ఉత్పత్తిదారులకైనా వారి ఉత్పత్తిని కొనుగోలుదారుడు కొనేలా ఒప్పించటానికి సాధ్యంకాదు. ఒక ప్రకటన ఆధారంగా ఏ ఉత్పతి అయినా బాగా కొను గోలు కావచ్చు. లేదా ప్రకటన కనుక ప్రేక్షకులను/కొను గోలుదారులను ఆకర్షించకపోయినట్టయితే ఆ ఉత్పత్తి కొనుగోలుకాక ఉత్పత్తిదారుడు నష్టాల పాలుకావచ్చు. అందువలన ప్రకటనల విషయంలో ఉత్పత్తి తయారీ దారులు చాలా జాగ్రత పడాల్సి ఉంటుంది. ప్రతి ఉత్పత్తికీ ఒక నిర్ధిష్ట జన సమూహాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యాపార ప్రకటనను రూపకల్పన చేయాలి. అదే విధంగా వాణిజ్య ప్రకటనలలో వాడే భాష విషయంలో ఎంతో జాగ్రత్త వహించాలి. ప్రస్తుతం దూరదర్శిని ప్రదర్శిత

మవుతోన్న ప్రకటనల్లో ఎక్కువగా ధ్వనిని అనుకరించిన (ఎబఎఎవఎ) దృశ్య, శ్రవణ వ్యాపార ప్రకటనలే కనిపిస్తున్నాయి. ఈ రకమైన ప్రకటనలు కూడా తెలుగు భాషపై సరైన అవగాహన లేనివారు, లేదా అరకొర అవగాహన ఉన్నవాళ్ళు యాంత్రికంగా పదానువాదం చేస్తున్నట్టుగా ఉంటున్నాయి. అలాగే ధ్వని అనుకరణ అంటే మూలం లోని వ్యాపార ప్రకటన కాల వ్యవధి ఎంత ఉందో లక్ష్య భాషలో వ్యాపార ప్రకటనలో కూడా పాటించాల్సి ఉంటుంది. ఆ క్రమంలో భాష చాలా మారిపోయే ప్రమాదం ఉంది. రెండు భాషల్లోని అనగా మూల, లక్ష్య భాషల్లోని పదాలు లక్ష్యభాషలో కనిపిస్తున్నాయి. మరికొన్నిసార్లు వ్యవహారంలో లేని పదాలను వాడుతున్నారు. ఉదాహరణకు తెలుగు 'లిమ్కా' ప్రకటనను పరిశీలిస్తే, ఉత్పత్తిదారుడు లక్ష్యించిన వినియోగదారులు రోజువారి సంభాషణలో వాడని ప్రాచీన ఇతిహాసాలలోని పదాలను వాడారు. అనువాదకుడికి తెలుగు భాషమీద ఏమాత్రం అవగాహన ఉన్నా 'యొక్క' అనే పదం వాడేవారు కాదేమో.

లిమ్కా ప్రకటన : " లిమ్కా 'యొక్క' దాహం

ఇక్కడ "లిమ్కా యొక్క దాహం" అనేది ఈ ప్రకటన నినాదం. ఈ ప్రకటన తయారుచేసిన హిందీ ప్రకటనలో "Limca waali Pyaas" అని ఉంటుంది. ఆ నినాదం హిందీ భాషకు సరిగ్గా సరిపోతుంది. కాని బలంగా చెప్పటానికి ఏ ఆదారం లేక పోయినపటికీ , హిందీ భాషకు ఉండే సాంస్కృతిక చిహ్నాలు/ప్రత్యయాలు మరియు registers అన్ని భాషలకు అనుకూలంగా సరిపోయే విధంగా ఉన్నాయి. కాని తెలుగులోకి అనువాదమైన ఆ ప్రకటనలో మాత్రం "యొక్క" అనే పద ప్రయోగం అసాధారణమైన రీతిలో ఉపయోగించినట్లు కనిపిస్తుంది . కాని తెలుగు వాణిజ్య ప్రకటనలు చూసినట్లు అయితే శబ్దాలు మరియు మాటలు వాచ్యంగా అనువదించి వాటికి source moving imagesకి ధ్వన్యనుకరణ లక్ష్య భాషతో చేసి ఆ ప్రకటనలను మీడియా ద్వారా దూరదర్శినిలో ప్రసారం చేస్తున్నా. ఇలా ప్రసారమైన చాలా వాణిజ్య ప్రకటనలను గమనించినట్లయితే మూలభాషలోని దృశ్యాలతో లక్ష్య భాషకు సమకాలీకరణ (synchronization) లోపించినట్లు కనిపిస్తుంది. అంటే కదులుతున్న దృశ్యానికి, శ్రవణానికి అనుసంధానం లేకపోవడాన్ని గమనించవచ్చు. సమకాలీకరణను (synchronization) గూర్చి Mona Baker ఇలా అన్నారు. " సమకాలీకరణ అనేది తెరమీది దృశ్యంలోని భాష, సాంస్కృతిక సమాచారంపై ఏకాగ్రతను నిలపడానికి సమకాలీకరణ అనేది చాలా ముఖ్యమైంది."

J C Catford చెప్పినట్లుగా, the untranslatibility arise from two sources: one is a linguistic and the other is culture. In the TT of Telugu Ad, the same twin Sardar boys Sunny and Goldie were portrayed. And the background children folk song was chosen from Telugu literature (Cui 2012).

ఉదాహరణ :

Tata capital Ad - pehale aap
Hindi AVT (folk song) Telugu AVT (folk song)
Lakdi ke kathi……..
Kathi se godha……..
Godhe ki tum pe jo..
Maara ha thoda.....
Thoda thoda thoda ghoda tum utaake daudaa……!
(song repeats again fast)

ముళ్ళుపోయి కత్తి వచ్చే డాం డాం డాం
కత్తి పోయి కర్ర వచ్చే డాం డాం
కర్ర పోయి రొట్టె వచ్చే డాం డాం డాం
రొట్టె పోయి పిల్ల వచ్చే డాం డాం డాం
ముళ్ళు పోయి కత్తి వచ్చే డాం డాం డాం

Voice over : Achaa lagtha hi koi apne bare mi nahi pehale aapke bare mi soche. Voice over: "చేస్తాం అదే , మీకు సరైనదే"Picture from Tata Capital Ad ఈ 'టాటా'వారి ప్రకటన ద్వారా పైన విశ్లేచించిన విషయాలను ఇంకా స్పష్టంగా తెలుసుకోవచ్చు . ఇది చాల వివరణాత్మకమైన ఉదాహరణ. ఇందులో అనువాద క్లిష్టత(untranslatability) మరియు మూల భాషలోని దృశ్యాలతో లక్ష్యభాషలోని శ్రవణం సమకాలీ

కరణ లోపించటాన్ని గుర్తించ వచ్చు. J C Catford చెప్పినట్లుగా, "అనువాద క్లిష్టత అనేది రెండు రకాలుగా ఉత్పన్నమవుతుంది. ఒకటి భాషా సంబంధంకాగా మరోటి సంస్కృతీ సంబంధమైంది. తెలుగు ప్రకటనలో సన్నీ, గోల్డి అనే ఇద్దరు పిల్లలు గీసిన చిత్రాలు. కానీ నేపథ్యంలో వచ్చే పిల్లల జానపద పాటను తెలుగు సాహిత్యంనుంచి ఎంపికచేయబడింది." (Cui 2012).

ఇక్కడ టాటా వారి పెట్టుబడి (capital) ప్రకటన తెలుగు అనువాదం చూసినట్లు అయితే మూల భాషలోని దృశ్యానికి సంబంధించిన పాటను లక్ష్యభాషలోకి అనువాదం చేయటానికి బదులుగా మరో తెలుగు పాటను పెట్టారు. శ్రవణానికి సంబంధించి ఇది ఒక రకమైన భర్తీచేయడంలాంటిది. కానీ, ఈ మధ్యకాలంలో అనువాదమైన తెలుగు ప్రకటనల్ని గమనిస్తే ఒక భాషలోకి అనువదించిన ప్రకటనలకు ధ్వన్యనుకరణ (డబ్బింగ్) చేసే సమయంలో మూల భాషలోని శ్రవణ సంబధిత కాల వ్యవధితో లక్ష్య భాషలోని మాటల్ని సమంచేసే చేసే క్రమంలో మూల భాషలోని మాటలు ఎంత కాల వ్యవధితో ఉంటాయో దానికి సమాన కాల వ్యవధిని లక్ష్యభాషలోని మాటలకూ ఉండేట్టు చేసే క్రమంలో కాలవ్యవధి ఎక్కువైతే కనుక అదే అర్థాన్నిచ్చే మరో భాషా పదాలను మధ్యలో కలిపి ధ్వన్యనుకరణ (డబ్బింగ్)ను చేస్తున్నారు. ఇలా చేయడాన్ని 'అదానం' (borrowing) అని అంటారు. ఇది ఒక రకమైన అనువాద పద్ధతై ఉం డవచ్చు. కానీ అలా కలపడం వలన ఆ భాషల యొక్క మిశ్రామానికి కొత్త పదాలను వెతక వలసిన అవసరం ఏర్పడుతుంది.

ఈ రోజుల్లో వ్యాపార ప్రకటనల రచనలో(copy writing)లో, వాటి అనువాదంలో పైన చెప్పబడిన నూతన భాషా పదాలు వాడటం విరివిగా, స్పష్టంగా కనిపిస్తుంది. బహుశ దీనికి కారణం 'అనువాద క్లిష్టత' (unstranslability), 'ఆదాన, (borrowing) ప్రక్రియలు కావచ్చు. కారణమేదైనా, వ్యాపార ప్రకటనల్లో తరుచుగా కనిపించే ఈ నూతన భాషా మిశ్రమాలను ఎంతమేరకు వీలైతే అంతమేరకు తగ్గిస్తే మంచిది. ఈ భాషామిశ్రమం ఇలాగే కొనసాగితే కనుక, కొన్ని సంవత్సరాల తరువాత తెలుగుపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశం ఉంది. అంతేకాక ఏది తెలుగు పదం ఏది ఇతర భాషా పదమో గుర్తించటానికి వీలుకాని ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ఇది తెలుగు భాషా ఉనికికే ప్రమాదం. బహుశ ఈ నూతన భాషా మిశ్రమానికంతటికీ మరో కొత్త పేరును పెట్టాల్సి వస్తుందేమో మనం వేచి చూడాల్సిందే.

ఉదాహరణ :

తెలుగు + ఆంగ్లం = ?

Veet Ad: Veet యొు naturals range మొదటిసారి 100% natural extractsతో పాటు మీకు ఇస్తుంది అదే veet యొక్క glowing మరుయు smooth skin gently.Veet naturals ..... ఒక అందవైున అనుభూతి"

తెలుగులో పియర్స్ సబ్బు నినాదం : "ఉండండి young గా,"కనిపించండి young గా"

తెలుగు + ఆంగ్లం + హింది = ?

ఉదాహరణ : తెలుగులో బజాజ్ ప్యాన్స్ ప్రకటనా నినాదం :

బజాజ్ వారి(T) బ్యూటిఫుల్ ఫాన్స్(E). చూసినవారు అంతా హక్కా బక్కా పక్క(H)

(Bajaj vaari beautiful fans, choosina vaaru antha, hakka, bakka, pakka)

తెలుగు + హింది?

ఉదాహరణ : Thumps Up ప్రకటన :

ఒక తూఫాన్ ఖతం ..... ఇంకోటి మొదలవ బోతుంది.

(Oka toofan khatam.....enkoti modhalava bothundi)

అనువాదకుడు వ్యాపార ప్రకటనల్లో భాష వాడటానికి ముందు ఆ భాష మాట్లాడే వారి సంస్కృతి, కట్టుబాట్ల గురించి అధ్యయనంతోపాటు పూర్తిస్థాయిలో అవ

గాహనను కల్గి ఉండటం మంచిది. అప్పుడు ఆ ప్రకటన ప్రభావం నిర్దిష్ట కొనుగోలుదారులమీద అమితంగా ఉంటుంది. వ్యాపార ప్రకటనలలో సంస్కృతి, కట్టు బాట్లను ప్రతిబింబించినట్లయితే, కనుగోలుదారులు ఎక్కువగా ఆకర్షించుకోవచ్చు. తద్వారా ఉత్పత్తి విక్రయాలు కూడా బాగా పెరుగుతాయి.

ఈ ప్రపంచంలోనే భారత దేశం భిన్నమైనది. మన దేశం భిన్న సంస్కృతుల, విభిన్న రాష్ట్ర భాషల మిశ్రమం. భిన్నత్వంలో ఏకత్వాన్ని పాటిస్తూ కూడా మనుగడను సాగించటం గమనార్హం. కాని ఈ భావనతోపాటు మన భాషను గౌరవించటం, దాని ఉనికిని కాపాడటం మన బాధ్యత, ప్రాథమిక కర్తవ్యం కూడా. ప్రపంచీకరణ ప్రభావంతో నేడు అనేక దేశాల భాషల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. కొన్ని పదాలు, కొన్ని భాషలు, పూర్తిగా అంతరించిపోయే పరిస్థితి నెలకొంది. దైనందిన జీవితంలో వాణిజ్య ప్రకటనల ప్రభావం ఎంతగానో ఉన్నది. ఈ ప్రభావం భాష పైన, సంస్కృతి పైన అమితంగా ఉందని మనం పరిశీలించాము. మిశ్రమ భాషల ప్రయోగాన్ని నివారించటానికి మనం తగినతంగా కృషి చేయాలి. మన తెలుగు భాషాసంస్కృతులు అంతరించి పోకుండా కాపాడవలసిన బాధ్యత మనందరిది. మరీ ముఖ్యంగా ఈ బాధ్యతలో అనువాదకుల పాత్ర ఎంతో కీలకమైంది, ప్రాముఖ్యమైనది కూడా. ప్రతి వాణిజ్య ప్రకటనా రచయిత, అనువాదకుడు, లక్ష్య భాష పట్ల, ఆ ప్రాంతం సంస్కృతి పట్ల పూర్తి అవగాహన ఉండటం వలన మన దేశ భాషాసంస్కృతులను కాపాడుకోవచ్చును.

Bibliography :

1. Chandran, Mini and Suchitra Mathur. Textual Travels: Theory and Practice of Translation in India. Delhi: Routledge. 2015. Print.
2. Chiaro, Delia. Issues in Audiovisual Translation. Routledge Companion to Translation Studies. Ed. Jeremy Munday. London: Routledge, 2010. PDF.
3. Cook, Guy. The Discourse of Advertising. London: Routledg, 2001. Print.
4. Cui, Jingjing, Untranslatability and the Meathod of Compensation, Theory and Practice in Language Studies 2 .4(April 2012), pp. 826-830, 21 March 2015. Academy Publisher Web.
5. Dyer, Gillian. Advertising as Communication. London and New York: Routledge, 1996. Print.
6. Geis, Michael. The Language of Adverrtising. London: Academic Press, 1982. Print.
7. Hamade, Linda Ahmed. TH Strategies Aand Limitations In Advertising Translations From English To Arabic. Sharja: American University of Sharja. 2008. Web.
8. Moeran, Brain. Advertising Cultures. Newyork:Bloomsbury Academic. 2003. Print.
9. Munday,Jermey. The Routledge Companion to Translation Studies. New York: Routledge, 2009. PDF.
10. Introducing Translation Studies: Theories and Applications. London and Newyork: Routledge, 2001. Print.
11. Mayr, Siti Waltraud. Reading Culture In Tv Commercials A Semiotic Analysis Of A Tv Commercial For The Purpose Of Teaching Culture To Foreign Language. International Journal of Arts and Commerce. Vol 2. Web.
12. Mooji, de Marieke. Global Marketing and Advertising: Understanding Cultural Paradoxes. USA: SAGE Publications. 2014. PDF.
13. Mooji, de Marieke. Consumer Behaviour and Culture. Consequences for Global Marketing and Advertising. USA: SAGE Publications. 2011. PDF.

14. Pym, Anthony. Exploring Translation Theories. London & NewYork: Routledge. 2010. Print.
15. Venuti, Lawrance. The Translation Studies Reader. London and New York: Routledge. 2003. Print.

Other Web Sources :

16. http://www.afaqs.com/planning-room/article/138_Effective-Use-of-Hinglish-in-Indian-Advertisements
17. http://www.bhatnaturally.com/advertising/pan-india-advertising-lost-in-translation/
18. http://geert-hofstede.com/india.html

Advertisements:

1. Pears (Telugu). Advertisement. Youtube. 26 Oct 2014. Television.
2. https://www.youtube.com/watch?v=8l_cA7vpQMw
3. Tata Capital (Telugu). Advertisement. Youtube. 20 Mar 2011. Television.
4. https://www.youtube.com/watch?v=_yrXIUUJ3m4
5. Thums up (Telugu). Advertisement. Youtube. 13 Mar 2014. Television.
6. https://www.youtube.com/watch?v=D-Laa52i94o
7. Veet (Telugu). Advertisement. Youtube. 26 May 2014. Television.
8. https://www.youtube.com/watch?v=orn9GLaEL10
9. Bajaj(Telugu). Advertisement. Youtube. 08 May 2014. Television.
10. https://www.youtube.com/watch?v=8ynRIbdQwVs
11. Limca (Telugu). Advertisement. Youtube. 26 May 2014. Television.
12. https://www.youtube.com/watch?v=zWZ-oDYcBPY.



BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలంగాణ కథలు - దళిత స్త్రీ జీవన చిత్రణ

- డా॥. డి. విజయకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

నేటి సాహిత్య లోకంలో దళిత సాహిత్యానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఈ సాహిత్యం సమకాలీన సాహిత్యాన్ని శాసించే విధంగా రూపొందించబడింది. దళిత సాహిత్యాన్ని దళితులే కాకుండా దళితేతరులు కూడా రాస్తున్నారు. దళితులు రాసినా, దళితేతరులు రాసినా ఆ సాహిత్యమంతా దళిత సాహిత్యం కాదు. ఆ సాహిత్యంలో దళిత జీవన స్పృహ ఉండాలి. దళితుల జీవితానికి అద్దం పట్టేదిగా ఉండాలి. దళిత సాహిత్యాన్ని గురించి 'అర్జున్ డాగ్లే' అనే మరాఠీ రచయిత "Dalit literature is nothing, but the literature expession of the self respect" (ఆత్మగౌరవానికి అక్షర రూపమే దళిత సాహిత్యం) అని నిర్వచించారు.

'దళితము అనే పదానికి విసిరివేయబడిన, అటు ఇటు చిమ్మివేయబడిన, ఖండింపబడిన అనే అర్థాలు చెప్పబడ్డాయి.'

దళిత స్త్రీల జీవితాలు మరింత విసిరివేయబడి, అటు ఇటు చిమ్మబడి, మరింత ఖండింపబడ్డాయని చెప్పవచ్చు. దళితులు సమాజంలో వివక్షకి గురి అయితే, దళిత స్త్రీలు సమాజంలోను, కుటుంబంలోనూ కూడా వివక్షకు గురయ్యారు. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో దళిత స్త్రీలు నిరక్షరాస్యతవల్ల, బీదరికంవల్ల ధనిక వర్గాల దోపిడీకి బలయ్యారు. కులపరంగా వివక్షకు గురయ్యారు. అటు సమాజంలో ఇటు కుటుంబంలోనూ పురుషాధిక్య భావ జాలానికి బలై తమ ఉనికిని కోల్పోయారు. నివసించ డానికి ఇల్లు లేక, కట్టుకోవడానికి బట్టలు లేక, తినడానికి తిండి లేక కటిక దరిద్ర్యాన్ని అనుభవించారని 'తెలంగాణ కథల' పరిశీలన వల్ల వ్యక్తమవుతుంది.

'కాలువ మల్లయ్య', 'సదానంద్ శారద', 'చంద్ర'ల సంపాదకత్వంలో వెలువడిన 'తెలంగాణ కథలు' అనే కథా సంకలనంలోని కొన్ని కథలను పరిశీలించి ఈ వ్యాసాన్ని రాశారు.

మావూరి ముచ్చట్లు :

ఈ కథను 'నల్లా లక్ష్మీరాజ్యం' 2002లో రాశారు. ఈ కథలో శాంతమ్మ భర్త నర్సయ్య. శంకరి ఆమె కుమారుడు. నర్సయ్య ఇంట్లో లేనప్పుడు చుక్కారెడ్డి శాంతమ్మ వద్దకు వస్తూపోతూ ఉంటాడు. ఆమెతో అక్రమ సంబంధం పెట్టుకుంటాడు. ఈ కారణంగా నర్సయ్య కుటుంబాన్ని ఆ ఊరి వాళ్ళు ఊరి నుండి వెలి వేస్తారు. అప్పటి నుండి చుక్కారెడ్డి శాంతమ్మ దగ్గరకు యదేచ్ఛగా వస్తుంటాడు. ఆ ఊరికి దళిత స్త్రీని సర్పంచి ఎన్నుకోవలసి వస్తుంది. ఆ ఊరి మాలమాదిగల్లో లచ్చుమక్క అనే స్త్రీ కొంత అక్షరాస్యత కలిగినది. వారు లచ్చుమక్కను సర్పించిగా నిలబెట్టాలనుకుంటాడు. చుక్కారెడ్డి శాంతమ్మ అయితే తాను చెప్పినట్టు వింటుందని భావిస్తాడు. ఆమెను సర్పంచిని చేసి, అధికారాన్ని తన చేతిలోకి తీసుకుంటాడు. చుక్కారెడ్డి కూతురు రజిత, శాంతమ్మ కొడుకు శంకరిలు ప్రేమించుకుంటారు. కొంతకాలం తరువాత వారు ఊరు విడిచి వెళ్ళిపోతారు. ఆ సంగతి తెలిసిన చుక్కారెడ్డి శాంతమ్మను శారీరకంగా హింసిస్తాడు. శంకరి, రజిత చట్ట బద్ధంగా వివాహం చేసుకుంటారు. (తెలంగాణ కథలు, పుట - 707).

ఈ కథలో చుక్కారెడ్డి తన కూతురు దళితుణ్ణి వివాహం చేసుకోవడంవల్ల కులం పరువు పోయిందని బాధపడతాడు. వివాహిత అయిన శాంతమ్మతో అక్రమ సంబంధం పెట్టుకున్నప్పుడు అతనికి శాంతమ్మ కుటుంబ పరువు గుర్తుకురాలేదు. ఎందుకంటే ఆమె దళిత స్త్రీ కావడంవల్ల దళితులకు పరువు, ప్రతిష్టలు ఉండవనే భావన చుక్కారెడ్డికి కలిగి ఉండవచ్చు. శంకరి, రజితలు చట్టబద్ధంగా వివాహం చేసుకున్నప్పటికి చుక్కారెడ్డి కులం పరువు పోయినట్లుగా భావిస్తాడు. పై కథలో దళిత స్త్రీ శీలం కంటే తన కులమే గొప్పదని పురుషుడు భావిస్తాడు.

రజిత, శంకరిని వివాహం చేసుకున్నదని తెలిసి శాంతమ్మను హింసిస్తాడు. తెలంగాణ ప్రాంతంలో దళిత స్త్రీలు ధనవంతుల దౌష్ట్యానికి బలవుతున్నట్లు ఈ కథ ద్వారా మంటగలుపుతాడు. ఆమెను సర్పంచిగా నియమించి, అధికారాన్ని తన చేతిలోకి తీసుకుని దళిత స్త్రీ హక్కుని కాలరాస్తాడు. చివరకు అతని కూతురుని, శాంతమ్మ కొడుకును వివాహం చేసుకొన్నప్పుడు ఆమెను శారీరకంగా హింసిస్తాడు. ఈ విధంగా సమాజంలో ధనిక వర్గానికి చెందిన పురుషులు దళిత స్త్రీ మాన, ప్రాణాలను దోచుకుంటున్నారు. సమాజంలోని ధనిక పురుషాధిక్యానికి దళిత స్త్రీలు బలవుతున్నారు.

లచ్చి :

లచ్చి కథను 'గూడూరి సీతారం' 1957లో రాశారు. ఈ కథలో భిక్షాటన చేస్తూ జీవించే స్త్రీ జీవితం ఏ విధంగా ఉంటుందో తెలుస్తుంది. రంగడు అనే వ్యక్తికి లచ్చి అనే స్త్రీతో వివాహమవుతుంది. పెద్దలు వారిరువుని వేరు కాపురం పెట్టిస్తారు. ఆ రోజు నుండి వారు బిచ్చమెత్తుకుని జీవించాలి. లచ్చి, రంగడు ఎంతో అన్యోన్యంగా జీవిస్తుంటారు. అటువంటి సమయంలో పోలీసులు వచ్చి రంగణ్ణి అరెస్ట్ చేస్తారు. లచ్చి నిశ్చేష్టురాలై ఉండిపోతుంది. రాత్రింబవళ్ళు నిద్రాహారాలు మాని భర్త కోసం దుఃఖిస్తుంది. తల్లిదండ్రుల దగ్గరకు వెళదామన్న వారు ఎక్కడ ఉన్నారో తెలియక ఒంటరిగానే నిస్సహాయ స్థితిలో ఉంటుంది. రంగడు నిరపరాధని తెలిసి పోలీసులు అతణ్ణి విడిచి పెడతారు. తిరిగి వచ్చిన భర్తను చూసి లచ్చి ఎంతో సంతోషిస్తుంది. వారిరువురు ఊరు వదిలి పట్టణానికి వెళారు. వారిరువు భిక్షాటన చేస్తూ హాయిగా జీవిస్తుంటారు. కొంత కాలానికి రంగడు రిక్షా కొంటాడు. అతని రిక్షాకి లైటులేదని పోలీసులు అతని సంపాదనలో కొంత దోచుకుంటారు. నెమ్మదిగా రంగడు మద్యపానానికి బానిసవుతాడు. అప్పుల వాళ్ళు ఇంటికి వచ్చి లచ్చిని బెదిరిస్తుంటారు. ఒక రోజు ఒక వ్యక్తి అప్పు అడగడానికి వస్తాడు. అదే సమయానికి రంగడు ఇంటికి వస్తాడు. అప్పుడతడు తాగి ఉంటాడు. భార్యను అనుమానించి, హింసించి రిక్షా తీసుకొని ఇంటి నుండి వెళ్ళిపోతాడు. రంగడి రిక్షాను ఒక కారు గుద్దుతుంది. రంగడు అస్పత్రిలో ఉంటాడు. ఆ విషయం తెలిసి లచ్చి ఆస్పత్రికి వస్తుంది. రంగడు తన తప్పు తెలుసుకుంటాడు. (తెలంగాణ కథలు, పుట - 117).

పై కథలో స్త్రీ, పురుషాధిక్య భావజాలానికి గురైందని చెప్పవచ్చు. పోలీసులు సరైన అవగాహన లేక నిరపరాధి అయిన తన భర్తను అరెస్టు చేసినప్పుడు ఒంటరిగా దుఃఖిస్తుంది. ఆ ఊరు వదిలి పట్టణానికి వెళ్ళి కొత్త జీవితాన్ని ప్రారంభిస్తుంది. అక్కడ ఆమె భర్త మద్యపానానికి బానిసవుతాడు. ఆమె చేయని తప్పుకి నిందను కూడా భరిస్తుంది. భర్త తన తప్పు తెలుసుకున్న తరువాత అతనితో కలిసి జీవించడానికే పూనుకుంటుంది.

ఈ కథలో దళిత స్త్రీ సమాజంలోను, కుటుంబంలోను వివక్షకు గురైంది. అయినప్పటికి భర్తతో కలిసి ఉండాలనే నిర్ణయించుకుంటుంది. కుటుంబానికే ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చింది. భర్తతోపాటు సమానంగా భిక్షాటన చేసి సంపాదిస్తుంది. భర్త దురలవాట్లకు బానిసైనప్పుడు ఆమె తన సంపాదనతోనే భర్తను పోషిస్తుంది. అతనితో అనుమానింపబడి, అపనింద మోస్తుంది. చివరకు తన సంసారాన్ని నిలబెట్టుకుంటుంది. ఆమె కోరుకుంటే ఒంటరిగా జీవించగలదు. అయినా కూడా ఆమె ఆ విధంగా చేయలేదు. ఇక్కడ స్త్రీ ఔన్నత్యం, ఆత్మస్థయిర్యం వెల్లడి అవుతున్నాయి. ఎప్పటికైనా భర్త మారతాడనే నమ్మకంతో జీవించింది. ఆ నమ్మకమే ఆమె సంసారాన్ని నిలబెట్టింది. ఈ కథలో స్త్రీ ఔన్నత్యం, సహనం, సౌశీల్యం ముందు పురుషుడు తలవంచక తప్పలేదు. పురుషాధిక్య సమాజంలో స్త్రీ తన ఔన్నత్యాన్ని, సౌశీల్యాన్ని చాటుకుంది. ఒక దళిత స్త్రీ తనని తను నిరూపించుకుంది.

గిర్నిబాయి :

గిర్నిబాయి కథను 'పసుపులేటి మల్లిఖార్జునరావు' రాశారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని దళిత స్త్రీ జీవితం ఈ కథలో ప్రస్ఫుటమవుతుంది. ఆరో నిజాం నవాబు మీర్ మహబూబ్ ఆలీఖాన్ బాద్‌షా. అందువల్ల మహ

బూబ్‌నగర్‌కి ఆ పేరు వచ్చింది. నారాయణపేట, గద్వాల జలతారు చీరలు, మఖ్తల్, నాగర్ కర్నూలు కంబళ్ళు మొదలైన వాటికి ఎంత ప్రసిద్ధి చెందిందో, దరిద్రానికి కూడా ఈ జిల్లా అంతే పేరు సంపాదించి పెట్టుకుంది. అందుకు నిలువెత్తు నిదర్శనం అచ్చవ్వ జీవితం. యెంగొండ అనే ఊరిలో అచ్చవ్వ, ఆమె భర్త రంగు రంగుల చాపలను తయారు చేసేవారు. శివరాత్రికి ముందు వచ్చే మన్నెంకొండ, సిరంగాపురం జాతర్లలో ఈ చాపలు ప్రజలను ఎక్కువగా ఆకర్షిస్తాయి. శ్రీశైలం, బొంబాయి, బరోడా మొదలైన ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులు ఈ చాపలను తీసికెళతారని ప్రయత్నం చేసింది. కానీ ఈ విధానం ద్వారా వచ్చే ఆదాయం అంతంత మాత్రమే అయ్యింది. కొంత కాలానికి అచ్చవ్వ భర్త చనిపోతాడు. ఆమెకు సంతానం లేకపోవడం వల్ల ఆమె నివసించే ఇంటిని కూడా అప్పుల వాళ్ళు ఆక్ర మిస్తారు. ఆమె పొట్ట చేతబట్టుకొని పట్టణానికి వెళు తుంది. కొత్త మనిషి కావడం వల్ల పని కూడా దొరకదు. ఆకలికి పొట్ట వీపుకంటుకుంటుంది. దవడపై ఎముకకి కనుబొమ్మలకి మధ్య ఎక్కడున్నాయో తెలియని కళ్ళు. నలభై ఏళ్ళకే అరవై ఏళ్ళు పైబడిన ముదుసలిలా కనబడుతుంది. అడుక్కుతినడానికి ప్రాణం ఒప్పలేదు. కాని తప్పని పరిస్థితి ఎండిపోయిన రొట్టెముక్కలు, పెళ్ళి ఇంటి ముందు బలవంతులు లాక్కోగా మిగిలిన ఎంగిలి మెతుకులు, పళ్ళకొట్టు ముందు పారేసిన కుళ్ళిపోయిన అరటి పళ్ళు ఆమె ఆహారం. కడుపునిండా అన్నం తిని వారం రోజులవుతుంది. అటువంటి పరిస్థితిలో రోడ్డు పక్కన మురుక్కాలువ ఒడ్డున రెండు వేప చెట్లు కన బడతాయి. అప్పుడామె ఆ చెట్ల నీడకి చేరుతుంది. ఆ చెట్లకు ఎదురుగా కాలువ అవతల పక్కన ఒక పింఇ గిర్ని కనబడుతుంది. ఆమె గిర్ని దగ్గరకు వెళ్ళి అక్కడ పని చేసే కుర్రవాణ్ణి తాగడానికి నీళ్ళివ్వమని అడుగు తుంది. ఆ కుర్రవాడు ఆమెకు నీళ్ళివ్వడానికి నిరాక రిస్తాడు. ఆమె ఆ సాయంత్రం వరకు అక్కడే ఉంటుంది. ఆ కుర్రవాడికి ఆమె మీద జాలి వేస్తుంది. గిర్ని తుడవగా వచ్చిన పిండి, మంచి నీళ్ళు, నీటితోపాటు ఒక పావలా కూడా ఆమెకు ఇస్తాడు. ఆ పావలాకు ఆమెకు ఒక అరకప్పు టీ కూడా ఇవ్వరు. చివరకు ఆమె ఆకలికి తట్టుకోలేక మరణిస్తుంది. ఆమె శవాన్ని మున్సిపాలిటి బండిలో తరలిస్తారు. (తెలంగాణ కథలు, పుట - 422.)

తెలంగాణ ప్రాంతంలోని మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రజల జీవన శైలి వ్యక్తమవుతుంది. దళిత స్త్రీలు ఆకలి బాధ తట్టుకోలేక ఎటువంటి దుర్భర జీవితాన్ని అనుభ విస్తున్నారో తెలుస్తుంది. ఈ ప్రాంతంలో ప్రజలకు చేసే పని తండి పెట్టక, సమాజంలో ఆదరించే వాళ్ళు లేక పట్టణాలకు ఒంటరిగా వెళ్ళిన స్త్రీలు దిక్కుతోచని స్థితిలో అనాథ శవాలుగా మారుతున్నారనడానికి ఈ కథ ఒక ఉ దాహరణ. సమాజంలో అనాథలైన స్త్రీలకు పట్టెడన్నం పెట్టకపోవడం గమనార్హం. తోటి మనిషిని ఆదరించక పోవడం ఈ కథ ద్వారా కనబడుతుంది.

ఊరుమ్మడి బతుకు :

ఈ కథను 1996లో 'కాలువ మల్లయ్య' రాశారు. ఈ కథలో కల్లు అమ్మే స్త్రీ జీవితం చిత్రించబడింది. నర్సయ్య కుటుంబం తరతరాల నుండి కల్లు అమ్ముకుని బతుకుతుంది. నర్సయ్య కొడుకు బాలగౌడ్, కోడలు సరోజ. నర్సయ్య కల్లు అమ్ముతాడు గాని కల్లు తాగడు. ఏదో ఒక బలహీనత ఉన్నవాడే కల్లు తాగుతాడని నర్సయ్య నమ్ముతాడు. నర్సయ్య కోడలు సరోజ కల్లు అమ్ముతుంది. ఆమె కల్లు వంచే సమయంలో చీర కొంగు జారిపోతుంది. కల్లు తాగడానికి వచ్చిన పురుషులు ఆమె వంక దొంగ చూపులు చూస్తారు. వారిలో ముకుందం అనే వ్యక్తి "సిలుకు చీర కట్టకుంటే నూలు చీర కట్టు కోపోయినావే పిల్ల" అంటాడు. అప్పుడు సరోజ అతని వైపు కోపంగా చూస్తుంది. 'నా చీర గురించి మీకెందుకు మీరేం పనికి వచ్చారో ఆ పని చేసుకుపొమ్మని' అంటుంది. 'పని చేసేవాళ్ళు మంచి చీరలు కట్టకూడదా' అని అతణ్ణి నిలదీస్తుంది. "పరాసికాని కన్నందుకు బాగ కోపానికి రావడ్తవేంది పిల్ల?!" 'కల్లు బోసే పిల్లతోగాకుంటే ఎవ్వ లతోని పరాశికమాడ్తరిగ' అంటాడు ముకుందం.

'గాపరాశికాలు నా దగ్గర నడవయ్, కుమ్మరోల్లు కుండ లమ్ముకుంట బతుకుతుండ్రు, కాపోల్లు పంటమ్ముకుంట బతుకుతుండ్రు, సాలోల్లు బట్టలమ్ముకుంట బతుకు తుండ్రు మేం కల్లమ్ముకుంట బతుకుతున్నం కాని బళ్ళమ్ముకుంట బతుకతలే' అంది సరోజ. నర్సయ్య కోడలి వంక గర్వంగా చూస్తాడు. ముకుందం కుమ్మరి కులానికి చెందినవాడు. అతని భార్యను దొరల కుటుం బాల వాళ్ళు ఇదేవిధంగా అవమానపరచడం నర్సయ్యకు తెలుసు.

ఆడవాళ్ళను కల్లువంచే దగ్గరుంచడం చాలాకాలం నుండి ఉందని, ఆడవాళ్ళు కల్లువంచుతుంటే తామెంత తాగుతున్నదీ పురుషులు మరిచిపోతారని రచయిత రాశారు. అంతేగాక ధనిక కుటుంబాలకు చెందిన పురు షులు కల్లువంచే స్త్రీతో పరాచికాలాడతారు. కొన్నిసార్లు కల్లువంచే స్త్రీలను దొరలు, పటేళ్ళు లొంగదీసుకొని అనుభవిస్తారని ఆ వాసన నేటికి సమాజంలో ఉందని రచయిత రాశారు.

"పేదోడికి మంచి పెళ్ళాముండద్దంటారా! మీ భార్య లతే పరాశికాలాడితే ఊరుకొంటారా" అని దొరలను నర్సయ్య ప్రశ్నిస్తాడు. తెలంగాణ ప్రాంతంలో జరిగిన ఉద్యమాలు, పోరాటాల వల్ల సమాజంలో ఈ మార్పు వచ్చిందని రచయిత రాశారు.

ఈ కథలో బాలగౌడ్ చిన్నతనం నుంచి తన తాతమ్మతో దొరలు పరాశికాలాడడం అతని తల్లి కల్లు వంచుతుంటే దొరలు ప్రవర్తించిన తీరు చూశాడు. 'ఆడోళ్లను కల్లువంచడానికి పెట్టకుంటేంది' అని తండ్రితో అంటాడు. అప్పుడు నర్సయ్య బట్టలుతికే చాకలివాళ్ళకి, వెట్టి చేసే హరిజన స్త్రీలతోను, కల్లు అమ్మే స్త్రీలను దొరలు పరాచికాలాడతారు. కొంతమంది స్త్రీలు వారి చేతిలో మానాలను పోగొట్టుకుంటున్నారని చెబుతాడు. మన ఆడోల్లను, దొరల పెండ్లాల నుంచినట్టు లోపలుంచితే మనకెళ్ళది అంటాడు. అంతేగాక పురుషులు కల్లు గీకటా నికి, వ్యవసాయం పనులకు వెళతారు. ఆ సమయంలో స్త్రీలు కల్లు మండువా దగ్గర కొచ్చిన వారికి కల్లు వంచక తప్పదు. ఈ విధంగా చేయడం వల్ల కల్లు తాగడానికి వచ్చిన వారు ఎక్కువ తాగుతారు. వారి వ్యాపారం కూడా పెరుగుతుంది.

ఈ కథలో కల్లు అమ్మే కుటుంబాల స్వార్థం కూడా ఉంది. తెలంగాణ ప్రాంతంలో ప్రజలు ఎంత ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారో ఈ కథ వల్ల తెలుస్తుంది. ఇక్కడ దళిత స్త్రీలు కుటుంబ పోషణ కోసం తమ శీలాన్ని కూడా పణంగా పెడుతున్నారని తెలుస్తుంది. ధనవంతు లైన పురుషుల ఆధిపత్యానికి దళిత స్త్రీలు బలవుతున్నారు. ఈ కథలో స్త్రీ 'కల్లు అమ్మే స్త్రీ సిలుకు చీర కట్టు కోకూడదా?' అని పురుషుణ్ణి ప్రశ్నిస్తుంది. తనతో పరాచి కాలాడిన పురుషుణ్ణి ఎదిరిస్తుంది. తమ పట్ల అసహ్యంగా ప్రవర్తిస్తే సహించేది లేదని చెబుతుంది. సమాజంలోని ధనికవర్గంలో పురుషాధిక్యాన్ని ప్రశ్నించి, దళిత స్త్రీలను కించపరిచి, వారి శీలాన్ని తృణప్రాయంగా భావించే పురుషు లకు గొడ్డలి పెట్టుగా ఈ స్త్రీ నిలుస్తుంది. అన్యాయాన్ని ఎదిరించి, సమాజం నుండి తనని తాను కాపాడుకోగల సామర్థ్యం ఉన్న స్త్రీ ఈ కథలో మనకు కనబడుతుంది.

ముగింపు :

తెలంగాణ ప్రాంతంలో ధనిక వర్గాలకు చెందిన పురుషుల చేతిలో తమ శీలాన్ని కోల్పోయిన శాంతమ్మ లాంటి దళిత స్త్రీలున్నారు. సమాజంలో దళిత స్త్రీలు ఏ విధమైన వివక్షకు గురవుతున్నారో 'మా ఊరి ముచ్చట్లు' కథ ద్వారా వెల్లడి అవుతుంది. 'లచ్చి' కథలో భిక్షాటన చేసే కుటుంబాల జీవనశైలి వ్యక్తమవుతుంది. సమాజంలో బిచ్చమెత్తుకునే దళిత స్త్రీ తన సౌశీల్యంతో తన భర్తను మార్చుకుని, సంసారాన్ని ఏవిధంగా నిలబెట్టుకుందో తెలుస్తుంది. దళిత స్త్రీ కుటుంబాన్ని పోషించడానికి పురుషుడికి ఏమాత్రం తీసిపోదని, చివరకు అతణ్ణి సన్మార్గంలో నడిపించడానికి చేసే ప్రయత్నంలో కష్టాలను, అపనిందలను కూడా సహించి నిలవగలదని ఈ కథ ద్వారా ప్రస్ఫుటమవుతుంద. 'గిర్నిబాయి' కథలో మహా బూబ్ నగర్ జిల్లాలో పేదరికం ఏ విధంగా తాండవ మాడుతుందో వ్యక్తమవుతుంది. ఆ జిల్లాలో స్త్రీకి ఆమె

చేసే పని వల్ల జీవనోపాధి కలగకపోవడం ఈ కథలో సారాంశం. చివరకు ఆమె అనాథ శవంగా మారుతుంది. మరొక కథ 'ఊరుమ్మడి బతుకు'. ఈ కథలో కల్లు అమ్మే స్త్రీ జీవితం చిత్రీకరించబడింది. ఆమెతో పరాచికాలాడటానికి ప్రయత్నించిన పురుషులను ఎదిరిస్తుంది. ఆమెకు తన వృత్తిపట్లగల గౌరవాన్ని వ్యక్తపరుస్తుంది. ఈ కథలో స్త్రీ తన పని తాను చేసుకుంటూ, కుటుంబానికి అండగా నిలుస్తూ, ఆత్మస్థయిర్యంతో జీవిస్తుంది.

ఈ విధంగా తెలంగాణ ప్రాంతంలో దళిత స్త్రీలు సమాజంలో పురుషాధిక్య భావజాలం గల పురుషుల నుండి ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. తెలంగాణ కథలు, సంకలనం, సంపాదకులు కాలువ మల్లయ్య, సదానంద్ శారద, చంద్ర, విశాలాంధ్ర పబ్లికేషన్స్, హైదరాబాద్, 2012.
2. తెలుగు కథ విభిన్న ధోరణులు, మల్లయ్య కాలువ, తెలుగు అకాడమి, హైదరాబాద్, 2012.
3. దళిత సాహిత్య సౌందర్య తత్వం, కొలకలూరి మధుజ్యోతి, తెలుగు అకాడమి, హైదరాబాద్, 2010.

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'జై భవానీ - జై శివాజీ' చారిత్రక నవల - శివాజీ పాత్ర చిత్రణ

- చిగురుపాటి మస్తానరావు

చరిత్రలో వివిధ కాలాల్లో గొప్ప సాహసం ప్రదర్శించిన వ్యక్తులు ఎందరో ఉన్నారు. వారిలో కొందరు చరిత్ర గతినే మార్చిఉండవచ్చు. అటువంటి వారిలో ప్రముఖంగా చెప్పుకోదగినవారు ఛత్రపతి శివాజీ. ఆ మహా వీరుని జీవిత వృత్తాంతాన్ని 'జై భవానీ - జై శివాజీ' అనే చారిత్రక నవలగా రాశారు పులిచెర్ల సుబ్బారావు. సంస్కృతాంధ్ర భాషల్లోనే గాక తమిళ, మలయాళ, కన్నడాది దక్షిణ భారతీయ భాషలను, హిందీ, మరాఠీ, ఉర్దూ, గుజరాతీ, బెంగాలీ భాషలను స్వీయ ఆసక్తితో అభ్య సించిన సుబ్బారావు చారిత్రక నవలా రచయితగా ప్రసిద్ధులు. జగవీరపాండ్య కట్టబ్రహ్మన అనే చారిత్రక నాటకం, హంసావళి కథాసంపుటి, జై భవానీ - జై శివాజీ అనే చారిత్రక నవల వీరికి ఖ్యాతి తెచ్చిన రచనలు. వివిధ సాహితీ సంస్థల ద్వారా వీరు చేసిన సాహిత్య కృషి మరువ లేనిది.

'జై భవానీ - జై శివాజీ' అనే చారిత్రక నవల శివాజీ జైత్రయాత్రలకు సంబంధించినది. రచయిత ఈ నవల ద్వారా తన దేశభక్తిని, భారతీయ ధర్మం ఎదుర్కొన్న బాధ లను, ఒడిదుడుకులను చక్కగా వివరించారు. ఈ నవల చదువుతుంటే పాఠకులకు ఆయా రణరంగాలలో తామే స్వయంగా తిరుగాడినట్లనిపిస్తుంది. భారతదేశ చరిత్రలో ఛత్రపతి శివాజీ స్థానం అజరామరమైనది. భారతీయ సంస్కృతి అడుగంటి, హిందూధర్మం అణగారిపోతున్న సమయంలో స్వధర్మరక్షణకై నడుంకట్టి జాతికి ఆత్మ గౌరవం, ఆత్మవిశ్వాసం నూరిపోసిన మహనీయుడు శివాజీ. జీవితమంతా స్వరాజ్యస్థాపనకై పరిశ్రమించి సాఫల్యత పొందిన అవతార పురుషుడు శివాజీ. భారత జాతి మనుగడ సాగించినంత కాలం శివాజీ జీవిత చరిత్ర సుస్థిరమై స్మరణీయమై వెలుగొందుతుంది. ఆ మహా పురుషుని ఉజ్జ్వల జీవిత వృత్తాంతానికి సుబ్బారావు చేసిన రూపకల్పనయే 'జై భవానీ - జై శివాజీ'.

మాతృదేశ సంరక్షణకై, అంతరించిపోతున్న భారతీయ ధర్మాన్ని పునరుద్ధరించడానికి శివాజీ చేసిన కృషి, స్వరాజ్య స్థాపన కోసం అతడు అనుసరించిన వ్యూహాలు, ఎత్తులు, పైఎత్తులు, ఔరంగజేబు కుటిలనీతిని, రాజకీయ కుట్ర లను భగ్నం చేసిన విశేషాలు ఈ నవలలో కనిపిస్తాయి. దేశం కోసం ప్రాణాలు అర్పించడానికి సిద్ధపడ్డ అనేక మరాఠా వీరుల ధైర్య సాహసాలతో పాటు అనాటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక, మత, సారస్వత, సాంస్కృతిక పరిస్థితులను మన కళ్ళ ముందుంచుతుంది ఈ చారిత్రక నవల. సామాన్యులకు సైతం అర్థమయ్యే భాషాశైలి, ఆవేశ పూరిత సంభాషణలు, నీతి, న్యాయాలకు ప్రాణాలర్పించే యోధుల వాక్పటిమతో పాఠకులను మంత్రముగ్ధుల్ని చేస్తుంది సుబ్బారావు గారి 'జై భవానీ - జై శివాజీ'.

శివాజీ ది. 06-04-1627 లో షాజీభోంస్లే, జిజాబాయి దంపతులకు జునార్ సమీపంలోని శివనేరు దుర్గంలో జన్మించాడు. చిన్నతనం నుండి తండ్రికి దూరంగా తల్లి ఆదరణలో పెరిగాడు. కొన్ని పరిస్థితుల కారణంగా షాజీ పూనా జాగీరును జిజాబాయి ఆమె పిల్లలకు ఇచ్చి దాదాజీ కొండదేవ్‌ను వారికి సంరక్షకుడిగా నియమించి బీజాపూర్ వెళ్ళిపోయాడు. దాదాజీ వద్ద శివాజీ రాజకీయ, పరిపాలనా వ్యవహారాలను నేర్చుకున్నాడు. విద్యతోబాటే గుర్రపు స్వారీ, కత్తిసాము, పక్షులు, జంతువులు చేసే శబ్దాల అనుకరణ లాంటి విద్యల్లో ప్రావీణ్యం సంపాదించాడు. సమర్థ రామదాసు ద్వారా రామాయణ, భారత, భాగవతా లను ఆకళింపు చేసుకున్నాడు. రాజపుత్రుల నుంచి ధైర్యసాహసాలను నేర్చుకున్నాడు. భారతీయ సంస్కృతికి, హిందూ ధర్మానికి వాటిల్లిన కష్టనష్టాలను చూసి చలించి ధర్మరక్షణకు దీక్ష వహించాడు. మాతృభూమి దాస్య శృంఖ లాలను ఛేదించడం కోసం భారతీయ సంస్కృతిని రక్షిం చడం కోసం కృతనిశ్చయుడయ్యాడు.

పులిచెర్ల సుబ్బారావు 'జై భవానీ - జై శివాజీ' అనే చారిత్రక నవలలో శివాజీ పాత్రను అద్భుతంగా చిత్రించారు. కళ్యాణదుర్గాన్ని జయించినప్పుడు అబాజీ సోన్‌దేవ్ అనే సైన్యాధిపతి ముల్లా అహమ్మద్ కోడలిని చెరపట్టి శివాజీ వద్దకు తెస్తాడు. అతడు చేసిన పనికి శివాజీ మిక్కిలి కోపించి, సోన్‌దేవ్‌ను మందలించి ఆమెను తన కుటుంబ సభ్యుల వద్దకు సకల మర్యాదలతో పంపుతాడు. ఇక ముందెప్పుడు తన రాజ్యంలో స్త్రీలను అగౌరవించడం, చెరపట్టడం లాంటివి చేసినవారికి మరణదండన విధిస్తానని చాటింపు వేయించాడు.

దాదాజీ కొండదేవ్ అనారోగ్యంతో మంచం పట్టినప్పుడు శివాజీ పొందిన బాధ, మనస్తాపాన్ని రచయిత కళ్ళకు కట్టినట్లుగా వర్ణించారు. తన తండ్రి షాజీభోంస్లే బీజాపూర్ కొలువులో ప్రముఖ సర్దారై దక్షిణాదిన బెంగుళూరు జాగీరు సాధించి అక్కడ తన రెండవ భార్యతో కులుకుతూ, తనను, తన తల్లిని నిర్లక్ష్యంగా పూనేలో వదిలేసిన సమయంలో తనను కంటికి రెప్పలా కాపాడుతూ ఇంతవాడ్ని చేసిన అమృతమూర్తి మృత్యు ముఖంలో ఉండటం శివాజీని ఎంతో కలచివేసింది. తల్లి కంటే ఎక్కువగా తనలో ధైర్యాన్ని నూరిపోసి, రాజసాన్ని రగుల్కొల్పిన దాదాజీ అవసానదశలో ఉండటం శివాజీని మిక్కిలి బాధపెట్టింది.

శివాజీ గొప్ప యోధుడు. యుద్ధ వ్యూహ రచనా చతురుడు. స్థానిక పరిస్థితుల కనుగుణంగా తన సైనిక విధానాన్ని రూపొందించుకొని ఆ ప్రాంత ప్రజల కనుగుణంగా వారికి లభించే ఆయుధాలతో శిక్షణలు, వారి ప్రావీణ్యత ననుసరించి వారికి అనేక యుద్ధ పద్ధతుల్లో శిక్షణ ఇచ్చి వారిని మేటి సైనికులుగా తీర్చిదిద్దాడు. సైనికులకు అత్యంత అభిమానపాత్రుడై, ఆరద్ధ్ర ప్రాయుడై వారి కష్ట సుఖాల్లో భాగస్వామిగా వ్యవహరించి శివాజీ తన నాయకత్వపు ప్రతిభను నిరూపించుకున్నాడు. ఇలా అనేక సంఘటనల ద్వారా శివాజీ ధైర్య సాహసాలను రచయిత కళ్ళకు కట్టినట్లుగా చిత్రించారు.

శివాజీ సనాతన హిందూ మతాభిమాని అయినప్పటికీ అన్ని మతాలను గౌరవించాడు. తన రాజ్యంలో ముస్లింలకు మతస్వేచ్ఛను కల్పించాడు. యుద్ధ సమయంలో ఎవరికైనా ఖురాన్ దొరికినట్లయితే దానిని ఎవరైనా ఇతర ముస్లింలకు ఇవ్వాలని చెప్పాడు. బందీలుగా చిక్కిన స్త్రీలను సొంత తల్లులులాగా చూడాలని, వారిని గౌరవించాలని, ఎవరైనా అమర్యాదగా ప్రవర్తిస్తే మరణదండన విధిస్తానని చాటింపు వేయించాడు. ఎవరి మతాల్ని వాళ్ళు గౌరవించాలి. అదే సమయంలో ఇతర మతాలను కూడా గౌరవించాలని చెప్పాడు. మత బోధకుల కోసం ఎంతో ఖర్చు చేశాడు.

శివాజీకి తల్లి పట్ల గల ప్రేమాభిమానాలను, భవానీ మాత పట్ల గల భక్తి భావాలను మనం ఈ నవలలో చూడవచ్చు. తాను ఏ కార్యం సాధించడానికి బయలు దేరాలన్నా ముందుగా తల్లి, ఆతర్వాత భవానీమాతల దీవెనలు పొందేవాడు. తల్లి కోరిక మేరకు అతి కష్టమైన సింహగఢ్‌ను జయించి కానుకగా ఇచ్చాడు. శివాజీ ఒకసారి తుకారాంను దర్శించి అక్కడే ఉండిపోదల్చినప్పుడు తల్లి జిజాబాయి వచ్చి శివాజీకి జ్ఞానబోధ చేసి కర్తవ్యాన్ని గుర్తుచేస్తుంది. తల్లి మాటలను మన్నించిన శివాజీ మరల కత్తి పట్టుకొని సమరానికి సన్నద్ధమయ్యాడు.

శివాజీ రాజకీయ చతురత, శత్రువుల పట్ల కఠిన వైఖరి, సమయానుకూలంగా ప్రవర్తించిన తీరుతెన్నులను రచయిత ఈ నవలలో చక్కగా చిత్రించారు. శివాజీ తన గురువైన రామదాసు కొరకు పులిపాలు తేవడం, అఫ్జల్ ఖాన్‌ను తెలివిగా సంహరించటం, షయిస్తఖాన్ చేతి వేళ్ళు నరకడం లాంటి సాహసోపేతకృత్యాలు పాఠకులలో ఉత్కంఠను కలిగిస్తాయి. ఔరంగజేబును ధైర్యంగా ఎదిరించడం, చెరలో నుండి మాయోపాయంతో తప్పించుకోవడం, రకరకాల మారువేషాలతో తన రాజ్యానికి చేరటం లాంటి సన్నివేశాలు ఎంతో ఉత్సుకతను కలిగిస్తాయి.

సిద్దీజౌహర్‌తో భేటీ సన్నివేశంలో శివాజీలో గల రాజకీయ చతురత, బాజీఘోర్పడే కుమారుడైన మాలోజీతో భేటీ సమయంలో శివాజీలోని సమయానుకూల ప్రవర్తన

తెలుస్తుంది. స్త్రీలను గౌరవించడం, మసీదులను నాశనం చేయకపోవడం, యుద్ధం తర్వాత హింస జరుగకుండా చూడడం, యుద్ధంతో సంబంధం లేనివారిని గౌరవించడం లాంటివి శివాజీలోని విశిష్ట లక్షణాలు. తన సైన్యంలో ఎంతో మంది ముస్లింలకు ఉద్యోగాలిచ్చాడు శివాజీ. విజయనగర సామ్రాజ్యం, దక్కన్ సుల్తానుల పతనం తర్వాత శివాజీ గొప్ప ప్రాముఖ్యంలోకి వచ్చాడు. ఈవిధంగా శివాజీలోని విశిష్టతలను, గొప్ప లక్షణాలను, యుద్ధతంత్రం, రాజనీతి వంటి లక్షణాలను ఈ నవలలో అణువణువునా దర్శించవచ్చు.

పులిచెర్ల సుబ్బారావు గారి నవలల్లో 'జై భవానీ - జై శివాజీ' ప్రఖ్యాతి గాంచిన నవల. చారిత్రక నవలల్లో అన్ని పునర్ముద్రణలు పొందిన తెలుగు నవలలు చాలా అరుదు. ఒక సామాన్య జాగీర్దారు కుమారుడు మొగలు సామ్రాజ్యాధికారాన్ని ధిక్కరించడం సామాన్య విషయం కాదు. ఈ అసామాన్య ఘనకార్యాన్ని సాధించిన శివాజీ మహారాజు చరిత్రను, హిందూధర్మ సంరక్షకుడైన ఛత్రపతి శివాజీ మహారాజు చరిత్రను రచయిత అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ నవలను పఠించడం ప్రారంభించిన సహృదయ పాఠకుడు చదవడం ముగించినంతవరకు నవలను మూయడు. దానికి కారణం శివాజీ చరిత్రలోని వీరోచిత ఘట్టాలు మాత్రమే కాదు శీర్షికల పేర్లతో పాటు రచనాశైలి కూడా పాఠకుడ్ని అంతగా ప్రభావితం చేస్తుంది.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

రెండు దశాబ్దాల రాయలసీమ పద్యకవిత్వం - తల్లిప్రేమ (1980-2000)

- నరేష్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

తెలుగు భాష, సాహిత్యానికి దాదాపు రెండువేల సంవత్సరాలకు పైబడిన చరిత్ర ఉంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు తెలుగు భాషా సాహిత్యాల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. పురాణం, కావ్యం, ప్రబంధం, శతకం, నాటకం, నవల, కథానిక, హైకు, రెక్కలు, నానీలు వంటి ప్రక్రియలతో తెలుగు సాహిత్యం వికాసం చెందింది. నేటికీ చెందుతూనే ఉంది. పురాణం, కావ్యం, ప్రబంధం, శతకం వంటి ప్రక్రియలు పద్యంలో వెలువడ్డాయి. నవల, నాటకం, కథానిక వంటివి గద్యంలో వెలువడుతున్నాయి. ఈ దృక్కోణంలో చూసినపుడు సంతస్కృతంలో శ్లోకం, తెలుగులో పద్యం ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయని చెప్పవచ్చు. ఒకప్పుడు పద్యం పండిత పామరలను అమితంగా ఆకట్టుకు ఉన్నది. అయితే ఆ తర్వాత ఆధునికక యుగంలో దీనికి ప్రాధాన్యత కొంతమేర తగ్గింది. అయినా దానికున్న ప్రామాణికత ఎంతమాత్రం తగ్గలేదని చెప్పక తప్పదు. నన్నయ నాటి నుండి నేటి వరకు వెలువడుతున్న పద్యకవిత్వమే దీనికి ప్రబల నిదర్శనంగా పేర్కొనవచ్చు.

పూర్వం పద్యం రాసిన వారినే కవులుగా పరిగణించే వారు. వారినే గొప్ప రచయితలుగా భావించేవారు. అందుకే కాబోలు శ్రీశ్రీ వంటి అభ్యుదయ కవి కూడా ప్రారంభంలో పద్య కవిత్వం రాశాడు. శాసనాలలోనే అక్కడక్కడ పద్య కవిత్వ ఛాయలు కనిపిస్తున్నాయి. ఆ తర్వాత ఆది కవి నన్నయ భారతాంధ్రీకరణతో పద్యానికొక పరిపూర్ణ స్వరూపం ఏర్పడింది. అప్పటి నుండి ఇప్పటి వరకు సుమారు వేయి సంవత్సరాల కాలం పద్యం రాజ్య మేలుతూనే ఉన్నదనవచ్చు. కాలానుగుణంగా తెలుగు సాహిత్యంలో వచ్చిన మార్పుల మూలంగా ఆధునిక యుగంలో పద్యకవిత్వపు రాశి తగ్గిందిగానీ వాసి తగ్గ లేదు.

తల్లి ప్రేమ - పద్యకవిత్వం :

సృష్టికి మూలం తల్లి. తల్లి లేని సృష్టిని ఊహించలేం. అందుకే కాబోలు మన పెద్దలు, కవులు, తల్లి, తండ్రి, గురువు, దైవాలను ప్రతి ఒక్కరూ ఆరాధించాలని, పురాణాది గ్రంథాల్లో సోదాహరణంగా వివరించారు. అందులోనూ తల్లికి అగ్రస్థానమిచ్చారు. ఈ విశ్వంలో తల్లికి తల్లే సాటి రాగలదు తప్ప ఇతరులెవ్వరూ రాలేరు.

ఒక్క హిందూమత ఆధ్యాత్మిక గ్రంథాలేగాకుండా అన్ని మత గ్రంథాలు తల్లికి సముచిత స్థానాన్నిచ్చాయి. ఈ దృక్కోణంలో చూసినపుడు రెండు దశాబ్దాల కాలంలో రాయలసీమ ప్రాంతంలో తల్లి ఔన్నత్యాన్ని శ్లాఘిస్తూ కొందరు కవులు పద్యకవిత్వం రాశారు. వారి కవిత్వంలోని వినూత్న కోణాలను ఇక్కడ పేర్కొని విశ్లేషించి చర్చించటం జరిగింది.

అమ్మ - సమభావం :

కన్న తల్లి కొడుకును, కూతురిని సమభావంతో చూస్తుందని కవి జోస్యం విద్యాసాగర్ తెలిపాడు. తల్లి తన కడుపున పుట్టిన బిడ్డలందరిని సమభావంతోనే చూస్తుంది. ఆడబిడ్డయినా, మగబిడ్డయినా తల్లికి ఒక్కటే. అయితే ఎక్కడో ఒకరిద్దరు మాత్రమే కొడుకు, కూతురనే వ్యత్యాసం చూపుతారు.

ఊపిరి ఉన్న చాలు కొడుకో గిడుకో యెవరైన నొక్కటే
చేసిన ప్రేమ జుర్రుకొను చిట్టి పెదా లెవియైన నొక్కటే
లోపలి పేగుబంధ యదలో మెదిలే... మమతాను బంధమున్
చూపెడి పాంచ భౌతికపు సుందర రూపపు సృష్టి కర్తగా

ఏ పసికూన యైననొకటే యని పల్కెడు అమ్మ అమ్మయే అంటాడు కవి.

(అమ్మ - పద్యం 3, ప్రచురణ : జోస్యము ప్రచురణలు, హైరదాబాదు, డిసెంబరు 2000)

కొడుకు అయితేనేమి, కూతురు అయితేనేమి ఎవ్వరో ఒకరున్న చాలు. వారి పెదాలపై ముద్దుపెట్టి జుర్రుకుంటా నంటుంది తల్లి. తమ ప్రేమానుబంధానికి ప్రతిరూపంగా ఎవ్వరున్నా చాలుననుకుంటుంది. అంతటి సహృదయం కలిగిన అమ్మకు మరొకరు సాటి రారని చెప్పవచ్చు.

కొడుక్కి అనారోగ్యం కలిగితే తల్లి పడే వేదన :

కన్నకొడుక్కు అనారోగ్యం కలిగితే తల్లి ఎంత తపన పడుతుందో కవి జోస్యం విద్యాసాగర్ కళ్ళకు కట్టినట్లు తెలిపాడు. తల్లి తన బిడ్డల బాగుకోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడుతుంది. వారి ఉన్నతి కోరి ఎన్నో నోములు, వ్రతాలు చేస్తుంది. తాను తినకుండా బిడ్డలకు పెడుతుంది. ఇది యథార్థ సత్యం.

కన్నులు కొంచె మెర్రబడి గట్టగ తుమ్మిన లేక దగ్గినన్
చిన్నికి జబ్బు చేసెనని చిందులు తొక్కును కాలుసేతులే
మన్నను వెచ్చనాను అనుమానంతో స్పృశియించి చూచితే
దన్న నిజ మ్మెరింగియు నిదానము చెందకతృప్తిలేక వెం
కన్నకు మొక్కి వేముడుపు కట్టు అమాక అమ్మ
అమ్మయే అంటాడు కవి.

(అమ్మ - పద్యం 14)

బిడ్డ కన్నులు కొంచెం ఎర్రబడినా, గట్టిగా తుమ్మినా కన్నతల్లి మనస్సు కలతచెందుతుంది. బిడ్డ శరీరాన్ని పదే పదే స్పృశించి చూస్తుంది. అబ్బా! నా బిడ్డకు ఎలాంటి అనారోగ్యం లేదని నిశ్చయించుకున్నాక తృప్తి చెందుతుంది. అయినా ఒక్కొక్కసారి తృప్తి చెందక వేంకటేశ్వర స్వామి వారికి ముడుపులు కడుతుంది.

కోరికలు నెరవేరాలని భావించి భక్తులు ముందుగా తాము నమ్మిన దేవునికి ముడుపులు కడతారు. ఒక తెల్లగుడ్డ తీసికుని దానిని పసుపు నీటిలో అద్ది ఆరబెడతారు. ఆ తర్వాత దానిలో తమకు తోచినంత నాణెం పెట్టి ముడివేస్తారు. దానిని ఇంటిలోని దేవుని మందిరంలోనో, ఊరిలోని గుడిలోనో, ఒక చెట్టుకో కట్టివేస్తారు. తమ కోరిక నెరవేరితే ఆ ముడుపు తీర్చుకుంటారు. ఇలాంటి ముడుపులు ఎక్కువగా ఇలవేల్పుకు కడుతుంటారు. ఈ సాంప్రదాయం జానపదుల్లో ఎక్కువగా ఉంది. నేటికీ భారతదేశ వ్యాప్తంగా ఈ సంస్కృతి కొనసాగుతున్నదని దృఢంగా చెప్పవచ్చు.

ఎక్కువ ఖర్చులు పెట్టవద్దనుట :

తన ఆరోగ్యం కోసం ఎక్కువ డబ్బులు ఖర్చు పెట్టవద్దని కొడుకును తల్లి ఎలా ప్రాధేయపడుతుందో కవి జోస్యము విద్యాసాగర్ చక్కగా తెలిపాడు. తాను గతించినా పరవాలేదుగానీ తన బిడ్డ సంపాదించుకున్న డబ్బు మాత్రం ఖర్చు కాకూడదనీ, ఆ డబ్బుతో అతడు అవసరాలు తీర్చుకుంటాడు హాయిగా జీవించాలని భావిస్తుంది.

మందులు తీసుకోమనుచు మాటికి మాటికి వచ్చి నన్ను ఇ
బ్బందిని పెట్టవద్దు... పార పాటున నంటిని గుండెనొప్పిగా
ఉందని ఊరకుండక ఏదో ఒక మందయితే సరే... మరీ
వందల మాత్రలైన తినవాలనగానె మొహమ్ము మొత్తు.... నా
కెందుకు చెప్పు వద్దు ఇటు లే చనిపోదను అమ్మ
అమ్మయే అంటాడు కవి.

(అమ్మ - పద్యం 99)

కవి ఈ మాట ప్రతి తల్లికి అన్వయిస్తుంది.

తాను ఎంత సంపాదించి ఇచ్చినా, తన కొడుకు ఆర్థికంగా ఎంత ఉన్నత స్థితిలో ఉన్నా, తరతరాలకు సరిపడేంత సంపద ఉన్నా తన మూలంగా తన బిడ్డ చేతిలోని సంపద ఖర్చు కాకూడదని తల్లి భావిస్తుందనడంలో సందేహం అక్కరలేదు. తన ఆరోగ్యం ఎంతగా దెబ్బతింటున్నా భరిస్తుందేగాని, చివరికి చనిపోవటానికి కూడా సిద్ధపడుతుదిగాని కొడుకు చేతినుంచీ ఒక్క

రూపాయి కూడా ఖర్చు పెట్టించడానికి అంగీకరించదు. దీనిని బట్టి తల్లి ఎంత నిస్వార్థపరురాలో, బిడ్డపై ఎంత అనురాగం కలిగి ఉంటుందో అర్థమవుతుంది.

బిడ్డకు తల్లి బుద్ధిమాటలు చెప్పుట :

అల్లరి పనులు చేసి నాన్నకు చెడ్డపేరు తీసుకురావద్దని తల్లి బిడ్డను వేడుకుంటున్న తీరును కవి జోస్యము విద్యాసాగర్ చక్కగా చెప్పాడు. పిల్లలు బాల్యం నుంచి క్రమశిక్షణతో పెరగాలి. దురలవాట్లకు లోనుకారాదు. పెద్దలను గౌరవించాలి. పిల్లలను ఆదరించాలి. మంచి లక్షణాలు అలవరచుకొని ఉత్తమ పౌరుడిగా తయారవ్వాలి. అపుడే తల్లిదండ్రులకు బిడ్డను కన్నందుకు సంతోషం కలుగుతుంది.

అల్లరివాడవంచు కనినంతనె అందరు నిన్ను తిట్టరా
ఎల్లరి నోళ్ళలో పడుట ఏమది మంచిదె... నాన్నగార్కి నీ
వల్లనె గౌరవమ్ము కరువయ్యె... తలెత్తుక తిర్గరైరి... నీ
పిల్ల తనమ్ము మాని చదువేమిటో... నీ పని యేమిటో మరొ
క్కళ్ళను పల్కరించకని కంటను నీరిడు అమ్మ
అమ్మయే అంటాడు కవి.

(అమ్మ - పద్యం 62)

ఒక తల్లి తన అల్లరి బిడ్డను ఇలా వేడుకుంటున్నది.

1. అల్లరి వాడని నిను అందరూ తిడతారు.
2. నలుగురి నోళ్ళలో నాని నీవు చెడ్డవాని వనిపించు కోవడం భావ్యమా!
3. నీ పనిని నీవు చక్కగా శ్రద్ధగా చేయమంటుంది.

అన్నీ చెప్పి చివరికి తల్లి కన్నీళ్ళు పెట్టుకుంటుంది.

తన బిడ్డ ఫెయిల్ అయితే తల్లిపడే తపన :

ఇరుగు పొరుగు తెలిసిన వాళ్ళందరూ పరీక్షో ఉత్తీర్ణులై తన బిడ్డ మాత్రమే ఉత్తరుడు కాకపోతే ఆ తల్లి పడే వేదన ఎలా ఉంటుందో కవి జోస్యము విద్యాసాగర్ చక్కగా చెప్పాడు. సహజంగా తల్లికి అందరి బిడ్డల కంటే తన బిడ్డే మిన్నగా ఉండాలని భావిస్తుంది. ఇది ప్రతి తల్లికి ఉండే స్వాభావిక స్వార్థ గుణం.

సారథి ఫస్టుక్లాసు... మన జానకి బిడ్డడు ఫస్టుక్లాసు... పూ
జారి సుతుండు ఫస్టు... శృతి సాగరు డా శశి బిందు
ఆరఘుం
డారవి ఆ సుధీరు గిరి అందరు అందరు ఫస్టు ఫస్టు ఏం
నేరము చేసి పుట్టితినొ నేరనుగాని అదేమొ నాదు బం
గారము మాత్రమె ఫెయిలు గావటమా యను అమ్మ
అమ్మయే అంటాడు కవి.

(అమ్మ - పద్యం 79)

సారథి, జానకి బిడ్డ, పూజారి కొడుకు, శృతి సాగరుడు, శశిబిందు, రఘు, సుధీరు, గిరి అందరూ ఫస్ట్ క్లాసులో పాసయ్యారని, కేవలం మన కుమారుడు మాత్రమే ఫెయిల్ అయ్యాడని, మనం ఏమి నేరము చేశామని తన భర్తతో చెబుతూ ఆవేదన చెందుతుంది. అదేమో కానీ నా బిడ్డ మాత్రమే ఫెయిల్ కావటమా! అంటూ తీవ్ర మనోవేదనకు గురవుతుంది. అందరూ ఫెయిల్ అయి ఉన్నా తల్లి ఓర్చుకుని ఉండేదేమో కానీ తన కుమారుడొక్కడే ఫెయిల్ అయ్యాడని బాధపడుతూ అంతులేని దుఃఖానికి గురవుతుంది.

అమ్మా - పిలుపుకు తల్లి ఆనందపడుట :

బిడ్డ మొదటిసారి అమ్మ అని పిలిచే పిలుపుకు స్త్రీ ఎంత తన్మయం చెందుతుందో కవి జోస్యము విద్యా సాగర్ తెలిపాడు. ఒక స్త్రీ తన బిడ్డ(ల) చేత అమ్మా! అని మొట్టమొదట పిలిపించుకున్నప్పుడు ఎంతో ఆనందంతో కూడిన తన్మయత్వానికి గురవుతుంది. అది కూడా మొదటి బిడ్డ మొదటి సారి సంబోధించినపుడు పులకరించిపోతుంది తల్లి.

'అమ్మ' అనే పదాన్ని ప్రథమమ్ముగ పల్కిన నాడు లోకమం
దమ్మ తనొక్కతే యయిన దర్పము గుండెల పొంగి పొర్లనే
త్రమ్ముల కాంతి పుంజములు రంజిల... మోమున
నూత్నమౌ మయూ
ఖమ్ములు కానుపింపపుల కాంకురముల్ మెయినిండ గల్గగా
నెమ్మది సంతసమ్ము వెన నిండగ నవ్వెడు అమ్మ
అమ్మయే![68] అంటాడు కవి.

(అమ్మ - పద్యం 8)

తన బిడ్డ మొట్టమొదటిసారిగా అమ్మా! అని పిలిచినపుడు, లోకానికంతా తానొక్కతే అమ్మ అయినంతగా ఆనంద పరవశురాలవుతుంది. ఆ ఆనందం ఆమె గుండల్లో కన్నుల్లో కనిపిస్తుంది. ముఖంలో నూతన భావపరంపర తాండవ మాడుతుంది. ఇన్ని భావాలు ఒక్కసారిగా మనస్సులో అంకురించగా అవన్నీ శరీరంలో పొడసూపగా పరమానంద భరితురాలవుతుంది. ఇంతగా సంతోషించే అమ్మకు సాటి మరొకరు లేరు, ఉండరు, ఉండోబరని చెప్పవచ్చు.

కొడుకు పెళ్ళి విషయంలో తల్లి తపన :

కొడుకుకు పెళ్ళి త్వరగా జరగాలని, అది కూడా మంచి సంబంధం కుదరాలని తల్లి పరిపరి విధాలుగా తపిస్తుంది. ఈ విషయాన్ని కవి జోస్యము విద్యాసాగర్ చక్కగా తెలిపాడు. తన బిడ్డ అందరికంటే మిన్నగా సలక్షణంగా ఉన్నాడని తల్లి భావిస్తుంది. కాకి పిల్ల కాకికి ముద్దు అన్న సామెత ఇలాంటి వాటి మూలంగానే వచ్చి ఉంటుందని చెప్పవచ్చు

ఎందుకు లేనిపోని దిగు? లేం మనవానికి కాలు వంకరా?
కందొవ వంకరా? నలుపు కాదు కదా! చదువేమి తక్కువా?
ఉంది స్థిరాస్థి - ఇల్లు - కొలువున్నది మంచిది ఏలరావు సంబంధము లింక చింత విడుమాయని అమ్మకు సానుభూతితో
పొందిక నాడు నాన్నగాని 'బో'రని యేడుచు అమ్మ అమ్మయే! అంటాడు కవి.

(అమ్మ - పద్యం 144)

లేనిపోని దిగులెందుకని, మన వానికి కాలు చేయి వంకర లేదు గదాయని, పైగా నల్లగా కూడా లేడని, చదువు కూడా బాగా చదివాడని, అంతేగాకుండా స్థిరాస్థి కూడా ఉందని, మంచి ఇల్లు ఉన్నదని, చక్కని ఉద్యోగం ఉందని - ఇన్ని సలక్షణాలు ఉన్నపుడు మంచి సంబంధాలు ఎందుకు రావని ఒక భార్యను భర్త ఓదారుస్తాడని కవి తెలిపాడు.

అత్త సంతోషం :

కోడలు తనను అత్త అనకుండా అమ్మ అని పిలిస్తే అత్త పరమానందభరితురాలవుతుందని కవి జోస్యము విద్యాసాగర్ చక్కగా తెలిపాడు. సహజంగా అత్త కోడళ్ళకు పొసగదు. అన్యోన్యత కలిగిన అత్త కోడళ్ళను వేళ్ళమీద లెక్క పెట్టవచ్చు. పెత్తనం చెలాయించాలని అత్త, అత్త ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయాలని కోడలు పోరాటం చేస్తారు.

కోడలు నన్ను 'అత్త' యని కొంత భయమ్ము ఇకొంత ప్రేమ తొ
ల్కాడగ పిల్చితే వినెదు గాయను కొంటిని... కాని నన్ను... తాన్
చడగానే అదేమొ అతి చోద్యము అమ్మ అటంచు పిల్చె... అ
ల్లాడిన నా మనస్సునకు హాయిని గూర్చెను ఏపదమ్ము ప
ల్కాడిన నేమి గౌరవము కావలెనంచును అమ్మ అమ్మయే! అటాండు కవి.

(అమ్మ - పద్యం 160)

ఒక అత్త తనను కోడలు అత్త అంటూ కొంత భయంతో ఇంకొంత ప్రేమతో పిలిస్తే వినాలనుకున్నానని, అయితే తాను ఊహించిన దానికంటే భిన్నంగా 'అమ్మ' అని పిలిచిందని, దానితో బాధతో అల్లాడిన నా మనస్సుకు హాయి కలిగిందని అంటుంది. నేడు అత్త కోడళ్ళంటే వర్గశత్రువులనే భావన ప్రజల్లో నాటుకు పోయింది. అయితే రామాయణంలో కౌసల్య - సీతలు గానీ, భారతంలో కుంతీ-ద్రౌపది గాని వాదులాడుకున్నట్లు ఆధారాలు కనిపించవు. అక్కడ వారు చాలా అన్యోన్యంగా కలిసి మెలిసి జీవించినట్లు ఆ గ్రంథాలు చెబుతున్నాయి. అయితే ఇటీవలి కాలంలోనే ఈ తగవులాటలు పుట్టాయని చెప్పడానికి అవకాశం కలుగుతున్నది.

ఈ అధ్యాయంలో పద్యకవిత్వ ఆవిర్భావ వికాసం పరిణామాన్ని గురించి సవివరంగా పేర్కొనడం జరిగింది. అదేవిధంగా రెండు దశాబ్దాల కాలంలో (1980-2000) సంవత్సరాల మధ్యకాలంలో రాయలసీమ ప్రాంతంలో

ఎంతో పద్యకవిత్వం ఆవిర్భవించింది. ఆ పద్య కవిత్వాన్ని చారిత్రక పద్య కవిత్వం, పురాణ పద్య కవిత్వం, ఇతిహాస పద్యకవిత్వం, సాంఘికాంశాల పద్యకవిత్వం, ఆధ్యాత్మిక పద్యకవిత్వం, జాతీయదృమ నాయకులు - పద్యకవిత్వం, తల్లి ప్రేమ - పద్యకవిత్వంగా వస్తువైవిధ్యం రీత్యా విభజించడం జరిగింది. ఈ అంశాల పరిధిలోకి వచ్చే పద్యకవిత్వాన్ని సప్రమాణంగా, సవివరంగా, సహేతుకంగా విశ్లేషించి చర్చించి వివరించడం జరిగింది. ఈ పద్యకవిత్వంలో చక్కని సామాజిక స్పృహను కవులు ప్రతిబింబించారని నిర్ధారించడం జరిగింది.

ఆధార గ్రంథాలు :

1. కంకాళరాత్రి - డా॥ అంతటి నరసింహం
2. అమ్మ - జోస్యము విద్యాసాగర్
3. కవితాభారతి - ఎ.సి. దస్తగిరి
4. సింధూరలేక - వై.సి.వి. రెడ్డి
5. తెలుగుసాహిత్యసమీక్ష - ఆచార్య జి. నాగయ్య



BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అంపశయ్య నవీన్ జీవితము, సాహిత్యము - పరిశీలన

- కొప్ప సుభాష్ చంద్రబోస్, పరిశోధకవ విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

అంపశయ్య నవీన్ పుట్టింది 1941లో వరంగల్ జిల్లా జనగామ తాలూకాలోని వావిలాల గ్రామం. 1956కు ముందు ఈ జనగామ తాలూకా నల్గొండ జిల్లాలో ఉండేది. 1946లో తెలంగాణాలో జరిగిన కమ్యూనిస్టు సాయుధ పోరాటానికి జనగామ తాలూకాలోని అనేక గ్రామాలు కేంద్రాలుగా ఉండేవి. అలా అయిదారేళ్ళ వయస్సులోనే ఉన్నవాడికి లేనివాడికి మధ్య జరిగిన వర్గ పోరాటాన్ని కళ్లతో చూసి మనసుతో అనుభవించే అవకాశం కల్గింది. 'బండెనక బండిగట్టి పదహారు బండ్లుగట్టి..' లాంటి ఆనాటి అనేక పోరాట పాటల్ని బాల్యంలోనే నాలాంటి అనేక మంది పసివాళ్ళతో కలిసి పాడుకునే అవకాశం కల్గింది నల్ల నరసింహులు, రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డిలాంటి నాయకులను చూసి సంభ్రమాశ్చర్యాలతో మునిగిపోయాం. అప్పటికే వాళ్ళు లెజెండ్స్. వాళ్ళను గూర్చిన అనేక కథలు ప్రచారంలో వుండేవి. అందువల్ల వాళ్ళు మామూలు మానవమాత్రులు కారేమోననుకునే వాడిని. అలాంటి వాళ్ళను నిజంగా చూసి కథల్లోని హీరోలను చూసినట్లుగా ఆశ్చర్యపోయే వాళ్ళం. ఆనాడు నేను చూసి అనుభవించిన ఆ తెలంగాణా పోరాటాన్ని నవలగా చిత్రించాలని నాలో ఆనాటి నుంచే తపన. బాల్యంలోనే కథలు వినడం అంటే పిచ్చి. భారత రామాయణ కథలంటే చెవులు కోసుకునేవాణ్ణి. ఆ రోజుల్లో పల్లెటూళ్లలో వీధి నాటకాలు ఆడుతుండేవాళ్ళు. రాత్రంతా కంటిమీద రెప్ప వేయకుండా ఆ నాటకాల్ని చూసేవాడిని. ఆ నాటకంలో చూసిన పాత్రల్ని, సన్నివేశాల్ని నా మిత్రులకు అనేక విధాలుగా వర్ణించి చెబుతుండేవాడిని. చదువుకునే రోజుల్లోనే చాలామంది మిత్రులు నా చుట్టూచేరి ఏదన్నా కథచెప్పమని అడుగుతుండే వాళ్ళు. నేను విన్న కథల్ని, చూసిన నాటకాల్లోని కథల్ని అనేక విధాలుగా మార్చి ఇంకా ఎక్కువ ఆసక్తికరంగా మార్చి నేను నా మిత్రులకు కథలు చెబుతుండేవాన్ని. ఒక్కొక్కసారి నిజంగా జరిగిన కొన్ని సంఘటనల్నే కథలుగా మార్చేసి చెబుతుండే వాడిని. ఇలా కథలు చెప్పడం అన్నది నాకు చాలా చిన్న వయస్సులోనే అలవడింది. ఆరవ తరగతి చదువు తున్న రోజుల్లోనే 'రత్నాకరుడు' అనే పేరుతో ఒక జానపద కథ రాసి 'చందమామ'కు పంపించాను. అలాగే వరంగల్ ఎ.వి.హైస్కూల్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్న రోజుల్లో మాస్కూల్లో జరిగిన ఓ చిన్న సంఘటననే కథగా రాసి ఆ స్కూల్లో మాకు తెలుగు చెప్పే మా తెలుగు మేష్టారు విశ్వనాథ వెంకటేశ్వర్లు (విశ్వనాథ సత్య నారాయణ గారి తమ్ముడు) గారికి చూపించాను. ఆయన ఆ కథ చదివి కొన్ని భాషా దోషాల్ని సరిచేసి 'వొరేయ్! నీకు గొప్ప భవిష్యత్తు ఉందిరా!' అన్నాడు కాబట్టి నేను రచయితను కావడం అనేది చాలా సహజంగానే జరిగింది. ఎక్కడ హృదయాన్ని కలచివేసే సంఘటన జరిగినా వెంటనే దాన్ని కథగా మలచాలని ఉవ్విళ్ళూరుతుండే వాడ్ని.

హైస్కూలు చదువు ముగించుకొని కాలేజిలో చేరాక నాలోని రచయిత ఇంకా వికసించటానికి సరయిన వాతావరణం లభించింది. వరంగల్‌లో రచయితలకు శిక్షణా కేంద్రంగా ఈనాటికీ పనిచేస్తున్న 'మిత్రమండలి'లో ప్రవేశం లభించడం, కాళోజి బ్రదర్స్, వరవరరావు, గంట రామన్న, లోచన్ లాంటి వాళ్ళతో స్నేహం ఏర్పడటం, కాలేజిలో ఇరివెంటి కృష్ణమూర్తి, జి.వి.సుబ్రమణ్యం, వేటూరి ఆనందమూర్తి, పేర్వారం జగన్నాథం లాంటి అధ్యాపకుల ఉపన్యాసాలు వినడం, లైబ్రరీల్లోంచి చలం, బుచ్చిబాబు, కొడవటిగంటి కుటుంబరావు, గోపీచంద్, శ్రీశ్రీ, ఆరుద్ర - థామస్‌హార్డ్, సామర్సెట్ మామ్, డి.హెచ్. లారెన్స్, ఆల్డన్ హక్స్‌లీ, బెర్ట్రాండ్ రస్సెల్, బెర్నార్డ్ షా లాంటి రచయితల పుస్తకాలు తెచ్చుకొని రాత్రింబవళ్ళు వాటినే చదవటం, మిత్రులతో ఆ పుస్తకాలను గూర్చి

చర్చించడం - ఇవన్నీ నాలోని రచయితను పరిపుష్టం చేశాయి. వరంగల్ కాలేజిలో జరిగిన ఒక సంఘటననే నేను 'అథో లోకం' అన్న కథను రాశాను. ఇదే నామొదటి ముఖ్యమైన రచన. ఈ కథను చెప్పడానికి నేను మొదటి సారిగా 'చైతన్య స్రవంతి' శిల్పాన్ని ఎన్నుకున్నాను. నా రచనలన్నింటి లోనూ నేను ప్రధానంగా వాస్తవికతను చిత్రించటానికే ప్రయత్నించాను. నాకు బాగా తెలిసిన వ్యక్తుల్నే నా కథల్లోనూ, నవలల్లోనూ పాత్రలుగా మల చాను. పాత్రల బాహ్య రూపాల్ని మాత్రమే కాకుండా వాళ్ళ అంతరంగ జీవితాన్ని కూడా చూపించాలని నా తాప త్రయం. ఎవరి జీవితాన్నైనా చాలా గాఢంగా ప్రభావితం చేసేది అతని మనస్తత్వమేనని నా నమ్మకం. బాహ్య పరిస్థితుల ప్రభావం కొంత ఉన్నా, అంతరంగ పరిస్థితులే వ్యక్తి జీవితాన్ని నిర్ధారిస్తాయని ప్రస్తుతం నేనను కుంటున్నాను. నా ముఖ్య రచనలన్నింటిలోను పాత్రల మనస్తత్వాలను చిత్రించటానికే ప్రయత్నం చేశాను.

'అంపశయ్య' నవలకు 1962-64 సంవత్సరాల మధ్యలో నేను ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఏ. చదువుతున్న రోజుల్లోనే అంకురార్పణ జరిగింది. 1965లో రాయడం మొదలెట్టి 1968లో పూర్తిచేశాను. ఈ నవలను రాయడం ఒక ఎత్తయితే, పుస్తకంగా ప్రచురించి పాఠకుల ముందు పెట్టటం మరోఎత్తు. 1969 నవంబర్‌లో 'అంపశయ్య'ను ప్రచురించి పాఠకుల ముందు పెట్ట గల్గాను. ఇలా అంపశయ్యను రాయడం, ప్రచురించడం రచయితగా నా జీవితంలో ఒక గొప్ప సాహసం.

'అంపశయ్య' వెలువడిన వెంటనే ఆ రచనకు పాఠ కుల నుండి చాలా గొప్ప ప్రతిస్పందన వచ్చింది. అయితే కొన్ని ప్రతికూలమైన విమర్శలు కూడా వచ్చాయి. త్రిపుర నేని మధుసూదన రావు 'ప్రయోగం ఒక పిచ్చి' ఈ నవలా వ్యాసానికి చాలా ఘాటైన విమర్శ రాశాడు. పురాణం సుబ్ర హ్మణ్యశర్మ ఒక సభలో 'తెలుగు ప్రయోగాత్మక నవల' అన్న అంశం మీద మాట్లాడుతూ 'అంపశయ్య' ఒక 'తిలకాష్ఠ మహిష బంధనం' అన్నాడు. ఇటీవలనే 'ఆంధ్ర భూమి'లో హవ్యవాహన పేరుతో ఒక సమీక్షకుడు 'పాఠకుల పాలిట అంపశయ్య' అనే పేరుతో 'అంపశయ్య'లో చాలా అశ్లీలాలున్నాయంటూ ఒక విమర్శ చేశారు. ఇలా కొన్ని ప్రతికూల విమర్శలు వచ్చినా మొత్తంగా 'అంపశయ్య'ను తెలుగు పాఠకులు, విమర్శ కులు ఆదరించారు.

అంపశయ్య, ముళ్ళపొదలు, అంతస్రవంతి - నేను ఈ మూడు నవలల్ని ట్రయాలజీ అంటాను (త్రయ నవలలు) ఈ మూడు నవలల్లోను కథాకాలం మూడు రోజులు మాత్రమే. 'రవి జీవితంలో మూడు రోజులు' అనే పేరుతో ఈ మూడు నవలల్ని కలిపి ఒకే నవలగా ప్రచురించాలని కోరిక.

'అంపశయ్య'లో యూనివర్సిటీలో చదువుకుంటున్న విద్యార్థుల ఒక రోజు జీతాన్ని, 'ముళ్ళపొదలు'లో ఈ విద్యార్థులే డిగ్రీలు పుచ్చుకొని ఉద్యోగాల వేటలో వున్నప్పటికీ వాళ్ళ ఒక రోజు జీవితాన్ని 'అంతస్రవంతి'లో వాళ్ళు ఉద్యోగాల్లో స్థిరపడ్డాక వాళ్ళ ఒకరోజు జీవితాన్ని చిత్రించాను. ఈ మూడు నవలల్లోను నాయకుడు రవి. అంపశయ్యలో విద్యార్థిగానూ, ముళ్ళపొదలులో నిరు ద్యోగిగా అంతస్రవంతిలో ఉద్యోగిగానూ రవి దర్శన మిస్తాడు.

నేను 1978లో రచించిన 'చీకటి రోజులు' నవలలో 1975-77 మధ్యకాలంలో ఈ దేశంలో అప్పటి పాలకులు ఎమర్జెన్సీ పేరుతో సాగించిన దురాగతాల్ని చిత్రించాను. ఎమర్జెన్సీ మీద తెలుగులో వెలువడిన ఏకైక నవల బహుశా ఇదే కావచ్చు. ఉద్యోగాలు చేస్తున్న స్త్రీల సమస్యల్ని చిత్రిస్తూ నేను 'ఉమెన్స్ కాలేజీ' అన్న నవల రాశాను. అలాగే స్త్రీల సమస్యల్ని చిత్రిస్తూనేను 'విచలిత' 'దాగుడు మూతలు' 'సంకెళ్ళు' 'కరుణ' 'మనోరణ్యం' లాంటి నవలలు రాశాను. సాహిత్యం ద్వారా సాధించ దలుచుకున్నది సమాజంలో 'మంచి'ని పెంచటం - నా రచనలన్నీ చదివి కనీసం పదిమంది పాఠకులైనా శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకొని, తమ లోని చెడును తొలగించుకుని, మంచినిపెంచుకుని ఈ ప్రపంచమంతా ఒకటే, మానవులందరూ ఒకటే అన్న విశాల దృక్పథాన్ని

అలవరచుకుంటే నా రచనలు సార్థకమయ్యాయనే నేను భావిస్తాను. నా రచనల ద్వారా ప్రధానంగా నేను చెప్పదల్చుకున్నది. మనిషికి శత్రువు బయట ఎక్కడో లేడు. తనలోనే ఉన్నాడని. తనతో తను పోరాడటం నేర్చుకుంటే మనిషి తనలోని శత్రువును జయించగలడు, ఇలా మనిషి మొదలు తనలోని శత్రువును జయించగల్గితే బయటి శత్రువును కూడా జయించగల్గుతాడు.

పాత్రోచితమైన మాండలికాల్ని వాడటం మంచిదే. అంటే నవలలో గాని, కథలో గాని సంభాషణల్లో మాండలికాల్ని వాడొచ్చు. కాని మొత్తం నవలంతా మాండలికంలోనే రాస్తానంటే మాత్రం నేనంగీకరించలేను. ఉదాహరణకు అల్లం రాజయ్య 'కొలిమంటుకున్నది' నవలుంది. నవల మొత్తం కరీంనగర్/ఆదిలాబాద్ జిల్లాల్లో మాట్లాడే మాండలికంలో నడిచింది. అందువల్ల చాలామంది పాఠకులు ఈ నవలను చదవలేకపోయారు. కాబట్టి ఎక్కడో మారుమూల ప్రాంతంలో మాట్టాడుకునే మాండలికాన్ని వాడి పాఠకుల్ని ఇబ్బంది పెట్టకూడదు. వాస్తవికత కోసం సంభాషణల్లో మాండలికం వాడొచ్చు. మాండలికాల్ని సంభాషణల వరకే పరిమితం చేస్తే మంచిది.

'చీకటి రోజులు' నవలలో నేను మాండలికాల్ని చాలా పరిమితంగా వాడుకున్నాను. నేను ప్రస్తుతం రాస్తున్న యాభై సంవత్సరాల తెలంగాణ జనజీవిత చరిత్రను చిత్రించే నవలలో కూడా మాండలికాల్ని సంభాషణల్లోనే వాడుతున్నాను. మనోవిశ్లేషణాత్మకంగా సాగే ఏ రచన మీదనైనా నా రచనల ప్రభావం కొద్దోగొప్పో ఉంటుంది. అంపశయ్య వెలువడ్డాక ఆ ధోరణిలో రాయాలని కొందరు రచయితలు ప్రయత్నించారు. ఉదాహరణకు 'అంతరంగ తరంగాలు' 'అనుక్షణికం' 'సిటీ బ్యూటీపుల్' లాంటి కొన్ని నవలల మీద అంపశయ్య ప్రభావం ఉందని విమర్శకులు అన్నారు. ఇటీవలనే వచ్చిన 'జీవన్మృతుడు' (అడేపు లక్ష్మీపతి) అనే పెద్దకథ చైతన్య స్రవంతి శిల్పంలో నడిచింది.

ఇంతవరకు నేను రాసిన నవలల్లో నేను దర్శించిన జీవితంలోని ఏవో కొన్ని పార్శ్వాలను మాత్రమే చిత్రించాను. నవలా రచయితగా నాకైనేను నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ఇంకా సాధించలేదు. అందువల్ల వివిధ వర్గాలకు చెందిన వివిధ సమస్యల్ని స్పృశిస్తూ, ఒక చారిత్రక దృక్పథంలో పందొమ్మిది వందల నలభైల నుండి ఇప్పటి వరకు - దాదాపు యాభై ఏళ్ళ చరిత్రను, నాకు బాగా తెలిసిన తెలంగాణా జన జీవితాన్ని చిత్రించే ఒక పెద్ద నవలను రాసే ప్రయత్నంలో ఉన్నాను ఈ నవల నేను నవలలు రాయడం మొదలెట్టినప్పటి నుంచి నా బుర్రలో ఎప్పటికప్పుడు ఒక స్పష్టమైన రూపాన్ని సంతరించుకుని బయటపడాలని ప్రయత్నిస్తోంది. ఈ నవలను కాగితం మీదకు ఎక్కించి, ప్రచురించి, పాఠకుల ముందు ఉంచడమే రచయితగా నా ప్రస్తుతం లక్ష్యం.

నవీన్ ఈనాటి ఆధునిక తెలుగు కథకుల్లో, నవలాకారుల్లో లబ్ధప్రతిష్ఠుడు. నవీన్ కథకుడిగా నవలాకారుడిగా, విమర్శకుడిగా, ఫీచర్ రచయితగా, చిత్రాల విశ్లేషకుడిగా మంచి గుర్తింపున్నా అతణ్ని తెలుగు సాహిత్యంలో అతనంత ఎత్తునకు నిలబెట్టేది కథకుడిగానే అని చెప్పొచ్చు. ఎందుకంటే పై అన్ని సాహిత్య ప్రక్రియల్లో అతని కథనశిల్పం అంతరాంతరాల్లో కన్పడుతుంది. మనకు తెలిసిన మానవీయాంశాలనే తీసుకొని అతడు అత్యద్భుతంగా, అలవోకగా, నాటకీయశైలితో కథారచన చేయగలడు. అతడేదైన అంశాన్ని కథగా మార్చాలనుకుంటే దానికి కావలసిన శిల్పపరమైన అంశాలు వాటికవే ఆయా సందర్భాలలో సహజంగా, అయాచితంగా ప్రవేశిస్తాయి. అంతటి అందెవేసిన చేయి అతనిది కథన సాహితీ ప్రపంచంలో. రచన చేయాలనేది అతని రక్తంలో ఉన్న సహజమైన Instinct. గాలి పీల్చడం ఎంత అవసరమని భావిస్తాడో రచన చేయడం అనేది కూడా తన సహజాతం అనిభావిస్తాడు. అతనిలోని కథకుడు ఎలా వామనరూపం నుండి విశ్వరూపానికి ఎదిగాడో అతని షష్ఠిపూర్తి సందర్భంగా దిఙ్మాత్రంగానైన అవలోకించడం సబబు.

నవీన్ నాలుగు దశాబ్దాల సాహితీవ్యాసంగాన్ని మూడు భాగాల్లో విశ్లేషించుకోవచ్చు. ఒకటి అతని విద్యార్థి దశ. (యం.ఏ.1964 వరకు) రెండోది ఉద్యోగ దశ (1996 వరకు), మూడోది ఉద్యోగ విరమణాంతర దశ (ఇప్పటి వరకు). అతని కథ హైస్కూల్ దశలో అంకురించినా అది అతని కళాశాల స్థాయిలో (బి.ఏ.వరకు) చిగురించి, చదివేకాలంలో పుష్పించి గుబాళించింది. ఈ దశలో నవీన్ తెలుగులోని సృజనాత్మక సాహిత్యాన్నే గాకుండా ఇంగ్లీషు లోని సాహిత్యాన్ని, నవలా సాహిత్యాన్ని బాగా చదివాడు, మామ్ కథలు, డికెన్స్ నవలలు, మొదలైనవి. వీటితో పాటు శరత్ నవలలు, చలం, బుచ్చిబాబు సాహిత్యాన్ని బాగా చదివాడు. నవీన్ అందరిలా చదవకుండా ఆయా రచయితలు కథను మలిచిన తీరు, అందులోని శిల్పాన్ని గ్రహించేవాడు. ఈ నేపథ్యంలో తాను చూసిన సామాజి కాంశాలు కథలో ఒదిగింపచేసి కథన శిల్పాన్ని చేచిక్కించు కున్నాడు. ఈ కాలంలో రాసిన కథలకు పరాకాష్ఠ అంపశయ్య. ఇది తన విద్యార్థి చరమదశలో రాసిన నవల.

నవీన్ కళాశాల జీవితం కాల్పనికదశే అయినప్పటికీ, తన సమకాలీన విద్యార్థి రచయితలు కాల్పనిక కవిత్వంలో కొట్టుకొని పోతున్నా తాను మాత్రం సమాజంలోని ముఖ్యంగా విద్యార్థిలోకం యొక్క యథార్థ జీవన దృశ్యాలను కథలో చిత్రించాడు. నవీన్ తెలుగు సాహిత్యంలోని భావ కవిత్వపు సొరభాలను ఆఘ్రాణిం చినా, తాను తన కథాసాహిత్యంలో మాత్రం యథార్థ వ్యధాభరిత జీవన దృశ్యాలనే అక్షరబద్ధం చేసాడు.

అందుకే విదార్థి దశలో కాల్పనిక సినిమా (సాహిత్య) పాటలన్నా, ముఖ్యంగా ఎంకి పాటలంటే చెవి కోసుకునే వాడు. ఆ పాటలను తన మూగ గొంతులో సాగదీస్తూ మంచిగా పాడే మిత్రులచే పాడించుకొని ఆనందించే వాడు. అయితే తన రచనా శిల్పంలో సాహిత్య ప్రయోజ నాన్ని భావ కవిత్వపు స్పృహకు అర్పించకుండా సామాజిక దృష్టికే అర్పించాడు. అయితే తన భావకవిత్వ మార్దవ త్వాన్ని ప్రకృతి సౌందర్య వర్ణనలో, స్త్రీలోని మార్దవత్వాన్ని చెప్పడంలో చూపెట్టాడు.

విశ్వవిద్యాలయ విద్యార్థుల సమస్యలను, వారి మనస్సుల్లో చెలరేగే వైయక్తిక, విద్య సామాజిక సంఘర్షణ లను, వాటిని ప్రభావితం చేసే సామాజికాంశాల ధన, రుణాంశాలను నవీన్ అంపశయ్యలో బాగా చూపెట్టాడు. విద్యార్థుల మనస్సులో చెలరేగే భావాల వేగాన్ని మించిన వ్యక్తీకరణ శైలిని అందులో చూపాడు. అదే చైతన్య స్రవంతి కథాశిల్పమైంది. భావాలతో సమానంగా భాషను నడిపించటం సామాన్యమైన విషయం గాదు, అందుకే అది విద్యార్థి లోకపు మహాప్రస్థానం అయ్యింది. అందుకే ఇది నవీన్ పేరులో సహజంగా ఇమిడిపోయింది. ఆ రచనకదే సాటి. దానికన్న ముందట అలాంటి (విద్యార్థు లకు సంబంధించి) రచనరాలేదు. దాని తర్వాత కూడా అలాంటిది మరొకటి రాలేదు. నవీన్ కూడా తర్వాత అలాంటి రచన చెయ్యలేదు. చెయ్యడం గొప్ప కథకుని లక్షణం కూడా కాదు. అది అతని ఉన్నత మానసిక సమాధ్యవస్థ నుండి జాలువారిన రచన, విద్యార్థి లోకానికి అంకితమైన రచన.

నవీన్ రెండోదశ ఉద్యోగదశ, (1965-1996). ఈ కాలంలో పెరిగిన సామాజిక అవగాహనతో వివిధ కళాశాలల్లో ఉపన్యాసకుడిగా పనిచేసిన కాలాల్లో విద్యార్థుల, ఉపాధ్యాయుల, సామాజికులకు సంబం ధించిన అంశాలపై కథలను, నవలలను రాసాడు. ఈ కాలంలో ముఖ్యంగా ఎమర్జెన్సీ కాలంలో సాగిన నిర్బంద కాండలో పోలీసు వ్యవస్థ సామాన్యులను ఎలా బాధలకు గురిచేస్తుందో 'చీకటి రోజులు' అనే నవలలో చూపాడు. ఈ నవలను పోలీసులు కూడా చదివారని వినికిడి.

మూడోది ఉద్యోగ విరమణాంతర దశ. నవీన్ నిత్య నూతన రచనాశీలి. చూడడం, చదవడం, రాయడం అయన త్రిసంధ్యలు. ప్రసిద్ధ రచయితలైన వారందరి రచనలో ఒకటే Master Piece (గొప్ప కళాఖండం)గా వాసికెక్కుతుంది. శరత్ 'శ్రీకాంత్' లాగా, విశ్వనాధ 'వేయి పడగల్లాగా'. మనకేమనిపిస్తుంటే ఈ రచన చేయడా నికి మిగతా రచనలు Homeworkగా చేశాడనిపిస్తుంది. అలాంటిది నవీన్ రచన 'కాలరేఖలు'. ఇది చాలా పెద్ద

రచన. ఇందులో నవీన్ తన అనుభవసారాన్నంతా చూపాడు. తన రచనా శిల్పాన్ని చూపాడు. సాహిత్య లక్ష్యాన్ని ధ్వనింపచేసాడు.

తెలంగాణాలో నిజాంపాలన వల్ల అరాచకాలు, రజాకార్ల దౌర్జన్యాలకు వలసలు పోయిన కుటుంబ గాధలు, అనాటి విద్యాబోధన, సమిష్టి వ్యవసాయ కుటుంబాల ఆవేదనలు, కుటుంబ కలహాలు, కుటుంబాల్లోని తోడికోడళ్ళ ఈర్ష్యాద్వేషాలు, సమిష్టి కుటుంబాల విచ్ఛిన్నత, కమ్యూనిస్టుపార్టి రజాకార్ల దౌర్జన్యాల నెదుర్కోవడం, ఇలా ఎన్నో ఈ నవలలో కనబడతాయి.

మానవీయ విలువలను ఆకాంక్షలను తెల్పడానికి నవీన్ సామాజిక ఉద్యమాన్ని చక్కగా ఉపయోగించుకొని ఒక గొప్ప కళాకారుడు చూపెట్టిన రచనాశిల్పం యిందులో చూపాడు. ఇది ఎంతగొప్ప రచనంటే, ఈ రచన తర్వాత ఇలాంటి రచన రచయిత మళ్ళీ చేయలేడేమోన్నంత గొప్పరచన. తెలంగాణ ఉద్యమాన్నే చెబితే నవీన్ తెలంగాణ 'పోరుబిడ్డ'గా మిగిలిపోయేవాడు, మానవీయాంశాలను ఈ నవలలో ప్రధానం చేసి చెప్పాడు కాబట్టి తెలంగాణ 'ఊరుబిడ్డ'గా మిగిలిపోయాడు. అయితే ఈ రచన తెలంగాణకే పరిమితం కాదు. ఇందులో సంభాషణలకు తెలంగాణ మాండలికాన్ని మాత్రమే వాడి మిగతా రచనకి వ్యవహారిక భాషను వాడాడు. అయితే ఈ నవల తెలంగాణ పునాది నుండి లేచినా అది తెలంగాణకే పరిమితం గాకుండా మానవీయాంశాలతో (అనువదిస్తే) విశ్వసాహితీ వివంచికి మూర్ఛనలు సమకూరుస్తుందనడంలో ఎలాంటి సందేహం ఉండదు. అంతే గాకుండా తెలుగు వాణికి తెలంగాణ బాణిని విన్పించిన నవలాకారుడు నవీన్.

తెలంగాణలో జన్మించి నవలారచన ద్వారా యావదాంధ్ర దేశాన్ని ప్రభావితం చేసిన అతికొద్ది మంది రచయితల్లో నవీన్ ఒకరు. ఆయన రానినన్ని తెలంగాణలో ఇతర ఏ రచయితా రచించలేదు. నవీన్ నవలల్లో గొప్ప వైవిధ్యం ఉంది. ఇది అటు వస్తువులోనూ ఇటు శిల్పంలో కూడా వ్యక్తమవుతూ ఉంటుంది. తాను నమ్మిన నిజాన్ని, తన నిశిత పరిశీలన వల్ల కన్పించిన వాస్తవాన్ని స్వీయ శైలిలో వ్యక్తీకరించడం నవీన్ విశిష్టత. ఆయన తొలి నవల 'అంపశయ్య'. తర్వాత ఆనవల పేరే ఆయన ఇంటి పేరుగా మారింది. నవీన్ నవలల్లో పుష్కలమైన స్థానీయత ఉంది. ఇది భాషలోనూ, భావంలో కూడా వ్యక్తమవుతూ ఉంటుంది. ఆయన రచించిన నవలల్లో తెలంగాణలోని జనజీవన ప్రతిబింబాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో గొలుసుకట్టు రీతిలో సాగిన సంఘటనల్ని, ఒక క్రమ పరిణామ రీతిలో కలిగిన రాజకీయ గతినీ నవీన్ తన నవలల్లో చిత్రించారు. నిజమైన చరిత్రకు కాల్పనిక ప్రత్యామ్నాయంగా వీటిని ఎంపికచేసుకోవచ్చు. వీటిని అధ్యయనం చేయడం ద్వారా తెలంగాణ పరిస్థితుల్ని మదింపు వేయవచ్చు. నవీన్ నవలా ప్రస్థానాన్ని పరిశీలించి, నవలా రచనపై ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాల్ని, ఆయన రచించిన నవలలపై ప్రముఖ సాహితీవేత్తలు వ్యక్తం చేసిన ప్రశంసల్ని అంచనా వేసుకొని ముందుకు సాగవలసి ఉంటుంది. ఈ అంచనాల అనంతరం నవీన్ నవలల్లో చిత్రించబడిన తెలంగాణను సరిగ్గా మదింపు చేయవచ్చు.

సుదీర్ఘ కాలంపాటు సాహితీ యానం చేసిన ఏ రచయిత అయినా పలు ప్రశంసలతో పాటు కొన్ని విమర్శల్ని సైతం ఎదుర్కోవలసి వస్తుంది. అయితే, నవీన్ ఎదుర్కొన్న విమర్శల కంటే అందుకున్న ప్రశంసల ఎక్కువ. నవీన్ 'అంపశయ్య' నవలకు తొలి చైతన్య స్రవంతి రచనగా తగిన స్థానాన్ని ఇవ్వవచ్చునా లేదా అన్నది కొంతమంది విమర్శకుల మీమాంస. ప్రసిద్ధ రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రి రచించిన 'అల్పజీవి' నవల చైతన్య స్రవంతి సంవిధానానికి బాగా దగ్గరగా ఉంటుందని విమర్శకుల అభిప్రాయం. నవీన్ రచించిన 'అంపశయ్య' నవలలో కొన్ని చోట్ల బూతును ప్రయోగించినట్టు విమర్శలున్నాయి. ఈ విమర్శల్లో నిజం ఉంది. అయితే, శిల్ప విషయకమైన అనివార్యతల కారణంగా ఈ పద ప్రయోగాలు జరిగాయని మరికొంతమంది సమర్థిస్తారు.

'నవీన్ అనగానే అంపశయ్య గుర్తొస్తుంది. అంపశయ్య అనగానే మనో వైజ్ఞానిక రచనా రంగంలో ఒక మైలు రాయి కళ్ళ ముందు నిలుస్తుంది' అని ఆచార్య సి.నారాయణ రెడ్డి ప్రశంసించారు. 'నవీన్ రచనల్లో ప్రత్యేకించి పేర్కొనవలసినది ఆయన మొదటి నవల అంపశయ్య అని కాళోజీ నారాయణరావు అభినందించారు. 'రచయిత ఎన్నో రచనలు చేస్తాడు. కాళిదాసు శకుంతల, ఠాగూర్ గీతాంజలి, ప్రేమ్‌చంద్ గోదాన్ ప్రఖ్యాతాలు, అంతే వారి అన్య రచనలు అల్పమూ స్వల్పఉలూ కావు. నవీన్ అంపశయ్యతో ప్రఖ్యాతుడైనా అతని అన్య రచనల విలువ వాటికి ఉంటుంది'. అని దాశరథి రంగాచార్య పేర్కొన్నారు. 'నవీన్ నవలల్ని ఇతర భారతీయ భాషల్లోకి అనువదించి ప్రచురిస్తే మన తెలుగు నవలకు గొప్ప గుర్తింపు వస్తుందన్న ప్రగాఢమైన నమ్మకం నాకుంది' అని వాసిరెడ్డి సీతాదేవి అభిప్రాయబడ్డారు. 'ఆధునిక తెలుగు సాహిత్యంలో ఇటువంటి రచనలు తక్కువగానే చెప్పాలి' అని హిందీ సాహితీవేత్త ఆచార్య జి.సుందరరెడ్డి కితాబిచ్చారు. 'బుచ్చిబాబు గుండెని తాకితే నువ్వు మెదడుని మధించావు' అని 'అంత స్రవంతి' నవల చదివి భరాగో రచయితకు ఉత్తరం రాశారు. 'తెలుగు వారికి తెలంగాణ బాణిని విన్సించిన నవలాకారుడు నవీన్' అని డాక్టర్ వెన్నవరం ఈదారెడ్డి రాశారు.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సమిష్టి కోసం వ్యష్టి బలిదానం
కట్టమంచి వారి 'ముసలమ్మ మరణం'

- నిమ్మలపూడి వీరరెడ్డులు, నల్లజర్ల, పశ్చిమ గోదావరి జిల్లా.

తెలుగు సాహిత్య రంగంలో సరికొత్త భావాలకు నూతన ఆలోచనలకు, మనోవికాసాత్మక విమర్శలకు తెరతీసిన వారు కట్టమంచి. సంభాషణల్లో దెబ్బకు దెబ్బ తీయగల నేర్పు ఆయన సొంతం. వాక్చాతుర్యం ఆయనకు ఒక వరం, హాస్య ప్రియత్వం, చమత్కార సంభాషణం, ఛలోక్తుల చతురత ఆయనకున్న సుగుణాలు. భాషలో శ్లేషను జొప్పించటం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఆంధ్రాంగ్ల భాషలలో మంచి వక్త. ఆత్మ విశ్వాసానికి మారు పేరు కట్టమంచి.

విద్యావేత్తగా, సాహితీ స్రష్టగా, రాజకీయవేత్తగా రాణించిన కట్టమంచి తిరుపతి - చిత్తూరు రహదారిలోని 'కట్టమంచి' గ్రామంలో డిశంబరు 10, 1880న సుబ్రహ్మణ్యం రెడ్డి, నారాయణమ్మ దంపతులకు జన్మించారు. వీధి బడిలో చదివేటప్పుడే ఇతిహాసాలను ఔపోసన పట్టాడు. తన 19వ ఏటనే ముసలమ్మ మరణం అను లఘు కావ్యాన్ని రచించాడు. అది నవ్య రచనల పోటీలో ప్రథమ బహుమతిని అందుకున్నది.

భారత ఆర్థికశాస్త్ర, కవిత్వతత్వ విచారం, వ్యాస మంజరి, పంచమి, వేమన అన్నవి ఈయన తెలుగు రచనలు. Drama in the East and West, Speeches on University Reforms, Democracy in comtemporay India, Education Industry and Commerce వీరి ఆంగ్ల రచనలు.

1906 భారత ప్రభుత్వం అందించిన స్కాలర్‌షిప్‌తో ఆయన కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. డిగ్రీ పూర్తి చేశారు. అక్కడ ఉత్తమ విద్యార్థులకు ఇచ్చే "రైట్ బహుమతిని" పొందారు.

బరోడా సంస్థానాధీసుడు "షయాజీరావ్ గైక్వాడ్" రామలింగారెడ్డిని తన విద్యా సలహాదారుగా నియమించుకున్నాడు. ఆ సమయంలో కట్టమంచి వారు వారి సహాయ సహకారాలతో అమెరికాలోని విశ్వవిద్యాలయాలను దర్శించారు. 1908లో బరోడా విశ్వవిద్యాలయ ఆచార్యులుగా నియమితులయ్యారు. ఆ సమయంలోనే "పల్లె పల్లెకు పాఠశాల" అనే ఉద్యమాన్ని సాగించి ప్రతి ఊరికి ఒక పాఠశాలను కట్టించారు.

1921 తరువాత రాజకీయాలలోకి వచ్చారు. 1922లో మద్రాసు శాసనసభలో అడుగుపెట్టారు. రెండవసారి చిత్తూరు నుండి శాసనసభకు వచ్చారు. అప్పటి జస్టిస్ పార్టీలో కీలకపాత్రను పోషించాడు. యునైటెడ్ నేషనలిస్ట్ పార్టీలో కీలకపాత్ర వహించాడు. 1936 నాటికి రాజకీయాలు వదలి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్స్‌లర్ అయ్యాడు.

పాశ్చాత్య సాహిత్య తత్వాతలను అధ్యయనం చేసి ఆధునికాంధ్ర సాహిత్యాన్ని నవీన మార్గాన నడిపిన వారు కట్టమంచి, కవిత్వపరంగా వీరి రచనలు తక్కువే అయినప్పటికీ మానవతా వాదానికి అవి ప్రతీకలయ్యాయి. ముసలమ్మ మరణం, యామిని పేర్కొనదగిన వీరి రచనలు.

ముసలమ్మ మరణం మానవతా వాదాన్ని పుణికి పుచ్చుకున్న రచన. "సమిష్టి వ్యష్టి బలిదానం జరిగిన కరుణ రసాత్మక వ్యాసమిది". దీనికి మూలం పేరు తెలియని తెలుగు కవి వ్రాయగా బ్రౌన్ దొరచే ముద్రింపబడిన అనంతరం చరిత్ర. దీని నుండి ఈ కథను తీసుకున్నానని సర్ సి.ఆర్. రెడ్డి గారే స్వయంగా తమ గౌతమ వ్యాసాలలో వ్రాసుకొన్నారు. ఈ కథను సూచించే శిలా శాసనం కూడా

అనంతపురం సమీపాన ఉన్న "బుక్కరాయ సముద్రం" అన్న గ్రామంలో ఉన్నది. ఆ ఊరి చెరువు కట్టకు ఇప్పటికీ "ముసలమ్మ కట్ట" అన్న పేరు వాడుకలో ఉంది. బుక్కరాయ సముద్ర చెరువు జోరున కురిసిన వర్షాలకు పొంగి కట్ట తెగిపోయింది. ఆ ఊరి వారంతా గ్రామ దేవత పోలేరమ్మను ప్రార్థించారు. అపుడు ఆకాశవాణి మీ ఊరి లోని 'ముసలమ్మ' అను వనిత ఆత్మ బలిదానం చేస్తే ఆ ప్రమాదం తొలగుతుందని పలికింది. ఊరందరి కోసం ఆమె 'ఆత్మ బలిదానం' చేసింది.

ఈ కావ్య విషయంలో కాల్పనికోద్యమ ప్రభావం ఉంది. అనాదిగా అనువాదాలు అనుసరణలుగా సాగిన తెలుగు సాహిత్యం ఆంగ్ల భాషా సాహచర్యంతో కొత్త పుంతలు తొక్కింది. దేవతల కథలు, రాజుల కథలకు నిలయాలైన తెలుగు రచనలు కాల్పనికోద్యమ పుణ్యమా అని సామాన్యుని ముంగిటకు వచ్చాయి. ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ఉద్యమాల ప్రభావం ప్రపంచం భాషా సాహిత్యాలను కదిలించినట్లే తెలుగు సాహిత్యాన్ని కూడా కొత్త దారులలో నడిపించింది. ఆంగ్ల భాషా సాహచర్యం చేసిన కట్టమంచి "ముసలమ్మ మరణం" వ్రాసి తెలుగు సాహిత్యానికి నూతన సొబగులను అద్దాడు. ఇది ప్రథమ నవ్య కావ్యం కాకపోయినా నవ్యత్వాన్ని సంతరించుకున్న కావ్యమిది. దీనిలో నవ్యత్వానికి, వస్తు నవ్యత, విషాదాంత ముగింపులు ప్రతీకరణలౌతాయి.

భారతీయ కవితా సంప్రదాయంలో విషాదాంత కావ్యాలకు స్థానం లేదు. "మంగళాదీని, మంగళమధ్యాని, మంగళాంతాని కావ్యానిచ" అన్నది భారతీయ కవితా సంప్రదాయం. 'ముసలమ్మ మరణం', ఆమె మరణంతో కావ్యం ముగిసింది. ఇది నవ్యత్వానికి నాందీ వాక్యం. ఈ కావ్యంలో కావ్య నాయిక 'ముసలమ్మ'. లోక కల్యాణం కోసం ఆమె ఆత్మ బలిదానం చేసింది. గ్రామ్యానంతటిని రక్షించింది.

రచనలో కట్టమంచి వారు సనాతన సంప్రదాయాన్నే అనుసరించారు. ప్రబంధ రచనలో పోకళ్ళు ఇందులో అడుగడుగునా కన్పిస్తాయి. వీరి రచనలోని వర్ణనలు అందుకు ప్రబల ఉదాహరణ. 'ముసలమ్మ' సహజ సౌందర్యాన్ని వర్ణిస్తూ...

లలనా శిరోలలా మం
బలరుచు ఁబసవపునను జలకమాడి తలిర్చెన్
దల మీద చెట్లు కురిసిన
లలిత సుమ పరాగమున వెలయు లతిక యనన్

ఈ పద్యంలో కట్టమంచి వారు చక్కని వర్ణనతో ఉపమాలాంకర ప్రయోగం చేశాడు. కావ్య నాయిక జలకములాడుతున్నపుడు ఆమె శరీరం పై నుండి పడుతున్న జల బిందువులు చెట్ల పై నుండి కురిసిన లలిత సుమాలతో పోల్చాడు.

గ్రామ వర్ణన చేసినపుడు అక్కడి చెరువును ప్రబంధ రీతిలో వర్ణించారు.

చలదుత్తుంగ మహోగ్ర భంగ పటలీ సంఘట్టనారవము
జ్జ్వల కూలాగ్ర నటత్తరంగ మంచన్వధ్య బాగ్భూమి భృ
త్కుల సంపాతి మహోర్మికా నికర నిర్ష్ఫేషంబునుం
గూడగా
నలరున్ ఘోర సరస్సు దిగ్వదళన వ్యాపార పారీణమై

ఇది గ్రామంలో సరస్సు ఆత్మార్పణమునకు ముందు భర్త అత్తమామలు అనుమతి తీసుకునే విషయంలో మానవతావాదం, త్యాగబుద్ధి, పెద్దల ఎడల గౌరవం కన్పిస్తుంది. భర్తను అనునయిస్తూ..

"హేయంబైన యిహంబు వాసనలకు వొగి
జనులకు మేలొనరింపని తనువేలో!
తమకు తమ భార్య యిటు చేసే దగునని యెల్ల
వారను వర్ణింప నింపుకదో"

అని ముసలమ్మ అనటంలో మానవతావాదం కన్పిస్తుంది.

ఇక అత్తమామలకు నచ్చచెప్పటంలో చతురతని చూద్దాం.

"కొడుకు లెల్లరు రాములు - పుడమి తనయలెల్ల కోడండ్రు దక్కువయేమి మీకు" అని అనటంలోని

సామాజికత ఎంత గొప్పదో మనం ఊహించవచ్చు. అలాగే బిడ్డలను ఓదార్చిన విధానం మిక్కిలి కరుణరస భరితం.

"అన్న పోరా! నీకు అమ్మ ఎక్కడిదింక
తండ్రి గారి కూడి తనరుమయ్యా!"

అనటంలో ఆమె ఆవేదనా భరితమైన హృదయ వేదన మనకు కన్పిస్తుంది. ఇక్కడ ముసలమ్మ ఒక కరుణరస మూర్తిగా కన్పిస్తుంది. ఐహిక బంధాలను తెంచుకున్న ఆదర్శమూర్తిగా మనకు కన్పిస్తుంది.

ఆత్మార్పణం చేసిన ముసలమ్మను వర్ణించటానికి కవి ఇక్కడ ప్రకృతిని తోడుగా తీసుకున్నాడు. అపుడు ముసలమ్మ

"కన్నెర్ర వారిన ఖర కరోదయ కాల
మల్లన మ్రింగు జాబిల్లి యనగా
జ్వలదగ్ని శిఖలపై నెలనవ్వుతో బోవు
ధాత్రీ మహాదేవి తనయయనగ
కెందామరల బారు సుందరమగు లీల
నల్ల నల్లన జొచ్చు అంచయనగ"
అన్నట్లు కన్పించిందట.

ఇక్కడ సూర్య విస్ఫారితానంద ముఖం రక్తమయం కావటం, పశ్చిమాంబుధిలో మునగడం, పక్షుల్లా మొర పెట్టుకోవటం వంటి వర్ణనలు ప్రాచీన కావ్యాలలో అంతటా కన్పిస్తాయి. ప్రాచీన కావ్యాలలో నాయికలు శృంగార నాయికలుగా ఉంటారు. ఈ కావ్యంలోని నాయిక అలాకాక త్యాగశీలిగా ఉన్నది. ఆమెను గూర్చి ప్రజలు తమ అభిమానాన్ని ప్రకటించుకొంటూ..

"వేగమై నాకుచు లీనమై మెడమలం
చిన గోవు బిండెడు వనరుహాక్షి" అని వర్ణించాడు.

ముసలమ్మ ఇక్కడ అచ్చమైన కాపు వనితగ కన్పిస్తుంది. కాని తరువాత పాదాలను గమనిస్తే ఆమె ఒక ప్రబంధ నాయికగా గోచరిస్తుంది.

"బొండు మల్లెల తోట పువ్వులు గోయుచు
వనలక్ష్మి యన నొప్పు వనజగంధి"

అన్న వర్ణన వలన కట్టమంచి వారు ఈ రచనలో కవితా సంద్రపాయాలు, వర్ణనా విధానాలు, కవి సమయాలు మార్చటానికి చేసిన ప్రయత్నాలు మనకు కన్పిస్తాయి. ముసలమ్మ మరణం కావ్య ప్రబంధ మార్గంలో నడచిన కావ్యం. వర్ణనలు ప్రధానం కాని కథా ప్రధానమైన కావ్యం. ఛందస్సులోను, రచనా సంవిధానంలోను, భావంలోను ఇది ప్రాచీన కావ్యాలను తలపిస్తుంది.

ప్రాచీన కవిత్వానికి, నవ్య కవిత్వానికి సారధిగా, మధ్యవర్తిగా నిలిచినవాడు కావున రెండు రచనల ప్రభావం ఇందులో మనకు కన్పిస్తుంది. సాధారణంగా కావ్యనాయికలు దివ్యనాయికలై ఉంటారు. దేవతా మూర్తులో, రాజకుమార్తెలో ఉంటారు. ఈ కావ్యంలోని నాయిక ఒక సామాన్యమైన రైతు కుటుంబానికి చెందింది. కావున ఈ కావ్య రచనలో కాల్పనిక కవితా ధోరణులు కన్పిస్తాయి. తరువాతి తరం కవులకు ఈ ముసలమ్మ మరణం ఒక వేగుచుక్క అయిందనటంలో సందేహింప పనిలేదు. దువ్వూరి వారి "నలజారమ్మ", ముదివర్తి కొండ మాచార్యులు వారి "నారాయణమ్మ" ఈ కోవలో తరువాత వచ్చిన రచనలు.

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

- డా॥. వి.చంద్రశేఖరరావు కథలు - బహుజన జీవితం

- కట్వా సుభ్బారెడ్డి, తెలుగు అధ్యాపకులు, యస్.వి.ఏ. ప్రభుత్వ కళాశాల, శ్రీకాళహస్తి.

డా॥ వి.చంద్రశేఖర రావు ఆధునిక తెలుగు సాహిత్యంలో నూతన ఒరవడిలో కథలు రాసినటువంటి రచయిత. అతి తక్కువ కాలంలో నాలుగు కథా సంపుటాలు, మూడు నవలల్ని వెలువరించి తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నాడు. తను రచించిన కథల్ని గురించి చెప్తూ "నా కథలు నా లోపలి నిశ్శబ్దాలు, సంచలనాలు, నిలువనీయని ఉద్వేగాలు, అవన్నీ వందలాది పదాలుగా, వాక్యాలుగా ఒకానొక కథాభాషగా, నేరేటివ్‌గా మారి, నేను నడచి వచ్చిన కాలాన్ని, దాని నడకల్ని, మనుషుల్ని, మనుషుల కలల్ని, గాధల్ని, వాళ్ళ గాయాల్ని రికార్డు చేసాయి" అంటాడు.

బహుజనులంటే విస్తృతమైన అర్థంలో వెనుకబడిన తరగతులు, దళితులు, గిరిజనులు, స్త్రీలు మరియు ఇతర మైనారిటీ వర్గాల వారుగా చెప్పుకోవచ్చు. దళితులు, గిరిజనులు, ముస్లిం మైనారిటీలు, స్త్రీలకు సంబంధించి ప్రత్యేకమైన సాహిత్యమున్నా, దోపిడీ, అణిచివేత, వివక్ష విషయంలో వీరంతా ఒక్కటే. బుద్ధిజం, మార్క్సిజం, అంబేద్కరిజం వంటి సిద్ధాంతాలు, పూలే, నారాయణగురు, రామస్వామి నాయకర్ వంటి వారి ఆలోచనలు పునాదిగా సాగే వాదం బహుజన వాదంగా చెప్పుకోవచ్చు. డా॥వి.చంద్రశేఖర రావు తన కథల్లో ఎక్కువగా దళితులు, ముస్లిం మైనారిటీలు, స్త్రీల సమస్యల్ని ఎక్కువగా చిత్రించారని చెప్పుకోవచ్చు.

డాక్టరుగా వృత్తి జీవితాన్ని ప్రారంభించిన డా॥వి.చంద్ర శేఖరరావు 'నైట్ డ్యూటీ' కథలో బడుగులు ప్రభుత్వ ఆసుపత్రులలో సరైన వైద్యం పొందలేని దయనీయ స్థితిని గురించి వివరించారు. ఈ కథలో దవాఖానాకి కొత్తగా వచ్చిన డాక్టరు అక్కడి వాస్తవ పరిస్థితుల్ని గమనించిన తరువాత హౌస్‌సర్జన్‌లో ప్రొఫెసరు చెప్పిన "తెరచిన గుడిలాంటిది హాస్పిటల్, బిహేవ్‌లైక్ డివోటెడ్ ప్రీస్ట్" అన్న మాటలు గుర్తుకొచ్చి తనలో తాను నవ్వుకుంటాడు. ప్రభుత్వమిచ్చే ఆర్థిక సాయంతో బిడ్డల ఆకలి తీరుతుందనే ఆశతో ట్యూబెక్టమీ చేయించుకున్న ఓ వితంతువు దయనీయమైన స్థితి, లంచం ఇవ్వందే మందులివ్వని నర్సులు, రేటు కుదరక పోతే టెస్టుల పేరుతో డాక్టర్లు కాలయాపన చేయడం వంటి సంఘటనలు కొత్తగా వచ్చిన డాక్టర్‌ని కదిలిస్తాయి. పాఠకుల్ని ఆలోచింపజేస్తాయి.

'మోహనా! మోహనా' అన్న కథలో మోహనరావు దళితనాయకుడు. తొంభైవ దశకంలో ఆంధ్రదేశంలో సంభవించిన కారంచేడు, నీరుకొండ, పాదిరి కుప్పం సంఘటనల నేపథ్యంలో పుట్టుకొచ్చిన దళిత ఉద్యమాల్ని శాసించే స్థాయికి చేరుకుంటాడు. కానీ వాస్తవానికి మోహనరావు కుహనా దళిత నాయకుడు. పదివేల రూపాయలు కాజేసాడనే నెపంతో తన అనుచరుడైన కోటేశును తీవ్రంగా కొట్టడం, అలాగే ఉద్యమంలోకొచ్చిన స్త్రీలను అనుభవించడం వంటి సంఘటనలతో మోహనరావు వ్యక్తిత్వం మసకబారుతుంది. మోహనరావుని దగ్గరగా గమనించి నటువంటి 'దాను' తమ నాయకుడు గోముఖ వ్యాఘ్రమని తెలుసుకుంటాడు. చివరకు ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్ళకు లొంగి ఉద్యమాన్నే పణంగా పెడతాడు. దీంతో ఉద్యమ నాయకుడిగా మోహనరావు పూర్తిగా పతనమౌతాడు. ఈ విధంగా ఉద్యమంపట్ల నిబద్ధత లేని నాయకులు పతనమౌతారన్న సందేశాన్ని రచయిత పాఠకులకందిస్తాడు. ఇదే కథలో ప్రకాశం అన్న దళిత మేధావి "ఈ భూగోళంలో మనిషి మనిషిగా బతకలేని దేశం ఉందంటే అది భారతదేశమే. స్వాతంత్ర్యం వచ్చిన నలభై ఏడు యేళ్ళ తరువాత కూడా ఈ దేశంలో దళితుడు అంటే, పనిచేసే పనిముట్టుగానూ, అవమానాలతో, ఆకలి, రోగాలతో బాధపడే రెండో తరగతి పౌరుడిగా

పరిగణింపబడుతున్నాడు. పాలం పండాలంటే దళితుడు కావాలి. ఫాక్టరీ నడపాలంటే దళితుడు కావాలి. ఎలక్షన్‌లో గెలవాలంటే దళితుడే కావాలి! కట్టు బానిసలా అతను అందరికీ సేవలు చెయ్యాలి. అతనికి మాత్రం బతుకంటే దినదిన నరకం" అన్న మాటలు కూడా పాఠకుల్ని ఆలో చింపజేస్తాయి. 'కేక' అనే కథలో సుందరం ఒక గుమాస్తా. నిజాయితీపరుడు. కానీ తన నిజాయితీ కారణంగా అనేక అవమానాలను ఎదుర్కొంటాడు. ప్రవృత్తిరీత్యా మంచి నటుడైన సుందరం "నేనే సి.యమ్"ని అన్న నాటకం రిహార్సల్ సందర్భంలో నేనే సి.యం.ని అని భీకరంగా కేకవేయాలి. మిగతా డైలాగుల్ని చెప్పగలిగిన సుందరం ఆ ఒక్కమాటకొచ్చేసరికి చెప్పలేని మానసిక సంక్షోభంలో చిక్కుకుంటాడు. ఈ సంఘటన ద్వారా దళితులకు నిజమైన అధికారం రాలేదనే నగ్న సత్యాన్ని తెలియజేస్తాడు రచయిత. 'నలుపు' కథలో లక్ష్మి దళిత బాలిక. "పిల్లచాకు! పాదరసం లాంటి బుర్ర! ఒక్కసారి చెబితే చాలు ఇట్టే గ్రహిస్తుంది. 'వాళ్ళలో' ఆపాటి చదివే వాళ్ళేరీ! అన్న అయ్యవారి మాటల్తో పుడుతూనే వివక్షతను వెంట తెచ్చుకున్నామన్న అంతరార్థాన్ని గ్రహిస్తుంది లక్ష్మి. కాలేజి చదువు కోసం సంక్షేమ హాస్టల్‌లో చేరిన లక్ష్మిపై అక్కడి ఇంగ్లీషు మాస్టారు రమేష్ కన్నుపడుతుంది. కంచే చేను మేసినట్లుగా లక్ష్మిని రమేష్ బలాత్కారం చేస్తాడు. జరిగిన విషయాన్ని వార్డెన్ మేడమ్‌కి చెబితే "నడిచిపోతుంటే పై నుంచి కాకి రెట్ట వేసింది. కడుక్కుంటాం" ఇదీ అంతే నంటూ సర్దుకుపొమ్మంటుంది. జరిగిన సంఘటన గురించి జీర్ణించుకోలేని లక్ష్మి చివరికి ఆ దుర్మార్గుడిపై యాసిడ్ బాటిల్ విసిరి ప్రతీకారం తీర్చుకుంటుంది. ఈ కథలో సంక్షేమ హాస్టళ్ళలో అత్యాచారాలకు గురౌతున్న అనేకమంది దళిత బాలికలకు ప్రతీకగా లక్ష్మిని చెప్పుకోవచ్చు.

'హైకూ' అన్న కథలో కాలేజీలలో యూనివర్సిటీలలో మస్లింలు ఎదుర్కొనే సమస్యల్ని ఎత్తి చూపింది. ముస్తాఫా! ముస్తాఫా!! అంటూ సినిమా పాటలు పెట్టుకొని ఎంజాయ్ చేస్తున్న హిందూమతోన్మాదులకు అబ్దుల్లా అనే కుర్రవాడికి తగాదా అవుతుంది. ఈ సంఘటన మతం రంగు పులుముకుంటుంది. చిన్న చిన్న విషయాలకే ఘర్షణ పడటాన్ని హరి అనే హిస్టరీ లెక్చరర్ నిరసిస్తాడు. ఉన్నత విద్యాలయాల్లో మతసామరస్యం ఆవశ్యకతను తెలియజేస్తాడు. అలాగే "రెండు ఎర్రని గాలిపటాలు" అన్న కథలో గుజరాత్ అల్లర్ల నేపథ్యంలో తల్లిదండ్రుల్ని కోల్పోయిన పిల్లలు ఎంత అభద్రతా భావానికి గురౌతారో తెలుసుకుంటాం. ఇందులో 'ఫాతిమా' అనే బిచ్చగత్తె మతకలహాలలో అనాథలయిన పిల్లల్ని చేరదీస్తుంది. తాను పస్తులుండి ఆ పిల్లలకు అన్నం పెడుతుంది. కానీ ఆ పిల్లల్లో హామీద్, రషీద్ మానసికంగా కుంగిపోయి విచిత్రంగా ప్రవర్తిస్తారు. దీనికి ప్రధాన కారణం ఆ పసి మనసుల్లో గూడుకట్టుకున్న విషాదమేనని చెప్పుకోవచ్చు. చివరికి ఫాతిమా కూడా అదృశ్యమైపోతుంది. తాను తినక శుష్కించిపోవడం వల్ల అని అందరూ అనుకుంటారు. కానీ ఫాతిమా అదృశ్యం వెనుక హిందూమతోన్మాదుల ప్రమేయం ఉందని రచయిత స్పష్టం చేస్తాడు.

"జీవని" కథానికలో లలిత స్వతంత్ర్యమైన వ్యక్తిత్వం కలిగినటువంటిది. ఇందులో లలిత మానసిక వైకల్యం కలిగిన కలిగిన 'జీవని'కి జన్మనిస్తుంది. దీంతో భర్త, స్నేహితులు జీవనిని ఏదైనా మానసిక వికలాంగుల కేంద్రానికి పంపి నెలకు ఇంతని పంపిస్తే వాళ్ళే అంతా చూసుకుంటారు అని సలహా ఇస్తారు. అందుకు లలిత ససేమిరా అంటుంది. జీవని మానసిక వైకల్యాన్ని ఒక సవాలుగా తీసుకుంటుంది. పాఠశాలకు పంపిస్తుంది. టీచర్లను అభ్యర్థిస్తుంది. తోటి పిల్లలతో ఆడుకోమని ప్రోత్సహిస్తుంది. పాపే తన సర్వస్వంగా భావిస్తుంది. జీవనికి ఆకాశమన్నా, నీలిమబ్బులన్నా, ఎగిరే పక్షులన్నా ఎంతో ఇష్టం. వాటినే పాఠశాలలో బొమ్మలుగా గీస్తుంది. ఇది గమనించిన ఉపాధ్యాయులు జీవనిని చిత్రకళ వైపు ప్రోత్సహిస్తారు. తను వేసిన 'అమ్మ' అనే పెయింటింగ్‌కు సోవియట్ లాండ్స్ చిల్డ్రన్స్ పెయింట్ అవార్డు వస్తుంది. జీవని ఒక్కసారిగా వార్తల్లోకెక్కుతుంది. ఒకప్పుడు తన

కూతురిగా నలుగురికి పరిచయం చేయడానికి ఇష్టపడని జీవని తండ్రి ఇప్పుడు 'షీ ఈజ్ మై ప్రౌడ్ చైల్డ్' అంటూ పరిచయం చేస్తాడు. ఎవరెన్ని సూటిపోటి మాటలన్నా జీవని మానసిక వైకల్యాన్ని ఒక సవాలుగా స్వీకరించి విజయం సాధించిన లలిత బలమైన వ్యక్తిత్వమున్న స్త్రీమూర్తిగా మనం ఈ కథలో గమనించవచ్చు. అలాగే 'బహుమతి' కథలో 'మాలతి' మధ్యతరగతి ఉద్యోగిని. భర్తకు హైదరాబాద్‌లో ఉద్యోగం. వారాంతంలో మాత్రమే ఇంటికి వచ్చేవాడు. ఇంటి పని, వంట పని అంతా మాలతిదే. భర్త మాత్రం పిల్లవాణ్ణి కానీ, ఇంటి గురించి కానీ పట్టించుకునేవాడు కాదు. పైగా వారాంతాలలో వచ్చే శ్రీవారికి సపర్యలు ఘనంగా చేయాలి. ఈ పరిస్థితులలో మాలతికి టి.బి.సోకుతుంది. భర్త శాశ్వతంగా దూర మౌతాడు. ఆరోగ్యం కుదుటపడిన తరువాత ఉద్యోగంలో ప్రమోషన్ కోసం డిగ్రీ పూర్తి చేస్తుంది. ఆంగ్లంపై అభిమానంతో చిన్ననాటి గురువైన జోసెఫ్ దగ్గర మెళుకువలు నేర్చుకుంది. కవితలు రాసే స్థాయికి చేరుకుంటుంది. తను రాసిన ఆంగ్ల కవితలు ప్రముఖ ఆంగ్లపత్రికల్లో రావడంతో మాలతి సమాజంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంటుంది. ఈ విధంగా మాలతి భర్త ఆదరణకు నోచుకోకపోయినా స్వయంకృషితో జీవితంలో పైకెదిగిన వైనాన్ని మనం గమనించవచ్చు.

ఈ విధంగా డా॥వి.చంద్రశేఖరరావు తన కథల్లో సమకాలీన సమాజంలో బహుజనులు ఎదుర్కొంటున్న సమస్యల్ని, ఆయా సమస్యల పరిష్కారంలో వారు చూపుతున్న నేర్పును ఆయా పాత్రల ద్వారా చిత్రించి తెలుగు పాఠకుల్లో అజరామరమైన స్థానాన్ని సంపాదించుకున్నాడు.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వ్యాస భాగవతం - అష్టాదశ పురాణాలలో విశిష్టత

- పి.ఉమా భార్గవి

'నిగమ కల్ప తరోర్గళితం ఫలం
శుక ముకాదమృత ద్రవ సంయుతం
పిబత భాగవతం రసమాలయం
ముహురహో రసికా భువి భావుకాః'

భారతీయ సంస్కృతికి మూలభూతాలైన వేదాల్ని, వేదధర్మాన్ని లోకంలో సుప్రతిష్ఠితం చేయడం కోసం ఏర్పడ్డ సులభ సాధనాలు పురాణాలు. విరాట్పురుషుడికి శ్రుతి స్మృతులు రెండూ నేత్రాలనీ, పురాణాలు హృదయ మని దేవీభాగవతమూ, ఇతిహాస పురాణాల ద్వారా వేదాన్ని విస్తరింప చేయాలని భారతమూ, వేదార్థాలన్నీ పురాణాల్లో ప్రతిపాదింప బడ్డాయని నారదీయమూ మొదలైన పురాణాలలో చెప్పబడింది. ఈ పురాణాలు పద్దెనిమిది. వీటిలో పదిహేడు పురాణాల సారాన్ని ఆకర్షించి వ్యాసభగవానుడు భాగవత పురాణాన్ని రచించాడని పద్మపురాణం వెల్లడిస్తున్నది. బ్రహ్మసూత్ర, ఉప నిషద్భగవద్గీతలనే ప్రస్థానత్రయంతో పాటు ప్రస్థాన చతుష్టయంలో ఒకటిగా భాగవతం ప్రస్తుతించబడుతుంది. సంసార భయాన్ని పోగొట్టేదీ, అజ్ఞానమనే చీకటిని తొలగించేదీ, భగవత్తత్త్వాన్ని వివరించేదీ భాగవతమని - స్కాంద పద్మపురాణాదులు ప్రకటిస్తున్నాయి.

సమస్త శాస్త్రముల యొక్క ఫలస్వరూపము, సకల పురుషార్థములకు ఉపాయ స్వరూపం కావున శ్రీమద్భాగ వతం వేదముల యొక్క సారరూపమైన పరిపక్వ ఫలమని వ్యాసులవారు తెలియజేసారు. ఈ భాగవత ఫలం మొదట వైకుంఠములో శ్రీ మహావిష్ణువు వద్ద నుండెను. తదనంత రము ఆ ఫలం నారదుల వారికి, తర్వాత వ్యాస మహర్షు లకు అనంతరము శుక మహర్షుల నుండి పరీక్షిత్తు మహా రాజు, సూత మహర్షులు మొదలగు శిష్య, ప్రశిష్యాను క్రమంగా ప్రపంచంలోకి అవతరించినది. ఈ ఫలము ఊర్ధ్వ లోకము నుండి అద్భుతమను రసమును కలిగి ఉద్భవించినది. 'చిలుక కొట్టిన పండు తియ్యగా నుండునని నానుడి కదా!' శుకుడను చిలుకచే కొట్ట బడినది. అనగా తెలియజేయబడినది అని అర్థము.

శ్రీమద్భాగవతము ముమ్మాటికి సంపూర్ణంగా ఆస్వా దించ దగ్గ ఫల స్వరూపము. అనగా అందులో పనికి రానిది ఏ కొంచెమైననూ లేదని అర్థము. కావుననే 'పిబత భాగవతం రసమాలయం' అని చెప్పబడినది. దుర్లభమైన భాగవత నామ గ్రంథఫలమును పదేపదే త్రాగండి, తొక్క, టెంక, గింజ, ఏమీలేని అమృతఫలం భాగవతం. ఈ ఫలాన్ని ఏకాస్తకూడా వదలకుండా పూర్తిగా తినండి, త్రాగండి ఆస్వాదించండి శ్రవణానందులుకండి. మహాద్భుతమైన, అమృతఫల రూపియైన భాగవతాన్ని ఆస్వాదించే ప్రయత్నంలో అందులోని కథలు, పాత్రలు, సంఘటనలు భగవదనుగ్రహానికి ఎలా పాత్రమైనవో తెలియజేసే ప్రయత్నం చేస్తాను.

మానవులు పాటించవలసిన ధర్మాలు, చేయవలసిన పనులు, దర్శించవలసిన క్షేత్రాలు, తరించే తీర్థాలూ గురించి వివరించేది పురాణం. ఇవి కథల రూపంలో ఉంటాయి. శ్రీమహావిష్ణువు అంశ వల్ల జన్మించిన శ్రీ వ్యాసభగవానుడు, అష్టాదశ పురాణాలు వేదవిభాగం బ్రహ్మసూత్రాలు, మహాభారత రచన చేసిన మహర్షి. ఈ అధ్యాయంలో అష్టాదశ పురాణాలు వ్యాస భాగవతం సామాజిక విశ్లేషణ పరిశీలిద్దాం.

పురాణాలను గూర్చి ఆలోచిస్తున్నప్పుడు కాలం గురిం చిన పరిగణనం ఆశ్చర్యం కలిగిస్తుంది. కాలం ఎప్పుడు మొదలయిందో ఎవరు చెప్పగలరు? పురాణాలు చెప్పటా నికి ప్రయత్నించాయనిపిస్తుంది. కొన్ని వేల సంవత్సరాల సంఖ్యలతో నాలుగు యుగాలు, ఆ నాలుగు యుగాలు కలిసి ఒక మహాయుగం. ఈ మహాయుగాలు అనేకంగా సాగినాయి. అంటే, కృత-త్రేత-ద్వాపర-కలియుగాలు

అనేక మార్లు వస్తుంటాయన్న మాట. ఈ యుగాలకూ మన్వంతరాలకు, కల్పాలకు సంబంధం కలిగించాయి. ఫలానా కల్పంలో, ఫలానా మన్వంతరంలో, ఫలానా యుగంలో అంటూ లెక్కలు చెప్పుతూ ఉంటారు. ఇవ్వాళ్ల మనం అనుకొనే క్రీస్తు పూర్వం, క్రీస్తుశకం అనుకొనే లెక్క పురాణాల లెక్కలకు ఎక్కడా పొంతనలేదు. ఇది చాలా చాలా సంకుచితమయిన లెక్క. ఇప్పుడు మనం జీవిస్తున్నది కలియుగంలో, భారతయుద్ధం ద్వాపర యుగాంతంలో జరిగింది. శ్రీ కృష్ణ నిర్యాణం ద్వాపరాంతం కాగా, కలియుగం మొదలయి ఇప్పటికి అయిదువేల సంవత్సరాలయిందని పంచాంగాలు చెప్పుతున్నాయి. అదట్లా ఉండగా ప్రతిదినం ద్విజులు సంధ్యావందనం చేస్తూ 'సంకల్పం' చెప్పుకుంటారు. సంకల్పం అంటే ఫలాన దినాన ఫలానా పనిచేయటానికి సంకల్పిస్తున్నామని చెప్పుకొంటున్నామన్నమాట. ఇవాల్టికి చెప్పుకొనే సంకల్పంలో ఇది శ్వేత వరాహకల్పమనీ, వైవస్వత మన్వంతరమనీ, ఇది కలియుగమనీ, అందులోనూ ప్రథమ పాదమనీ కాలాన్ని గూర్చి వివరాలు చెప్పబడుతున్నాయి. కాగా, కల్పం-మన్వంతరం - యుగం వీటి సమన్వయంతో కాలం లెక్క పెట్టబడుతున్నదని స్పష్టం. ఇపుడు పురాణ లక్షణాలు తెలుసుకుందాం.

పై పద్దెనిమిది పురాణాలనూ సాత్త్విక - రాజస - తామస - సంకీర్ణాలుగా క్రోడీకరించడమూ జరిగింది. అసలు వేదంలోనే రెండు విభాగాలు ఉన్నాయనీ ఒకటి కర్మభాగం - మరొకటి జ్ఞాన భాగమని చెబుతూ స్మృతులు కర్మ భాగానికి చెందుతాయి, పురాణాలు జ్ఞానభాగానికి చెందుతాయి అని ఒక తీర్మానం చేశారు. ఈ లెక్కన పురాణాలు జ్ఞాన విధులు. మరి 'శాస్త్రేషు హీనాః కవయో భవంతి కవిత్వ హీనాస్తు పురాణ భట్టాః' అని పురాణాలనూ పౌరాణికులనూ చిన్న బుచ్చడం ఎందుకు జరిగిందో ఎలా జరిగిందో అర్థం కాదు!! పురాణ పదానికి - పురా అపి నవం భవతి, అని యాస్కుడిచ్చిన నిరుక్తి. పాతదే అయినా కొత్తగా ఉంటుంది అని. యస్మాత్పురా హ్యభూచ్ఛైతత్ పురాణం తేన తత్ స్మృతమ్ అని మాత్రమే బ్రహ్మాండ పురాణం చెప్పినా యాస్కుడు దీని నవత్వాన్ని సైతం చెప్పడం గనమించదగిన అంశం. పాత్రలు సన్నివేశాలు సంఘటనలు మానవుల స్వభావాలకూ స్పందనలకూ ప్రతి స్పందనలకూ ప్రతీకలై స్థిరపడటం దీని నిత్యనూతనత్వానికి ఒక హేతువు. భారతీయ సాహిత్య ప్రక్రియలు అన్నింటిలోకి ఇవి ప్రవేశించాయి. ఇవ్వేళకీ చెలామణి అవుతున్నాయి. జన వ్యవహారంలోను ప్రసార సాధనాల శీర్షికల్లోనూ బహుధా వినిపిస్తున్నాయి, కనిపిస్తున్నాయి.

పురాణమనేది భారతీయుల జీవన వైవిధ్యానికీ చతుర్విధ పురుషార్థాల, ప్రధానంగా అర్థకామాల వైచిత్రికీ, తరతరాల భౌతిక-బౌద్ధిక ప్రగతికీ నిలువుటద్దం. ఒక్క పురాణాన్ని క్షుణ్ణంగా చదివితే చాలు సమస్తమూ తెలుస్తాయి. అందుకే-యస్మిన్ జ్ఞాతే భవేద్ జ్ఞాతం వాఙ్మయం సచారాచరమ్ అన్నాడు వ్యాసుడు. ఈ పురాణాలను పద్దెనిమిది అని అన్ని పురాణాలూ పేర్కొంటున్నాయి.

మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వ చతుష్టయమ్।
అనాపల్లింగ కూస్కాని పురాణాని పృథక్ పృథక్ ॥

మత్స్య-మార్కండేయ (2), భవిష్య - భాగవత (2) బ్రహ్మ - బ్రహ్మాండ - బ్రహ్మవైవర్త (3) వరాహ - వామన - వాయు - విష్ణు (4) అగ్ని - నారద-పద్మ- లింగ - గరుడ - కూర్మ - స్కాంద (7) పురాణాలు వెరసి పద్దెనిమిది. పురాణం పంచలక్షణమ్ అని నిర్వచించిన శ్లోకం కూడా దీనిలాగానే సుప్రసిద్ధం. అయితే అందులో కొన్ని పదాలకి అర్థాల విషయంలో కొన్ని సంశయాలున్నాయి.

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణి చ।
వంశానుచరితం చైవ పురాణం పంచలక్షణమ్ ॥

సర్గమంటే సృష్టి. ప్రతి సర్గమంటే ప్రళయం. ప్రతి సర్గో వినాశః అని నిఘంటువు. వంశమంటే బ్రహ్మ సరాసరి సృష్టించిన చక్రవర్తుల-మహర్షుల వంశాల వివరాలు. వంశానుచరితమంటే మానవ (నిర్మితాలైన) వంశాలు. మన్వంతరాలు అందరూ ఎరిగినదే. ఈ అయిదింటి గురించీ చెప్పేది పురాణమని పెద్దలు నిర్వచించారు.

లోకవృత్తమితిహాస పురాణస్య విషయః అని వ్యాస భాష్యంలో వాత్సాయనుడు అన్నది దీనికి క్లుప్తీకరణ అన్నారు.

పద్దెనిమిది పురాణాల పరిమాణమూ ఈ విధంగా ఉంది. బ్రహ్మ పురాణం పదివేల శ్లోకాలు గల గ్రంథం. పద్మపురాణం పరిమాణం ఏభై అయిదువేలు. విష్ణు పురాణం ఇరవై మూడువేలు. శివపురాణం ఇరవైనాలుగు వేలు. భాగవతం పద్దెనిమిది వేలు. నారదపురాణం ఇరవై అయిదు వేలు. మార్కండేయ పురాణం తొమ్మిదివేలు. అగ్నిపురాణం పదిహేనువేల నాలుగువందలు. భవిష్యోత్తర పురాణం పధ్నాలుగువేల అయిదు వందలు, బ్రహ్మకైవర్త పురాణం పద్దెనిమిది వేలు. లింగపురాణం పదకొండువేలు. వరాహపురాణం ఇరవైనాలుగువేలు. స్కాంధపురాణం ఎనభై యొక్కవేలనూరు. వామనపురాణం పదివేలు. కూర్మపురాణం పదిహేడువేలు. మత్స్యపురాణం పద్నాలుగువేలు. గరుడపురాణం పందొమ్మిదివేలు. బ్రహ్మాండ పురాణం పండ్రెండువేలు.

ఈ విధంగా నాలుగులక్షల పరిమాణంగల పద్దెనిమిది పురాణాలలో నదులలో గంగానదివలె, దేవతలలో బ్రహ్మవలె, తారకలలో చంద్రునివలె, సముద్రాలలో పాల సముద్రంవలె, పర్వతాలలో మేరుపర్వతం వలె, గ్రహాలలో సూర్యునివలె, రాక్షసులలో ప్రహ్లాదునివలె, రత్నాలలో పద్మరాగంవలె, చెట్లలో హరిచందనంవలె, ఋషులలో నారదునివలె, ధేనువులలో కామధేనువువలె, సూక్ష్మాలలో జీవునివలె, జయింపరాని వాటిలో మనస్సువలె, వసువులలో హవ్యవాహనునివలె, అదితిసంతానంలో విష్ణువువలె, రుద్రులలో నీలలోహితునివలె, బ్రహ్మలలో భృగువువలె, సిద్ధులలో కపిలునివలె, గుఱ్ఱాలలో ఉచ్చైఃశ్రవము వలె, సర్పాలలో వాసుకివలె, మృగాలలో సింహంవలె, ఆశ్రమాలలో గృహస్థాశ్రమంవలె, వర్ణాలలో ఓంకారంవలె, శస్త్రాలలో ధనుస్సువలె, యజ్ఞాలలో జపయజ్ఞంవలె, వ్రతాలలో అహింసవలె, యోగాలలో ఆత్మయోగంవలె, ఓషధులలో యవలవలె, వాక్కులలో సత్యవాక్కువలె, ఋతువులలో వసంత ఋతువువలె, మాసాలలో మార్గవీర్షమాసంవలె, యుగాలలో కృతయుగంవలె భాగవతం ప్రకాశిస్తూ ఉంటుంది. ఈ భాగవత పురాణం చదివినవారు విష్ణసాయుజ్యం పొందుతారు'.

గరుడ మహాపురాణంలో భాగవత ప్రశస్తి ఈ విధంగా పేర్కొనబడింది.

అర్థోయం బ్రహ్మసూత్రాణాం భారతార్థ వినిర్ణయః,
గాయత్రీ భాష్యరూపోసౌ వేదార్థ పరిబృంహితః.
పురాణానాం సారరూపః సాక్షాద్భగవతోదితః,
ద్వాదశ స్కంధ సంయుక్తః శతవిచ్ఛేద సంయుతః,
గ్రంథో2ష్టాదశ సాహస్రః శ్రీమద్భాగవతాభిధః.

ఈ భాగవతం బ్రహ్మసూత్రాల పరమార్థం. భార తార్థాన్ని నిర్ణయం చేసే గ్రంథం. గాయత్రీ మహా మంత్రానికి ఇది భాష్యం. వేదార్థ పరిపోషకం. సమస్త పురాణాల సారం. సాక్షాత్ భగవత్స్వరూపుడైన శుకమహర్షిచే ప్రోక్తం. ఈ మహాగ్రంథం ద్వాదశ స్కంధాలతో కూడింది. నూరు పరిచ్ఛేదాలు కలది. పద్దెనిమిది వేల శ్లోకాలతో నిండింది. ఈ మహాగ్రంథం పేరు శ్రీ మద్భాగవతం.

ఇరువది ఎనిమిదవ ద్వాపర యుగమున పరాశరునకు, సత్యవతికి కృష్ణద్వైపాయనుడు (వ్యాసుడు) జన్మించాడు. అతడు విష్ణువు వంశమున పుట్టినవాడు. వ్యాసుడు సర్వస్వతీ నదిలో స్నానంచేసి బదరికాశ్రమమున ఒంటరిగా కూర్చుండి భూత, భవిష్య, వర్తమానములను గురించి ఆలోచించుచు రాబోవు కలియుగంలోని మానవులు బలహీనులై విద్యుక్త కర్మలు ఆచరించుచు శక్తిలేని వారగుదురని భావించి సర్వవర్ణాశ్రమములకు తగినట్లు గాను, యజ్ఞయాగాదులకు విరామం లేకుండునట్లుగాను, ఏక రాశిగానున్న వేదమును ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణ వేదములని నాలుగు భాగములు చేసి, ఇతిహాస పురాణములన్నియు పంచమ వేదమని నిర్దేశించెను.

ఇంత చేసినప్పటికిని వ్యాసునకు మనశ్శాంతి కలుగక విచారించుచున్న సమయంలో నారదుడు ఆచటికి వచ్చెను. వ్యాసుడు అతనిని పూజించెను. నారదుడు

వ్యాసునితో నీ విచారమునకు కారణమేమని అడిగెను. అంతలో వ్యాసుడు నీకు తెలియనిదేమున్నది నా చింతకు పరిష్కారము నీవే చెప్పుమనెను. అందులకు నారదుడు నీవు ఎన్ని పురాణములు వ్రాసినను వాటిలో విష్ణు కథలు అంతంత మాత్రంగానే చెప్పినావు, కాని సమగ్రముగా చెప్పలేదు. శ్రీహరి మహత్మ్యమును గ్రహించి భక్తితో అతని లీలా విశేషములను వర్ణింపుము, నీకు చింతదీరి బ్రమ్మానందం కలుగును. పూర్వ జన్మములో శూద్రుడనైన నేను ఇట్లుండుటకు హరినామస్మరణమే కారణము అని నారదుడు చెప్పి వెళ్లెను.

వ్యాసుడంతట ధ్యానరతుడై విష్ణుదేవుని స్మరించి అతని మహిమా విశేషములను భాగవత గ్రంథముగా రచించి తన కుమారుడైన శుక మహర్షి చేత చదివించెను. ఇది సంస్కృతంలో రచింపబడినటువంటిది. ఈ విధంగా భాగవత అవతరణ జరిగింది. వ్యాసభగవానుడు రచించిన అష్టాదశపురాణాలలో శ్రీమద్భాగవతము మకుటాయమానం. శ్రేయఃప్రాప్తికి పరమసాధనములైన భక్తి జ్ఞాన వైరాగ్యములు ఇందు ప్రతిపాదింపబడినవి. నారాయణుడు భాగవతసారమును తొలుత బ్రహ్మకును, అతడు తన మానస పుత్రుడైన నారదునకును తెల్పెను. నారదుడు వేదవ్యాసునకు భాగవతము రచించి లోకహిత మొనర్పు మనియు, అందువలన నీకు మనశ్శాంతి లభింపగలదనియు ఉపదేశించెను.

నారదోపదేశమున వ్యాసమహర్షి భాగవత పురాణము వ్రాసి ఆత్మశాంతి పడయగల్గెను. శ్రీమన్నారాయణుడు దుష్ట శిక్షణకు, శిష్ట సంరక్షణకు, ధర్మ సంస్థాపనకు అనేకములైన అవతారములెత్తెను. వాటి వైభవము శ్రీమద్భాగవతమున వర్ణింపబడినది. పరిపూర్ణతావతార మైన శ్రీకృష్ణ పరమాత్మ దివ్యచరిత్రము ఇందు ముఖ్యముగా అభివర్ణింపబడినది. ఇట్టి భగవంతుని శ్రేష్ఠతమావతార కథా సంవిధానముచే భాగవతము భారతీయులందరికీ శిరోధార్యమగుచున్నది. శ్రీమద్భాగవతము భక్తి రసప్రధానమైన గ్రంథము. దీనిని పఠించినచో తాపత్రయము తొలగి ఐహికాముష్మిక సుఖములు సంప్రాప్తించును. సకల శుభములు సమకూరును.

భగవంతుని లీలలతోనూ, భగవద్భక్తుల చరిత్రల తోనూ నిండి భక్తిజ్ఞాన వైరాగ్య సంభరితమై ఉండటం కూడా భాగవతానికి ఎక్కడలేని ప్రశస్తి తెచ్చి పెట్టింది. అందుకనే అది శ్రీమద్భాగవతంగా విరాజిల్లింది. ఇంకా చెప్పాలంటే తక్కిన పురాణాల్లోకంటే భాగవతంలో వ్యాసుల వారి రచన రమ్యమై ప్రౌఢగంభీరమై విలసిల్లింది. పద్మపురాణంలో శ్రీమద్భాగవతం సాక్షాత్తుగా భగవత్స్వరూపమని నిరూపించబడింది.

తమాదిదేవం కరుణానిధానం
తమాలవర్ణం నుహితావతారమ్,
అపారసంసార సముద్రసేతుం
భజామహే భాగవతస్వరూపమ్.

భాగవతం భగవంతుని స్వరూపంగా చెప్పటం గమనించదగింది. భాగవతంలో ఉన్న పండ్రెండు స్కంధాలనూ భగవంతుని అవయవములుగా పేర్కొనడం జరిగింది.

ప్రథమశ్చ ద్వితీయశ్చ చరణౌ ద్వౌ ప్రకీర్తితౌ,
తృతియశ్చ చతుర్థశ్చ ద్వావూరూ సముదీరితౌ.
పంచమో నాభిదేశశ్చ షష్ఠో హృదయ ముచ్యతే,
సప్తమ శ్చాష్టమశ్చైవ బాహూ ద్వౌ పరికీర్తితౌ.
నవమః కంఠదేశః స్యాత్ దశమో ముఖమేవ చ,
ఏకాదశో లలాటం చ ద్వాదశస్తు శిఖోచ్యతే.
ఏవం సర్వం భాగవతం శ్రీహరేరంగ ముచ్యతే.

భాగవతంలోని ప్రథమ ద్వితీయస్కంధాలు భగవంతుని చరణాలనీ, తృతీయ చతుర్థస్కంధాలు ఊరువులనీ, పంచమస్కంధం నాభిప్రదేశమనీ, షష్ఠస్కంధం హృదయమనీ, సప్తమ అష్టమ స్కంధాలు బాహువులనీ, నవమస్కంధం కంఠమీన, దశమస్కంధం ముఖమనీ, ఏకాదశం లలాటమనీ, ద్వాదశం శిఖ అనీ వివరింపబడింది ఇందులో దశమస్కంధం భగవంతుని ముఖమనీ

చెప్పడంవల్ల దాని ప్రాధాన్యం ఎంతటిదో అభివ్యక్త మవు తున్నది. శ్రీకృష్ణసర్వస్వమైన భాగవత దశమస్కంధం సర్వోత్తమ మనటంలో సందేహం లేదు.

వేదవ్యాసమహర్షి విష్ణుస్వరూపుడు ఈయన రాశీ భూతమైవున్న వేదవాఙ్మయాన్ని నాల్గు భాగాలుగా విభ జించి లోకానికి మహోపకారం చేసిన మహామనీషి. పురా ణాలు మిత్ర సమ్మితాలు. అంటే మిత్రుడెలా దగ్గరచేరి మంచిమాటలు మంచిగా చెప్పి మంచిమార్గానికి మర లిస్తాడో అలా పురాణాలు కూడా 'రామాదుల వలె ప్రవర్తించు; రావణాదులవలె మెలగ వద్దు' అని సత్య ధర్మాలను సుఖంగా సుగమంగా కథలద్వారా బోధిస్తాయి. అలాంటి పద్ధెమిది పురాణాలనూ, అన్నే ఉపపురాణాలనూ కూడ రచించి సంస్కృత భాషకు పుష్టినీ, రసజ్ఞులకు తుష్టినీ కలిగించిన అనన్య ప్రతిభూవిభాసి వ్యాసులవారు. వ్యాస కృతపురాణాలలో శ్రీమద్భాగవతం మిక్కిలి ప్రశస్తి వహిం చిన మహోత్తమగ్రంథం. ఈ గ్రంథ రచనవల్లనే ఆ మహర్షికి మనశ్శాంతి చేకూరిందట! భక్తి రసప్రధానమై భగవంతుని అనంత కళ్యాణ గుణ గణాలను కీర్తించడంవల్ల ఈ పురాణానికి ఎంతో ప్రచారం లభించింది. నదులలో గంగా నదివలె, దేవతలలో అచ్యుతుని వలె, విష్ణు భక్తులలో శివుని వలె, పురాణాలన్నింటిలో భాగవత పురాణము శ్రేష్ఠమైనది.



BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

బంజారాల సాంస్కృతిక జీవనం

- డా॥. నెల్లూనాయక్, పి.డి.ఎఫ్ స్కాలర్, ఉస్మానియా యూవర్సిటి, హైదరాబాద్.

సమాజంలో బంజారాల సంస్కృతి చాల ఆకర్ష ణీయంగా ఉంటుంది. జానపదులలో గ్రామము లాగా గిరిజనులలో వీరి సమాజాన్ని తాండా అని అంటారు. వీరి ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, నమ్మకాలు, విశ్వాసాలు, ఆహారపానీయాలు, పండుగలు, జాతరలు, వివామ కార్యక్రమాలు, సంస్కృతి సమాజంలో ఒక ప్రత్యేకతను తెలియచేస్తుంది. తాండాలోని ప్రతి పని వ్యవహారాలు కూడ నిర్ధిష్టంగా విభజించి వ్యవస్థికృతంగా ఉంటుంది. తాండాలోని ప్రతి వారు తమ నాయకుని ఆజ్ఞ ఉ లోబడి తమ జీవితాన్ని సాగిస్తుంటారు. అంతే కాకుండా తాండాలోని నియమ నిబంధనలను, కట్టు బాట్లకు అందరు మూకుమ్మడిగా కట్టుబడి ఉంటారు. తాండాకు సంబంధించిన ప్రతి విషయాన్ని చట్ట సమానంగా భావిస్తారు. తాము ఒక ప్రత్యే తెగకు సంబం ధించిన వారమని భావిస్తారు. సమాజంలో బంజారాలను గోర్ అని బంజారేతరులను కోర్ అని అంటారు. కాబట్టి వీరి సంస్కృతిని గోర్ సంస్కృతి అని పిలుస్తారు.

పూర్వం శ్రీరంగపట్టణంను పరిపాలిస్తున్న హైదర్ ఆలీ, టిప్పు సుల్తాన్‌ల సైన్యంలో చేరి స్వతంత్ర పోరాటంలో వీరు కూడా పోరాడారు. అప్పుడు సైన్యంలో మంచి నైపుణ్యం తెలివితేటలు కనబరచిన ఈ బంజారాలు యుద్ధ వీరులకు, ఆహార పదార్తాలను యుద్ధ సామాగ్రిని సరఫరా చేశారు. యుద్ధంలో కూడా పాల్గొనేవారు. వారు సైన్యానికి నాయకత్వం వహించారు. కాబట్టి అప్పుడు రాజుగారు వీరికి నాయక్ అనే బిరుదు ఇచ్చి సత్క రించాడు. అప్పటి నుండి వీరు తమ పేరు చివరన నాయక్ అని పెట్టుకుంటున్నారు.

"బంజారాలు పూర్వం తమ వంశ నామాలను హిందు వులు అగ్రవర్ణాల వారు రావు, రెడ్డి, నాయుడు, రాయుడు, గౌడ్, ముదిరాజ్ మొదలగు పేరు చివరన పెట్టిన విధంగానే వీరు కూడా తమ పేరు చివరనా, రాథోడ్, చౌహాన్, జాదవ్ (వడితియా), పమార్ అని పెట్టు కుంటారు. 15వ శతాబ్దంలో ఉత్తరాది నుండి దక్షణాదికి వలస వచ్చిన వీరు, ఆంధ్రప్రదేశ్‌లో అనంతపూర్, ఖమ్మం, వరంగల్, మెదక్, మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి మొదలగు జిల్లాలలో ఎక్కువగా విస్తరించి ఉన్నారు.

బంజారాల సమాజం - వృత్తులు :

"బంజారాలు స్వతంత్ర జీవనం గలవారు. వీరికి ప్రత్యేకమైన కుల వృత్తులు అంటూ ఏవి లేవు. వీరిలోనే కొంతమంది, కుల వృత్తులుగా చేసుకొని జీవనం గడుపు తున్నారు. వీరు అనాది కాలం నుండి మాత్రం పశు పోషణకులు, వ్యవసాయదారులు, వ్యాపారస్తులు. వీరిలో చాలామంది పశువులు, కోళ్ళు పెంచేవారు. పశువులు ఎంత ఎక్కువగా వుంటే అతనిని అంత ఉన్నతమైన (ధనవంతుడుగా) వారుగా పరిగణించేవారు. వీరు మంచి కష్టజీవులు. వీరికి మోసం, దగా చేయటం తెలియదు. నీతి, న్యాయాన్ని నమ్ముకుంటారు. కూరగాయలు, ఆహార ధాన్యాలను పండిస్తారు. నిజాయితీగా బ్రతుకుతారు. వీరిలో నావి అనే మంగలి పనివాడు ఉంటాడు. దాదాపు తాండాకు సంబంధించిన అందరి క్షవరాలు చేస్తాడు. అదే విధంగా ఢాడి అనేవారు యాచక వృత్తిని చేసుకుంటూ పాట పాడుకుంటూ తాండా, తాండాలకు తిరిగి పురాణ, ఇతామాసాల కథలు చెప్పుకుంటూ బిచ్చమెత్తుకొని జీవిస్తారు. వీరినే బంజారా భట్రాజులు అని వ్యవ హరిస్తారు.

తర్వాత ఢాలియా అనే ఒక తెగవారు డప్పులు కొట్టు కుంటూ కాళ్లకు గజ్జెలు కట్టుకొని వివిధ నృత్యా విన్యాసా

లను ప్రదర్శిస్తారు. వీరి వృత్తి కూడా యాచక వృత్తి. తర్వాత సనార్ అనే కంసాలి తెగ (Gold Smith) వారు ఉంటారు. వీరు బంజారాలకు సంబంధించిన ఆభరణాలను తయారు చేస్తారు. తర్వాత ఖాత్తి అనే వడ్రంగి వారు కూడా ఉంటారు. అదే విధంగా బంజారాలకు బట్టలు సరఫరా చేసే వ్యక్తిని రంగారా అని అంటారు. బట్టల వ్యాపారి పైన పేర్కొన్న వారు తమ కుల వృత్తులను తాండాలోనే చేసుకుంటారు. తాండాలో వీరికి అందరితో పాటు సమానంగా గౌరవిస్తారు. తాండాలో అందరు కూడా అన్నదమ్ముల్లాగా కలిసిమెలిసి తజీవనం సాగిస్తుంటారు.

తాండా వ్యవస్థ :

"తాండా వ్యవహారాలు మంచి చెడులు వివాహాలు పండుగలు పంచాయితీలు ఎన్నికలు, జాతరలు మొదలగు అన్ని విషయాలు తాండా నాయకుని అధ్వర్యంలో నాయకుని పేరు మీదుగా జరుగుతాయి. తాండాలో నివసించే వారందరు, తమ నాయకుడు చెప్పిన విధంగా కట్టు బాట్లను గౌరవిస్తూ నడుచుకుంటారు. నాయకునికి కొంత మంది సలహాదారులుగా కొరోబారీ లను నియమిస్తారు. వీరు నాయకుని అడుగుజాడలో తమ పనులను, సలహాలను నిర్వర్తిస్తుంటారు. తాండాలో నివసించే అన్ని కులాల వారిని సరి సమానంగా నాయకుడు చూసుకుంటాడు. తాండాలో జరిగే ప్రతి శుభ అశుభ కార్యాక్రమాలు తాండా నాయకుడు నిర్వహిస్తాడు.

చాలా వరకు తండాల పేర్లు నాయకుని పేరు మీదుగా పెట్టుకోవటం జరుగుతుంది. అంతే కాకుండా తాండాలో రకరకాల గోత్రాల వారు ఉంటారు. ఆ తాండాలో ఏ గోత్రీకులు ఎక్కువ సంఖ్యలో నివశిస్తే వారి గోత్రం పేరు కూడా తాండాకు పేరుగా పెట్టుకుంటారు.

బంజారాల కట్టుబాట్లు :

"బంజారాల న్యాయ నిర్ణయ పద్ధతిని నసాబ్ అని గోర్ పంచాయతీ అని వ్యవహరిస్తారు. ఈ పంచాయితీ ముఖ్యంగా తాండా నాయకుని ఆధ్వర్యంలో జరుగుతుంది. ఎవరికి ఎటువంటి అన్యాయం జరగకుండా సక్రమమైన పద్ధతిలో తీర్పులు ఇస్తారు. న్యాయం కోసం వాది (బాధితుడు) నాయకునికి తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తాడు. అప్పుడు నాయకుడు ప్రతివాదిని పిలిపించి నసాబ్‌కు అయ్యే ఖర్చును మరియు తాను ఇచ్చే తీర్పులను శిరసావహిస్తామని అంటేనే పంచాయితీని జరిపిస్తానని ఇరువురికి తెలియ చేస్తాడు. అప్పుడు వాది, ప్రతివాది ఇద్దరు ఒప్పుకుంటే నాయకుడు పంచాయితీని ఏర్పాటు చేస్తాడు. పంచాయితీలో కారోబారీ తాండా నాయకులు చిన్న పెద్దలందరు పాల్గొంటారు. వాది ప్రతి వాదులతో కొంత డబ్బును డిపాజిట్‌గా నాయకుని దగ్గర పెట్టించుకుంటారు. తర్వాత ఇరువురిని తమకు నచ్చిన నాయకులను కోరుకోమని తాండా నాయకుడు ఇద్దరికి అవకాశం ఇస్తాడు. ఇరువురు తమ నాయకులను కోరుకున్నాక, పంచాయితీ సమయాన్ని బట్టి ఆ రోజు గాని మరుసటి రోజు గాని తేదీని నిర్ణయిస్తారు. ఆ నిర్ణయం మేరకు ఇరువురి పంచాయితి పెద్దల సమక్షంలోనే తండా నాయక్ పంచాయితి తీర్పును ఇస్తాడు.

బంజారాల ఆచారాలు :

బంజారా తాండాలో గర్భిణీ స్త్రీలు సాధారణంగా బయటి వైద్యానికి వెళ్లరు. తాండాలో ఉండే మంత్రసాని నాయకణ్ దగ్గరకు వెళ్ళి ఆమె చెప్పే విధంగా నాటు వైద్యాన్ని చేయిస్తారు. గర్భం దాల్చిన స్త్రీలు చాలా వరకు బిడ్డను జన్మనిచ్చేంత వరకు తమ పనులతో పాటు, ఇంటి వ్యవసాయం కూలి పనులు చేస్తుంటారు. బంజారాలలో సీమంత ఆచారం ఉండదు. బిడ్డ పుట్టే సమయంలో దగ్గర మంత్రసాని ఉంటుంది. ఈమె బొడ్డు కోసి, మాయిని తీసి ఇంటి దేవత మూలలో 25 సైనలతో పాటు కొద్దిగా జొన్న పిండిని ఒక గుంత తీసి అందులో పూడ్చేస్తారు. అలా చేస్తే ఎటువంటి హాని జరగదని వారి నమ్మకం.

బంజారాల పండుగలు, జాతరలు :

"బంజారాలు (లంబాడీలు) తెలంగాణా ప్రాంతంలో

ఎక్కువగా నివసిస్తున్నారు. మానుకోట, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, మెదక్, మిగిలిన అన్ని ప్రాంతాలలో బంజారాలు నివసిస్తుంటారు. వీరు చేసుకునే పండుగలు, జాతరలు, ఉత్సవాలలో నృత్యం గమ్మత్తుగా ఉంటుంది. మగవారు డప్పు కొడుతుంటే ఆడవారు నృత్యం చేస్తూ వుంటారు. కొన్ని సందర్భాలలో ఆడ మగవారు ఇరువురు కలిసి నృత్యం చేస్తారు. వీరు ముఖ్యంగా తుల్జా భవాని, తీజ్ పండుగ, హోలీ, దశరా, దీపావళి, సంక్రాంతి, శివరాత్రి మొదలగు పండగను అత్యంత వైభంగా చేసుకుంటారు.

బంజారాల అలంకరణ :

బంజారాలు తమ బట్టలను తామే స్వయంగా తయారు చేసుకుంటారు. వీరే చేతి పనితో రంగు రంగుల దారాలు చిన్న చిన్న అద్దాలు పెద్ద అద్దాలు వీటిని అర్సి అని అంటారు. అదేవిధంగా లాల్డీ అనే చిన్న చిన్న రంగు రంగుల పూసలతో రకరకాల పూలు వేస్తారు. స్త్రీలు తాము తొడిగే లంగాను ఫేటియా అని అంటారు. దీనిని కుచ్చులు కుచ్చులుగా వచ్చే విధంగా నడుము దగ్గర లేపోతో జోడించి కుడుతారు. లేపో పైన చిన్న చిన్న అద్దాలు, రంగు రంగుల దరాలు, చిన్న పూసలు, దారంతో చిన్న చిన్న పూలు వేసి ఆకర్షణీయంగా ఉండే విధంగా తయారు చేసుకుంటారు.

బంజారా సమాజంలో పురుషులు చిన్న జాంగియా అనే నెక్కరు, జగలా అనే అంగీ రుమాల& అనే తలపాగా ధోతి తువ్వాలలు ధరిస్తారు. చేతులకు వెండి కడియాలు, నడుముకు కొణధరో అనే వెండి మొలత్రాడు, చెవులకు రింగులు ధరిస్తారు. దాదాపు లంబాడాలు తలపాగాకు ఎర్రటి, నీలి రంగు అందులో తెల్లటి చారలుగల తల పాగా (రుమాళ్ళు) ను వాడుతారు. బంజారాల (లంబాడీలు) స్త్రీ పురుషులను సులభంగా గుర్తుపట్టవచ్చు. ఈ విధంగా బంజారా సమాజం చాలా కట్టుదిట్టమైన సంస్కృతి సంప్రదాయాలతో వైభవోపేతంగా ఏ కులంలో, ఏ మతంలో, ఏ వర్గంలో లేనటువంటి సంస్కృతి సంప్రదాయాలు, వేష భాషలు, ఒక్క బంజారా సమాజంలో మాత్రమే ఇప్పటికి కొనసాగుతూ వుంది.



BHAVAVEENA
Vol. 17, Issue. 5, May 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"The long awaited transformation of Kuchipudi from male dancers to females and the marvelous thought of an inevitable change".

- ***Bijina K K***, Research scholar, RabindraSangit Dance and Drama, SangitBhavana, Visva-BharathiUiversity, W.B.

Abstract :

From the very time of the origin of Kuchipudi, only men from Bhagavathulu families used to perform this dance in the form of Kalapam, Yakshaganam, and Kelika etc. It was Sri VedantamLakshminarayanaSastry who was one of the three famous influential Kuchipudi Dancers, very popularly known as Natya-Trayam, introduced female dancers to Kuchipudi. He is remembered and respected forever for encouraging women to learn this divine dance form. He taught this dance form to the women from all families irrespective of their community. Women from Devadasi families who were interested to learn this dance form were encouraged by Sri Vedantam Lakshminarayana Sastry. Credit of introducing Ekapatra Kelika (Solo performances) also goes to him. Laksmi NarayanaSastry not only introduced women to this dance form, but also encouraged them to develop as solo performers.

Keywords :

Kuchipudi, female dancers, existence, exponent, changing traditions.

Vagarthavivasampruktouvagarthpratipattaye I
Jagatahpitarouvandeparvatiparameswarou II

According to the Sanskrit verse, Lord Shiva and Parvathi are the parents of the entire creation consisting of movable and immovable ones including the language. It is the woman who gave birth to the Lord Brahma, Vishnu and Maheswara who are the cause of creation, operation and dissolution. She is the embodiment of Energy. She is the Supreme Mother. At the outset of creation, she formed an enclosure with the primal sound OM (AUM) over a cot supported by four legs namely Dharma, Artha, Kama and Moksha. The cot was laced with the six foes i.e. Kama, Krodha, Lobha, Moha, Mada and Matsarya, over which she produced the trinity. Since then, Brahma became the creator, Vishnu the operator and Maheswara the dissolver. Thus they have been playing the role of regeneration. Greatness must be attributed to the woman for being the cause of trinity. So in our Bharath (indian) tradition, woman was given predominance according to the Vedic dictum "Matrudevobhava".

Woman is :

- The Giver of Birth
- Goddess of Education
- Presiding deity of the Gayatri Mantra
- Bestower of Riches

Wife is known as better half in accordance with our age-old tradition of ArthanareeswaraTattvam. This enables both the scholar and the commoner to understand the importance of the woman. The Veda of Dance (Natyaveda) whose originators were Shiva and Parvathidescended from the sky on to the earth following the request of LordBrahma and celestials such as Indra. Parvathi is the smiling form while Parameswara is the Nataraja performing Tandava dance. Thus dance is the blend of the two. Most famed dancers of the

divine world are the Rambha, Urvasi and Menaka. Due importance was given to the eves in the context of the dance scribes.

Verse :

Sambhurgouritathas brahma
madhavonandikeshawara I
DattilokohakaschaivaYajnavalkyaschanaradahaII
Hanuman
vighnarajaschashanmukhothabrihaspatihi
ArjunoravanaschaivakanyabanaushatathaaII
Etebhartakartarobhuvaneshuprakeertitaha.

Shiva, Parvathi, Brhma, Mahava, Nandi-keswara, Dattila, Kohala, Yajnyvalka, Narad, Hanuman, Vighnaraja, Kumar wamy, Brihaspati, Arjuna and Ravana are famous as dance masters. Ushasundari,the daughter ofBanasura who received a boon from lord Shiva to act as the gate-keeper to his fort on earth, was the direct disciple of Goddess Parvathi.Thus the art of dance that descended from the divine world has undergone several changes according to the regional traditions. For example it was practiced in Andhra Pradesh state as 'Kuchipudi'state derived from the name of the village Kuchipudi in Krishna district. It was Bhratanatyam in Tamilnad, Kathakali in Kerala, Odissey in Odisha, Kathak in north Hindustan, and Manipuri in Manipur. Thus the dance assumed six characteristic names in India.

Entry of women dancers :

In the entire creation, the woman plays incomparable roles like risking her life while giving birth to children, satisfying hunger, giving education and providing wealth. This is the reason why she occupies a worshippable place in the Vedas and stands in the forefront. Along with the progress of civilization, particularly in the modern times there is no sector which is not touched by the woman. They are proving their merits wherever they are and even outdoing men in certain areas. Apart from their presence in the 64 traditional arts the dames showed their excellence in the following fine arts namely:

1. Music 2. Literature 3. Sculpture 4. Drawing/Painting and 5. Dance.

MS Subbalakshmi carved a niche for herself in Carnatic vocal (music) while it was poetess Molla who hailed from a humble background wrote Ramayana. Similarly women figured in the first row in the fields of Sculpture, drawing/ painting and Dance too. As for the Kuchipudi dance which is the subject proper, men alone had access to it. With a view to bringing global fame to Kuchipudi, theKuchipudi pioneer, visionary and great guru late Vedantam Lakshminrayana Sastry provided access to women also.It would be in the fitness of things to make an attempt to know about his life history of the legend.

Life history of the Kuchipudi exponent (VedantamLakashmiNarayanaSastry) :

Kuchipudi explorer Vedantam Lakshmi-narayana Sastrywas born in the year 1886 in Kuchipudi village of Krishna district in Andhra Pradesh, India. He was the fond kid of Ramesam and Savitramma and studied Sanskrit and Telugu along with the practice of the art of Bharata muni which dance was named after him. Sastri was an adept performer of Gollaveshams in the attire of cowherds. He used to perform solo dance items in accordance with the books of Natyasastraabhinayadarpana etc. He laid an exclusive way in the solo performances of

Ashtapadis of Jayadeva, Kshetrayya and Sarangapanipadams, javali, Ramayana Sabdam etc. He displayed the solos by repeating one Charana in Sancharibhava producing the rasa contextually. The kuchipudi dance solos which we see today are his true copies. Sastriwho was the trendsetter of solos was an expert in acting for Slokas and brought great popularity to them.Sastri performed with joined and separate hands in order to make the common man understand the meaning of each line of the Sanskrit verse. An expert in performance, Sastri displayed his performance for Sanskrit verses of Srikrishnakarnamutam, Pushpbanavilapam, Natyasastram, Abhinayadarpanam and taught his disciples practically. He was an expert in performing dance items along with relevant hand and leg movements and facial expressions.He used to teach his students "Practice like you have never won and Perform like you never lost." He also taught that Dancers need no wings to fly.

Exponent's ideology :

Kuchipudi dance is derived from our ancient Vedic and puranic wealth which at the outset was created by lord Shiva in the form of Nataraja and streamlined by the Bharatamuni. In short it is the essence of vedas, Upanishads, puranas, itihasas in a most scientific way of presenting our ancient glory in a beautiful, melodious and touching manner. It is also held that Lord Brahma created it as the Bharata Alankarsastra, practiced by Bharatamuni and emerged as Kuchipudi dance form.According to researches on the history of dance it came to light that Sanskrit roopakams were displayed in dance form in the 11th century. Later in 13th century Siddhendra yogi created Bhama kalmpam which was the first Telugu deseeya Drusya prabandham. In 14th century, Kelika was displayed and the kuchipudi dance carved people and created social awareness among people.Next Solo dance was discovered and it was easily followed by dancers in ways suitable to the changing times. Later Kuchipudi imbibed the other dance traditions too for contemporariness by display of Nrutyanata-kams and Nrityaroopakams which became famous. Kuchipudi dance which began as Sanskrit roopakams, became invincible with Bhamakalapams, cited social consciousness with kelikas and emboldened itself with Yakshaganam by perrforming nuances in solos. Thus Kuchipudi carved a niche for itself in the world map in the area of dance.

Accoding to the social conditions prevailing in those days, Kuchipudi for a long time was restricted to men alone. In the 18th century,it was the broadmind and farsightedness of late VedantamLakshminarayanasastry that enabled entry of women into the dance field regardless of caste,creed, gender and religion. Otherwise women's talents would have remained dormant and their role restricted to kitchens only. Women are deeply indebted to the dance exponent for bringing their talents light and making them famous in the world.

Consequences :

The world famous Kuchipudi dance was the forte of men only initially. But the Kuchipudi exponent VedantamLakshminarayanasastry who was a visionary created space for women also in 18 the century. At first, he taught the dance to Devadasis who used to perform dance in the temples enabling their free movement in the society. Lack of transport facilities and

protection to women and also absence of proper stages for dance performance for dance performances were some handicaps for them. Yet Kuchipudibhagavatas used to move on foot from place to place and used to travel long distances braving hot sun and drenching rains. They faced ridicules in the society also. They used to prepare Aharyam (attire) with wooden planks and prepared colors for makeup to their faces. Yet they were bent upon bringing kuchipudi dance to lime light. Periods (monthly cycle) were also an obstruction to women because of which men used to don women roles.Owing to the social progress, women too volunteered to enter the field and the encouragement by the Bhagavatas also helped them to fulfill their ambition to learn and perform dance. Consequently many women dancers learnt kuchipudi dance dedicatedly and scaled dizzy heights. All the credit goes to the Kuchipudi exponent Vedantam Lakshminaryanasastry for his relentless efforts to develop the dance form worldwide. Conversely, women are more in the field of dance while men are less. Too much of anything is bad. So it would be better if men too take equal spirit to learn Kuchipudidance to maintain the balance.

Conclusion :

It is the result of the hardest, sincere and restless efforts of some group of female dancers. By which Kuchipudi has reached today's status from a state where it was once the monopoly of male artists. It is sure that the sole right of Kuchipudi would be in the palms of female dancers within 10 to 20 years. It will remain as the sole art of females. The Great Kuchipudi Dancers namely Balasarawathi, Vijayalakshmi, Dr. Uma Ramarao, Dr.JonnalagaddaAnuradha, BalaKondalRao, ArunaBhikshu, Alekhya Punchela, Vanajauday etc. are not only made the audience spell bound with their wonderful creative performance but also trained many new practitioners with utmost determination and dedication in order to express their gratitude for the blessings they received from all over the world. In the present generation also many female dancers are learning the dance form with utmost interest and enthusiasm following the footsteps of their Gurus and contributing their level best to the art form by giving performance on various themes under the guidance of their respective Gurus...

References :

1. ParishchaAvinash, Venkat Raman Leela. 'Indian Classical Dance'. Roli books Pvt Ltd, Luster press, P-75- New-Delhi, 2002.
2. Sarma, Nagabhushan N. Kuchipudi: Gurus, Performers and Performance Traditions'. A RangaSampada Publication, Karshak Art printers, Vidyanagar- Hyderabad, 2016.
3. 'Gender monopolies in Indian classical dance: A sociological analysis of Cause and context',SangeetNatak, Nos.117118, July-December -1995.p.4.
4. Kothari, Sunil. 'A Classical Dance Art'. Abhinav Publications, Sakthimalik E-37Hauz-New Delhi. First Published in India 2001

భావవీణ

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక


ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253
UGC Care List Group - 1
Journal Sl. No 34 under Arts and Humanities Category

May 2020


నన్నయ


తిక్కన



సోమనాథుడు


ఎర్రన


పోతన


శ్రీనాథుడు


శ్రీకృష్ణదేవరాయలు


నంది తిమ్మన


మొల్ల


కందుకూరి వీరేశలింగం


గురజాడ అప్పారావు


గిడుగు రామ్మూర్తి



అన్నమయ్య


బండారు అచ్చమాంబ


గుర్రం జాషువా


బోయి భీమన్న


యోగి వేమన


భద్రిరాజు కృష్ణమూర్తి



కాళోజి నారాయణరావు



బిరుదురాజు రామరాజు



సి. నారాయణరెడ్డి


దేవులపల్లి కృష్ణశాస్త్రి


శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ)


రావూరి భరద్వాజ్


నేదనూరి గంగాధరం


విశ్వనాధ సత్యనారాయణ


దాశరథి కృష్ణమాచారి


రాయప్రోలు సుబ్బారావు

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002.
Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.